www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
పేజీలు: 16 + 20

మంగళవారం | 6-2-2018 | సంపుటి: 14 సంచిక: 207 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి ఉ. 8.01 తదుపరి సప్తమి; నక్షత్రం: చిత్త ఉ. 10.53 తదుపరి స్వాతి; వర్జ్యం: సా. 4.48-6.30; దుర్ముహూర్తం: ఉ. 9.06-9.51, రా. 10.19-11.08; అమృతఘడియలు: రా. 2.58-4.40; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.10 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



ఒక అమరుడి పుష్ప విలాసం

"అతనికి జీవించడం ఓ చాన్స్
అందుకే పూలమ్మేవాడికి ముందే డబ్బిచ్చేశాడు!
పువ్వులలా వస్తూనే ఉన్నాయి
పుట్టిన రోజు..పెళ్లి రోజూ..
ఇలా ప్రతి సందర్భంలో శుభాకాంక్షలు ఆమెకు చెబుతూనే ఉన్నాయి!"

పాక్ కాల్పుల్లో అమరుడైన కపిల్ కుందు రాసుకున్న కవిత


ఎన్నేళ్లు బతికామన్నది కాదన్నయ్యా!

ఎంత గొప్పగా బతికామన్నదే ముఖ్యం

వీర జవాను వీడ్కోలు సందేశం

నాకు మరో కొడుకున్నా దేశం కోసమే పంపేదాన్ని: వీర మాత

16



ఇవాళ మేం.. రేపు మీరు!

ఎవరైనా గద్దెనెక్కవచ్చు

రాజ్యసభలో అమిత్‌షా గంటన్నర తొలి ప్రసంగం

16



మోదీ గంజాయి మత్తులో ఉన్నప్పుడు..!

ప్రధానిపై కాంగ్రెస్ నేత రమ్య వివాదాస్పద వ్యాఖ్య

16

» సీన్ రివర్స్

పోలీస్ బ్లాక్ మెయిల్



తిడితే ఆత్మహత్య చేసుకుంటా!

మీ పేరు రాసి మరీ చచ్చిపోతా

పోలీసు సిబ్బంది బెదిరింపులు

ఉన్నతాధికార్లకు ముచ్చెమటలు

డ్యూటీలో టార్గెట్ తప్పితే.. బెదిరింపులతో సేఫ్‌జోన్‌లోకి

పోలీసుశాఖలో నయా ట్రెండ్.. చెల్లని ఆఫీసర్ల అధికారం

ఎస్సైలు, సీఐలతో సంకటం.. మెమోల జారీలోనూ జాగ్రత్త

ఆయనో సర్కిల్ ఇన్‌స్పెక్టర్! క్రైమ్ మీటింగ్‌లో ఉన్నతాధికారులు తనకు వార్నింగ్ ఇస్తారని ముందుగానే ఊహించారు. అంతే ఆయన బెదిరింపు బాణం వదిలారు. 'నన్ను ఏమైనా అన్నారో ఆత్మహత్య చేసుకుంటా. మీకోసం నేను చేసిన కష్టం అంతా అందులో రాస్తా' అంటూ బెదిరింపులకు దిగారు. కంగుతిన్న పోలీసు ఉన్నతాధికారి క్రైమ్ మీటింగ్‌ను వాయిదా వేశారు. అంతేకాదు, ఆత్మహత్య చేసుకుంటానన్న అధికారిని క్యాంపు ఆఫీసుకు పిలిపించుకొని మరీ ఓదార్చారు.

'సిద్దిపేట జిల్లాలోని ఓ ఎస్‌ఐపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. బాధితులు నేరుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఎస్‌ఐని మందలించడానికి కూడా ఉన్నతాధికారులు ధైర్యం చేయడంలేదు. దీనికి కారణం.. ఇదే జిల్లాలో వివిధ కారణాలతో ముగ్గురు ఎస్‌ఐలు ఆత్మహత్యలకు పాల్పడడమే!

హైదరాబాద్/సిద్దిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇలాంటి ఘటనలు పోలీసు శాఖలో తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యానికే ఉన్నతాధికారుల నుంచి చివాట్లు, మెమోలు అందుకోవాల్సిన పరిస్థితి ఉండేది. కానీ, ఎస్‌ఐలు ఆత్మహత్యలకు పాల్పడడం, ఉల్టా బెదిరింపులకు దిగడం వంటి పరిస్థితులతో పోలీస్‌శాఖలో సీన్ రివర్సయ్యింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంత పెద్ద

మిగతా 2వ పేజీలో...

» విరబూసిన ఆనందం



రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్స్‌లో విరబూసిన పూల నడుమ కోవింద్ దంపతులు.

ఎన్డీయే లుకలుక

బీజేపీతో మిత్రులకు పెరుగుతున్న దూరం

వచ్చే ఎన్నికల్లో కూటమి నిలిచేనా?

ఇప్పటికే 273కు తగ్గిన సీట్లు

సభలో మరిన్ని ఇబ్బందులు తథ్యం

విభజన హామీలపై టీడీపీ గళమెత్తితే మద్దతిచ్చేందుకు మిత్రులు సిద్ధం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నిన్నటిదాకా దుర్భేద్యంగా ఉన్న ఎన్‌డీయే కూటమిలో లుకలుకలు బయల్దేరాయి. బీజేపీ మిత్రపక్షాలేవీ మనస్ఫూర్తిగా దాంతో కలిసి నడవడం లేదు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై టీడీపీయే అసంతృప్తి వ్యక్తం చేయగా, దానికి ఇతర పార్టీల మద్దతు పెరుగుతోంది. బీజేపీ వైఖరితో ఎన్డీఏ పార్టీలది

మిగతా 16వ పేజీలో...

'బినామీ'లకు చుక్కలే!

మన దగ్గర బాగా డబ్బులు ఉన్నాయి. సంపాదించిన డబ్బుకు సరిపడా పన్ను కట్టి.. మిగతా సొమ్ముతో ఎన్ని ఆస్తులు కొన్నా అడిగేవాడుండడు! అలా కాకుండా.. పది రూపాయలు సంపాదించి.. రెండు రూపాయలే ఆదాయం వచ్చినట్టుగా చూపించి.. మిగతా రూ. 8 తో వేరే వ్యక్తుల పేరిట ఆస్తులు కొని అనుభవిస్తామంటే కుదరదు! బాలీవుడ్ బాద్‌షా.. షారుక్ ఖాన్ ఆదాయ పన్ను శాఖ అధికారులకు పట్టుబడింది ఇలాంటి కేసులోనే!



నిబంధనలు మారాయి.. జాగ్రత్త!

ఇతరుల పేరుతో కొనుగోళ్లకు కాలం చెల్లు

ఆదాయపన్ను అధికారులు అన్నీ ప్రశ్నిస్తారు

షారుక్ ఖాన్ ఉదంతంతో సంపన్నుల బెంబేలు

ముంబై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముంబైకి దక్షిణంగా ఉన్న సముద్ర తీర పట్టణం అలీబాగ్ దగ్గర్లో తాళ్ అనే గ్రామం ఉంది. ఐటీ అధికారులు చెబుతున్నదాని ప్రకారం.. ఆ ఊళ్లో షారుక్ 19,960 చదరపు మీటర్ల (4.93 ఎకరాల) వ్యవసాయ భూమి కొన్నాడు. కానీ.. తన పేరు మీద కాదు. ఇంకెవరో వ్యక్తుల పేరిట. అందుకోసం 2004 డిసెంబరులో 'డెజావు ఫార్మ్స్' పేరుతో ఒక సంస్థను నెలకొల్పారు. ఆ సంస్థకు షారుక్ రూ.8.5 కోట్ల అప్పు ఇచ్చాడు. వ్యవసాయం చేస్తామని చెప్పి మరీ ఆ డబ్బుతో భూమిని కొన్నారు. కానీ, దాన్ని షారుక్ వ్యక్తిగత వినియోగం కోసం ఫామ్‌హౌస్‌గా మార్చారు. ఖరీదైన విల్లా కట్టి.. పెద్ద స్విమ్మింగ్‌పూల్, హెలిప్యాడ్ వంటి ఏర్పాట్లు చేశారు. అక్కడ 1991కి ముందు ఓ భవనం ఉండేదంటూ నకిలీ పత్రాలు సృష్టించారు. కార్పొరేట్ వ్యవహారాల శాఖ రికార్డుల ప్రకారం.. డెజావు ఫార్మ్స్‌లో షారుక్ అత్తమామలైన సవిత, రమేశ్, షారుక్ మరదలు నమిత చిబ్బా డైరెక్టర్లుగా ఉన్నారు. వ్యవసాయం చేస్తామంటూ భూమినైతే

మిగతా 16వ పేజీలో...



వనపర్తిలో జరిగిన కాంగ్రెస్ మహిళా గర్జనలో మాట్లాడుతున్న ఉత్తమ్

మహిళలకు వడ్డీ లేని రుణాల పరిమితి పెంపు

ప్రతి సంఘానికీ లక్ష.. 'అభయహస్తం' కింద మరో వెయ్యి

సెర్ప్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ.. వీవోయేలకు 10వేల వేతనం

మహిళా మేనిఫెస్టోను ప్రకటించిన టీపీసీసీ చీఫ్ ఉత్తమ్

టీఆర్ఎస్‌పై తిరగబడాలి: కుంతియా.. వనపర్తిలో 'గర్జన'

వనపర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచుతామని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలను పర్యవేక్షిస్తున్న 4,262 మంది సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని వెల్లడించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన 'మహిళా గర్జన' కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా మేనిఫెస్టోను ఆయన

మిగతా 6వ పేజీలో...

ప్రాజెక్టులపై 'ఉక్కు' పిడుగు

భారీగా పెరిగిన స్టీలు ధరలు.. టన్ను ధర రూ.34 నుంచి 52 వేలకు

అదనపు భారం రూ.900 కోట్లు!.. పాలమూరుపైనే 400 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ ప్రాజెక్టులపై 'ఉక్కు' పిడుగు పడుతోంది. స్టీలు ధరల పెరుగుదలతో సర్కారుపై అదనపు భారం పడుతోంది. ప్రస్తుత అంచనా ప్రకారం నిర్మాణంలో ఉన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ వంటి ప్రాజెక్టుల్లో ఉపయోగించే ఉక్కుకు సంబంధించి ప్రభుత్వంపై అదనంగా సుమారు రూ.900 కోట్ల భారం పడనుందని అంచనా వేస్తున్నారు. ఉక్కు ధరలు ఇలాగే పెరిగితే... భవిష్యత్తులో ప్రాజెక్టులపై మరింత భారం పడనుందని భావిస్తున్నారు. ప్రాజెక్టులను మొదలు పెట్టినప్పుడు మార్కెట్‌లో ఉక్కు ధర టన్నుకు సుమారు రూ.34 వేల వరకు ఉండేది. అయితే ఎనిమిది మాసాలుగా ఉక్కు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం కంపెనీని బట్టి ఉక్కు ధర టన్నుకు రూ.52 వేల వరకు ఉంది. దీంతో పెరిగిన ధరలను చెల్లించి ప్రాజెక్టుల నిర్మాణాల కోసం ఉక్కును కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కాళేశ్వరం

మిగతా 5వ పేజీలో...



గవర్నర్ నరసింహన్‌ను కలిసిన మంత్రి కేటీఆర్

'డబుల్'కు స్టీల్ కంపెనీలు

సాయపడాలి

ఉక్కు కంపెనీ యజమానుల సమావేశంలో మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్ వినతి

5

ప్రొఫెసర్ల కొరతతో ఇక్కట్లు!

వయోపరిమితి పెంపు అమలేదీ?


ఘోస్ట్ డాక్టర్లతో విద్యార్థులకు బోధన

రోగులకు సేవలపైనా ప్రభావం

గాంధీ, ఉస్మానియా, కాకతీయ నుంచి పాలమూరు, సిద్దిపేటకు డిప్యుటేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రొఫెసర్ల కొరత వేధిస్తోంది! ఫలితంగా వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదు. రోగులకు మెరుగైన సేవలు అందడం లేదు! ఈ ప్రభావం ప్రతిష్ఠాత్మక గాంధీ, ఉస్మానియా వైద్య కళాశాలలపైనా పడినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. కాకతీయ మెడికల్ కాలేజీలోనూ ఇదే పరిస్థితి. ప్రొఫెసర్లతోపాటు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల కొరత నేపథ్యంలో ప్రభుత్వం పలు ఫీట్లు చేస్తోంది! విద్యాసంవత్సరం మధ్యలో ఉస్మానియా, గాంధీ, కాకతీయ వైద్య కళాశాలల నుంచి కొందరికి డిప్యుటేషన్ ఇస్తూ వైద్య విద్య డైరెక్టర్(డీఎంఈ) రమేష్‌రెడ్డి ఈ నెల 1న ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఉస్మానియా నుంచి మహబూబ్‌నగర్ వైద్య కళాశాలకు 18 మందిని డిప్యుటేషన్‌పై పంపారు. ఇక సిద్దిపేట

మిగతా 2వ పేజీలో...



కోరికలన్నీ ఆ నాలుగు విభాగాల్లోనే!



పరంజ్యోతి Paramjyothi

లోకంలో నిత్యవ్యవహారంలో ఏ వ్యక్తీ ఏ ప్రయోజనం లేకుండా ఏ పనినీ చేయడు. ఒక ప్రయోజనం ఉందంటే ఎన్ని కష్టాలకైనా ఓర్చి ఆ యా పనులను ఒప్పుకొని చేస్తుంటాడు. ప్రతి మనిషీ తను కోరుకున్నది సాధించుకోవడం కోసమే పని చేస్తూంటాడు. కొందరు ధనం కావాలనుకుంటే, మరికొందరు సుఖం కావాలనుకుంటారు. మరికొందరు ఈ పనులు, ఈ సంపదలూ, ఈ సుఖాలూ ఇవన్నీ శాశ్వతమైనవి కావు, వీటన్నిటికీ మించిన శాశ్వతమైనది ఏముందో అది తెలిస్తే చాలు. అదుంటే చాలు అనుకుంటారు. ఈ భూమి పైన ఎన్ని వందలకోట్ల జనాభా ఉన్నదో వారి కోరుకునే విషయాలు అన్ని వందల కోట్ల వందలకోట్ల సంఖ్యకు మించి ఉంటాయి. ఒక మనిషికి ఇన్ని కోరికలే ఉండాలని లేదు. అందుకనే.. 'సముద్ర ఇవ కామః యథా సముద్రో అనంతః తథా కామః అపి' అని వేదాలు చెబుతున్నాయి. సముద్రం ఎలాగైతే అంతం లేనిదో కోరికలు కూడా అలాగే అని దీని అర్థం. ఈ అనంతమైన కోరికలను మన మహర్షులు స్థూలంగా నాలుగు విధాలుగా విభజించారు. తమ విధినిర్వహణలో ఆనందాన్ని పొందేవారిని ధర్మార్థులు అంటారు. ధన సంపదలను కోరుకునే వారిని అర్థార్థులు అన్నారు. అన్ని రకాల లౌకిక సుఖాలనూ కోరుకునే వారిని కామార్థులు అంటారు. ఈ జగత్తుకు మూలభూతమైన సత్యాన్ని తెలుసుకోవాలనుకునే వారు మోక్షార్థులు. చతుర్విధపురుషార్థములని వీటికే పేరు. సూక్ష్మంగా పరిశీలిస్తే ప్రపంచంలో ఎవరి కోర్కైనా ఈ నాలుగు విధాలలోకే చేరుతుంది. ఈ కోరికలను కలిగిఉండటం మానవధర్మం. అయితే మనం ఏ పని చేసినా అందరి మంచి కోసం, అందరి సుఖం కోసం అనుకుంటే, అలా ఉండేలా చేస్తే మన ప్రతి కోరికా ధర్మబద్ధమే అవుతుంది.

-ఆచార్య రాణి సదాశివమూర్తి

లోకం తీరు



జీఎస్టీ, నోట్ల రద్దు, నిత్యావసర ధరలు, రాజస్థాన్ ఉప ఎన్నికలు, చమురు ధరలు... ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఉంటే ఎన్నికలకు ఎలా వెళ్తామయ్యా?



దబ్బనం రంధ్రంలో, ఉంగరంలో దూరే చీరను ప్రదర్శిస్తున్న హరిప్రసాద్

పోలీస్ బ్లాక్‌మెయిల్



మొదటి పేజీ తరువాయి

ఆరోపణలు వచ్చినా సున్నితమైన మందలింపులతోనే సరిపెట్టాల్సి వస్తున్నది. విధిగా అప్పగించాల్సిన బాధ్యతలను కూడా సున్నితంగా, సుకుమారంగా చెప్పాల్సి వస్తోంది. తాజాగా.. నల్లగొండ సీఐ అనూహ్యంగా మాయమవడం... ఒత్తిడి నుంచి బయటపడడానికే అలాచేశానని చెప్పడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. ఆయన చేసిన పని సరైందా? కాదా అన్న అంశాన్ని పక్కనపెడితే, ఒత్తిడి పెరిగినప్పుడు పోలీసు అధికారులు వారివారి మానసిక స్థితినిబట్టి వ్యవహరిస్తున్నారు. కొందరు సహాయ నిరాకరణకు దిగితే, మరి కొందరు ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సిద్దిపేట కమిషనరేట్‌లో దీనిప్రభావం మరీ ఎక్కువగా ఉంది.

తరాల అంతరమే సమస్య!

పోలీసుశాఖలోని సనాతన సంప్రదాయాలు వంటబట్టకపోవడంవల్లే కొత్త తరంవారు సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని కొందరు ఉన్నతాధికారులు చెబుతున్నారు. 1990 ముందు పోలీసు సర్వీసులో చేరిన వారికి ప్రొటోకాల్ విధానం ఎలా పాటించాలి? ఉన్నతాధికారుల ఆదేశాలను ఎలా పాటించాలి? వంటి విషయాలు బాగా తెలుసు. పైస్థాయి అధికారులు ఇచ్చే ఆదేశాలు, సలహాల్లో తప్పున్నా వాటిని ఎత్తిచూపకుండా అమలు చేసినవారున్నారు. అయితే, సాంకేతికత, కొత్త విద్యావిధానం పోలీసు శాఖలోనూ మార్పులు తీసుకొచ్చాయి. "యూనిఫామ్ సర్వీసు కావడంతో బాసిజం(అధికార దర్పం)ఉంటోంది. ఇప్పుడు పీజీ, పీహెచ్‌డీలు, ఎంటెక్ గ్రాడ్యుయేట్లు కూడా ఎస్సైలుగా వస్తున్నారు. ఉన్నత విద్యావంతులు కానిస్టేబుళ్లుగా నియమితులవుతున్నారు. పైవారు ఇచ్చే ఆదేశాలు డొల్లగా ఉన్నప్పుడు అది తప్పు.. అలా ఎందుకు చేయాలంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో అంతర్గత ఘర్షణ మొదలవుతోంది" అని పోలీసులకు మానసిక అంశాల్లో శిక్షణ ఇస్తున్న నిపుణుడు ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. అయితే, అందరి విషయంలో ఇలాంటి పరిస్థితి లేదంటున్నారు. "కొందరు ఉన్నతాధికారుల మనసు తెలుసుకొని వ్యవహరిస్తున్నారు. గొడవలకు చోటివ్వకుండా చూసుకుంటున్నారు. వారి మధ్య స్నేహం పెరిగి...అది వికటించిన తర్వాత....కిందిస్థాయిలోని వారు కొందరు అడ్వాంటేజ్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తమను తిట్టినా, లేదా చార్జ్‌మెమోలు ఇచ్చినా కొందరు బెదిరింపులకు దిగుతున్నారు. ఆత్మహత్య చేసుకుంటామంటున్నారు. ఎందుకొచ్చిన గొడవంటూ పై స్థాయివారు రాజీపడిపోతారు." అని ఆయన వివరించారు. అయితే, ఉన్నతస్థాయి అధికారులతో సత్సంబంధాలు లేనివారు, తీవ్రమైన వేధింపులను ఎదుర్కొంటున్నవారు తమకు ఇక ఏ అండా దొరకడంలేదంటూ మానసిక సంఘర్షణకు లోనై ఆత్మహత్య చేసుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. సిద్దిపేట కమిషనరేట్‌లో ఎక్కువగా ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయి. ఇటీవలి కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఇద్దరు ద్వితీయశ్రేణి పోలీసు అధికారులు నేరుగా పోలీసుబాస్‌లకే లేఖలు రాసి ఆత్మహత్య చేసుకుంటామంటూ హెచ్చరించారు. నేరాలు జరిగినప్పుడు కేసులు నమోదు చేసే సమయంలో రాజకీయ జోక్యం, ఉన్నతాధికారుల పెత్తనం ఉండటంతో కొందరు డ్యూటీ సరిగ్గా చేయలేక చేతులెత్తేస్తున్నారు. నల్లగొండ ఘటన ఇలాంటిదేనని అధికారవర్గాలు అనుమానిస్తున్నాయి.

రాజకీయ రంగుతో ఇబ్బందులు

సిద్దిపేట జిల్లాలో కొత్తగా విలీనమైన ఓ మండలంలో ఒక ఉద్యోగి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పదోన్నతి పొందాడని ఆరోపణలు రావడంతో అతనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వెంటనే ఆ ఉద్యోగిని రిమాండ్ చేయాలని సదరు ఎస్సైకి అధికారులు సూచించారు. చివరకు కోర్టు మినహాయింపుతో నెల తర్వాత ఆ ఉద్యోగికి స్టేషన్ బెయిల్ వచ్చింది. నెల జాప్యం జరగడానికి ఓ రాజకీయ నేత హస్తం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల కన్నా రాజకీయ నేత మాటకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చినట్లు సమాచారం.

గతంలో ఇలా లేదు

20 ఏళ్ల కిందట డిపార్టుమెంట్‌లో చేరినపుడు అధికారుల మాట జవదాటకుండా పనిచేశాం. ఏ అధికారైనా అవినీతికి పాల్పడాలని చెప్పడు. డ్యూటీలో తేడా వస్తే మందలిస్తారు. చిన్న అంశాలకే గతంలో మాకు మెమోలు, చార్జి మెమోలు ఇచ్చేవారు. అందుకే అప్రమత్తంగా ఉండేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రాజకీయ సంబంధాలు పెట్టుకుంటున్నారు. ఠాణాలలో రికార్డుల నిర్వహణ కూడా సక్రమంగా ఉండట్లేదు. - ఒక ఏసీపీ

భయపడక తప్పడం లేదు

స్టేషన్లలో పని జరగకుంటే బాధితులు మాదాకా వచ్చి ఫిర్యాదు చేస్తారు. న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో అన్ని విషయాలు మాట్లాడతారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్ఐలకు, సీఐలకు ఫోన్ చేసి మందలించాలంటే మేమే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనరల్ తనిఖీలకు వెళితే టార్చర్ పెడుతున్నారని అంటారు. వారు అనాలోచితంగా ఏదైనా చేసుకుంటారనే ఉద్దేశంతో వారిపై ఎన్ని ఫిర్యాదులొచ్చినా, వాటికి ఆధారాలున్నా మెమోలు ఇవ్వడానికి ఆలోచిస్తున్నాం. - ఒక పోలీస్ ఉన్నతాధికారి

దబ్బనం, ఉంగరంలో దూరే చీర!

- ఇదీ సిరిసిల్ల నేతన్న ఘనత
- బతుకమ్మ చీర నూలుతో తయారీ

సిరిసిల్ల, ఫిబ్రవరి 5: అద్భుతాలు సృష్టించడంలో మన నేతన్నకు సాటిరారెవ్వరు! అగ్గిపెట్టెలో అమరే చీరలను నేసి ఎప్పుడో విశ్వఖ్యాతిని గడించారు. అదే స్ఫూర్తితో రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నేత కార్మికుడు ఎల్డి హరిప్రసాద్.. దబ్బనం రంధ్రంలో, ఉంగరంలో దూరే చీరను తయారు చేశాడు. బతుకమ్మ చీరలకు ఉపయోగించే నూలును వారి పవర్‌లూంపై దీన్ని రూపొందించాడు. హరిప్రసాద్ గతంలో సూక్ష్మస్థాయి మరమగ్గాల యంత్రాలు తయారుచేసి అబ్బురపరిచాడు.



వట్టివాగు మినీ మేడారంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న జేసీ దామోదర్‌రెడ్డి

చింతలగట్టులో ఆంధ్రజ్యోతి 'స్వచ్ఛ'జాతర

జేసీ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యర్థాల తొలగింపు

మహబూబాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వట్టివాగు చింతలగట్టు మినీ మేడారం జాతర ప్రదేశంలో భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'స్వచ్ఛ' జాతర పేరిట సోమవారం తొలగించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ దామోదర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత శబరిమలై కోసం ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. అదే రీతిన సుమారు 2 లక్షలకు పైగా భక్తజనం హాజరైనా వట్టివాగు చింతలగట్టు మినీ మేడారంలో వదిలేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, చెదారాన్ని తొలగించి పర్యావరణ పరిరక్షణకు, రిజర్వు ఫారెస్టులో శుభ్రతకు ముందుకొచ్చిన ఆంధ్రజ్యోతి బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గూడూరుకు చెందిన విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

కరెంటు పొయ్యిలో పసిడి!

స్టౌలో పొరలు పొరలుగా పేర్చి.. 4.65కిలోల బంగారం స్మగ్లింగ్

- అధిక బరువుతో అనుమానాలు
- నెల్లూరు రైల్వేస్టేషన్‌లో పట్టివేత
- విలువ రూ. కోటిన్నరపైమాటే

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 5 : అది కరెంటు పొయ్యి! పైన మూత, దానిని తీస్తే లోపల గిన్నె పట్టేంత స్థలం! ఆ మూతపెట్టే చోటుకూ, గిన్నె పట్టే స్థలానికీ మధ్య.. చుట్టూ వెడల్పాటి పొర! ఇంతవరకు బాగానే ఉంది. మామూలు పొయ్యి కన్నా కొంచెం ఎక్కువ బరువు లేకపోతే అధికారులకు సైతం అనుమానం వచ్చేది కాదు! ఆ పొయ్యి పొరల్లో స్మగ్లర్లు పేర్చిన సుమారు ఐదు కిలోల బంగారాన్ని ఆదివారం అర్ధరాత్రి నెల్లూరు రైల్వేస్టేషన్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకొన్నారు. డీఆర్ఐ వర్గాల కథనం ప్రకారం, కొంతమంది వ్యక్తులు ఎలక్ట్రిక్ స్టౌ, బొగ్గు స్టౌలలో బంగారాన్ని రైల్లో తరలిస్తున్నట్టు డీఆర్ఐ అధికారులకు సమాచారం అందింది. నెల్లూరు స్టేషన్‌లో గౌహతీ ఎక్స్‌ప్రెస్‌లో అధికారులు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి బ్యాగ్‌లో అల్యూమినీయంతో తయారు చేసిన ఎలక్ట్రికల్, బొగ్గు స్టౌవ్‌లు కనిపించాయి. వాటి బరువు అధికంగా ఉండటంతో అనుమానం వచ్చి, ఆ పొయ్యిలను నిశితంగా పరిశీలించారు. రూ. 1.50 కోట్ల విలువైన సుమారు ఏడు కిలోల బంగారాన్ని వాటిలో గుర్తించారు. ఎలాంటి అనుమానం రాకుండా స్మగ్లర్లు ఆ స్టౌలలో పొరలు, పొరలుగా బంగారాన్ని అమర్చి.. తరలించడానికి ప్రయత్నించారు. మయన్మార్ నుంచి తెచ్చిన ఈ బంగారాన్ని మద్రాస్‌కు స్మగ్లింగ్ చేస్తున్నట్టు నిందితుడు అంగీకరించారు. 1962 యాక్ట్ కింద వారిపై కేసు నమోదుచేసి, అతడిని విజయవాడ రైల్వే కార్యాలయానికి తరలించారు. కాగా, మరో ఘటనలో.. ఒడిశాలోని భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌లో ఒక వ్యక్తి నుంచి రూ. 76.59 లక్షలు విలువ చేసే 2.49 కిలోల బంగారం స్వాధీనం చేసుకొన్నారు.



స్టౌలో బంగారాన్ని ఇలా అమర్చారు!

ఎద్దులు అమ్మినందుకు తల్లి, బిడ్డ ఆత్మహత్యాయత్నం



మృతి చెందిన వీరతేజ

- కొడుకు మృతి.. తల్లి పరిస్థితి విషమం

దుగ్గిరాల, ఫిబ్రవరి 5: ఎద్దులంటే వారికి ప్రాణం.. తల్లి, బిడ్డలు వాటిని అమ్మొద్దన్నారు. తండ్రితో గొడవపడ్డారు. కానీ ఆర్థిక కారణాలతో తండ్రి వాటిని అమ్మేశాడు. దీంతో మనస్తాపానికి గురైన తల్లి, బిడ్డ కూల్‌డ్రింక్‌లో గుళికలు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ క్షణికావేశానికి ఓ నిండు ప్రాణం బలైంది. మరో ప్రాణం చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలోని పేరుకలపూడి గ్రామానికి చెందిన నల్లగొర్ల శివన్నారాయణ, మాధవి (33) భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులున్నారు. అందులో వీరతేజ (11) పెద్దవాడు. శివన్నారాయణ ఇంట్లోని ఎద్దులను విక్రయించాలని నిర్ణయించగా మాధవితోపాటు పిల్లలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయమై ఇంట్లో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అయినా ఇవేమీ లెక్కచేయకుండా శివన్నారాయణ ఆ ఎద్దులను అమ్మేశాడు. తమ మాట లెక్కచేయలేదన్న కోపంతో మాధవి, వీరతేజ థమ్సప్‌లో గుళికలు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరతేజ ఇంటివద్దే మృతిచెందగా.. మాధవి తెనాలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది.

ప్రొఫెసర్ల కొరతతో ఇక్కట్లు!

మొదటి పేజీ తరువాయి

కళాశాలకు గాంధీ, ఉస్మానియాల నుంచి 20 మందిని పంపించారు. వీరిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకే ఈ డిప్యుటేషన్లు ఉంటాయి. అంటే వారు మళ్లీ వెనక్కు వస్తారు! ఫలితంగా అటు మహబూబ్‌నగర్, సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందదు. అదే సమయంలో ఇటు ఉస్మానియా, గాంధీ విద్యార్థులకు ఇబ్బందులే! రోగులకు సేవలపైనా ప్రభావం పడనుంది. వైద్య విద్యా బోధనలో 9 ఏళ్ల అనుభవం ఉంటేనే ప్రొఫెసర్ అవుతారు. ఈ క్రమంలో ప్రొఫెసర్ల కొరతను దృష్టిలో పెట్టుకొని కేంద్రంతో పాటు పలు రాష్ట్రాలు ఇప్పటికే వయోపరిమితిని పెంచాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా అదే బాటలో నడవాలన్న అభిప్రాయానికి వచ్చింది. దీనిపైనే గత నెల 30న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఉన్నతస్థాయి సమావేశం కూడా నిర్వహించారు. సీఎం కేసీఆర్ కూడా వయోపరిమితి పెంచడానికి సానుకూలంగా ఉన్నారన్న వార్తలు వచ్చాయి. అధికారిక నిర్ణయం ఇంకా వెలువడాల్సి ఉంది. కానీ, ప్రొఫెసర్ల కొరతతో ప్రభుత్వం కూడా 'డిప్యుటేషన్' ఫీట్లు చేయాల్సి రావడం చర్చనీయాంశమైంది.

మరిన్ని ఖాళీలు!

వయోపరిమితి పెంచకపోతే ఈ సంవత్సరం అనేక మంది ప్రొఫెసర్లు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయని, ఆ ప్రభావం వైద్య రంగంపై పడుతుందని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అప్పుడు మరింత మంది ఘోస్ట్ డాక్టర్లు ప్రభుత్వ రంగంలోనే పుట్టుకురాక తప్పదని చెబుతున్నాయి.

ఘోస్ట్ డాక్టర్లతో ఇబ్బంది

ఏ వైద్య కళాశాల ఫ్యాకల్టీ ఆ వైద్య కళాశాలకే ఉండాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) కూడా స్పష్టం చేస్తోంది. కానీ, కొన్ని ప్రైవేట్ వైద్య కళాశాలలు ఈ ఆదేశాలను సరిగా పాటించడంలేదు. దీంతో విద్యార్థులకు సరైన బోధన అందడంలేదు. ఎంసీఐ తనిఖీకి వచ్చినప్పుడు మాత్రం వేరే కళాశాలలో పని చేస్తున్న వారిని తీసుకువచ్చి తమ ఫ్యాకల్టీ సభ్యులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రైవేట్ వైద్య కళాశాలలు ముట్టజెప్పే కాసులకు కక్కుర్తి పడే కొందరు వైద్యులు ఇందుకు అంగీకరిస్తున్నారు. ఎంసీఐ తనిఖీకి వచ్చినప్పుడే వారు ఆ కళాశాలలో కనిపిస్తారు. తర్వాత అక్కడ కనిపించరు. వీరే ఘోస్ట్ డాక్టర్లు. దీనివల్ల విద్యార్థులకు సరైన విద్య అందదు. దీన్ని ఎంసీఐ తీవ్రంగా పరిగణిస్తోంది. రెండేళ్ల కిందట ఈ బాగోతం బయటపడింది. తెలంగాణకు చెందిన ముగ్గురు, ఏపీకి చెందిన నలుగురు డాక్టర్లు పుదుచ్చేరిలోని ప్రైవేట్ వైద్య కళాశాలలో పని చేయకపోయినా తాము అక్కడి ఫ్యాకల్టీ సభ్యులమేనని ఎంసీఐని నమ్మించారు. తర్వాత విషయం ఎంసీఐకి తెలియడంతో వారిపై వేటు వేసింది. నాడు ఎంసీఐ సభ్యుడిగా ఉన్న ప్రస్తుత డీఎంఈ రమేష్‌రెడ్డి.. ఇలాంటి అనైతిక చర్యలు వైద్య వృత్తికి మచ్చ వంటివని వ్యాఖ్యానించారు. కానీ, ఇప్పుడు ఆయనే ఉస్మానియా, గాంధీ, కాకతీయల నుంచి కొందరు డాక్టర్లను మహబూబ్‌నగర్, సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలకు డిప్యుటేషన్‌పై పంపుతూ ఆదేశాలు ఇవ్వాల్సి రావడం చర్చనీయాంశమైంది.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	08.6	33.0
రామగుండం	14.3	33.0
హైదరాబాద్	14.9	31.2
సంగారెడ్డి	15.0	31.0
వరంగల్	16.0	33.0

రాష్ట్రంలో కొనసాగుతున్న చలి

హైదరాబాద్/విశాఖపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. సోమవారం రాత్రి ఖమ్మంలో అత్యల్పంగా 12 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. సముద్రం నుంచి తేమ గాలులు వీస్తుండడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల పాక్షికంగా మేఘాలు ఆవరించాయి



మోదీ 'ప్రామిస్' టూత్‌పేస్ట్!

గత ఎన్నికల ప్రచార సమయంలో అమ్మిన ప్రామిస్ టూత్‌పేస్ట్.. పళ్లు శుభ్రం చేయడం మాట అటుంచి.. సమస్యల్లో ఉన్న రైతులు, నిరుద్యోగుల ముఖాలపై చిరునవ్వు తీసుకురాలేదు. మరి ఆదివారం మోదీ బెంగళూరు ర్యాలీలో విక్రయించిన ప్రామిస్ టూత్‌పేస్ట్ చిరునవ్వు తెస్తుందని మీరు నమ్ముతున్నారా?

- సినీనటుడు ప్రకాశ్‌రాజ్



బీజేపీపై భ్రమలు తొలిగాయి

బీజేపీపై మధ్యతరగతి ప్రజల్లో భ్రమలు తొలగిపోయాయి. నిరుద్యోగం ఇప్పుడు అతి పెద్ద సమస్య. భవిష్యత్ పట్ల యువత ఆందోళన చెందుతోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 215 కన్నా తక్కువ సీట్లే వస్తాయి.

- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.77.63	పాత ధర 69.69
కొత్త ధర రూ.77.63	కొత్త ధర 69.69
మార్పులేదు	మార్పులేదు



భయమే కుక్కకాటుకు కారణం

లండన్, ఫిబ్రవరి 5: మనలోని భయాల వల్లే కుక్కలు కరుస్తుంటాయని పరిశోధకులు అంటున్నారు. 385 కుటుంబాల్లోని 694 మందిపై యూకేలోని వర్సిటీ ఆఫ్ లివర్‌పూల్ పరిశోధకులు నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. టెన్ ఐటెం పర్సనాలిటీ ఇన్వెంటరీ(టీఐపీఐ) విధానం ద్వారా శునకాలపై వారిని పలు ప్రశ్నలు అడిగి వారిలోని భావోద్వేగాల స్థిరత్వాన్ని అంచనా వేశారు. కుక్కలంటే ఉన్న భయంతోనే చాలామంది కుక్కకాటుకు గురైనట్లు తెలిసింది.

భారత్ యాంటీ బయోటిక్స్‌తో సూపర్ బగ్ ముప్పు

లండన్: యాంటీ బయోటిక్స్ ఒక్కొక్కటిగా పనిచేయకుండాపోతున్నాయి. రోగ నిరోధక మందులకు లొంగని సూక్ష్మక్రిములు(సూపర్ బగ్) కొత్త రోగాలతో మనిషిని చిన్నాభిన్నం చేస్తున్నా యి. దీనికి కారణమేంటని పరిశోధకులు ఆరా తీయగా.. భారత్‌లో అమ్ముడయ్యే యాంటీబయోటిక్స్ కూడా ఈ సమస్యకు ఓ కారణమని తెలిసింది. భారత్‌లో యథేచ్ఛగా అనుమతి లేని యాంటీ బయోటిక్స్ అమ్ముడవుతున్నాయని తేలింది. భారత్‌లో 2007-2012 మధ్య అమ్ముడైన యాంటిబయోటిక్స్, వాటి అనుమతులపై క్వీన్‌మేరీ వర్సిటీ ఆఫ్ లండన్ పరిశోధకులు పరిశోధన చేశారు.

నేటినుంచి శ్రీశైలమల్లన్న బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 5: శ్రీగిరిక్షేత్రంలో మంగళవారం నుంచి మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 15వ తేదీవరకు కొనసాగే బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 7.30 గంటల నుంచి చండీశ్వరపూజ, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు, స్వామివారికి విశేషార్చనలు, అమ్మవారికి నవావరణార్చనలు, 9గంటలకు రుద్రహోమం, చండీహోమది పూజలు, బలిహరణలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటల నుంచి నిత్యహవనాలు, అనుష్ఠానాలు, బలిహరణలు నిర్వహిస్తారు. ఉత్సవాల రెండో రోజు నుంచి వాహన సేవలు, గ్రామోత్సవాలు మొదలవుతాయి. 7వ తేదీ సాయంత్రం భృంగివాహనసేవ, 8న హంస, 9న మయూరం, 10న రావణ, 11 పుష్పపల్లకిసేవ, 12న గజవాహనం, 13వ తేదీ మహాశివ రాత్రి రోజున నందివాహనసేవ, 14న రథోత్సవం, 15న పూర్ణాహుతి, 16వ తేదీన అశ్వవాహనసేవ ఉంటాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఉభయదేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సంగమేశ్వర ఆలయానికి జల విముక్తి



కర్నూలు జిల్లా సప్తనదీ సంగమస్థలిలో వెలసిన శ్రీలలితా సంగమేశ్వరాలయం నదీజలాల నుంచి నెమ్మదిగా బయటపడుతోంది. సోమవారం సాయంత్రానికి శ్రీశైల జలాశయంలో 857.30అడుగుల నీటిమట్టంతో 98అడుగుల నీటిలోపల ఉండటంతో ఆలయ శిఖరాగంలోని ఎర్రరంగు మెట్లతో పాటు తెలుపురంగు మెట్లు కనిపిస్తున్నాయి. గత ఏడాది ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల శ్రీశైలానికి వరదజలాలు తాకిడి పెరిగి సెప్టెంబరు 19న ఆలయం పూర్తి స్థాయిలో నీటమునిగింది. గత కొన్నిరోజులుగా శ్రీశైల జలాశయంతో పాటు పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, మల్యాల, ముచ్చుమర్రి తదితర ప్రాజెక్టుల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల ద్వారా నీరు విడుదల చేస్తుండటం వల్ల ఆలయం శిఖరం కనిపిస్తోంది. మరో 30 అడుగుల నీటిమట్టం తగ్గితే తప్ప ఆలయం పూర్తిగా బయటపడేందుకు అవకాశం లేదు. ఈ ఏడాది శివరాత్రి పర్వదినానికి కూడా సంగమేశ్వరుడి దర్శనభాగ్యం లేకపోవడంతో ఎగువ ఉమామహేశ్వరాలయంలో భక్తులు పూజలు చేయనున్నారు. - ఆత్మకూరు/కొత్తపల్లి

మహాశివరాత్రి నాడు రాహు-కేతు పూజలు రద్దు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 13వ తేదీన చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో భ్రమరాంబ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని, మరుసటి రోజు నుంచి యథావిధిగా పూజలు జరుగుతాయన్నారు. ఈ మార్పును భక్తులు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ సాయంత్రం నుంచి 21వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. ఈ రోజుల్లో వీవీఐపీలకు స్వాగతం, ఆశీర్వచనం ఉండదన్నారు.

'సగర కులస్థులను బీసీ-ఎ గ్రూప్‌లో చేర్చాలి'

బర్కత్‌పుర/హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాలలో వెనుక బడిన సగర కులస్థులను బీసీ ఎ గ్రూప్‌లో చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర తదితరులు డిమాండ్ చేశారు. గతంలో బీసీ ఎ గ్రూప్‌లో ఉన్న సగరలను బీసీ డి గ్రూప్‌లో చేర్చి తీరని అన్యాయం చేశారని వారు ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి చివరి వారంలో నగరంలో లక్ష మందితో సగర మహాగర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టే నిర్మాణ పనుల్లో 20 శాతం కాంట్రాక్టులను సగర కులస్థులకే కేటాయించాలని గతంలో విడుదల చేసిన జీవో 29ని సవరించాలని డిమాండ్ చేశారు. సగర ఫెడరేషన్ ద్వారా ప్రతి జిల్లాకు మూడు కోట్ల రూపాయలు విడుదల చేయాలని కోరారు. సగర కుల దైవమైన భగీరథ మహర్షి విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని, ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎన్ఎస్‌యుఐ సభ్యత్వం 43 వేలు

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐకి నిర్వహించిన సభ్యత్వ నమోదులో 43,278మంది చురుకైన సభ్యులుగా, 2,58,000మంది ప్రాథమిక సభ్యులుగా సభ్యత్వం తీసుకున్నట్లు ఎన్ఎస్‌యూఐ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ కమిషనర్ కిరణ్ ముగబాసన్ తెలిపారు. జనవరి 1తో సభ్యత్వం పూర్తి చేశామని, చురుకైన సభ్యులకు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఉంటుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కేసీఆర్ ముందుచూపుతోనే అభివృద్ధి

- ఆయన వల్లే సిద్దిపేటలో ఆదర్శ రైతుబజార్
- ప్రజల కోసం ఆనాడే స్థలాన్ని కాపాడారు: హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రయోజనాలు కాపాడడంలో సీఎం కేసీఆర్ ముందుచూపు అమోఘమని మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. 1998లో కేసీఆర్ మంత్రిగా ఉన్నపుడు సిద్దిపేటలో ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి రైతు బజార్‌ను ఏర్పాటు చేశారని, ఆ స్థలమే నేడు ఆదర్శ రైతు బజార్‌గా మారి ప్రజలకు ఉపయోగపడుతోందన్నారు. ఆ ముహూర్త బలం వల్లే ఇది సాధ్యమైందన్నారు. దేశంలోనే ఆదర్శంగా నిర్మించిన మోడల్ రైతు బజార్‌ను సోమవారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిద్దిపేట బాగుపడాలంటే మూడు అవసరాలను(జిల్లాగా సిద్దిపేట, సాగునీటి వనరులు, రైల్వే లైను) తీర్చాలని కేసీఆర్ ఎప్పుడూ అనేవారని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారని, ఫలితంగా రైతులు అప్పుల పాలై చనిపోతున్న ఘటనలు ఇంకా తలెత్తుతున్నాయన్నారు. రైతుల కళ్లలో వెలుగులు నిండేందుకే ఒక రైతుబిడ్డగా కేసీఆర్ పరితపిస్తున్నారని చెప్పారు. పదవులు, డబ్బు, అధికారం తాత్కాలికమేనని, మంచి పనులు చేస్తేనే చిరస్థాయిగా పేరుంటుందని మంత్రి గుర్తు చేశారు. కాగా, పొన్నాల పరిధిలో నిర్మించిన పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభించిన మంత్రి హరీశ్.. దుద్దెడ శివారులో నూతనంగా సిద్దిపేట కమిషనరేట్ కార్యాలయాన్ని రూ.15కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

దేశంలోనే రోల్‌మోడల్ రైతుబజార్



సిద్దిపేటలో నిర్మించిన మోడల్ రైతు బజార్

సిద్దిపేటలో రూ.8.16 కోట్లతో నిర్మించిన మోడల్ రైతుబజార్ దేశానికే ఆదర్శమని మార్కెటింగ్ శాఖ అధికారులు చెపుతున్నారు. ఇందులో 350మంది కూరగాయల రైతులకు ప్రత్యేక చాంబర్లు ఏర్పాటు చేశారు. షాపింగ్‌మాల్‌ను తలపించేలా ఏసీ గదులు, కోల్డ్ స్టోరేజీ, ప్రత్యేక ఏటీఎం సెంటర్, అధునాతన వసతులు ఉన్నాయి. ప్రతి అంతస్తులో వేర్వేరుగా మరుగుదొడ్లు ఉన్నాయి. నిఘా కోసం 30సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ రహిత రైతు బజార్‌గా, ఎలక్ట్రానిక్ తూకాలతో నడిచేలా తీర్చిదిద్దారు. చెత్తాచెదారం, కుళ్లిన కూరగాయలతో సెల్లార్‌లోని బయోగ్యాస్ విద్యుత్ కేంద్రంలో విద్యుత్తును తయారు చేయనున్నారు. రైతు బజార్‌లో 'మానవత్వపు గది' ఆకట్టుకుంటోంది. ఇందులో అవసరం లేని వస్తువులు వేయాలని, అవసరమున్న వారు తీసుకెళ్లారని సూచనలురాశారు.

సాధికారతకు సామాజిక మాధ్యమం

- స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి
- ప్రజా మాధ్యమంగా సోషల్ మీడియా
- ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్



జ్యోతి వెలిగిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి, కె.శ్రీనివాస్

హన్మకొండ/కాళోజీ జంక్షన్ ఫిబ్రవరి 5: మహిళా సాధికారత సాధనలో సామాజిక మాధ్యమాలను కీలక సాధనంగా ఉపయోగించుకోవాలని స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని సెనేట్ హాల్‌లో జర్నలిజం, మాస్ కమ్యునికేషన్ విభాగం, దూర విద్య సంయుక్త ఆధ్వర్యంలో 'మహిళా సాధికారతలో సామాజిక మాధ్యమం పాత్ర' అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సును స్పీకర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవన ప్రస్థానంలో సోషల్ మీడియా ఓ అద్భుత పరిణామ క్రమంగా అభివర్ణించారు. ప్రజా మాధ్యమంగా సోషల్ మీడియా విస్తరిస్తోందని ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్ అన్నారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో సగం మంది స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారని చెప్పారు. సామాజిక మాధ్యమం విస్తృతమైన తర్వాత పత్రికలను చదవడం మానేశారని, దీంతో పత్రికల ఉనికికి ప్రమాదం ఏర్పడే పరిస్థితి వచ్చిందన్నారు.పత్రికలు కూడా సోషల్ మీడియాను అనుసరించి అందులోని సమాచారాన్ని వాడుకోవడం, కొన్ని సార్లు పత్రికలోని వార్తలను ముక్కలు ముక్కలుగా అందులో పెట్టడం చేస్తున్నాయని వెల్లడించారు. సామాజిక మాధ్యమంలో మంచీ చెడూ రెండు ఉన్నాయని గుర్తు చేశారు. అమెరికాతో పోల్చితే మన దేశంలో సామాజిక మాధ్యమాల వినియోగం తక్కువేనని తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో బోధనకు, క్షేత్ర స్థాయిలో ఆచరణకు సంబంధం లేదన్న విమర్శలు వస్తున్న తరుణంలో, కేయూలో ఈ సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు.

బడ్జెట్‌పై కేసీఆర్ మాట్లాడరేం?

- బీజేపీ, టీఆర్ఎస్.. తోడుదొంగలే : పొన్నం
- టీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి : జానారెడ్డి
- విభజన హామీల సాధనలో విఫలం : గండ్ర
- స్టడీ సర్కిళ్లలో అంతులేని అవినీతి : వీహెచ్
- తండాల అభివృద్ధి కోసం పోరాటం: రవీంద్ర
- ఒక్క హామీని నెరవేర్చని కేసీఆర్ : కనుకుల

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగినా సీఎం కేసీఆర్ ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉంటున్నారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. దీన్నిబట్టి బీజేపీ, టీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని స్పష్టమవుతోందన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, టీఆర్ఎస్ తోడుదొంగల మాదిరిగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. లోపాయికారి ఒప్పందం లేకపోతే కేంద్రం తీరుపై పోరాడాలని సూచించారు. కాగా, రానున్న ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని సీఎల్పీ నేత జానారెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.70 వేల కోట్ల మేర అప్పులుంటే, మూడున్నరేళ్లలో వాటిని 1.70లక్షల కోట్లకు చేర్చిన ఘనత టీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. మాటల గారడీతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పథకాలనే పేరుమార్చి అమలు చేస్తున్నారన్నారు. హన్మకొండలోని వడ్డేపల్లిలో కాంగ్రెస్ నేత గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను సాధించడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని విమర్శించారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం విషయం బడ్జెట్‌లో ప్రస్తావనకు రాకపోవడం టీఆర్ఎస్ చేతకానితనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాగా, తెలంగాణ స్టడీ సర్కిళ్లలో అంతులేని అవినీతి జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు ధ్వజమెత్తారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టడీ సర్కిల్ ఎదుట ఆందోళన అనంతరం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా అగ్రవర్ణానికి చెందిన జగదీశ్‌రెడ్డిని నియమించడాన్ని తప్పుపట్టారు. ఎస్సీ విద్యార్థుల సంక్షేమానికి రూ.11 కోట్లు ఖర్చు చేసినట్లు చూపుతున్నా, రూ.3 కోట్లకు బిల్లులే లేవని తెలిపారు. విద్యార్థులకు నెలకు రూ. 3500 ఇస్తున్నట్లు దొంగ బిల్లులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కిళ్లకు కమిషనర్‌గా ఉన్న అధికారి పారదర్శకంగా వ్యవహరించటం లేదని ఆరోపించారు. కాగా, తండాల అభివృద్ధి కోసం పోరాటం చేస్తానని టీపీసీసీ అధికార ప్రతినిధి రవీంద్ర నాయక్ తెలిపారు. గాంధీభవన్‌లో మాట్లాడుతూ గిరిజనులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం.. వారి మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని ఆరోపించారు. గిరిజనులను చైతన్యవంతం చేసేందుకు తండాలలో పర్యటిస్తానన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని సీఎం కేసీఆర్ నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్ రెడ్డి విమర్శించారు.

శ్రీకాకుళంలో 'కోటా' మంట!

- మత్స్యకారుల శిబిరానికి నిప్పు
- వారిని ఎస్టీల్లో చేర్చొద్దంటూ.. ఏపీలో ఆదివాసీల ఆగ్రహ జ్వాల
- కలెక్టరేట్ వద్ద బీభత్సకాండ



మంటల్లో కాలిపోతున్న మత్స్యకారుల దీక్షా శిబిరం

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: మత్స్యకారులను, వాల్మీకిబోయలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దంటూ ఏపీలో ఆదివాసీలు సాగిస్తున్న ఉద్యమం సోమవారం హింసాత్మకంగా మారింది. శ్రీకాకుళంలో ఆదివాసీలు పెద్దఎత్తున కదం తొక్కారు. కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసులు, అధికారులు చూస్తుండగానే.. మత్స్యకారుల దీక్షా శిబిరానికి నిప్పుపెట్టారు. అడ్డుకోబోయిన పోలీసులను, మత్స్యకార నేతలను తరిమికొట్టి, దీక్షా శిబిరాన్ని కూల్చేసి బీభత్సం సృష్టించారు. కలెక్టర్ జోక్యంతో ఆందోళనకారులు శాంతించి, వెనుదిరిగారు. తమను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ మత్స్యకారులు, వాల్మీకీ బోయలు చేస్తున్న డిమాండ్‌ను ఉత్తరాంధ్రలోని ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నారు. తమకన్నా అక్షరాస్యత శాతం ఎక్కువగా ఉన్న మత్స్యకారులను తమలో కలపడం వల్ల రిజర్వేషన్ ఫలాలకు దూరం అవుతామనేది వీరి ఆందోళన. దీనిపై సోమవారం ఆదివాసీ జేఏసీ 'గర్జన' పేరిట శ్రీకాకుళం నగరంలో నిరసన ప్రదర్శన జరిపింది. వేలాదిమందితో ఆర్ట్స్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన సాగింది. వారంతా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నించారు. పోలీసులు, వారిని లోపలకు అనుమతించలేదు. దీంతో ఇరుపక్షాల మధ్య తోపులాట సాగింది. కలెక్టర్ బయటకు రావాలంటూ ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారానికి సమీపానే గడచిన 50రోజులుగా మత్స్యకారులు దీక్షా శిబిరం నిర్వహిస్తున్నారు. పోలీసులతో ఘర్షణకు దిగిన వారిలో కొంతమంది ఆదివాసీలు.. ఆ దీక్షా శిబిరం వైపు ఆవేశంగా పరుగు తీశారు. శిబిరం వద్దకు వచ్చిన ఆందోళనకారులు వారందరినీ పక్కకు నెట్టేసి.. విధ్వంసకాండకు దిగారు. కుర్చీలు విరగ్గొట్టి, టెంట్లను పీకివేశారు. వాటిని కుప్పవేసి నిప్పుపెట్టారు. ఆ శిబిరం వద్ద ఉన్న పోలీసులు నిస్సహాయంగా మిగిలిపోగా, వారికి రక్షణగా కలెక్టరేట్‌లోని పోలీసులు ముందుకు రాబోయారు. అయితే, వారిని కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ధర్నాకు దిగిన ఆదివాసీలు అడ్డుకొన్నారు. దీంతో శిబిరం పూర్తిగా కాలిపోయింది. పరిస్థితి దాదాపు అదుపు తప్పడంతో.. కలెక్టర్ ధనంజయరెడ్డి సీఎం వీడియో కాన్ఫరెన్స్ నుంచి బయటకు వచ్చారు. ఎస్పీ త్రివిక్రమవర్మతో కలిసి ఆదివాసీలను కలుసుకొన్నారు. వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఫిషింగ్ హార్బర్ బంద్

తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ మత్స్యకార సంఘాలు, మరబోటు సంఘాలు.. ఫిషింగ్ హార్బర్‌లో సోమవారం బంద్ పాటించాయి. హార్బర్‌లోని మత్స్యకారులు పూర్తిగా బంద్‌కు సహకరించారు. తమను ఎస్టీ జాబితాలో చేరుస్తామని తెలుగుదేశం పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నా, ఇప్పటివరకు ఆ డిమాండ్ కార్యరూపం దాల్చలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు ఆత్మహత్య

కుంటాల, ఫిబ్రవరి 5 : నిర్మల్ జిల్లా కుంటాం మండలం లింబా(కె)లో ఓ రైతు ఆత్మహత్య అప్పుల బాధతో చేసుకున్నాడు. సిందె మాన్కారి చంద్రకాంత్ (30) అనే రైతుకు రూ.5 లక్షల వరకు అప్పులు పేరుకుపోయాయి. దీంతో సోమవారం తెల్లవారు జామున చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

మూసాపేట, ఫిబ్రవరి 5: సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లి తిరిగి వస్తూ మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందారు. పెబ్బేరు, కొత్తకోట మండలం కనిమెట్టకు చెందిన రెండు కుటుంబాలవారు జాతరలో చిరు వ్యాపారం చేసుకోవడానికి పది రోజుల క్రితం వెళ్లాయి. జాతర ముగియడంతో ఆదివారం రాత్రి బొలేరో వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. బొలేరో వాహనం కొమ్మిరెడ్డిపల్లి శివారులో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో రాజు (38), మన్యం(52), లక్ష్మీదేవమ్మ (60) మృతి చెందారు.

జాతరలో నల్లకుంట మహిళ మృతి

బర్కత్‌పుర /అంబర్‌పేట/హైదరాబాద్: ఇటీవల జరిగిన మేడారం జాతరలో జరిగిన తొక్కిసలాటలో నల్లకుంట సంజీవయ్యనగర్‌కు చెందిన దేవిలత(45) అనే మహిళ మృతిచెందింది. ఈ నెల 1వ తేదీన వివిఐపీల రాకతో జంపన్నవాగు వద్ద తీవ్ర తొక్కిసలాట జరిగింది. దేవిలత తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబసభ్యులు ఈ విషయాన్ని జాతరలో ఉన్న పోలీసులకు తెలియజేసినా పట్టించుకోలేదు.

పాము కాటుతో బాలుడి మృతి

- తట్టుకోలేక ఆగిన నాయనమ్మ గుండె

మల్దకల్, ఫిబ్రవరి 5: పాముకాటుకు మనవడు మృతి చెందగా ఆ వార్త విన్న నాయనమ్మ గుండెపోటుకు గురై మృతి చెందింది. ఈ విషాద ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఉలిగేపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పాండు(14) సోమవారం పాము కాటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాలుడి నాయనమ్మ శాంతమ్మ గుండెపోటుతో కుప్పకూలింది.

మత్స్యకారులకు పవన్ అండ

- 21న శ్రీకాకుళం వెళ్తానని ప్రకటన

రాష్ట్రంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి జనసేన సిద్ధంగా ఉందని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ సమస్యపై మత్స్యకారులను కలుసుకోడానికి తాను ఈ నెల21న శ్రీకాకుళం వెళుతున్నట్టు వెల్లడించారు. "తమను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న మత్స్యకారుల డిమాండ్ న్యాయమైనదే. వారి ఆకాంక్షపై అందరితో చర్చించి పరిష్కరించాల"ని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. హైదరాబాద్ ప్రశాసన్ నగర్‌లోని పార్టీ పరిపాలన కార్యాలయంలో సోమవారం మత్స్యకారులతో పవన్ సమావేశమయ్యారు. పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు తదితరులతో కలిసి ఆయన మత్స్యకారుల సమస్యలపై వారితో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎస్సీలుగానూ, మరికొన్ని రాష్ట్రాల్లో ఎస్టీలుగానూ మత్స్యకారులను పరిగణిస్తున్నారు. మన రాష్ట్రంలో మాత్రం వీరిని బీసీ-ఎ జాబితాలో చేర్చారు. మత్స్యకారులకు న్యాయం చేస్తానని టీడీపీ తన మేనిఫెస్టోలో పేర్కొంది. పార్లమెంటులో ఆ పార్టీ ఎంపీలు తమ గళం విన్పించాలి. ప్రధాని మోదీని కలిసే అవకాశం వచ్చినప్పుడు.. నేను కూడా ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళతాను" అని పవన్ వివరించారు. అయితే, మత్స్యకారుల సమస్యలు రెండు గంటల్లో తేలిపోయేవి కావని, వాటిపై ఎంతో అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. మత్స్యకారుల దీక్షలను భగ్నం చేయడం సరికాదన్నారు. మత్స్యకారులని ఎస్టీల్లో చేర్చడం వల్ల ఇతర కులాలవారికి ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు.



మునిసిపల్ కమిషనర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి

సంస్కరణల అమలులో కమిషనర్లదే కీలకపాత్ర: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్కరణల అమలులో మునిసిపల్ కమిషనర్లదే కీలకపాత్ర పోషించాలని మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. తాము పనిచేస్తున్న పట్టణాలపై ప్రత్యేక ముద్ర చాటుకునేలా కమిషనర్లు పనిచేయాలని, స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో తెలంగాణ మునిసిపల్ కమిషనర్ల డైరీ-2018ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 15 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీలను నగర పంచాయతీలుగా, మునిసిపాలిటీలుగా మార్చాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మరిన్ని సర్కిళ్లను, జోన్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

9 నుంచి శిక్షణ తరగతులు: వంగపల్లి



రాంనగర్ /హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాజకీయంగా మాదిగలు, మాదిగ ఉప కులాల్లో ఓటు చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ నెల 9 నుంచి అన్ని జిల్లాల్లో రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు టీఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. సోమవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలు, మండల వారీగా చైతన్యం తీసుకువస్తామని తెలిపారు. టీఎమ్మార్పీఎస్ చేపట్టిన మలి దశ ఉద్యమంలో మాదిగలను విద్య, ఆర్థిక, రాజకీయ రంగాలలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి మాదిగల ఆత్మీయ సమ్మేళనం ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో మంగళవారం నిర్వహిస్తున్నామని తెలిపారు.

సరిహద్దుల్లో మావోయిస్టుల విధ్వంసం

- దంతెవాడలో రైలు పట్టాల తొలగింపు
- ఎదిరలో సెల్ టవర్ కంట్రోల్ రూం పేల్చివేత
- ఛత్తీస్‌గఢ్‌లో మావోల బంద్ ప్రభావం



ఛత్తీస్‌గఢ్‌లో గోర్ల వద్ద మావోయిస్టులు తగలబెట్టిన బస్సు

భద్రాచలం/వెంకటాపురం/చింతూరు ఫిబ్రవరి 5: ఛత్తీస్‌గఢ్ - తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్టుల విధ్వంసాలు కొనసాగుతున్నాయి. సోమవారం మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రెండు ప్రాంతాల్లోనూ విధ్వంసాలకు పాల్పడ్డారు. దండకారణ్యంలో బంద్ సంపూర్ణం కాగా, తెలంగాణలో మిశ్రమ స్పందన లభించింది. దంతెవాడ జిల్లాలోని బచేలి-బాన్సీ మధ్య రైలు పట్టాలు తొలగించడంతో గూడ్సు రైలు ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. కిరండోల్ సమీపంలో సాగునీటి ప్రాజెక్టు పనులు జరుగుతున్న చోట ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను దహనం చేసినట్లు తెలిసింది. అలాగే భూపాలపట్నం నుంచి రాయపూర్‌కు వెళ్లే బస్సును మద్దేడు పోలీసుస్టేషన్ పరిధిలోని గోర్ల వద్ద ఆదివారం రాత్రి తగలబెట్టారు. ఛత్తీస్‌గఢ్‌లోని ఆవుపల్లి సమీపంలో చెట్లను నరికి రహదారులకు అడ్డంగా వేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బంద్ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్య ప్రాంతంలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కలివేరులో 151 సీఆర్‌పీఎఫ్ క్యాంపు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి నాటు బాంబు పేలింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం ఎదిరలో బీఎస్ఎన్ఎల్ టవర్ కంట్రోల్ రూంను పేల్చివేశారు.

యుపి ఎన్‌కౌంటర్లు

ఒకనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఆ తరువాత ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలు ఎన్‌కౌంటర్లకి ప్రసిద్ధి చెందాయి. 1980ల్లో 90ల్లో పంజాబ్‌లో ఎడతెరిపి లేని ఎన్‌కౌంటర్లు జరిగేవి. దాదాపు సంవత్సరంన్నర నుంచి కశ్మీర్‌లో వందలాది ఎన్‌కౌంటర్లు జరిగాయి. ప్రభుత్వానికి, రాజ్యానికి వ్యతిరేకంగా తిరగబడేవారి మీద జరిగే సాయుధచర్యలు అవి. ఎన్‌కౌంటర్ అంటే ఒక సాయుధ తీవ్రవాదో, వేర్పాటువాదో మరణించిన సంఘటన అని తప్ప, నిఘంటువులో ఉన్నట్టు, ఎదురెదురుగా జరిగిన సాయుధ ఘర్షణ అని ఎవరూ అర్థం చేసుకోవడం లేదు. ప్రభుత్వానికి, శాంతిభద్రతల యంత్రాంగానికి కొరక రాని కొయ్యలుగా మారిన, ఏ సిద్ధాంతాలూ లేని సాధారణ ముఠానేరస్థులు, బందిపోట్లు కూడా ఎన్‌కౌంటర్ కావడం గతంలో ముంబైలో, ఒక నాడు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో విరివిగా జరిగేవి. నేరాలను అదుపుచేయడానికి ఇటువంటి పద్ధతులు సహజమూ అవసరమూ అని భావించేవారు పోలీసుయంత్రాంగంలోను, రాజకీయవాదులలోనూ తగినంత మంది ఉన్నారు. ఎంతటి తీవ్ర నేరస్థుడినైనా చట్టవ్యతిరేకంగా చంపే అధికారం ప్రభుత్వానికి లేదని వాదించే హక్కుల ఉద్యమం కూడా దేశంలో బలంగా ఉంది. న్యాయవ్యవస్థ తరచు ఇటువంటి ఎన్‌కౌంటర్లను తప్పుపట్టడం, విచారణలకు ఆదేశించడం జరుగుతూ ఉన్నది కూడా. పైన చెప్పిన కోవలోకి చెందని, మరొక రకం ఎన్‌కౌంటర్ల నరేంద్రమోదీ హయాంలో గుజరాత్‌లో చూశాము. ఇష్రాత్ జహాన్, సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ సంఘటనలు ఇప్పటికీ, ఈ దేశ ప్రధాని, అధికారపార్టీ అధ్యక్షుడిని వెంటాడుతూ ఉన్నాయి. దేశంలోని ప్రధాన పార్టీలన్నీ పౌరహక్కుల విషయంలో ఒకేరకమయిన అభిప్రాయాలతో ఉన్నాయి కానీ, వారు అధికారంలో ఉన్నారా ప్రతిపక్షంలో ఉన్నారా అన్న దానిని బట్టి, స్పందనలు భిన్నంగా వినిపిస్తుంటాయి. మధ్యేవాద పార్టీ అయిన కాంగ్రెస్‌కు, మితవాద పార్టీ అయిన బిజెపికి శాంతిభద్రతల నిర్వహణ విషయంలో వేర్వేరు వైఖరులుంటాయి. ఏ నేరానికి అయినా సామాజికార్థిక మూలాలు ఉంటాయని, దానిని పరిగణనలోకి తీసుకుని, నేరస్థుడిని కాక నేరాన్ని నిర్మూలించడం మీద సత్పరిపాలన దృష్టి పెట్టాలని న్యాయవేత్తలు చెబుతుండగా, మితవాద ధోరణి ఉన్నవారు, నేరస్థులను భౌతికంగా తొలగించడం ద్వారా సమస్యను పరిష్కరించాలని చూస్తుంటారు. ఒక్కోసారి అటువంటి నిర్దాక్షిణ్యమైన విధానాలకు పాల్పడేవారికి విపరీతమైన జనామోదం లభిస్తుంది కూడా. మాదకద్రవ్యాల నియంత్రణ పేరుతో ప్రస్తుత ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు, హంతకదళాలను ప్రోత్సహిస్తూ, విచ్చలవిడిగా అనుమానితులను హత్య చేయిస్తున్నారు. అతని ధోరణికి ఆ దేశంలో పెద్ద ప్రతిఘటన లేకపోవడం ఆశ్చర్యకరమే.

గుజరాత్ ఎన్‌కౌంటర్ల పర్యవసానాలను చూస్తూ కూడా, బిజెపికి చెందిన మరొక రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్ల పరంపరను కొనసాగిస్తున్నారు. ఎన్‌కౌంటర్ల సంఘటనల సంఖ్యతో పోలిస్తే, మృతుల సంఖ్య అతి తక్కువే అయినప్పటికీ, అధికారంలోకి వచ్చి ఏడాది కాకుండానే 30మందిని పైగా అనుమానిత అసాంఘికశక్తులను, జూదగాళ్లను, ముఠాకోర్లను నిర్మూలించారు. పోలీసు యంత్రాంగం అమిత ఉత్సాహంతో జరుపుతున్న ఈ కార్యక్రమాన్ని యోగి బాహాటంగా సమర్థిస్తున్నారు. యోగి సమర్థనకు జాతీయ మానవహక్కుల కమిషన్ అభ్యంతరం చెప్పింది కూడా. అయినా, యోగి వెనక్కి తగ్గలేదు. పోలీసు చర్యలకు పాలకుల నుంచి బేషరతు అంగీకారం ఉండడం మంచిది కాదు. ఈ మధ్యనే ఒక గ్రామంలో జూదగాళ్ల మీద దాడిచేసే క్రమంలో పోలీసులు జరిపిన కాల్పులు ఎనిమిదేళ్ల బాలుడిని బలితీసుకున్నాయి.

యోగి అని పేరున్నంత మాత్రాన, కాషాయం ధరించిన సన్యాసి అయినంత మాత్రాన, ఆదిత్యనాథ్ పాలనాధర్మాలను పాటించగూడదని ఎవరూ చెప్పరు. సంఘవ్యతిరేక శక్తుల విషయంలో కఠినంగా ఉండకూడదనీ అనరు. కానీ, పాలకుడు కేవలం దండోపాయం మాత్రమే ఉపయోగించేవాడు కాగూడదు. నిజమే, ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉన్నది. అఖిలేష్ యాదవ్ పాలన చివరి రోజుల్లో అయితే, మరీ హేయమైన నేరాలు జరిగాయి. అవేవీ యోగి ముఖ్యమంత్రి కాగానే మటుమాయం కాలేదు, కావడం సాధ్యం కాదు కూడా. అరాచకం, భయం ప్రబలినప్పుడు బాధితులయ్యేది అధికంగా బలహీనులే. స్త్రీలు, దళితులు, మైనారిటీలు– అందరి కంటె ఎక్కువగా గట్టి భద్రతను ప్రభుత్వాల నుంచి కోరుకుంటారు. కానీ, మూలకారణం మీద గురిపెట్టకుండా, నేరాన్ని నేరంతోనే నిర్మూలించడం సాధ్యపడదని గత అనుభవాలు నిరూపిస్తున్నాయి. సక్రమమైన అభివృద్ధి, సమన్యాయంతో కూడిన అభివృద్ధి, విస్తారమైన ఉపాధి అవకాశాలు, పాలకుల, సమాజ నేతల ప్రగతిశీల వైఖరులు– శాంతిభద్రతలను మెరుగుపరుస్తాయి. అశాంతిని రగిలించే ప్రకటనలు చేసి వివాదాలు రేపడం యోగితో సహా, ఆయన మంత్రివర్గ సహచరులనేకులకు ఒక అలవాటు. దాన్ని కూడా వారు మానుకోవాలి. నేరం ఇంతగా వెర్రితలలు వేసే చోట, నేరంతో వ్యవహరించే పోలీసుయంత్రాంగం కూడా నేరపూరితమై ఉండే అస్కారం ఉంది. వారికి పూర్తి నియంత్రణాధికారాలు ఇస్తే, అమాయకులు బాధలు పడతారు. అబద్ధపు ఎన్‌కౌంటర్లూ జరుగుతాయి. రాజ్యాంగస్ఫూర్తికీ, పాలనాబాధ్యతలకూ న్యాయం చేస్తూ, పాలకులు వ్యవహరించినప్పుడే, ఫలితాలు కూడా దీర్ఘకాలికంగా ఉంటాయి.

విలువలు నేర్పిన విద్యావేత్త

కొంతమంది వ్యక్తులు తమ జీవితం, ఆచరణ ద్వారా సమాజంపై బలమైన ముద్ర వేస్తారు. అలాంటి వ్యక్తులనే తర్వాత సమాజం ఆదర్శంగా తీసుకుంటుంది. విద్యారంగంలో ఎందరెందరో వృత్తికి జీవితాన్ని అంకితం చేసి లక్షలాది భావిపౌరులను తీర్చిదిద్దారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, కట్టమంచి రామలింగారెడ్డిలను మేం చూడలేదు. కానీ మా తరంలో విద్యాసంస్థలను తీర్చిదిద్ది మమ్మల్ని ముందుకు నడిపించి, బాటలు వేసిన కొందరు టీచర్లను, ప్రిన్సిపాళ్లను చూశాం. వాళ్లు మా తరంపై వేసిన ముద్రను ఎప్పటికీ మర్చిపోలేం.

పాత నల్గొండ జిల్లా కోదాడలో కె.ఆర్.ఆర్ డిగ్రీ కాలేజీలో వై.వి. రెడ్డి మాకు ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. విద్యార్థి సంఘాల జోరు బాగుండేది. పిడిఎస్‌యు, ఆర్‌ఎస్‌యు లాంటి విప్లవ విద్యార్థి సంఘాలు, ఎస్‌ఎఫ్ఐ, ఏఐఎస్‌ఎఫ్‌లాంటి వామపక్ష సంఘాలు, ఏబీవీపీ, ఎన్ఎస్‌యు (ఐ) సంఘాల వరకు అన్ని సంఘాలు ఉండేవి. ఎవరి భావజాలాన్ని వారు విస్తృతంగా ప్రచారం చేసుకునేవారు. ఊర్లో గోడలనిండా ఈ సంఘాల పేర్లే రాసి ఉండేవి. మొత్తం మీద ఆ కాలానికి కోదాడ డిగ్రీ కాలేజీ అంటే జ్ఞానం వెల్లివిరిసే చైతన్యపు తోట లాగా ఉండేది. అప్పుడప్పుడు ఘర్షణలు జరిగి ఒక్కసారిగా గొడవల మంట చెలరేగేది. ఆ ఉద్రిక్త సమయంలో రెండు గ్రూపుల మధ్యలోకి ఒక సైనికుడిలా వచ్చి మా ప్రిన్సిపాల్ వై.వి.రెడ్డి నిలబడేవారు. అక్కడ ఎవరైనా ఎదురుతిరిగితే, ఘర్షణకు దిగితే, భారతీయుడు సినిమాలో వృద్ధ కమల్‌హాసన్ పాత్రలాగా విజృంభించేవాడు. క్యాంపస్‌ను ప్రకాశవంతంగా ఉంచేవాడు. అట్లని నిరంకుశుడు కాదు, విద్యార్థులంటే పంచప్రాణాలు. ఒక విద్యాసంస్థను నిర్వహించాలంటే అందుకు సమర్థత కావాలి. అది వై.వి.రెడ్డికి సమృద్ధిగా ఉండేది అప్పట్లో మద్రాసులో ఎం.ఏ. ఇంగ్లీషు, పొలిటికల్‌సైన్స్ చదివారు. స్వస్థలం ప్రకాశం జిల్లా కారంచేడు మండలం ఎర్రంవారిపాలెం. కానీ, ఆయన కమ్యూనిస్టు కంచుకోటలైన ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఎమర్జెన్సీ సమయంలో నక్సలైట్ విద్యార్థి నాయకులకు షెల్టర్ ఇచ్చారని ఖమ్మంలో ఆయనను పోలీసులు బాగా ఇబ్బందులు పెట్టారు. చివరకు ట్రాన్స్‌ఫర్‌చేస్తే మా కోదాడ డిగ్రీ కాలేజీకి వచ్చారు. సైకిల్ మీదనే కాలేజీకి వచ్చేవారు. ఆయన దగ్గర కూర్చుంటే తెలుగు సంగతేమో కానీ, ఇంగ్లీషు మాత్రం సులభంగా నేర్చుకోవచ్చును. అప్పుడు పాత నల్గొండ జిల్లాలో నల్గొండ, సూర్యాపేట, కోదాడ మూడు చోట్లనే డిగ్రీ కాలేజీ ఉండేవి. అప్పుడు కోదాడ కాలేజీ విద్యార్థుల సంఖ్య సుమారు 3000 దాకా ఉండేది. నల్గొండలో 5000 దాకా ఉండేది. ప్రగతిశీల రాజకీయాల బాట వెంట నడుస్తున్న కోదాడ కాలేజీ నిర్వహణలో వై.వి.రెడ్డి చేసిన కృషి ఆ పట్టణంపై కూడా చెరగని ముద్రవేసింది.

నివాళి



(17.09.1932 – 02.02.2018)

> **హక్కులనూ, బాధ్యతలనూ క్రమశిక్షణనూ, తప్పును తప్పు అని చెప్పే ధైర్యాన్నీ నూరిపోసిన ఉన్నత విలువలున్న వ్యక్తి వై.వి రెడ్డి.**

వై.వి రెడ్డి నిజాయితీపరుడు. కాలేజీలో పిల్లల మధ్య ఘర్షణ జరుగుతున్నప్పుడు పోలీసులు బందోబస్తుపై వచ్చారు. ఎస్.ఐ బుల్లెట్ వేసుకునినేరుగా ప్రిన్సిపాల్ రూమ్ వరకు క్యాంపస్ లోంచి పెద్ద శబ్దం చేస్తూ వచ్చాడు. దీంతో క్యాంపస్‌లోకి బుల్లెట్ వేసుకుని ఎట్లావచ్చావ్, 'ఇది విద్యాసంస్థ' అంటూ ఆ పోలీస్ ఆఫీసర్‌పై ఫైర్ అయ్యాడు. పోలీస్ ఆఫీసర్ సారీ చెప్పి వెళ్లిపోయాడు. కాలేజీలో ఒక విద్యార్థిపై వై.వి. రెడ్డి చేయిచేసుకున్నారు. తర్వాత ఆ విద్యార్థికి ఉద్యోగం వచ్చాక కాండెక్ట్ సర్టిఫికేట్ కోసం పోతే వెరీగుడ్ అని రాసి పంపిన విజ్ఞత ఆయనకుంది.

వై.వి రెడ్డి ఫస్ట్ పీరియడ్ జరుగుతుంటే అన్ని క్లాసులను పర్యవేక్షించేవారు. మొత్తం 4 ఎకరాల క్యాంపస్ అంతా కలియతిరిగేవారు. కళాశాల వార్షికోత్సవం మాకొక సామాజిక సాంస్కృతిక జనతన ఉత్సవంగా జరిగేది. ఆ వేదిక మీద వైస్‌ఛాన్సలర్ దగ్గర నుంచి విప్లవకవుల వరకు వచ్చేవారు. ఆ ఫంక్షన్‌లో ఎప్పుడు ఏ ఘర్షణ జరుగుతుందో ఎవరికీ తెలిసేది కాదు. వై.వి రెడ్డి ఈ ఉత్కంఠల మధ్యన గొడవలు నివారిస్తూ కాలేజీడేను ఘనంగా నిర్వహించేవారు. వై.విరెడ్డి ఎంతో సమర్థతతోకాలేజీని నిర్వహిస్తే ఆ కాలేజీ ఇచ్చిన చైతన్యం స్ఫూర్తితో కోదాడ పట్టణాన్ని ఈ ప్రగతిశీల విద్యార్థులు కాపాడేవారు. కాలేజీడే ముగిశాక అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రెండు మూడు కిలోమీటర్లు అమ్మాయిలు స్వేచ్ఛగా నడుచుకుంటూ ఇంటికి వెళ్లిపోయేవారు. హక్కులనూ, బాధ్యతలనూ, క్రమశిక్షణనూ, తప్పును తప్పు అని చెప్పే ధైర్యాన్నీ నూరిపోసిన ఉన్నత విలువలున్న వ్యక్తి వై.వి రెడ్డి. కాలేజీ మేనేజ్‌మెంట్ వాళ్లు వై.వి రెడ్డిని ఒత్తిడికి గురిచేస్తే ఆయనే స్వయంగా ఆ కాలేజీ నుంచి బదిలీ కోరుకుని నాగార్జునసాగర్‌లోని ఎ.పి. రెసిడెన్షియల్ కాలేజీకి వెళ్లారు. వై.వి రెడ్డిని వెళ్లనివ్వమని మొత్తం కళాశాల విద్యార్థులు అడ్డుపడ్డారు. రిలీవింగ్ ఆర్డర్స్‌ను తీసుకుపోకుండా మొత్తం విద్యార్థులు అడ్డుపడ్డారంటే ఆయన పిల్లలపైన, ఆ కళాశాలపైన, కోదాడ పట్టణంపైన ఎంత ముద్రవేశారో తెలుస్తుంది.

వై.వి రెడ్డిని చూశాక ప్రిన్సిపాల్ అంటే ఒక పదవి పేరుతో ఉన్న కుర్చీ కాదని మొత్తం కాలేజీని తీర్చిదిద్దే ఒక మహాశక్తియని తెలిసింది. ప్రిన్సిపాల్ అన్న పదానికి ఒక ఆచరణాత్మక విశ్వరూపం వై.వి రెడ్డి.

■ జూలూరు గౌరీశంకర్
రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు

మానవతా మూర్తి

ప్రతి ప్రిన్సిపాల్ తనకన్న ముందున్న ప్రిన్సిపాళ్లను పిల్లలు విమర్శిస్తే సంతోషపడతారు. దాని వలన తన గౌరవం పెరుగుతుంది అనుకుంటారు. కానీ వై.వి రెడ్డి (వై.వెంకటరెడ్డి) తనకన్న ముందున్న ప్రిన్సిపాళ్లను పొగిడితే సంతోషపడతాడు. ఈనాడు తన కుర్చీని పటిష్ఠంగా చేసింది వారే కదా అంటాడు. ఇలాంటి క్యారెక్టర్ వై.వి. రెడ్డిది. ఆయనను నేను ప్రిన్సిపాల్‌గా చూశాను. పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా చూశాను. తనతో ఏకీభవించనివాళ్లను వాళ్లముందే విమర్శిస్తాడు. కానీ వారు లేనప్పుడు వారి మంచితనాన్ని పొగుడుతాడు. ఇది చాలా మందిలో ఉండదు. మానవత్వానికి ప్రతీక ఆయన. ఆయనే నాగార్జున సాగర్ ఎ.పి.రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీకి నా తర్వాత వచ్చిన ప్రిన్సిపాల్. అలాంటి మనిషి విద్యార్థులకే కాదు, నా లాంటి వారికి కూడా ఆదర్శనీయం. చనిపోయిన తర్వాత వచ్చే కీర్తి శాశ్వత కీర్తి. బతికున్నప్పుడు వచ్చే కీర్తి నీళ్ల మీద రాతలే.

■ చుక్కా రామయ్య
ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి సభ్యులు

(వై.వి రెడ్డి ఫిబ్రవరి 2వ తేది రాత్రి గుండె పోటుతో గుంటూరులో కన్నుమూశారు)

జనవాక్యం

రైతన్నను ఆదుకోండి!

అందరికీ అన్నం పెట్టే రైతన్న పురుగుల మందు ఎందుకు తాగుతున్నాడు? ఇంటి చూరుకో, చెట్టుకొమ్మకో ఎందుకు దీనంగా వేలాడుతున్నాడు? ఎన్నో కమిటీలు, రిపోర్టులు, సమావేశాలు, ప్రకటనలు, వరాలు.. అయినా నేటికీ రైతు పరిస్థితిలో కించిత్ మార్పు రాలేదు.

నిజానికి ప్రపంచంలో పెరుగుతున్న జనాభా ఒకవైపు, తరుగుతున్న వ్యవసాయ భూములు మరొకవైపు, గతి తప్పుతున్న రుతు పవనాలు, కల్తీ మయమైన విత్తనాలు, రసాయనాలు, క్రిమి సంహారక పురుగుమందులు ఇత్యాది కారణాలతో భవిష్యత్తులో ఆహార భద్రతకు పెను సవాలు రానున్నది. అంతేకాకుండా వ్యవసాయ భూములను సైతం నయా పెట్టుబడిదారులు గ్రామాల్లో చేరి చెరబట్టడం, రియల్ ఎస్టేట్ వైపు మళ్లిస్తుండడంతో రైతులే రైతు కూలీలుగా మారుతున్న దుస్థితి దాపురించింది. 'సేద్యం గానీ స్వేదం గానీ ఎరుగని' నయా పెట్టుబడిదారుల చెరలోకి భూమి తరలుతున్నది.

వ్యవసాయదారులు చినుకు కోసం నింగి వైపు, చినుకు పడితే పెట్టుబడి కోసం గ్రామ సేఠుల వైపూ చూస్తున్నారు. విత్తులకై ఆరాటం, కూలీ డబ్బుల చెల్లింపులకై పోరాటం, క్రిమిసంహారక మందులతో కుస్తీపడుతున్నారు. దిగుబడి వచ్చేసరికి పెట్టిన పెట్టుబడి సైతం రాని దుస్థితి. రైతులకు దక్కని గిట్టుబాటు దళారీలకు దక్కుతోంది. ఎన్నికల హామీలతో రైతులను నమ్మించి నట్టేటముంచుతున్న ప్రభుత్వాలు ఇప్పటికైనా రైతుగోసను మన్నించి వ్యవసాయరంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసేందుకు పూనుకోవాలి. భారత హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ లాంటి శాస్త్రవేత్తలు చేసిన మేలైన సూచనలు పరిగణనలోకి తీసుకోవాలి.

రైతులకు పెట్టుబడి సాయం, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, భూసార పరీక్షలు, సేంద్రియ జీవ ఎరువులు, ఉపాధి హామీ పథకానికి అనుసంధానత, మార్కెట్ సదుపాయాల ఆధునీకరణ, గిట్టుబాటు ధర, నిల్వ సదుపాయాలు, మౌలిక వసతుల పెంపు, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సేద్య పద్ధతులు, నీటి పారుదల వ్యవస్థ మెరుగు వంటి చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి రైతులను ఆదుకోవాలి.

– వినోద్ కుమార్ సుద్దాల
ఉస్మానియా యూనివర్శిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

ఈ 'అనారోగ్యాన్ని' ఎన్నాళ్లు భరిద్దాం?

ఉన్నత స్థాయి న్యాయవ్యవస్థను భూతద్దం కింద నిలబెట్టే పరిణామాలు ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్నాయి. తాజాగా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎన్. శుక్లాను అభిశంసన ద్వారా పదవి నుంచి తొలగించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా శ్రీకారం చుట్టారు.

లక్నోలోని ఒక మెడికల్ కాలేజీ 2017–18 సంవత్సరానికి గాను అడ్మిషన్లు మొదలు పెట్టేందుకు వీలుగా ముడుపులు తీసుకుని ఉత్తర్వులు ఇచ్చారన్నది జస్టిస్ శుక్లాపై వచ్చిన అభియోగం. మొదట ఒక నాన్‌జుడిషియల్ కమిటీ విచారణ జరిపింది. తర్వాత ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, మరో హైకోర్టు న్యాయమూర్తితో కూడిన కమిటీ విచారణ జరిపి జస్టిస్ శుక్లాపై వచ్చిన అభియోగాలు వాస్తవాలేనని తేల్చింది. అయితే ఇందులో ఇంకా చాలా లోతు ఉంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా కేంద్రంగా చాలా పెద్ద వివాదమే సుళ్లు తిరుగుతోంది. లక్నోలో మరో మెడికల్ కాలేజీని నడిపే ప్రసాద్ ఎడ్యుకేషన్ ట్రస్టు అనే సంస్థకు అనుకూలంగా గత సంవత్సరం జస్టిస్ దీపక్ మిశ్రా బెంచ్ కొన్ని ఉత్తర్వులు ఇచ్చింది. నిజానికి ప్రసాద్ ఎడ్యుకేషన్ ట్రస్టు సుప్రీం కోర్టులో 2017 ఆగస్టు 28వ తేదీన దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు జస్టిస్ దీపక్ మిశ్రా బెంచ్ అనుమతించడంవల్లనే ఆ సంస్థ అలహాబాద్ హైకోర్టులో తమకు అనుకూలమైన ఉత్తర్వులు తెచ్చుకోగలిగింది. ఆ ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు బెంచ్‌కు నేతృత్వం వహించింది ఇప్పుడు అభిశంసన ఎదుర్కొంటున్న జస్టిస్ శుక్లానే.



ఈ కేసు దర్యాప్తు చేసిన సీబీఐ గత సెప్టెంబరులోనే ఒక ప్రాథమిక నివేదికను రూపొందించింది. ఈ కేసులో సీబీఐ ఇప్పటి వరకూ అరెస్టు చేసిన వారిలో ఒరిస్సా హైకోర్టు న్యాయమూర్తి ఐ.ఎం. ఖుద్దుసి కూడా ఉన్నారు.

మీడియా కథనాల ప్రకారం, ఈ కేసులో జస్టిస్ శుక్లాపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసేందుకు అప్పట్లోనే సీబీఐ జస్టిస్ దీపక్ మిశ్రా అనుమతి కోరింది. అయితే ఆయన అందుకు నిరాకరించారు. తర్వాత మరో మెడికల్ కాలేజీకి అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చిన కేసులో జస్టిస్ శుక్లాపై జస్టిస్ దీపక్ మిశ్రా అంతర్గత విచారణ ప్రారంభించారు. ఆ విచారణ ఇప్పుడు అభిశంసన దశకు చేరింది.

ప్రసాద్ ఎడ్యుకేషన్ ట్రస్టు కేసులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ప్రమేయం లేకుండా సుప్రీం కోర్టు విచారణ కోరుతూ 'క్యాంపెయిన్ ఫర్ జుడిషియల్ ఎకౌంటబులిటీ అండ్ రిఫార్మ్స్' అనే స్వచ్ఛంద సంస్థ తరపున పిటిషన్ దాఖలు చేసిన సీనియర్ న్యాయమూర్తి ప్రశాంత్ భూషణ్, ఒక త్రిసభ్య ధర్మాసనం నుంచి తీవ్రమైన మందలింపును ఎదుర్కోవాల్సి వచ్చింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం ప్రతి వెయ్యి మంది రోగులకు ఒక డాక్టరు ఉండడం ఆదర్శవంతం. ఇండియాలో ఈ నిష్పత్తి రెండు వేల మందికి ఒక వైద్యునిగా ఉంది. 50 ఏళ్ల క్రితం ఈ నిష్పత్తి మరీ అథమస్థాయిలో ఉండేది. వైద్యులను తయారు చేయడం కోసం ప్రభుత్వం ప్రయివేటు మెడికల్ కాలేజీలను ప్రోత్సహించడం మొదలుపెట్టింది. వైద్యులకు ఆరాధనాభావంతో కూడిన అత్యున్నత స్థాయి గౌరవం ఇచ్చే భారత సమాజంలో ఆ చదువుకు మొదటినుంచీ మంచి గిరాకీ ఉంది. మరోపక్క మిషనరీ ఆసుపత్రుల సేవా తత్పరత వైపు నుంచి క్రమంగా పక్కా వ్యాపార ధోరణిగల కార్పొరేట్ వైద్యం వైపు ఈ రంగంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రయివేటు వైద్య కళాశాలలు ఎక్కువ సంఖ్యలో ప్రారంభమయ్యాయి. ఇండియాలో విద్యా వ్యాపారం చేయకూడదు. వ్యక్తులు విద్యా సంస్థలను నడపడానికి వీలు లేదు. అయితే, ట్రస్టు పేరిట విద్యాసంస్థలను నడిపే వ్యక్తులు ఈ రంగంలోకి వచ్చేదే వ్యాపారం చేయడం కోసం. వ్యాపారం అన్నాక ఇక అందులో ఉచ్చనీచాల ప్రస్తావన ఏముంటుంది? వైద్య కళాశాలల్లో అధ్యాపకులు ఉండరు. వైద్య విద్యను బోధించే అధ్యాపకులు దేశంలో తగినంతమంది లేరు, అది వేరే సంగతి. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రులలో వైద్యులు ఉండరు సరికదా, అసలు రోగులే ఉండరు. భారతీయ వైద్య విద్యామండలి (ఎంసీఐ) బృందాలు ఏటా చేసే తనిఖీల సమయంలో కిరాయి రోగులు, కిరాయి అధ్యాపకులు, వైద్యులు ప్రత్యక్షం అవుతారు. ఎంసీఐ అధ్యక్షునిగా వందల కోట్ల రూపాయల అవినీతి సొమ్మును పోగేసి ఆఖరికి 2010లో అరెస్టయిన కేతన్ దేశాయ్ గుర్తున్నాడా?

అటు తగినంతమంది సిబ్బంది, ఇటు తగిన స్థాయిలో మౌలిక సదుపాయాలు లేని ప్రయివేటు వైద్య కళాశాలలు ఎంసీఐ స్థాయిలో ముడుపులు ముట్టచెప్పి వేటు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తాయి. అక్కడ కుదరని పక్షంలో ఏకంగా ఉన్నత న్యాయస్థానాలలోని జడ్జీలను లోబరచుకునేందుకు తెగబడతాయి.

> **సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఒక రుగ్మతను కథాంశంగా తీసుకుని సినిమా తీస్తే దానిని ఆదరిస్తున్నాం. ఆ రుగ్మతను మాత్రం పట్టించుకోవడం లేదు. విద్యాలయాలను, అందునా వైద్య విద్యాలయాలను అడ్డమైన వ్యాపారాలు చేసేవాళ్లు, లిక్కర్ మాఫియా బాసులు, క్రిమినల్సూ నిర్వహించడంలో మనకేమీ దోషం కనిపించడం లేదా?**

ఒక సంవత్సరం అడ్మిషన్లు ఆగితే ఒక ప్రయివేటు కళాశాల నష్టపోయే మొత్తం చాలా ఎక్కువ స్థాయిలో ఉంటుంది. అందుకే కోట్లకు కోట్లు లంచాలు ఇచ్చేందుకు యాజమాన్యాలు ఏ మాత్రం వెనుకాడవు. ప్రైవేటు వైద్య కళాశాలలపై ఆదాయ పన్నుశాఖ దాడులు చేయడం, కోట్ల రూపాయల నల్లడబ్బును స్వాధీనం చేసుకోవడం రివాజుగా మారింది. ఇదే అంశాన్ని కథా వస్తువుగా తీసుకుని కొద్ది సంవత్సరాల క్రితం రజనీకాంత్ హీరోగా నిర్మించబడిన 'శివాజీ' ఘన విజయం సాధించింది. అంతకు ముందు ఘన విజయం సాధించిన మరో సినిమా 'జెంటిల్మెన్' ఇతివృత్తం కూడా ఇదే.

సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఒక రుగ్మతను కథాంశంగా తీసుకుని సినిమా తీస్తే దానిని ఆదరిస్తున్నాం. ఆ రుగ్మతను మాత్రం పట్టించుకోవడం లేదు. విద్యాలయాలను, అందునా వైద్య విద్యాలయాలను అడ్డమైన వ్యాపారాలు చేసేవాళ్లు, లిక్కర్ మాఫియా బాసులు, క్రిమినల్సూ నిర్వహించడంలో మనకేమీ దోషం కనిపించడం లేదా?

కోట్ల రూపాయల డొనేషన్ చెల్లించి, తగిన సదుపాయాలు లేని ప్రయివేటు విద్యాలయాల్లో చదివి పట్టా పుచ్చుకునే వైద్యుడు ఎంత నాణ్యమైన విద్య సముపార్జిస్తాడు? ఎంత సేవా భావంతో వృత్తికి అంకితమవుతాడు? పాలకుల ఓటు రాజకీయాల పుణ్యమా అని ప్రభుత్వ రంగంలో వైద్య, ఆరోగ్య సదుపాయాలు తగ్గిపోయి, కార్పొరేట్ వైద్య రంగం వర్థిల్లుతోంది.

ధనార్జనే ఏకైక ధ్యేయంగా సేవా ధర్మాన్ని, వైద్య నియమాలను ఉల్లంఘించి, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యంత అమానవీయ పద్ధతులలో రోగులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారు.

ఒక సమాజం ఆరోగ్యవంతమైన రీతిలో అభివృద్ధి చెందాలంటే అందరికీ నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల స్థాయికి ఇండియాలో వైద్యుల సంఖ్య పెరగాలంటే, ప్రైవేటు రంగంలో ఇంకా వైద్య కళాశాలలు వస్తాయి. అవి కూడా వ్యాపారమే చేస్తాయి. విద్య, ప్రత్యేకించి వైద్య విద్య, వ్యాపారం కాని రీతిలో నడిచే పకడ్బందీ వ్యవస్థను మనం నిర్మించుకోలేమా? విద్యా రంగం కూడా పూర్తిగా మాఫియా పద్ధతుల్లోకి వెళ్లే ప్రమాదాన్ని నివారించాలంటే ఈ ప్రశ్నకు త్వరగా జవాబు వెతకడం మంచిది. సమాజ నిర్మాణం జరిగే విద్యాలయాల్లో ఇంత అవినీతిని ఉపేక్షించడం క్షేమం కాదు

■ ఆలపాటి సురేష్ కుమార్
సీనియర్ జర్నలిస్టు

నవ్వులపాలైన నేషనల్ బడ్జెట్

ఆంజనేయస్వామి విగ్రహం చెక్కాలని నాలుగేళ్ళుగా ప్రయత్నించి చివరకు కోతి బొమ్మ చెక్కినట్టుగా ఉంది కేంద్ర బడ్జెట్. నరేంద్ర మోదీ ప్రవేశపెట్టే చివరి సంపూర్ణ బడ్జెట్టయినా, ఓటర్లను ఆకర్షించడానికి చేసిన చివరి ప్రయత్నమయినా ఆకర్షణీయంగా మాత్రం లేదు. బీదల బడ్జెట్‌గా చెప్పుకొనేందుకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన ప్రయత్నం ఫలించలేదు. జనాలను ఆకట్టుకునేందుకు చేసిన ప్రయత్నాలలో... ఆరోగ్య బీమా పథకం, ఆవాస పథకం, మూడేళ్ల కోసం భవిష్యత్ నిధికి చందాలు కట్టడం, వ్యవసాయ రంగానికి మద్దతు మొదలైనవి కనిపించవచ్చు కానీ, వాటి లోతుల్లోకి వెళ్లి చూస్తే ఆయనేం చేశారో తెలుస్తుంది. మూడేళ్ల నుంచి ఏదో ఒకటి చేస్తునే ఉన్నాం కనుక ఈ సారి పన్నులు తగ్గించే మాటే మాట్లాడవద్దని నిక్కచ్చిగా చెప్పి ఇది పన్నుకట్టేవారి బడ్జెట్‌కాదని స్వయానా నిరూపించుకున్నారు జైట్లీ. బడ్జెట్ ప్రసంగం వింటుంటే, బడ్జెట్ కాగితాలు చదువుతుంటే మనది ఫెడరల్ వ్యవస్థా లేక కేంద్రీకృత ప్రభుత్వ వ్యవస్థా అన్న అనుమానం కలుగకమానదు.

ఆరోగ్య బీమాతో ప్రారంభిద్దాం.. పది కోట్ల కుటుంబాలకు అయిదు లక్షల రూపాయల చొప్పున ప్రతి సంవత్సరం వైద్య ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు జైట్లీ. ఆయన లెక్క ప్రకారం ప్రతి కుటుంబంలో అయిదుగురు వ్యక్తులు ఉంటారు. ఈ అయిదుగురి సంవత్సర వైద్య ఖర్చు అయిదు లక్షల రూపాయలు. అంటే, యాభై కోట్ల మందికి, దేశ జనాభాలో దాదాపు సగంమందికి ఒక్కొక్కరి లక్ష రూపాయల చొప్పున ఏభై లక్షల కోట్లు చెల్లించడానికి ప్రతిజ్ఞ చేశారు. కానీ, ప్రతి వారూ రోగాన పడుతారని, ప్రతి వారూ లక్ష రూపాయలమేర వైద్యం చేయించుకుంటారని కాదు. అయినప్పటికీ ప్రజల వద్ద నుంచి ప్రీమియం డబ్బులు సేకరించి, ఇన్సూరెన్స్ కంపెనీల పబ్బం గడపటానికి బడ్జెట్ ప్రసంగాలు చేసి మేమే చేస్తున్నామని చెప్పుకుంటున్నారు. పైపెచ్చు, ఆరోగ్యశ్రీ కింద అందించిన సేవలకు తమకు డబ్బులు రాలేదని ఇటీవల కొన్ని ఆసుపత్రులు సమ్మెకు దిగాయి. అనేక రాష్ట్రాలలో ప్రాథమిక ఆరోగ్య శాఖ పరిపాలన అస్తవ్యస్తంగా ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేసి ఆరోగ్య వ్యవస్థను పరిపుష్టం చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల సంఖ్యను పెంచడంతోపాటు వాటి సేవల్లో గుణాత్మకమైన మార్పు తేవాలి. ప్రయివేటు ఆసుపత్రుల ఆగడాలు అరికట్టాలి. ఇవి చేయకుండా, బీమా సంధాన ఉచిత ఆరోగ్య సేవలు అందిస్తామనడం నేల విడిచి సాము చేసినట్టే అవుతుంది.

ఇక భవిష్యనిధి చందాల మినహాయింపు విషయానికొద్దాం. కొత్తగా ఉద్యోగాలు ఇస్తే యజమానులు కట్టే 12 శాతం చందా ప్రభుత్వమే మూడేళ్ల పాటు కడుతుందని ప్రకటించారు. ప్రావిడెంట్ ఫండ్ కట్టాల్సిన జీతం పరిమితి 15 వేల రూపాయలు. దీని మీద కట్టే చందా నెలకు 15 వందల నుంచి 18 వందల రూపాయలు. ఇది యజమానులు కట్టాల్సింది. ఇదంతా ఉద్యోగి ఖాతాలో జమకాదు. 8.33 శాతం పెన్షన్ ఖాతాలో జమ అవుతుంది. పైపెచ్చు ప్రభుత్వం నుంచి నెలకు వచ్చే 18 వందల రూపాయలకు ఆశపడి ఏ యజమానీ 15 వేల నెల జీతమిచ్చి కొత్త ఉద్యోగులను పెట్టుకోడు. ఉద్యోగుల అవసరం ఉన్న ఏ సంస్థ అయినా కేవలం 18 వేల రూపాయలకు భయపడి నియామకాలు ఆపేయదు. ఈ చిన్న విషయం జైట్లీకి ఎందుకు అర్థం కాలేదో అర్థం కాదు. నిజానికి చిన్న ఉద్యోగాల్లో ఉన్నవాళ్లను ఆకర్షించడానికి వారు కట్టాల్సిన చందా తామే కడతామంటే బాగుండేదేమో. మహిళల విషయంలో మరో తప్పు చేశారు. మహిళలు చెల్లించాల్సిన భవిష్య నిధి చందాలో మూడేళ్ల పాటు ఎనిమిది శాతం కడితే చాలన్నారు. మహిళల చేతుల్లో ఖర్చు కోసం ఎక్కువ ఖర్చు ఉంటుందనే ఆలోచించారు కానీ, దీర్ఘకాలిక పొదుపు ఉద్దేశాన్ని మరచిపోయారు. ఈ సౌలభ్యం వల్ల మహిళా ఉద్యోగుల చేతుల్లో మిగిలేది మహా అయితే నెలకు ఆరొందల రూపాయలు. భవిష్య నిధిపేరులోనే అది భవిష్యత్ కోసమని ఉంది. ఆ నిధిని ఇప్పుడే కొల్లగొట్టి డబ్బులు దాచుకోవద్దనడం సరి కాదు. నిజానికి మహిళా చిరు ఉద్యోగులకు ఊరట కలిగించాలంటే, వారు కట్టే చందా ప్రభుత్వమే కడుతుందని ప్రకటించాల్సింది. ఆర్థిక మంత్రి ఆ అవకాశం జారవిడుచుకున్నారు. సంస్థల యజమానులకు మూడేళ్ల పాటు ఇచ్చే యాజమాన్యపు చందా కన్నా, మహిళలకు మూడేళ్ల పాటు ఉద్యోగినుల చందా కడతామనడం చాలా బాగుండేది.



భవిష్యనిధి గురించి మరో మాట. ఉద్యోగులు పొందే మొత్తం జీతం మీద చందా చెల్లిస్తే ప్రభుత్వానికి పోయేదేమీ లేదు. అది ఉద్యోగులు, వారి యాజమాన్యాలు చెల్లించాల్సింది. ఆ మేరకు చట్టాన్ని సవరించవచ్చు. మొత్తం జీతం మీద చందా కట్టడం వల్ల పదవీ విరమణ పొందిన నాడు తమ నెల జీతంలో సగం పింఛను పొందే అవకాశం ఉంది. దీనికి చేయాల్సింది కేవలం చట్టసవరణే. ఆ అవకాశమూ పోగొట్టుకున్నారు ఆర్థిక మంత్రి. బడ్జెట్ ప్రసంగం వింటుంటే అరుణ్ జైట్లీ మనల్ని నవ్విస్తున్నాడా తానే నవ్వుల పాలవుతున్నాడా అన్నది అర్థం కాదు. అందుకు ఉదాహరణ 'హవాయి చెప్పులు వేసుకునే వారు కూడా విమానాలలో ప్రయాణిస్తా'రని ఆయన చేసిన ప్రకటన. అందుకోసం బడ్జెట్‌లో కేటాయించింది 6,602 కోట్లు. ఇందులో 4460.50 కోట్ల రూపాయలతో రెండు బోయింగ్ విమానాలను కొంటారు. వాటిని ప్రముఖుల ప్రయాణాలకు వాడుతారు. మిగతాది ప్రాంతీయ అనుసంధానాలు పెంచడం, విమానాశ్రయాల విస్తరణ వగైరాలకు వినియోగిస్తారు. దీంతో హవాయి చెప్పులు తొడుక్కునే వారి భూములు విస్తరణలో పోతాయి కానీ ఎవ్వరూ విమానాలు ఎక్కే పరిస్థితి ఉండదు. ఇదిలా ఉండగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎయిర్ ఇండియాను అమ్మకానికి పెట్టడం మరీ దారుణం. ఇక ప్రయివేటీకరణ విషయానికొస్తే.. ఐరావతాల్లా మిగిలి ఉన్న సాధారణ బీమా కంపెనీలను ప్రయివేటు పరం చేయాలి కానీ, దేశానికే గర్వకారణంగా ఉన్న ఎయిర్ ఇండియాను కాదు. దాన్ని అమ్ముకుని ఎన్నో రోజులు పబ్బం గడుపుకోలేరు.

> **రైల్వే బడ్జెట్ ప్రత్యేకంగా ఉన్నప్పుడు రైల్వే ఆదాయ వ్యయాలు, ప్రణాళికలు, చేపట్టే కార్యక్రమాలు స్పష్టంగా తెలిసేవి. ప్రతి రాష్ట్రానికీ అమలయ్యే రైల్వే అభివృద్ధి పనుల విషయంలో అవగాహన ఉండేది. ఆ అవకాశం ఇప్పుడు లేదు. 2018–19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రైల్వేల విషయాన్ని మొక్కుబడిగా ప్రస్తావించడం ప్రభుత్వ ఉద్దేశాన్ని తెలియజేస్తోంది. రైల్వేలు సరిగా పనిచేయనినాడు కోట్లాది మందికి జీవనోపాధి పోతుంది. వచ్చే ఏడైనా మళ్లీ రైల్వేకి ప్రత్యేక హోదా కల్పించాల్సిన అవసరముంది.**

మార్కెట్‌లో గట్టి పోటీ ఉన్నందున సాధారణ బీమా కంపెనీలను కలిపి ఒకటి చేశామన్నారు. నిజానికి ప్రభుత్వ రంగంలో సాధారణ బీమా కంపెనీల అవసరం లేదు. బీమా కంపెనీల మీద ప్రభుత్వ నియంత్రణ ఉండాలే కానీ దాన్ని ప్రభుత్వమే నిర్వహించాల్సిన అవసరం లేదని 1990కి ముందే ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. నిజానికి ఆర్థికాభివృద్ధికి దోహదపడే వస్తు సేవల ఉత్పత్తి ప్రభుత్వం చేపట్టాలే కాని సాధారణ బీమా కాదు. మార్కెట్‌లో చాలా సాధారణ బీమా కంపెనీలు ఉన్నాయి.

ఇక ఉద్యోగులు చెల్లించే ఆదాయ పన్ను వివరాలలోకొద్దాం. ప్రతి ఉద్యోగి సగటున 76,306రూపాయలు పన్ను చెల్లిస్తున్నారని చెప్పారు. వ్యాపారాలలో ఆదాయం సంపాదించే వ్యక్తులు కేవలం 25,753 రూపాయలు మాత్రమే ఆదాయ పన్ను కడుతున్నారు. 1.89కోట్ల మంది ఉద్యోగులు, ఫించనుదార్లనుంచి గత సంవత్సరం 1.44 లక్షల కోట్లు ఆదాయ పన్ను వసూలయ్యింది. ఉద్యోగులు కాని వారి వద్ద నుంచి 48 వేల కోట్లు మాత్రమే వచ్చింది. ప్రభుత్వ బడ్జెట్ 24.42 లక్షల కోట్లలో ఉద్యోగుల నుంచి వసూలు చేసేది 5.89 శాతం. రెవెన్యూ లోటు 2, 20,639 కోట్లు. అంటే మొత్తం బడ్జెట్‌లో 9 శాతం. ఉద్యోగుల నుంచి పైసా వసూలు చేయకున్నా ప్రభుత్వం నడుస్తుంది. ఉద్యోగుల మన్నన పొందాలంటే వారి ఆదాయ పన్నును మొత్తంగా ఎత్తేసి, వ్యాపారుల నుంచి పకడ్బందీగా వసూలు చేయాలి. కానీ ఆ పని చేయలేదు. గ్రామీణ బ్యాంకులను బలోపేతం చేసేందుకు తీసుకున్న చర్యలు మరీ విడ్డూరంగా ఉన్నాయి. సంస్థాగత రుణాల కోసం కొట్టుమిట్టాడుతున్న గ్రామీణ రైతాంగాన్ని, చిన్న వ్యాపారులు, వృత్తిదారులకు పెద్ద బ్యాంకులు దూరంగా ఉండడంవల్ల 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ బ్యాంకులకు శ్రీకారం చుట్టింది. లాభాలార్జించడం ఈ బ్యాంకుల ధ్యేయం కాదు. వ్యవసాయానికి, వ్యవసాయాధారిత వృత్తులకు రుణసదుపాయం కల్పించడం వీటి ఉద్దేశం. అలాంటి మార్కెట్‌లో షేర్లు అమ్మమనడం అనైతికం.

సాధారణ బడ్జెట్‌లో రైల్వేలను జోడించడం మరో ప్రహసనం. రైల్వే బడ్జెట్ ప్రత్యేకంగా ఉన్నప్పుడు రైల్వే ఆదాయ వ్యయాలు, ప్రణాళికలు, చేపట్టే కార్యక్రమాలు స్పష్టంగా తెలిసేవి. ప్రతి రాష్ట్రానికీ అమలయ్యే రైల్వే అభివృద్ధి పనుల విషయంలో అవగాహన ఉండేది. ఆ అవకాశం ఇప్పుడు లేదు. 2018–19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రైల్వేల విషయాన్ని మొక్కుబడిగా ప్రస్తావించడం ప్రభుత్వ ఉద్దేశాన్ని తెలియజేస్తోంది. రైల్వేలు సరిగా పనిచేయని నాడు కోట్లాది మందికి జీవనోపాధి పోతుంది. వచ్చే ఏడైనా మళ్లీ రైల్వేకి ప్రత్యేక హోదా కల్పించాల్సిన అవసరముంది. మొత్తానికి, ఈ ఏడాది బడ్జెట్ చాలా మంది ఆశలపై నీళ్లు చల్లింది. జనాకర్షణ లేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆర్థికమంత్రి జైట్లీ తమ ప్రభుత్వం ప్రజలకు మరింత దూరమయ్యేలా చేశారు.

■ డాక్టర్ పి. మాధవ రావు
ఐక్యరాజ్య సమితి మాజీ సీనియర్ సలహాదారు

టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి 2లక్షల విరాళం



కాదంబరి కిరణ్‌కు చెక్కు అందిస్తున్న సంతోష్

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్ కుమార్ 'మనం సైతం' సంస్థకు సోమవారం విరాళమిచ్చారు. ఆ సంస్థ అధ్యక్షుడు కాదంబరి కిరణ్‌కు రూ.2,01,600 చెక్కును అందజేశారు. మనం సైతం పేరుతో కాదంబరి కిరణ్ తన మిత్రబృందంతో కలిసి చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితుడై విరాళం అందించానని సంతోష్ కుమార్ తెలిపారు.

మేడారం మినీ కుంభమేళ: వెంకయ్య

- జాతరను జాతీయ పండుగగా ప్రకటించలేం: కేంద్రం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర మినీ కుంభమేళ అని, పెద్ద ఎత్తున గిరిజనులు ఒక్కదగ్గర చేరడాన్ని చూడడం గొప్ప ఉల్లాసాన్ని ఇచ్చిందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. జాతరకు దాదాపు కోటి 50 లక్షల మంది హాజరయ్యారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయని, దానికి తగినట్లుగా ఏర్పాట్లు చేశారని ప్రశంసించారు. కాగా, మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించలేమని, దేశంలో ఏ జాతర/వేడుకను జాతీయ పండుగగా గుర్తించే పథకం కాని, మార్గదర్శకాలు తమ దగ్గర లేవని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయమంత్రి జస్వంత్‌సింగ్ భభ్రా సోమవారం లోక్‌సభలో వెల్లడించారు.

ఉర్దూలోనూ సెట్స్ ప్రశ్నపత్రాలు: సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌తో పాటు పలుకోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షల (సెట్స్) ప్రశ్నపత్రాలను ఇకపై ఉర్దూలో కూడా ఇవ్వాలని సీఎం కేసీఆర్ తెలంగాణ ఉన్నత విద్యామండలిని ఆదేశించారు. దీంతో ఈ యేడాది నుంచి అన్ని సెట్స్ పరీక్షలతో పాటు పీజీ పరీక్షలకు కూడా ఉర్దూలో ప్రశ్నపత్రం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు కౌన్సిల్ ఛైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. లాంగ్వేజ్ ఆప్షన్‌లో తెలుగు, ఇంగ్లిష్‌తో పాటు ఉర్దూ భాషను కూడా చేర్చనున్నట్లు ఆయన వివరించారు.

వ్యర్థాలపై కలెక్టర్లకు హెచ్‌ఆర్‌సీ నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు రసాయన వ్యర్థాల విడుదలను మానవహక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. రసాయనాల విడుదల వల్ల చెరువులు, భూగర్భ జలాలు విషతుల్యమవుతున్నాయంటూ వచ్చిన మీడియా కథనాలపై హెచ్‌ఆర్‌సీ స్పందించింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు మెంబర్ సెక్రటరీతోపాటు 11 జిల్లాల కలెక్టర్లకు నోటీసులిచ్చింది. ఈనెల 28లోగా పరిశ్రమలు రసాయన వ్యర్థాల విడుదలపై సమగ్ర నివేదికను సమర్పించాలని హైదరాబాద్, రంగారెడ్డి, పెద్దపల్లి, భద్రాద్రి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, నల్గొండ, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి జిల్లాల కలెక్టర్లను హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

న్యాయం చేయండి: డీ-ఫార్మసీ విద్యార్థులు

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ, ప్రైవేటు వైద్య ఉద్యోగాల్లో తమకు కూడా అవకాశం కల్పించాలంటూ డీ-ఫార్మసీ విద్యార్థులు సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఆసుపత్రిలో ఫార్మ్-డీ క్లినికల్ ఫార్మసిస్టులను నియమించాలని కోరారు. డీ-ఫార్మసీ విద్యార్థులు సరైన అవకాశాల్లేక నష్టపోతున్నారని వాపోయారు.

శ్రీనివాస్ హత్య కేసు దర్యాప్తుపై డీజీపీ సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మున్సిపల్ ఛైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో దర్యాప్తు తీరును డీజీపీ మహేందర్ రెడ్డి సోమవారం సమీక్షించారు. నిందితులపై మోపిన అభియోగాలు.. నమోదు చేసిన సెక్షన్లు, నిందితులకు బెయిల్ మంజూరు తీరు, అనుమానాస్పదంగా మారిన కాల్ డేటా వ్యవహారం, టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు అదృశ్యం వెనక కారణాలు, విపక్షాల విమర్శలపై ఆరా తీశారు.

సీసీఎల్ఏగా బాధ్యతలు చేపట్టిన రాజేశ్వర్ తివారీ

భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించడానికి విముఖత వ్యక్తం చేసిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ.. ఎట్టకేలకు బెట్టు వదిలారు. గతనెల 31న తివారీని సీసీఎల్ఏగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. తాను ఆ బాధ్యతలు చేపట్టలేనంటూ ఆయన సీఎస్ ఎస్కే జోషికి తెలిపారు. దీంతో సీఎంవో రంగంలోకి దిగి.. తివారీకి కౌన్సెలింగ్ ఇచ్చింది. సీఎస్ కూడా నచ్చజెప్పడంతో.. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

'కాంట్రాక్టు' వెయిటేజీపై కౌంటర్ కోరిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): టీఎస్ ట్రాన్స్‌కో, స్టాఫ్ నర్స్, మెడికల్ ఆఫీసర్స్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వడంపై కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ట్రాన్స్‌కోను హైకోర్టు ఆదేశించింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ అభ్యర్థులకు వెయిటేజీ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఏసీజే రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారించింది.ఇరుపక్షాల వాదనలు విని వారంలో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని, ట్రాన్స్‌కోను ఆదేశించింది. ఇదిలావుండగా ఇద్దరు అభ్యర్థులకు సమానమైన మార్కులు వచ్చినప్పుడు వెయిటేజీ మార్కులు ఇవ్వవచ్చని ఓ ధర్మాసనం, వెయిటేజీ మార్కులు ఇవ్వరాదంటూ మరో ధర్మాసనం తీర్పులిచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ వివాదాన్ని ఏసీజే ముందుంచాలని సింగిల్ జడ్జి గతంలో ఆదేశించారు.

దాడులపై విచారణ చేపట్టండి:రాములు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : 'దళితులు, దళిత ఉద్యోగుల మీద జరుగుతున్న దాడులపై విచారణ జరిపి చర్యలు తీసుకునే బాధ్యత రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్‌పై ఉంది. అలా జరగని పక్షంలో జాతీయ కమిషన్ స్థాయిలో చేసి చర్యలు తీసుకుంటా' అని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాములు అన్నారు. రాములును తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ప్రభుత్వం మంచి అనుభవజ్ఞులైన వారితో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులను నియమించిందని, అందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నిరంతర విద్యుత్తుపై ఢిల్లీ వర్సిటీ విద్యార్థుల ఆరా

- 'జష్నే - ఈ - హిందు' ను ప్రారంభించిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో 24 గంటల విద్యుత్తు అందిస్తున్న విషయమై ఢిల్లీ వర్సిటీ విద్యార్థులు టీఆర్ఎస్ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఆయన వర్సిటీలోని ప్రముఖ హిందూ కాలేజీలో సోమవారం జరిగిన జష్నే - ఈ- హిందు కార్యక్రమాన్ని ఢిల్లీ మాజీ సీఎం షీలాదీక్షిత్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఐటీ కారిడార్ అభివృద్ధి, ప్రపంచంలోనే పేరొందిన సిలికాన్ వ్యాలీ కంపెనీలు తెలంగాణకు రావడం, టీ హబ్ ఏర్పాటుపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

టీడీపీ-టీఎస్‌కు చంద్రబాబు దిశానిర్దేశం!

హైదరాబాద్/మహబూబాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా టీడీపీ-టీఎస్ నేతలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. బుధవారం ఎన్టీఆర్ భవన్ చేరుకోనున్న చంద్రబాబు.. పార్టీ నాయకులతో వ్యక్తిగతంగా, బృందంగా సమావేశం కానున్నారు. అలాగే కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో నేతలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. కాగా, బుధవారం చంద్రబాబు సమక్షంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య టీడీపీలో చేరనున్నట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి.

స్టాఫ్ నర్సు దరఖాస్తుల్లో తప్పుల సవరణకు చాన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్సు, ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దరఖాస్తుల్లో తప్పుల సవరణ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 8 నుంచి 11 వరకు దరఖాస్తుల్లో తప్పుల సవరణ చేసుకోవచ్చని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బడ్జెట్‌పై సీఎం సమీక్ష

వివిధ శాఖల నుంచి అందిన ప్రతిపాదనలపై ఆరా

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రవేశపెట్టనున్న 2018-19 బడ్జెట్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షలు ప్రారంభించారు. సోమవారం ప్రగతిభవన్‌లో బడ్జెట్ పద్దులపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థికశాఖకు వివిధ శాఖల నుంచి అందిన ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ శాఖ నుంచి ఎంతెంత ప్రతిపాదనలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ మేరకు నిధులు వస్తాయన్న విషయాలను ఆరా తీశారు. ఇప్పటికే బడ్జెట్ ప్రతిపాదనలపై రామకృష్ణరావు వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో సమీక్షించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి సమీక్షలు పూర్తికాగానే బడ్జెట్‌కు తుదిరూపు రానుంది. ఏ శాఖకు ఎంతమేర నిధులు కేటాయించాలన్నది సీఎం ఇచ్చే సూచనలమీదే ఆధారపడి ఉంటుంది.



యాదాద్రి ప్రధాన ఆలయ విమానగోపురం నిర్మాణ స్థలి

చకచకా యాదాద్రి

క్షేత్రపాలక, విమాన గోపురాలకు శిలాన్యాసం
దసరానాటికి పూర్తిచేసేందుకు అధికారుల కృషి

యాదాద్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయ పునర్నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ మంత్రి నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల వరకూ.. వరుస సమీక్షలతో గడువులోగా ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆలయ క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి స్వయంభూ ఆలయ పునర్నిర్మాణం, స్వామివారు కొలువైన కొండగుహ ప్రధాన ఆలయంపై విమాన గోపుర నిర్మాణాలకు సోమవారం శాస్త్రోక్తంగా శిలాన్యాస పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాన్ని 8 పలకలు, 8 కోణాలతో కృష్ణ శిలలతో నిర్మించడానికి ప్రథమశిలను అధిష్ఠింపజేశారు. నెల రోజుల్లో ఆంజనేయస్వామి ఆలయం పైకప్పు స్థాయికి చేరుకుంటుందని స్థపతి డాక్టర్ ఆనందచారి వేలు తెలిపారు. లక్ష్మీనరసింహ స్వామివారి గర్భాలయంపై విమాన గోపుర నిర్మాణానికి సోమవారం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శిలాన్యాస పూజలు నిర్వహించారు. పంచ నరసింహులు కొలువైన గర్భాలయంపై 43 అడుగులతో 5 అంతస్తుల విమాన గోపురాన్ని 32 లేయర్లతో చేపడుతున్నారు. ఈ నిర్మాణం పూర్తిచేసిన వెంటనే బంగారు తాపడం చేయడానికి వైటీడీఏ సన్నాహాలు చేస్తోంది. దసరా నాటికి స్వామివారి గర్భాలయ దర్శనం కల్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ప్రాజెక్టులపై 'ఉక్కు' పిడుగు

(మొదటి పేజీ తరువాయి)

పనులు వేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది డిసెంబరు నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నది. దీనికోసం రోజూ సుమారు 3500 నుంచి 4 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను వేస్తున్నారు. కాళేశ్వరంలో భాగంగా 19 పంప్ హౌజ్‌లను నిర్మిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన గోదావరిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాంతాల్లో ప్రత్యేక బ్యారేజీలను చేపడుతున్నారు. ఒక్కో బ్యారేజి నిర్మాణానికి సుమారు 50 వేల నుంచి 60 వేల టన్నుల స్టీల్ అవసరం ఉంది. అన్నారం బ్యారేజికి 53 వేల టన్నుల స్టీల్ అవసరం ఉంది. ఇందులో ఇప్పటికే 30 వేల టన్నుల వరకు ఉపయోగించారు. అంటే ఇంకా 20 వేల టన్నుల స్టీల్‌ను వాడాల్సి ఉంది. అలాగే అన్నారం పంప్ హౌజ్‌కు 19 వేల టన్నుల ఉక్కు అవసరం ఉండగా, ఇప్పటి వరకు 10 వేల టన్నుల వరకు వాడారు. ఇలా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంప్‌హౌజ్‌లతో పాటు లింకు-2 పనుల కోసం మొత్తం సుమారు 3.50 లక్షల టన్నుల ఉక్కు అవసరం ఉంది. అయితే, ఇందులో ఇప్పటికే సగానికిపైగా ఉక్కును ఉపయోగించారు. అంటే... సుమారు 1.50 లక్షల టన్నుల ఉక్కును అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి ఉంది. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి కాంక్రీట్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ పనులను త్వరలోనే చేపట్టనున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో సుమారు 2.65 లక్షల టన్నుల స్టీల్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. ఉక్కు ధరలు పెరగడంతో ఈ ఒక్క ప్రాజెక్టుపైనే సుమారు అదనంగా రూ.400 కోట్ల భారం పడనుంది. అలాగే సీతారామ ప్రాజెక్టును కూడా కొత్తగానే చేపట్టారు. ఇవి కాకుండా పలు ప్రాజెక్టులు నిర్మాణ దశలోనే ఉన్నాయి. అన్ని ప్రాజెక్టులకు కలిసి సుమారు 6 లక్షల టన్నుల ఉక్కు అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు. టన్నుకు రూ.34 వేల నుంచి రూ.52 వేల వరకు ధరలు పెరిగినందున అదనంగా రూ. 900 కోట్లకు పైగా భారం పడుతుందని అంచనా వేస్తున్నారు.

భారమంతా సర్కారుపైనే

స్టీల్, సిమెంట్, ఇసుక వంటి మెటీరియల్ ధరల పెరుగుదల, తరుగుదల వంటి ప్రభావం కాంట్రాక్టర్లపై పడదు. ఎందుకంటే.. ఈ వస్తువుల ధరలు తగ్గితే ఆ మేరకు చెల్లింపుల్లో తగ్గించనున్నారు. ఒక వేళ ధరలు పెరిగితే...పెరిగిన ధరల ప్రకారం బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. దీనినే ఎస్కలేషన్ విధానం అంటారు. ఆయా ప్రాజెక్టుల పనులను నిర్వహించే కాంట్రాక్టు ఏజెన్సీలు నెల వారీగా బిల్లులను ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఎప్పటికప్పుడు ఉండే ధరల ప్రకారం ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులను చెల్లించనుంది. దాంతో ప్రస్తుతం పెరిగిన స్టీల్ ధరల కారణంగా ప్రభుత్వంపై భారం పెరిగింది.

స్టీలు కొరత

ప్రస్తుతం మార్కెట్‌లో స్టీల్ కొరత కూడా ఉంది. ప్రాజెక్టుల నిర్మాణాల్లో టాటా వంటి ప్రముఖ 3 కంపెనీల స్టీల్‌ను మాత్రమే ఉపయోగించాల్సి ఉంది. ఈ మేరకు కాంట్రాక్టులతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ధరల పెరుగుదల నేపథ్యంలో మార్కెట్‌లో కొరత సమస్య కూడా తలెత్తింది. దీంతో ప్రాజెక్టుల నిర్మాణాలపై దీన్ని ప్రభావం ఉంటుందని ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు.



ఉక్కు కంపెనీల యజమానులతో భేటీ అయిన మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డి

'డబుల్'కు స్టీల్ కంపెనీలు సాయపడాలి

ఉక్కు కంపెనీ యజమానుల సమావేశంలో మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకానికి సామాజిక బాధ్యతగా ఉక్కు కంపెనీల యజమానులు తమ వంతు సాయం అందించాలని మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కేటీఆర్ కోరారు. సోమవారం సచివాలయంలో ఉక్కు కంపెనీల యజమానులతో మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్ కంపెనీలు మార్కెట్ ధరల హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా బస్తా సిమెంట్ రూ.230కే విక్రయించేందుకు ఒప్పుకున్నాయని, ఉక్కు కంపెనీల యాజమాన్యాలు కూడా తక్కువ ధరకే ఉక్కును విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం 2.60 లక్షల డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు 5.27 లక్షల టన్నుల ఉక్కు అవసరమని, అందువల్ల లాభాపేక్ష లేకుండా సరైన ధరకు ఉక్కును విక్రయించే ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అన్ని ఉక్కు కంపెనీల యజమానులతో సంప్రదించి చర్చించి తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని ఉక్కు కంపెనీల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఈ విషయంలో అధికారులతో మరోసారి భేటీ కావాలని స్టీల్ కంపెనీల యజమానులకు సూచించారు. రెండు మూడు రోజుల్లో ఉక్కు కంపెనీ యజమాన్య ప్రతినిధులతో సమావేశమై నిర్దిష్టమైన ధరను నిర్ణయించాలని ఈ సందర్భంగా మంత్రులు గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రా రామచంద్రన్‌ను ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ మడుపు భూంరెడ్డి, ఆలిండియా స్టీల్ అసోసియేషన్ ఛైర్మన్ సురేష్ కుమార్ సింఘాల్, విశాఖ స్టీల్ ప్లాంట్, జిందాల్, శాలినీ స్టీల్ కంపెనీతో పాటు మరో 8 స్టీల్ కంపెనీల యజమానులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం

- 9, 11 తేదీల్లో సమావేశాలు.. దక్షిణాది రాష్ట్రాలతో భేటీ
- 10న 'కాళేశ్వరం' సందర్శన.. విజ్ఞప్తులతో సిద్ధమైన సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటైన 15వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి రానుంది. సంఘం ఏర్పాటైన తర్వాత నిర్వహిస్తున్న మొట్టమొదటి సమావేశానికి హైదరాబాదే వేదిక కానుంది. దక్షిణాది రాష్ట్రాల కోసం 9, 11 తేదీల్లో ఈ సమావేశాలను నిర్వహించనున్నారు. ఈమేరకు రాష్ట్ర ఆర్థిక శాఖకు వర్తమానం అందింది. సంఘం ఛైర్మన్ ఎన్కే సింగ్‌తో పాటు సభ్యులు శక్తికాంత దాస్, అనూప్ సింగ్ సమావేశంలో పాల్గొనే అవకాశాలున్నాయి. కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నులు, గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ వాటాలపై సిఫారసులు చేసేందుకు ప్రతి ఐదేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం 14వ ఆర్థిక సంఘం అమలులో ఉంది. 2017 నవంబరు 27న రాష్ట్రపతి 15వ ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఎన్కే సింగ్ ఛైర్మన్‌గా, శక్తికాంత దాస్, అనూప్ సింగ్, అశోక్ లాహిరి, రమేష్ చంద్ సభ్యులుగా సంఘం ఏర్పాటైంది. ఈ 15వ ఆర్థిక సంఘం చేసే సిఫారసులు 2020 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఈలోపు ఆర్థిక సంఘం రాష్ట్రాలతో సంప్రదింపులు, చర్చలు జరుపుతుంది. అందులో భాగంగానే దక్షిణాది రాష్ట్రాలతో మొట్టమొదటి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. రెండు రోజుల పాటు జరిగే సమావేశాల్లో దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళతో పాటు మహారాష్ట్ర కూడా పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా ఆర్థిక సంఘానికి రాష్ట్రాలు పలు విజ్ఞప్తులను అందజేయనున్నాయి. రాష్ట్రాల నుంచి వసూలవుతున్న వివిధ రకాల పన్నులు, ఇక్కడి క్షేత్ర స్థాయి ఇబ్బందులు, జిల్లాల వెనుకబాటుతనం గురించి వివరించనున్నాయి. తదనుగుణంగా కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటాతో పాటు, గ్రాంట్స్-ఇన్-ఎయిడ్‌లో వాటాలు, కేంద్ర సౌజన్య పథకాల్లో తమకు అవసరమైన వాటి గురించి వివరించనున్నాయి. రాష్ట్ర ప్రణాళిక విభాగం ఇప్పటికే నివేదికను తయారు చేసింది. ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ ఆధ్వర్యంలో వివిధ శాఖల నుంచి సమాచారాన్ని సేకరించి నివేదికను రూపొందించారు. ఇంటింటికీ తాగు నీటి కోసం చేపడుతున్న మిషన్ భగీరథ పథకానికి రూ.19,205 కోట్లు, చెరువుల పునరుద్ధరణ కోసం చేపడుతున్న మిషన్ కాకతీయ పథకానికి రూ.5000 కోట్లు ఇవ్వాలంటూ ఇప్పటికే నీతి అయోగ్ కేంద్రానికి సిఫారసు చేసింది. ఈ విషయాన్ని కూడా ఆర్థిక సంఘం దృష్టికి తీసుకురానుంది.

కాళేశ్వరానికి జాతీయ హోదా...

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలంటూ 15వ ఆర్థిక సంఘానికి ప్రభుత్వం నివేదించనుంది. దాదాపు రూ.88 వేల కోట్ల అంచనాలతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.22 వేల కోట్ల మేర వెచ్చించామని, కనీసం రూ.10 వేల కోట్ల మేర కేంద్ర సహాయం అందేలా చూడాలని కోరనుంది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకే 10న ఆర్థిక సంఘం బృందం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనుంది. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించి అవగాహనకు వస్తుందని భావిస్తున్నారు.

5 సబ్‌జైళ్ల మూసివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏఏటికాయేడు ఖైదీల సంఖ్య తగ్గుతుండడంతో.. సబ్‌జైళ్లను మూసివేస్తున్నట్లు జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ వెల్లడించారు. 107 మంది ఖైదీల సామర్థ్యమున్న ఆర్మూర్, బోధన్, నర్సంపేట, పరకాల, మధిర సబ్‌జైళ్లలో కేవలం 23 మంది మాత్రమే ఉన్నారని, ఈ కారణంగా వాటిని మూసివేశామని ప్రకటించారు. అక్కడి ఖైదీలు, సిబ్బందిని సంబంధిత జిల్లా జైళ్లలో సర్దుబాటు చేశామన్నారు. ఇదే క్రమంలో ఈ ఏడాదిలో మరో మూడు సబ్‌జైళ్లను మూసివేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. '2015 జనవరి నాటికి తెలంగాణ జైళ్లల్లో 6,012 మంది ఖైదీలున్నారు. జైళ్ల శాఖలో చేపడుతున్న విద్యాదానం, యోగా, కౌన్సెలింగ్ వంటి కార్యక్రమాలతో ఖైదీల్లో పరివర్తన వస్తోంది. నేరాలు పదిశాతం తగ్గాయి. దీంతో.. ప్రస్తుతం తెలంగాణలోని అన్ని జైళ్లలో ఖైదీల సంఖ్య 5,348కి చేరింది. 2020 నాటికి.. 50 శాతం మేర నేరాలను తగ్గించి, సర్కారు ఖజానాకు రూ. 10కోట్ల మేర ఆదా చేస్తాం. క్రమంగా నేరాలు తగ్గి.. భవిష్యత్‌లో తెలంగాణ జైళ్లన్నీ ఖాళీ అవుతాయి' అని వివరించారు. సత్ప్రవర్తనతో విడుదలైన 3,000 మందికి ఈ ఏడాది చివరికల్లా ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

ప్రాజెక్టుల నిధులు మనకెన్ని?

- సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర సాయం
- రాష్ట్రంలోని 11 ప్రాజెక్టులకు ప్రత్యేకంగా..
- నేడు ఢిల్లీలో కీలక సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ ఏడాది వీలైనంత ఎక్కువ ఆర్థిక సాయాన్ని పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం కేంద్రానికి ప్రత్యేక నివేదికను అందించాలని నిర్ణయించారు. ఈ ఏడాది కేంద్రం ఇచ్చే ఆర్థిక సహాయానికి సంబంధించి రెండు రోజుల్లో స్పష్టత రానుంది. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సుమారు 11 ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన(పీఎంకేఎస్‌వై) కింద కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం కేంద్ర బడ్జెట్‌లో సుమారు రూ.6 వేల కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా సుమారు 45 ప్రాజెక్టులు ఉండగా.. రాష్ట్రంలోనే అత్యధికంగా 11 ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఇచ్చే నిధులకు సంబంధించి మంగళవారం ఢిల్లీలో కేంద్రం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తోంది. ఆ సమావేశంలో పాల్గొని, ఆర్థిక సహాయాన్ని ఎక్కువగా రాబట్టేందుకు వీలుగా రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు నివేదికలను రూపొందిస్తున్నారు. పీఎంకేఎస్‌వై పరిధిలోని 11 ప్రాజెక్టుల మొత్తం నిర్మాణ వ్యయం రూ.24,574 కోట్లు కాగా ఇప్పటి వరకు సుమారు రూ.18,263.53 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కేంద్రం నుంచి రూ.3,388.32 కోట్లు వచ్చింది. ఇంకా సుమారు రూ.1200 కోట్ల నిధులు రావాల్సి ఉంది. ఈ నిధుల్లో సాధ్యమైనంత ఎక్కువ మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోనే పొందాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ముఖ్యంగా 11 ప్రాజెక్టులను ఈ ఏడాదే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో మొత్తం నిధులను మంజూరు చేయాల్సిందిగా కేంద్రాన్ని కోరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కచ్చితంగా రూ.600 కోట్లు వస్తాయని భావిస్తోంది.

గ్యాప్ ఆయకట్టు అభివృద్ధికి ప్రత్యేక నిధులు..

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల పరిధిలో సుమారు 12 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఇందులో నాగార్జునసాగర్, జూరాల వంటి పెద్ద ప్రాజెక్టులతోపాటు పలు చిన్న ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. అంటే ఈ ప్రాజెక్టుల పరిధిలో రావాల్సిన ఆయకట్టు విస్తీర్ణం ఇంకా అందుబాటులోకి రాలేదు. ఇలాంటి ఆయకట్టును అభివృద్ధిలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇందుకోసం కేంద్రం ప్రత్యేక నిధులు కూడా అందించనుంది. ఈ పథకంలో రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులను గుర్తించారు. ముఖ్యంగా జూరాల, నాగార్జునసాగర్, గుండలావు, అలీసాగర్, గుత్ప, ఏఎంఆర్‌పీ, సింగూరు, డిండి, నిజాంసాగర్, ఆర్డీఎస్, కడెం, మూసి, కోటిపల్లివాగు, ఘణపూర్, కౌలస్నాలా, స్వర్ణ, వొట్టివాగు, శాంత్నాల, అప్పర్ మానేరు, పాకాల, గడ్డెన్నవాగు, తాలిపేరు, నల్లవాగుల వంటి ప్రాజెక్టుల పరిధిలోని గ్యాప్ ఆయకట్టును అభివృద్ధిపర్చాలని నిర్ణయించారు. మంగళవారం నాటి సమావేశంలో ఈ ప్రాజెక్టులను కూడా ప్రస్తావించాలని అధికారులు నిర్ణయించారు.

బీసీలకు టీఆర్ఎస్ సర్కారు ప్రాధాన్యం

కేంద్ర బడ్జెట్ కన్నా మేమే ఎక్కువ కేటాయించాం
బీసీ సంక్షేమం, అటవీ శాఖల మంత్రి జోగు రామన్న



శిక్షణ పొందిన నాయీ బ్రాహ్మణులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి జోగు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాలకు టీఆర్ఎస్ సర్కారు అధిక ప్రాధాన్యం ఇస్తోందని బీసీ సంక్షేమ మంత్రి జోగురామన్న అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు కేటాయించే బడ్జెట్ కన్నా రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ కేటాయించిందని గుర్తు చేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ బడ్జెట్‌లో రూ.5,070 కోట్లు కేటాయించగా కేంద్ర బీసీ బడ్జెట్ కేవలం రూ.1,250 కోట్లు మాత్రమేనని అన్నారు. సోమవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ ద్వారా ఆధునిక శిక్షణ పొందిన 138 మంది నాయీ బ్రాహ్మణులకు కిట్స్, ధ్రువపత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతరించిపోతున్న కుల వృత్తులకు తమ ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకొస్తోందని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో బలహీన, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని, అందులో భాగంగానే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూ.250 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

2002 దిల్‌సుఖ్‌నగర్ పేలుడు కేసులో కీలక నిందితుడి అరెస్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): షఫీ అలియాస్ మహ్మద్ అబ్దుల్ ముజహార్.. 2002 దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు కేసులో కీలక నిందితుడు. 16 ఏళ్లుగా మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్న అతడిని ఒమన్‌లో ఇంటర్‌పోల్ పట్టుకుంది అతడిని ఇంటర్‌పోల్ అధికారులు తెలంగాణ సీఐడీకి అప్పగించారు. ఈ మేరకు అతడిని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టిన సీఐడీ అధికారులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. లష్కరే తాయబా ఉగ్రవాద సంస్థకు చెందిన షఫీ.. 2002, నవంబర్ 21న దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబాగుడి ఎదురుగా జరిగిన బాంబు పేలుడు కేసులో కీలక నిందితుడిగా ఉన్నాడు. సీఐడీ అతడిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసి ఇంటర్‌పోల్‌కు సమాచారమిచ్చింది. అప్పటి నుంచి నిఘా వేసిన ఇంటర్ పోల్.. వేరే దేశానికి వెళ్లే ప్రయత్నంలో ఉండగా ఇటీవల ఒమన్‌లో షఫీని అదుపులోకి తీసుకుంది.

మోదీకేర్ కోసం ఆరోగ్యశ్రీ అధ్యయనం

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): 'ఆయుష్మాన్ భారత్' అమలు సాధ్యాసాధ్యాలపై కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ప్రీతీ సుడాన్ నేతృత్వంలోని ఓ బృందం ఆదివారం హైదరాబాద్‌కు వచ్చింది. సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో డాక్టర్ మనోహర్‌తో భేటీ అయ్యింది. 'ఆరోగ్యశ్రీ' ఎలా అమలవుతోంది. ఏటా ఎంత ఖర్చు పెడుతున్నారు? పథకం అమల్లో తలెత్తుతున్న సమస్యలేంటి? ఆస్పత్రుల ఎంప్యానెల్‌మెంట్, రోగులకు అందుతున్న శస్త్రచికిత్సల వివరాలను ఈ బృందం అడిగి తెలుసుకుంది. కేంద్రం ఇటీవల బడ్జెట్లో ప్రకటించిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని దేశంలోని 10కోట్ల మందికి వర్తింపజేసి, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్యబీమాను అందించాలనుకుంటోంది. ఇలాంటి పథకాన్ని ఇప్పటికే రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పేరుతో అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి 2 లక్షల వరకు ఆరోగ్యబీమా కల్పిస్తున్నారు. ఏటా రెండున్నర లక్షల సర్జరీలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఏటా 700 కోట్లు ఖర్చు పెడుతోంది. అలాగే మోదీకేర్ పథకాన్ని ఆరోగ్యశ్రీతో లింకప్ చేయడంతోపాటు, నెట్‌వర్కింగ్ వ్యవస్థను ఎలా చేయాలన్న దానిపై కూడా కేంద్రబృందం అధికారులతో చర్చించినట్టు తెలుస్తోంది. మంగళవారం ఈ బృందం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డితో భేటీ కానుంది.



ఉపాధ్యాయుడి(సర్కిల్‌లో ఉన్న)ని నిలదీస్తున్న యువకులు

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

ఉపాధ్యాయుడికి గ్రామస్థుల దేహశుద్ధి..పోలీసులకు అప్పగింత

పుల్‌కల్, ఫిబ్రవరి 5 : పదో తరగతి విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఓ ఉపాధ్యాయుడికి గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం కోర్పోల్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మల్లికార్జున్ భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అయితే తమ పట్ల మల్లికార్జున్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ పదో తరగతి విద్యార్థినులు పలువురు కుటుంబసభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు స్థానిక యువకులను వెంటబెట్టుకుని పాఠశాలకు వెళ్లారు. అయితే ఉపాధ్యాయుడు సెలవులో ఉండడంతో హెచ్‌ఎం సంగప్పకు విషయాన్ని వివరించి మల్లికార్జున్‌ను పిలిపించారు. అప్పటికే అక్కడ గుమిగూడిన గ్రామస్థులు మల్లికార్జున్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం హెచ్‌ఎం గదిలో తీసుకెళ్లి జరిగిన విషయమై నిలదీశారు. తాను ఎవరి పట్ల అసభ్యంగా ప్రవర్తించలేదంటూ సమాధానమిచ్చారు. ఇంతలోనే ఎస్ఐ సత్యనారాయణ గ్రామానికి చేరుకుని ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు తరలించారు.

తల్లిదండ్రుల కలహాలతో విద్యార్థి ఆత్మహత్య



కేసముద్రం, ఫిబ్రవరి 5: ఏది తప్పో.. ఏది ఒప్పో చెప్పాల్సిన తల్లిదండ్రులే నిత్యం కొట్టుకోవడం జీర్ణించుకోలేకపోయాడో కుమారుడు. ఎప్పుడూ అమ్మానాన్నలు గొడవ పెట్టుకుంటుండటంతో మనస్తాపం చెందిన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధన్నసరి శివారు సబ్‌స్టేషన్‌తండాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన బానోతు సరోజ, శంకర్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. శంకర్ నిత్యం మద్యం సేవించి భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇద్దరూ గొడవపడటం చూసిన కుమారుడు సుమన్ తీవ్ర మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తండా సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం సుమన్ చెప్పులను గుర్తించిన తండా వాసులు బావిలో గాలించగా మృతదేహం బయటపడింది.

సేద్యానికి అనువుగాని భూముల్ని గుర్తించండి

అధికారులకు వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : భూరికార్డుల ప్రక్షాళన వివరాల ఆధారంగా సేద్యానికి అనువుగాని భూముల వివరాలను గ్రామాలవారీగా ఇవ్వాలని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారధి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. వ్యవసాయాధికారులు సేకరించిన సమాచారాన్ని గ్రామరెవెన్యూ అధికారుల వద్ద ఉన్న భూముల సమాచారాన్ని పోల్చి చూడాలన్నారు. ఈ సమాచారాన్ని గ్రామాల వారీగా పంటల వివరాల్ని ఉద్యాన పంటలతో కలిపి క్రోడీకరించి ఫిబ్రవరి 12 నాటికి పంపాలని ఆదేశించారు. కాగా, రాష్ట్రంలో డిమాండ్ మేర సోయాబీన్, శనగ, వేరుశనగ విత్తనాలను సరఫరా చేయాలని పార్థసారధి అధికారులను ఆదేశించారు. విత్తన ఉత్పత్తిలో కార్పొరేషన్‌తో పాటు వ్యవసాయ పరిశోధన సంస్థల చొరవ తీసుకోవాలన్నారు. జాతీయ నూనెగింజల పరిశోధన స్థానం సంచాలకుడు డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

ఆ ఊర్లు మావే.. కాదు మావే!

12 ఊర్లపై తెలంగాణ, మహారాష్ట్ర వాదులాట., వివాదాస్పద గ్రామాల్లో 'మహా' దూకుడు!

- వేగంగా మౌలిక సదుపాయాలు
- రూ.20 కోట్లతో రోడ్ల నిర్మాణం
- చోద్యం చూస్తున్న తెలంగాణ సర్కారు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో 12 గ్రామాలు.. 3900 జనాభా! తెలంగాణ నుంచి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం పరిధిలోకి వచ్చే గ్రామాలివి! ఈ గ్రామాలు తమవంటే తమవంటూ.. తెలంగాణ, మహారాష్ట్రలు వాదిస్తున్నాయి! 1987లో మహారాష్ట్ర.. 1993లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఆయా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడంతో వివాదం ముదిరింది. తాజాగా మహారాష్ట్ర సర్కారు దూకుడు పెంచింది. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతోంది. ఈ వివాదానికి సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన కమిషన్ ఆ గ్రామాలన్నీ తెలంగాణకే(పూర్వపు ఆంధ్రప్రదేశ్) చెందుతాయని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ అక్కడి ప్రజల భాష, సంస్కృతులను సాకుగా చూపించి తమకే చెందుతాయంటూ మహారాష్ట్ర పేచీ పెట్టింది. దాంతో వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్లింది. కొద్ది నెలల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉండగా, మహారాష్ట్ర గుత్తాధిపత్యాన్ని చూపుతోంది!

ఆ 12 గ్రామాలివే..

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోళి, అంతాపూర్ గ్రామపంచాయతీల పరిధిలోని మిగిలిన 10 గ్రామాలతో కలుపుకొని మొత్తం జనాభా 3900. ఇందులో పరందోళి పంచాయతీలో 2100 మంది జనాభా ఉండగా, 1268 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే అంతాపూర్ పంచాయతీ పరిధిలో 1850 జనాభాలో 1479 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం పరందోళికి తెలంగాణ తరఫున పవార్ వామన్ రావు, మహారాష్ట్ర తరఫున లక్ష్మణ్ కాంబ్లె, అంతాపూర్ పంచాయతీకి తెలంగాణ నుంచి సూర్యవంశీ పరమేశ్వర్, మహారాష్ట్ర నుంచి జాదవ్ బాందవ్ సర్పంచ్‌లుగా ఉన్నారు. వివాదాస్పద గ్రామాలుగా గుర్తింపు పొందిన పరందోళి, అంతాపూర్ పరిధిలోకి వచ్చే ఇస్సాపూర్, కోట, పరస్వాడ, బోలాపటార్, చింతగూడ, ఇందిరానగర్, మహారాజ్‌గూడ, ముక్దాంగూడ, లెండిజాల, శంకర్‌లొద్ది గ్రామాల్లో మహారాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల తో ఇప్పటికే 15 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లను నిర్మించింది. మరో 10 కిలోమీటర్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేస్తోంది. దాంతో ఈ గ్రామాలపై తెలంగాణ హక్కులు చేజారిపోయే ముప్పు ఏర్పడింది. ఇంత జరుగుతున్నా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా యంత్రాంగానికి కానీ రాష్ట్ర ప్రభుత్వానికి గానీ కనీస అవగాహన లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.




పరందోళిలో మహారాష్ట్ర ప్రభుత్వ పాఠశాల

ప్రయోజనాలు ఇక్కడ.. మనసేమో అక్కడ..

పరందోళి, అంతాపూర్ పంచాయతీలకు 1987లోనే మహారాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1993లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడంతో తొలిసారిగా ఈ 12 గ్రామాల వివాదం తెరపైకి వచ్చింది. సరిహద్దు వివాదం నేపథ్యంలో ఈ 12 గ్రామాల భవితవ్యం తేల్చేందుకు 1989లో కేంద్రం నియమించిన కేకే నాయుడు కమిషన్ అన్ని అంశాలను అధ్యయనం చేసిన తర్వాత ఈ గ్రామాలన్నీ ఆంధ్రప్రదేశ్‌కే చెందుతాయని కేంద్రానికి నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం ప్రత్యేక జీవోతో ఈ గ్రామాలను తెలంగాణలో కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పరందోళి, అంతాపూర్‌లో ప్రజల మానసిక స్థితిని పరిశీలిస్తే తమను మహారాష్ట్రలోనే కలిపి వేయాలని ముక్తకంఠంతో చెబుతుండడం గమనార్హం. అయితే ఇందుకు కారణం.. అటవీ హక్కుల చట్టమేనని తెలుస్తోంది. ఈ చట్టంతో 12 గ్రామాలకు ఎలాంటి భూ యజమాన్య హక్కులు వచ్చే పరిస్థితి లేదని గ్రహించి మహారాష్ట్రలోనే కలపాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.



బోలాపటార్ ప్రజలతో మాట్లాడుతున్న కుమ్రం భీం జిల్లా జేసీ అశోక్‌కుమార్



పరస్వాడలో రోడ్డు నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం వేసిన కంకర

తప్పుదోవ పట్టిస్తున్నారు



పరందోళి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున అభివృద్ధి పనులు జరిగాయి. 12 గ్రామాల చిరకాల వాంఛ అయిన ఉమ్రి వాగుపై వంతెన నిర్మాణానికి కేసీఆర్ రూ.4కోట్లు ఇచ్చారు. ప్రజలంతా తెలంగాణలోనే ఉండాలని కోరుకుంటున్నా కొంతమంది తప్పుదోవ పట్టిస్తున్నారు.

- పవార్ వామన్‌రావు, సర్పంచ్(తెలంగాణ)

మేమంతా మహారాష్ట్ర వైపే..



పరందోళి, అంతాపూర్ పంచాయతీల పరిధిలోని నాలుగు వేల మందీ మహారాష్ట్రలోనే కలిపేయాలని కోరుకుంటున్నారు. తెలంగాణలో ఉంటే మా భూములకు పట్టాలు ఇచ్చే అవకాశం లేదు. అందుకే మహారాష్ట్రలో చేరాలనుకుంటున్నాం.

- కాంబ్లె లక్ష్మణ్, సర్పంచ్(మహారాష్ట్ర)

అటకెక్కిన 'సబ్సిడీ గొర్రెల' పరిశీలన!

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం పనితీరుపై సర్కారు చేపట్టిన థర్డ్‌పార్టీ పరిశీలన అటకెక్కింది. పథకం అమలులో నాణ్యత, తదితరాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా అంచనా వేసి నివేదిక ఇచ్చే బాధ్యతను సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)కు అప్పగిస్తూ డిసెంబరు 30న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, సెస్ వద్ద సరిపడా సిబ్బంది లేరన్న కారణంతో థర్డ్ పార్టీ పరిశీలనను నిలిపేయాలని తాజాగా నిర్ణయించినట్లు తెలిసింది. గొర్రెలు ఒక చోట ఉండవని, మేతకోసం గొర్రెలతో పాటు కాపరులూ సంచరిస్తుంటారని, ఈనేపథ్యంలో కచ్చితమైన పరిశీలన ఎలా జరుగుతుందని ఉన్నతాధికారి ఒకరు ప్రశ్నించారు.

42 లక్షల గొర్రెల పంపిణీ పూర్తి

రాష్ట్రంలో ఇప్పటిదాకా 2లక్షలకు పైగా గొల్ల, కురమలకు 42లక్షల గొర్రెలను పంపిణీ చేసినట్లు గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధి సమాఖ్య ఎండీ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ ఏడాది గొర్రెల పంపిణీ లక్ష్యం 3,62,445 యూనిట్లుకాగా, ఇప్పటివరకు 2,200,235 యూనిట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కామారెడ్డిలో 94.85%, జగిత్యాలలో 92.25%, కుమ్రం భీం జిల్లాలో 92.14%, గద్వాలలో 88.44%, వరంగల్ అర్బన్‌లో 86.61%, నిజామాబాద్‌లో 85.70%, మంచిర్యాలలో 83.56%, సిరిసిల్లలో 82.37%, కొత్తగూడెంలో 79.02%, భూపాలపల్లిలో 76.02%, ఆదిలాబాద్‌లో 75.20% మేర పంపిణీ పూర్తయ్యిందని వివరించారు.

12 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు!

ఖరీఫ్‌కు 7.5 లక్షలు, రబీకి 4.5 లక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయే వ్యవసాయ సీజన్‌లో 12 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను రైతులకు అందజేయనున్నారు. ఇది గత ఏడాది కంటే 2 లక్షల క్వింటాళ్లు అధికం. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. 12 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాల్లో ఖరీఫ్‌లో 7.5 లక్షల క్వింటాళ్లు, రబీలో 4.50 లక్షల క్వింటాళ్ల మేర పంపిణీ చేయనుంది. ఈ ప్రణాళికను ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది. పచ్చిరొట్ట సబ్సిడీ విత్తన ప్రణాళికను వ్యవసాయ శాఖ రెట్టింపు చేసింది. గతేడాది 45 వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాల పంపిణీకి ప్రణాళిక రూపొందించుకోగా.. వచ్చే సీజన్‌లో లక్ష క్వింటాళ్లకు ప్రణాళిక సిద్ధం చేసింది. జనుము 15 వేల నుంచి 31 వేల క్వింటాళ్లకు, పిల్లిపెసర 4 వేల నుంచి 10వేల క్వింటాళ్లకు పెంచింది. ఏటికేడు రైతులు అనాసక్తి ప్రదర్శిస్తున్న విత్తనాల ప్రణాళికనూ భారీగా పెంచడం గమనార్హం. ప్రధానంగా జొన్న పంట విత్తన ప్రణాళిక గతేడాది 5,300 క్వింటాళ్లు ఉండగా.. దాన్ని ఈ ఏడాది 13 వేల క్వింటాళ్లకు పెంచేసింది. సోయా విత్తన ప్రణాళికను గతేడాది కంటే 30 వేల క్వింటాళ్ల మేరకు పెంచేసి.. 2 లక్షల క్వింటాళ్లతో రూపొందించింది. ఖరీఫ్, రబీల్లో పంపిణీకి టెండర్ల ద్వారా సేకరించాల్సిన విత్తనాల్లో ఎక్కువశాతం పచ్చిరొట్ట, సోయాబీన్ విత్తనాలే ఉన్నాయి. అయితే, రూ.4 వేల చొప్పున పెట్టుబడి సాయంనేపథ్యంలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



తెలంగాణ పల్లెలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏచూరి, కరత్, బీవీ రాఘవులు, తమ్మినేని

కౌలు రైతులకు చట్టబద్ధ హక్కులు

- సీపీఎం రాష్ట్ర మహాసభల్లో తీర్మానం
- ముందస్తు ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం: కరత్

నల్లగొండ, ఫిబ్రవరి 5: రాష్ట్రంలోని కౌలు రైతులందరికీ చట్టపరమైన హక్కులను కల్పించడంతో పాటు గుర్తింపునివ్వాలని సీపీఎం రాష్ట్ర మహాసభలో రెండోరోజు తీర్మానం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర మహాసభల్లో సోమవారం పలు తీర్మానాలు చేశారు. కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు, ఎకరాకు రూ.4 వేలు సబ్సిడీ ఇవ్వాలన్నారు. 60 ఏళ్లు నిండిన కౌలు రైతులకు నెలకు రూ.5వేలు చెల్లించడంతో పాటు హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇస్తే పంట రుణాలు, బీమా, ప్రకృతి వైపరీత్యాల పరిహారం, ప్రభుత్వ సబ్సిడీ పథకాలు అమలవుతాయన్నారు. ప్రభుత్వ రాయితీలు అయిన విత్తన సబ్సిడీ, మైక్రో ఇరిగేషన్, ట్రాక్టర్లు, క్రిమిసంహారక మందులు చల్లే పరికరాలు భూస్వాములకే ప్రభుత్వం ఇస్తుందని, వాస్తవంగా సాగుచేసే వారికి ఇవ్వడం లేదని సీపీఎం సభలో నాయకులు ఆరోపించారు. మరోవైపు దేశంలో ముందస్తుగా జమిలి ఎన్నికలు వస్తాయంటూ ప్రధాని మోదీ ఆయన అనుచరగణం చేస్తున్న ప్రచారం రాజ్యాంగ ప్రాథమిక సూత్రానికి విరుద్ధమని, దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని సీపీఎం కేంద్ర నాయకుడు ప్రకాశ్ కరత్ అన్నారు. మహాసభల్లో భాగంగా విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ప్రధాన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఎదగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి

- భారత్‌ను అమెరికాకు దాసోహం చేస్తున్న మోదీ
- హైదరాబాద్ సభలో ఎన్నికల పొత్తులు ప్రకటిస్తాం
- తెలంగాణలో బహుజనులకు అన్యాయం
- 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఏచూరి



నల్లగొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ స్థాయిలో రాజకీయ పొత్తులు, బలహీన పడుతున్న కామ్రేడ్లు వంటి అనేక అంశాలపై సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా ఆయన ఇలా స్పందించారు.

ఆంధ్రజ్యోతి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జత కట్టాలన్న మీ నిర్ణయంపై పార్టీలో మెజారిటీ అభిప్రాయం రాకపోవడంపై మీ కామెంట్?

ఏచూరి: ఎన్నికలు, పొత్తులు అనే అంశం అంతర్గతమైంది. చర్చలు, భిన్నాభిప్రాయాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనం. ఎన్నికలు, పొత్తులు అనే అంశం ఇంకా చివరి దశకు చేరుకోలేదు. హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ సమావేశాల్లో మా రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తాం. కాంగ్రెస్‌తో కలిసి వెళ్లం అని చెప్పలేం. రాజకీయాల్లో ఎప్పుడు 2+2 =4 అని చెప్పలేం. ఎప్పుడు ఏమైనా జరగవచ్చు.

ఆంధ్రజ్యోతి: కామ్రేడ్లు పార్లమెంటరీ, వర్గపోరులోనూ వెనుకబడ్డారు, కారణాలేంటి?

ఏచూరి: సామ్రాజ్యవాద శక్తులు, రాజకీయ కుట్రల్లో ఈ ప్రభావం కనిపిస్తుంది. దీన్ని అధిగమించేందుకే 93 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఏర్పాటు చేశాం. తెలంగాణలో గడిచిన నాలుగేళ్లల్లో బహుజనులకు తీవ్ర అన్యాయం జరిగింది. వారిపై ఆర్థిక, సామాజిక దౌర్జన్యాలు జరుగుతున్నాయి. వారంతా ముందుకు రావడంతో బీఎల్ఎఫ్ ఏర్పడింది. ఈ రాష్ట్రంలో బీఎల్ఎఫ్ ఒక బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా నిలబడుతుంది.

ఆంధ్రజ్యోతి: వామపక్షాలపై మోదీ ప్రభావం తీవ్రంగా పడిందన్న వ్యాఖ్యలపై మీ అభిప్రాయం?


ఏచూరి: దేశానికి కావాల్సింది నాయకులు కాదు.. విధానాలు. ఇందిరా గాంధీ సమయంలో ప్రకటిత అత్యవసర పరిస్థితి ఉంది. ప్రస్తుతం దేశంలో మోదీ అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నారు. సీబీఐ మొదలు.. సినిమాల సెన్సార్ వరకు కాషాయీకరణ కనిపిస్తోంది. ప్రస్తుతం దేశం రెండు వర్గాలుగా విడిపోయింది. దేశంలోని 73 శాతం సంపద ఒక శాతం ప్రజానికం చేతిలోకి వెళ్లింది. తీవ్ర అంతరాలు నెలకొన్నాయి. అమెరికా, ఇజ్రాయిల్‌తో జతకట్టి భారత్‌ను అమెరికా సామ్రాజ్యవాదానికి మోదీ దాసోహం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మీరు వామపక్ష ఐక్యత అంటారు, మీతో బీఎల్ఎఫ్‌లో సీపీఐ, న్యూడెమోక్రసీ వంటి ప్రధాన పార్టీలు కలిసి రావడం లేదు కదా?

ఏచూరి: సీపీఐ రావడంలేదు అనేది ఫైనల్ కాదు. ఆ పార్టీ నేతలు ఇంకా చర్చించుకుంటున్నారు. త్వరలో నిర్ణయం వెల్లడిస్తామని నల్లగొండ రాష్ట్ర సభలోనూ మాతో చెప్పి వెళ్లారు.

ప్రజల కోసమే కొత్త పార్టీ

పేరు, గుర్తు ఖరారు కాలేదు: కోదండరాం



సిద్దిపేట, ఫిబ్రవరి 5 : అనివార్య పరిస్థితుల్లో ప్రజల కోసం కొత్త పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు టీజేఏసీ చైర్మన్ కోదండరాం తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఫోరం ఆరో వార్షికోత్సవ సభకు హాజరైన ఆయన వీపీఆర్ గార్డెన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చేందుకు పార్టీ పరంగా ఉద్యమిస్తామని చెప్పారు. వాచ్‌డాగ్‌లా ఉందామని ఇన్నాళ్లు ప్రయత్నించి, ఏమీ చేయలేకపోయామన్నారు. భవిష్యత్తులో ఎవరు గెలిచినా ఇదే పరిస్థితి పునరావృతమయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేరాలంటే అటోఇటో తేల్చుకోక తప్పని పరిస్థితి నెలకొందని తెలిపారు. కొత్త పార్టీ పేరు, గుర్తు ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేశారు. కాగా, రాష్ట్రంలో రైతు సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక వ్యవసాయ విధానాన్ని ప్రకటించి, అమలు చేయాలని కోరుతూ త్వరలో ప్రచార యాత్రలు, అవగాహన సదస్సులు, మండలాల స్థాయిలో దీక్షలు, వంటావార్పు కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు.

కోదండరాం పైసాకి పనికి రాడు: పిడమర్తి రవి

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'కేసీఆర్‌లా రాజకీయ పార్టీని స్థాపించి సీఎం అవుదామని కోదండరాం భావిస్తున్నారు. కేసీఆర్ రాజకీయ చతురతతో పోలిస్తే కోదండరాం పైసాకి పనికి రాడు'అని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం రవి విలేకరులతో మాట్లాడుతూ రైతులంతా సీఎం కేసీఆర్ వెంటే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. ఏ పార్టీలో టికెట్లు రాని వాళ్లే కోదండరాం వెంట ఉంటారని, ఆయన స్థాపించబోయే పార్టీకి దక్కేది చివరి స్థానమేనని అన్నారు. తెలంగాణ జన సమితి... జనం లేని సమితిగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు.

మేడారంలో గుడి వద్దు: సురవరం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మేడారంలో రూ.200 కోట్లతో సమ్మక్క-సారలమ్మ ఆలయాన్ని నిర్మించాలనే ఆలోచన సరికాదని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆలయం నిర్మిస్తే ఆదివాసీ గిరిజనుల సాంస్కృతిక ఉనికికే ప్రమాదమమని వ్యాఖ్యానించారు. మగ్దూంభవన్‌లో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలోని సమస్యలకు పరిష్కారం చూపగలిగే సత్తా వామపక్షాలకు ఉందని, ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు కొంత సమయం పడుతుందని తెలిపారు. దేశంలో వామపక్షాలే ప్రత్యామ్నాయమని సీతారాం ఏచూరి చేసిన వ్యాఖ్యలపై సురవరం ఈ విధంగా స్పందించారు.

ఆర్థిక దుస్థితిపై ప్రభుత్వం స్పందించాలి: రావుల

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక దుస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసరా, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాలకు నిధులు నిలిపివేయాలని ప్రభుత్వం మౌఖికంగా ఆదేశించిందని ఆరోపించారు.

50% రిజర్వేషన్ల కోసం పోరాటం: కృష్ణయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): చట్ట సభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్‌తో తెలంగాణ, ఏపీతోపాటు కర్ణాటకలోనూ భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ నెల 7న కరీంనగర్ జిల్లా మంథని, 9న పరిగి, 21న తిరుపతి, 25న విజయవాడ, 29 కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో బహిరంగ సభలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట మంగళవారం ధర్నాలు, దీక్షలు చేపడతామని వెల్లడించారు.

9న మంత్రులతో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న మంత్రులు కేటీఆర్, కడియం శ్రీహరి, జగదీశ్వర్‌రెడ్డితో రాష్ట్రంలోని ప్రైవేటు ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు భేటీ కానున్నాయని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘం తెలిపింది. ఈ సమావేశం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళలకు వడ్డీ లేని రుణాల పరిమితి పెంపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. కేసీఆర్ ప్రభుత్వం తొక్కిపెట్టిన అభయహస్తం పింఛన్లను పునరుద్ధరించడంతో పాటు అదనంగా ఒక్కో సభ్యురాలికి నెలకు రూ.1000 అందజేస్తామని వెల్లడించారు. రివాల్వింగ్ నిధుల కింద ప్రతి సంఘానికి రూ.లక్ష అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 18,600 మంది వీఓఏలకు రూ.3వేల చొప్పున వేతనం ఇస్తున్నారని, తాము అధికారంలోకి వస్తే వారి వేతనాన్ని రూ.10వేలకు పెంచుతామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళా సంఘాలకు ఇవ్వకుండా ఆపేసిన రూ.2వేల కోట్ల వడ్డీ లేని రుణాలను తక్షణమే అందజేస్తామని పేర్కొన్నారు. ప్రమాద బీమా కింద మహిళా సంఘాల సభ్యులకు రూ.2.5లక్షలు, సభ్యురాలు మరణిస్తే రూ.5లక్షలు, దహన సంస్కారాల కింద రూ.10వేలు అందిస్తామని వివరించారు. కాంగ్రెస్ అమలు చేయబోయే మేనిఫెస్టో ద్వారా రాష్ట్రంలోని 70 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. మహిళలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్.. అభయ హస్తం, వడ్డీ లేని రుణాలను అటకెక్కించిందని ధ్వజమెత్తారు. మంత్రివర్గంలోకి మహిళలను తీసుకోకుండా సీఎం కేసీఆర్ అవమానించారని మండిపడ్డారు. కేంద్రంలో నరేంద్ర మోదీ.. రాష్ట్రంలో కేసీఆర్ అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు 2019లో కాంగ్రెస్‌నే అధికారంలోకి తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ తీవ్రంగా నష్టపోతుందని తెలిసినా సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మహిళా మంత్రి లేని కేబినెట్‌ను తెలంగాణలోనే చూస్తున్నానని తెలిపారు. మహిళలు తిరగబడి టీఆర్ఎస్ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సుస్మితాదేవ్ మాట్లాడుతూ 2019లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ప్రతి ఇంటికీ ఓ ఉద్యోగం ఇస్తానని ప్రకటించిన కేసీఆర్.. నాలుగేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా రూ.30తో చీరలు ఇచ్చి మహిళలను కేసీఆర్ అవమానించారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, నాయకులు జైపాల్‌రెడ్డి, గీతారెడ్డి, డీకే అరుణ, చిన్నారెడ్డి, మధుయాష్కీగౌడ్, నేరెళ్ల శారద పాల్గొన్నారు.

నేడు ఏసీబీ ముందుకు పురుషోత్తం రెడ్డి?

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో పరారీలో ఉన్న హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి మంగళవారం అధికారుల ఎదుట హాజరవ్వనున్నట్లు తెలిసింది. 4రోజుల క్రితం ఏసీబీ అధికారులు పురుషోత్తం రెడ్డి కార్యాలయం, ఇల్లు, బంధువుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. నిందితుడు తన కుటుంబ సభ్యులతో సహా కనిపించకుండా పోయాడు. మధ్యవర్తుల ద్వారా జరిపిన సంప్రదింపుల ఫలితంగా.. మంగళవారం అతను లొంగిపోయే సూచనలున్నాయి. కాగా.. పురుషోత్తం రెడ్డికి ఆశ్రయమిచ్చిన వారిపైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు చెబుతున్నారు.

కాకతీయ కళావైభవాన్ని అడ్డుకుంటాం: కార్పొరేటర్లు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 5(వరంగల్ అర్బన్): రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బిరామిరెడ్డి మార్చి 11న వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలో నిర్వహించే కాకతీయ కళావైభవం కార్యక్రమాన్ని అడ్డుకుంటామని వరంగల్ మహానగరపాలక సంస్థ కార్పొరేటర్లు హెచ్చరించారు. సోమవారం ఖిలావరంగల్‌లో కార్పొరేటర్ దామోదర్‌యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి అడ్డుతగిలిన టి.సుబ్బిరామిరెడ్డి.. ఖిలావరంగల్‌లో ప్రోటోకాల్‌ను విస్మరించడం విచారకరమన్నారు.



సత్కరిస్తున్న రోశయ్య తదితరులు

లక్ష్మీనారాయణకు ఆర్యవైశ్య ఆణిముత్యం బిరుదు

రవీంద్రభారతి/హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ఐక్యతగా మెలగాలని తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య జాతి కోసం నిరంతరం తపించే వ్యక్తిని గౌరవించుకోవడం అభినందనీయమన్నారు. తెలంగాణ ఆర్యవైశ్య అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో అమరవాది లక్ష్మీనారాయణకు అభినందన మందార మాల, ఆర్యవైశ్య ఆణిముత్యం బిరుదు ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోశయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్య జాతి అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు.

బిట్స్‌లో విద్యార్థి ఆత్మహత్య

జవహర్‌నగర్/హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బిట్స్‌లో ఈఈఈ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాఘవ శాంతారాం(21) ఉరేసుకున్నాడు. జవహర్‌నగర్ ఎస్సై చలపతి తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని చెన్నైకి చెందిన రాఘవ ఆదివారం సాయంత్రం క్రికెట్ మ్యాచ్ ముగిసిన అనంతరం తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం వరకు గది తలుపులు తీయకపోవడంతో అతని స్నేహితులు వార్డెన్‌కు సమాచారం అందించారు. ఇతర విద్యార్థులతో కలిసి వార్డెన్ తలుపులు పగులగొట్టి చూడగా.. ఫ్యాన్‌కు రాఘవ ఉరేసుకొని ఉన్నాడు. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు.. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

స్ఫూర్తి



కలెక్టర్ గారి భార్య సాదాసీదాగా పేటకొచ్చింది. పల్లె ప్రజలతో పదం కలిపింది. పదిమంది జీవితాల్లో వెలుగులు పంచింది. అభివృద్ధిని పరుగులు పెట్టించింది. సర్పంచిగా ఆ పల్లె ముఖచిత్రాన్ని ఆసాంతం మార్చింది రితూ జైస్వాల్. సమాజసేవ ఆమెను పట్నం నుంచి పల్లె వైపు పరుగులు పెట్టించింది. ఫలితంగా 'సింఘువాహిని' గ్రామం వార్తల్లోకెక్కింది.





ఆదర్శ సర్పంచ్

ఈ కలెక్టర్‌గారి భార్య!

రితూ జైస్వాల్.. పుట్టింట్లో సుకుమారంగా పెరిగింది! కలెక్టర్ గారి భార్యగా కష్టమెరుగని జీవితం ఆమెది! ముద్దులొలికే ఇద్దరు పిల్లలతో కాలక్షేపం చేస్తూ ఇంట్లోనే కూర్చోకుండా సమాజసేవ చేయాలనుకున్నారు. బీహార్‌లోని హాజీపూర్ రితూ స్వస్థలం. చిన్న వయసు నుంచే రితూకు సమాజ సేవపై మక్కువ. రకరకాల సేవాకార్యక్రమాల్లో పాల్గొని పేదలకు సహాయం చేసేవారు. దాన్ని పెద్దయ్యాక కొనసాగించారు. అర్థశాస్త్రంలో పీజీ పట్టాతో పాటు.. భరతనాట్యం, కథక్ కూడా నేర్చుకున్నారు. 1996లో అరుణ్‌కుమార్ ఐఏఎస్‌తో ఆమెకు వివాహమైంది. వారికి ఆర్యన్, అవని ఇద్దరు పిల్లలు. ఢిల్లీలో నివాసం.

ఓ శుభకార్యానికి వెళ్లి...

కష్టనష్టాలకు వెరువక పేదల కోసం పాటుపడే రితూను కాలం తన వెంట 'సింఘువాహిని' గ్రామానికి తీసుకొచ్చింది. బీహార్‌లోని మారుమూల గ్రామం సింఘువాహిని! ఢిల్లీకి ఎంత దూరమో.. అభివృద్ధికీ అంతే దూరం. ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు బంధువుల ఇంటికి రితు ఢిల్లీ నుంచి సింఘువాహినికి వచ్చింది. రితూ ఆ గ్రామంలో అడుగుపెట్టే నాటికి పేదరికం మబ్బులా పరుచుకుంది ఆ ఊరు మీద. కరెంటు వెలుగులు లేవు. మరుగుదొడ్ల ఊసే లేదు. శుభ్రమైన తాగునీటికీ కటకటే. పిల్లలు చదవటానికి బడి లేదు. పేరుకే ఊరు.. ఒక ఊరికి ఉండాల్సిన ఏ సౌకర్యమూ లేదు. ఆ దుర్భర పరిస్థితిని చూసి రీతూ ఆలోచనలో పడ్డారు. తక్షణమే ఆ ఊరికి ఏదైనా చేయాలనుకున్నారు. ఢిల్లీలో విలాసవంతమైన జీవితాన్ని కాదని ఆ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నడుం బిగించారు.

తొలుత పిల్లల చదువులతో సేవను ప్రారంభించాలనుకున్నారు. తనే జీతం ఇచ్చి ఆ ఊళ్లోనే బీఈడీ చదివిన యువతిని బడికి టీచరుగా నియమించారు. 25 మంది అమ్మాయిలు ఆ బళ్లో చేరారు. రీతూ వీలున్నప్పుడల్లా ఢిల్లీ నుంచి ఆ గ్రామానికి వెళ్లొస్తుండేవారు. ఈలోపు సగం మంది అమ్మాయిలు పదో తరగతి పాసయ్యారు. దాంతో గ్రామస్థులకు ఆమె మీద గురి కుదిరింది. నెమ్మదిగా గ్రామస్థుల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి మార్గాలు అన్వేషించేవారు. ఆ విధంగా గ్రామస్థులతో ఆమెకు అనుబంధం ఏర్పడింది. 2016లో సర్పంచిగా పోటీ చేయమని రితూను కోరారు. గ్రామస్థులందరూ పట్టుబట్టి మరీ ఆమెను సర్పంచిగా ఎన్నుకున్నారు. రితూ 72 శాతం ఓట్లను సాధించి, తిరుగులేని ఆధిక్యంతో గెలిచారు. కలెక్టర్ భార్యగా

> "నాకు ఇద్దరు పిల్లలు. వారితో పాటు పంచాయతిలోని 9700 మంది ప్రజలూ నా పిల్లలే అనుకున్నా. దేశంలోని ప్రతి తల్లిలానే నేనూ నా పిల్లలంతా సంతోషంగా, ఆరోగ్యంగా, సామరస్యంగా జీవించాలని కోరుకున్నాను. అందుకే కొద్ది కాలంలోనే ఆశించిన విధంగా గ్రామాభివృద్ధి జరిగింది "

కాకుండా, సాదాసీదా సర్పంచిగా తన విధులను నిర్వర్తించే పనిలో పడ్డారు. గ్రామానికి తక్షణం అవసరమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అయితే ఢిల్లీలో కూర్చుంటే తనను నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేయలేనని, పూర్తి సమయం గ్రామాభివృద్ధికి వెచ్చించాలని నిర్ణయించుకున్నారు. కుటుంబసభ్యులు ఆమె నిర్ణయాన్ని ప్రోత్సహించారు. వీలున్నప్పుడల్లా తామే ఆ గ్రామం వచ్చి కొన్ని రోజులు గడుపుతామని చెప్పారు. దాంతో ఆమెలో ధైర్యం పెరిగింది. తను సాధించగలననే నమ్మకం కలిగింది. ఇక అప్పటినుంచి పూర్తిగా ఆ గ్రామాభివృద్ధికే అంకితమయ్యారు.

ఒంటరి కాదు.. వెనుకడుగు లేదు!

ఈ మొత్తం ప్రయాణంలో రితూకు అనేక



ఒడుదొడుకులు ఎదురయ్యాయి. రేషన్‌షాపుల్లో సరుకులు పక్కదారి పట్టటంతో ప్రభుత్వ అధికారులను నిలదీసి పరిష్కరించారు. గ్రామంలోని రైతు కూలీలకు హక్కుల గురించి చెప్పి చైతన్యం తేవటంతో భూస్వాముల నుంచి బెదిరింపులు వచ్చాయి. దాంతో చాలామంది గ్రామస్థులు రీతూతో "మీరు ఈ పనిచేయలేరు. మీ వల్ల కాదు, తిరిగి ఢిల్లీ వెళ్లి సుఖంగా ఉండండి" అని నచ్చజెప్పేవారు. కానీ ఆమె ఏ మాత్రం బెదరలేదు. వెనుకడుగు వేయలేదు. "నా కలను నిజం చేసి తీరతాను... నా దారిలోకి వచ్చే ఏ అడ్డంకులనైనా ఎదుర్కొంటాను" అని ఆమె స్థిరంగా వారికి బదులు చెప్పేవారు. గ్రామస్థులతో తరచూ మీటింగ్‌లు ఏర్పాటు చేసేవారు. పారిశుద్ధ్యం, గృహహింస, సేంద్రియసేద్యం లాంటి అంశాలను గురించి అవగాహన కలిగించారు. పిల్లలకే కాదు వారి తల్లిదండ్రులు చదువు చెప్పే బాధ్యతను తీసుకున్నారు. భూములు ఇవ్వటానికి గ్రామస్తులు ముందుకు రాకపోతే రితూ వారిని ఒప్పించి, స్థలం సేకరించి రోడ్డును నిర్మించారు. బహిరంగ మల విసర్జనను నివారించేందుకు అందరికీ మరుగుదొడ్లు కట్టించారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా సొంత డబ్బును సైతం ఖర్చుపెట్టారు. ఆమె కృషివల్లే తొలిసారి ఆ ఊరిపైన విద్యుత్ వెలుగులు ప్రసరించాయి. పల్లె ప్రజలు చేయి చేయి కలిపితే అభివృద్ధి అసాధ్యం కాదని రీతూ నమ్మారు. ఆ నమ్మకాన్ని నిజం చేసి చూపారు. మహారాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి 'ఆదర్శ యువ సర్పంచ్' అవార్డును అందుకున్నారు.

"నాకు ఇద్దరు పిల్లలు. వారితో పాటు పంచాయతిలోని 9700 మంది ప్రజలూ నా పిల్లలే అనుకున్నా. దేశంలోని ప్రతి తల్లిలానే నేనూ నా పిల్లలంతా సంతోషంగా, ఆరోగ్యంగా, సామరస్యంగా జీవించాలని కోరుకున్నాను. అందుకే కొద్ది కాలంలోనే ఆశించిన విధంగా గ్రామాభివృద్ధి జరిగింది " అంటారావిడ. మహాత్ముడు కలలుగన్న రామరాజ్యాన్ని తమ కళ్ల ముందు ఆవిష్కరించిన రితూకు కృతజ్ఞతగా 'సింఘువాహిని' ప్రజలంతా 'మాది రితూ రాజ్యం' అని గొప్పగా చెప్పుకుంటున్నారు.

బ్యూటీ కేర్

పెదాలు పగిలితే...

నేచురల్ ఆయిల్స్, గ్రీన్ టీ, బీట్‌రూట్ జ్యూస్, గులాబీరేకులు... ఇంట్లో దొరికే ఇవన్నీ పెదాలను పగలనీయవు. మృదువుగా ఉంచుతాయి. అదెలాగంటే...



* నేచురల్ ఆయిల్స్ అయిన కొబ్బరి నూనె, ద్రాక్షగింజల నూనె, నిమ్మ నూనె, ఆల్మండ్ ఆయిల్ వంటివి మాయిశ్చరైజర్లుగా బాగా పనిచేస్తాయి. సాధారణంగా అందరి ఇళ్లలో కొబ్బరి నూనె ఉంటుంది. కాబట్టి దాన్ని బేస్‌గా చేసుకుని, దానికి మిగతా నూనె ఏదైనా కలిపి పెదవులపై రాస్తే కొన్ని రోజుల్లోనే ఫలితం కనిపిస్తుంది.
* ఒక్కోసారి పగిలిన పెదాల నుంచి రక్తం కూడా కారుతుంది. అలాంటప్పుడు వెంటనే ఉపశమనం కలిగేందుకు తేనె, వాజిలైన్‌లను వాడాలి. ఆర్గానిక్ తేనెను మందంగా పూసి, దానిపైన వాజిలైన్‌ను పొరలా పూయాలి. పావుగంట తర్వాత పెదవులను తడి టవల్‌తో సున్నితంగా తుడవాలి.
* గులాబీరేకుల్లాంటి పెదవులు కావాలంటే గులాబీరేకులు కావాలి. పగిలిన పెదాలకు ఇవి ఉపశమనం ఇవ్వడమేగాక, వాటి రంగుని కూడా పెంచుతాయి. కొన్ని గులాబీరేకులను నీటిలో కడిగి, పాలల్లో కొన్ని గంటలు నానబెట్టాలి (పాల ఉత్పత్తులు పడకపోతే గ్లిజరిన్ వాడాలి). వాటిని పేస్టులాగా చేసి పొడి పెదాలపై రోజుకు మూడుసార్లు (రాత్రి నిద్రపోయే ముందు తప్పనిసరిగా) రాస్తే పెదాల రంగు కూడా గులాబీ రంగులోకి మారిపోతుంది.
* అలోవెరా కూడా పగిలిన పెదాలపై బాగా పనిచేస్తుంది. ఇది పెదాలపై పగుళ్లను పోగొట్టడమేగాక, పెదాలపై పొరను ధృడంగా చేస్తుంది. చలికాలంలోనే కాకుండా ఏడాది పొడవునా దీన్ని పెదాలపై వాడొచ్చు. రాత్రి నిద్రపోయే ముందు అలోవెరా ఆకును కత్తిరించి, దాని లోపలి జెల్‌ను నేరుగా పెదాలపై రాసుకోవచ్చు.



* పాల మీగడ పెదాలకు చక్కని మాయిశ్చరైజర్. మీగడను పెదాలపై రాసి పది నిమిషాలు వదిలేయాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటిలో ముంచిన దూదితో మృదువుగా శుభ్రం చేస్తే పగుళ్ల మాయమవుతాయి.
* బీట్‌రూట్ రసంలో పోషకాలు అనేకం. ఈ రసం చర్మంలోని తేమను కాపాడుతుంది. బయటకు వెళ్లేముందు తాజా బీట్‌రూట్ రసాన్ని నేరుగా పెదాలకు రాయాలి. పావుగంట తర్వాత చల్లని నీళ్లతో కడిగితే పెదవులు తాజాగా కనిపిస్తాయి.
* పెదాలపై దెబ్బతిన్న చర్మకణాలను బాగు చేయడంలో గ్రీన్ టీ బాగా పనిచేస్తుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు పెదవులను ఆరోగ్యంగా, బలంగా ఉంచుతాయి. గోరువెచ్చని నీళ్లలో గ్రీన్ టీ బ్యాగును డిప్‌చేసి దాన్ని పెదాలపై పెట్టుకోవాలి. సాధ్యమైనంత ఎక్కువసేపు ఉంచితే మంచిది.

పేరెంటచ్

ఏదో ఒక్క అంశం మీదికి...



పిల్లలకు ఆసక్తి కలిగించే విషయాలు కోకొల్లలుగా ఉంటాయి. అందుకే వేరు వేరు విషయాల మీద ఎప్పుడూ ఏదో ఒకటి అడుగుతూ ఉంటారు. తమకు తెలిసిన మేరకు ఓపిక ఉన్నంత వరకు తల్లిదండ్రులు వాటికి సమాధానం చెబుతూ ఉంటారు. నిజానికి అలా అనేక విషయాలకు సంబంధించి వివిధ సమాచారం తెలుసుకోవడం వల్ల వాళ్లకు కలిగే ప్రయోజనం చాలా తక్కువ. అలాగని వాళ్లు అడిగిన ప్రశ్నలను దాటవేయాలని గానీ, విసుక్కోవడం గానీ చేయకూడదు. చెప్పగలవన్నీ చెబుతూనే ఉండవచ్చు. కాకపోతే క్రమక్రమంగా వారి దృష్టినీ, వారి ఆసక్తిని ఏదో ఒక విషయం మీద కేంద్రీకృతం అయ్యేలా చేసేందుకు ప్రయత్నం చేయాలి.

అంతకన్నా ముందు వారి ఆసక్తి అన్నింటికన్నా ఎక్కువగా ఏ విషయం మీద ఉందో గమనించాలి. అలా ఏదైనా అనిపిస్తే ఆ రోజు నుంచి, ఆ విషయానికి సంబంధించిన పుస్తకాలు, పత్రికలు, ఆడియో, వీడియో ప్రోగ్రామ్స్, ఇలా ఆ అంశానికి సంబంధించినవేవో వాళ్లకు అందుబాటులో ఉండేలా చూడాలి. పత్రికల్లో వచ్చే ఆ రంగానికి సంబంధించిన ప్రముఖుల ఇంటర్వ్యూలు వారు చదివేలా చేయాలి. వీలైతే, ఆ ప్రముఖుల క్రియేటివ్ వర్క్స్ గురించి వాటి విశిష్టత గురించి వాళ్లకు తెలిసేలా చేయాలి. ఉదాహరణకు చరిత్రకు సంబంధించిన ఆసక్తి తమ పిల్లాడిలో ఎక్కువగా ఉన్నట్లు గమనించారనుకోండి. ప్రాచీన చరిత్ర నుంచి ఆధునిక చరిత్ర దాకా సమాచారం ఉన్న పుస్తకాలను వారికి పరిచయం చేయాలి. చిన్న చిన్న చరిత్ర పుస్తకాలు కొనివ్వాలి. దానికి సంబంధించిన టీవీ కార్యక్రమాలు కూడా వారు చూసే ఏర్పాట్లు చేయాలి. చరిత్ర అనేది కేవలం పుస్తకాలకే పరిమితం అవుతుందని కూడా కాదు కదా! మనకు కనిపిస్తున్న చిత్రకళ, శిల్పకళా సంపదలో కూడా చరిత్ర ఉంటుంది. వాటి వద్దకు పిల్లలను తీసుకు వెళ్లాలి. చారిత్రక నేపథ్యంతో రాసే నవలలు, కథలు, కావ్యాలను కూడా పరిచయం చేయాలి. ఇది వారికొక హాబీగా నిలిచిపోవచ్చు. వారు అందులో తమ సృజనాత్మకతను జోడించి ఏదో ఒక రోజున ఒక అద్భుతం చేసినా చేయవచ్చు. అందుకే ఆసక్తి అనేది ఏదో గాలిగా కాకుండా, ఒక ప్రత్యేక అంశానికి కట్టుబడి... దానికి అంకితమైపోయేలా చేయాలి. ఆ అవకాశాన్ని తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వాలి.

కిచెన్ టిప్స్

ఇలా నిల్వ చేయండి



- తాజా వెల్లుల్లిని ప్లాస్టిక్ బ్యాగుల్లో, డబ్బాల్లో నిల్వ చేయొద్దు. ఈ జాగ్రత్త తీసుకుంటే నెల రోజుల కంటే ఎక్కువ పాడు కాకుండా ఉంటాయి.
- ఉల్లిపాయల్ని పొడిగా ఉండి, వెలుతురు సోకని ప్రదేశంలో ఉంచితే వాటికి మొలకలు రావు. అలాగే ఉల్లిపాయల్ని బంగాళా దుంపలతో కలిపి నిల్వ చేయొద్దు. అలా చేస్తే బంగాళా దుంపలకి మొలకలొస్తాయి.
- క్యాబేజిని చల్లటి ప్రదేశంలో ఉంచితే కొన్ని వారాల పాటు వాడిపోకుండా నిల్వ ఉంటుంది.
- టొమాటోలు కొనేటప్పుడు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటుంది. కొన్ని పచ్చివి, కొన్ని పండువి తీసుకోవాలి. వీటిని వెలుగు పడని ప్రాంతంలో, పేపర్ టవల్ లేదా వార్తాపత్రికల్లో చుట్టిపెట్టాలి. పచ్చి టొమాటోలు పండాలంటే వాటిని చీకట్లో ఉంచాలి. పండిన టొమాటోలను రెండు రోజుల్లో వాడేయాలి. ఈ జాగ్రత్త తీసుకుంటే రెండు వారాల పాటు టొమాటోలు కొనాల్సిన అవసరం లేకుండా మేనేజ్ చేయొచ్చు.
- క్యారెట్, సెలరీలను అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టాలి. కాని చివర్లు మూసేయొద్దు. కాస్త తెరిచి ఉంచడం వల్ల తేమ బయటికి పోతుంది. లేదంటే త్వరగా పాడవుతాయి. ఇవి కొన్నిసార్లు పొడి బారినట్టు అవతాయి. అలాంటప్పుడు నీళ్లలో వేస్తే తిరిగి తాజాగా తయారవుతాయి. ఇలా చేస్తే వారం నుంచి రెండు వారాలు... ఒక్కోసారి అంతకంటే ఎక్కువ రోజులు పాడు కావు.

ప్రతిభ

'ఆకలితో బాధపడటమనేది ఒక సామాజిక సమస్య. దాన్ని సమూలంగా రూపు మాపి... ఆకలి లేని ప్రపంచాన్ని చూడాలనేది నా కోరిక'... ఇది అనితా నరహరి అంతరంగం. సాధారణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కెరీర్ మొదలుపెట్టి ఐక్యరాజ్యసమితి (యూఎన్‌ఓ)లో అధికారి వరకు ఎదిగిన అనిత ఎన్నో మైలు రాళ్లను దాటారు. యూఎన్‌ఓ నిర్వహించిన 'ఇంటర్నేషనల్ సివిల్ సర్వీసెస్' (ఐసీఎస్) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి... 'ప్రపంచ ఆహార కార్యక్రమం' (డబ్ల్యూఎఫ్‌పీ) విభాగంలో 'డిప్యూటీ చీఫ్ ఆఫ్ బిజినెస్ అండ్ ఇన్నోవేషన్' అధికారిగా ఎంపికయ్యారు. ఈ ఉన్నత పదవిని అలంకరించిన తొలి భారత వనితగా చరిత్ర సృష్టించిన 'అనిత'రసాధ్యమైన ప్రయాణం ఆమె మాటల్లోనే...

ఆమె ప్రయాణం..'అనిత'రసాధ్యం!

మా నాన్న నరహరి నారాయణ ప్రముఖ ఆర్థోపెడిక్. ప్రభుత్వ వైద్యునిగా పోలియోతో బాధపడే వేలాది మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేశారు. బాల్యం నుంచి నాన్న సేవామార్గం నన్ను బాగా ఆకర్షించింది. సామాజిక సేవలో ఎంతో ఆత్మసంతృప్తి ఉంటుందని అమ్మ చెబుతుండేది. అవే మనసులో నాటుకుపోయాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో నా ప్రాథమిక విద్య పూర్తయిన తరువాత నాన్న మా సొంతూరు కర్నూలు వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. అక్కడి మాంటిస్సోరీ పాఠశాల (1998)లో పదో తరగతి చదివాను. ఆ తరువాత ఇంటర్ నెల్లూరులో, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీతో ఇంజనీరింగ్ కర్నూలులో పూర్తిచేశాను. ఆ సమయంలో 'ఎంచుకున్న లక్ష్యంపై గురిపెట్టు. వైఫల్యాలకు కుంగిపోకుండా ముందుకు సాగు' అంటూ నా కుటుంబం నాలో స్ఫూర్తి నింపింది.

అసలుసిసలు పరీక్షలవి...

ఇంజనీరింగ్ పూర్తయ్యాక బెంగళూరు ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ తరువాత డెలాయిట్ తదితర కంపెనీల తరుపున పద్నాలుగేళ్ల పాటు అమెరికా, జర్మనీ, ఆఫ్రికా, ఇటలీ దేశాల్లో పనిచేశాను. ఐటీ రంగంలో నైపుణ్యం సంపాదించాను. ఇదే సమయం(2014)లో పత్రికల్లో వచ్చిన యూఎన్‌ఓ 'వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్' ప్రకటన ఆకర్షించింది. ఇంట్లోవారికి చెబితే భుజం తట్టారు. వెంటనే యూఎన్‌ఓ 'ఇంటర్నేషనల్ సివిల్ సర్వీసెస్'కు దరఖాస్తు చేసుకున్నాను. వివిధ స్థాయిలు, దశల్లో జరిగిన పరీక్షల్లో కేవలం ఉత్తీర్ణత సాధించడమే కాదు... ప్రథమ స్థానం దక్కించుకోగలిగాను. ప్రపంచ స్థాయిలో వివిధ దేశాల నుంచి లక్షల మంది ఈ ఉద్యోగానికి పోటీపడ్డారు. యూఎన్‌ఓ నిర్వహించిన అనేక రకాల ఇంటర్వ్యూలను మూడేళ్ల పాటూ ఎదుర్కొన్నా. రాత, మౌఖిక, పరిశీలన పరీక్షల్లో మనలోని మేధాశక్తికి అసలుసిసలు పరీక్షలవి. సేవ చేయాలన్న తపన... అనుకున్నది సాధించాలన్న పట్టుదల... సడలని సంకల్పం... అన్నింటికీ మించి అమ్మ, నాన్న, భర్త ప్రోత్సాహం... ఇవే నా విజయానికి కారణాలు. నా భర్త ఇల్లూరు హరికృష్ణ ఎల్జీ సంస్థలో 26 దేశాలకు హెడ్ ఆఫ్‌ది కార్పొరేట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. మా కుమార్తె మేథ కర్నూలులో అమ్మమ్మ, తాతయ్యల వద్ద చదువుకుంటోంది.

సూడాన్‌లో మూడేళ్లు సేవలు...

ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత తరువాత 'వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్'లో 'డిప్యూటీ చీఫ్ ఆఫ్ బిజినెస్ అండ్ ఇన్నోవేషన్' అధికారిగా జనవరి 11న నియామక పత్రాలు అందుకున్నాను. సూడాన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. డబ్ల్యూఎఫ్‌పీ ప్రతినిధిగా మూడేళ్లు అక్కడ సేవలు అందించాల్సి ఉంటుంది. ఆ దేశంలోని ఆకలి చావుల సమస్య పరిష్కారం దిశగా కృషి చేయడం నా బాధ్యతల్లో భాగం. డబ్ల్యూఎఫ్‌పీ ప్రధాన కార్యాలయం ఇటలీ రాజధాని రోమ్‌లో ఉంది.

'బయోమెట్రిక్ డేటా ప్రాజెక్టు'కు ప్రశంసలు...

నేను బెంగళూరులో పనిచేసేటప్పుడు యుద్ధాలు, సునామీలు, భూకంపాలు, దాడులతో దేశాన్ని విడిచి పోయే వలస బాధితులకు శాశ్వత ఆహార భద్రత కల్పించడానికి 'బయోమెట్రిక్ డేటా ప్రాజెక్టు' రూపొందించాను. డబ్ల్యూఎఫ్‌పీ ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు... 'బాధితులకు సేవలు ఎలా అందించగలుగుతావు' అని అడిగారు. అప్పుడు ఈ ప్రాజెక్టును ప్రజెంట్ చేశాను. ఇంటర్వ్యూలో ఇదే నన్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. బాధితుల వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులూ అందుబాటులో ఉండవు. కనుక వారి వేలి ముద్రలు, ఐరిస్ విధానంతో గుర్తింపు కార్డులను ముద్రించి, ఆయా దేశాల ప్రభుత్వాలకు అందించడం ద్వారా వారికి శాశ్వత రక్షణ, ఆవాస, ఆహార భద్రత కల్పించవచ్చని ప్రాజెక్టు ద్వారా తెలియజెప్పాను. నేను విధులు నిర్వర్తించే చోట ఈ ప్రాజెక్టును అమలు చేస్తాను.



ఫ్యామిలీతో..



సామాజిక బాధ్యత...

డబ్ల్యూఎఫ్‌పీకి ఎంపికైన తరువాత వీసాతో పనిలేని పాస్‌పోర్టును యూఎన్‌ఓ ఇచ్చింది. దీంతో ప్రపంచంలో ఏ దేశంలోనైనా పర్యటించవచ్చు. ముఖ్యంగా సునామీల వంటి ప్రకృతి వైపరీత్యాలు, భయంకరమైన కరువు కాటకాలు, యుద్ధం వంటి విపత్కర పరిస్థితులున్న దేశాలకు యూఎన్‌ఓ ప్రతినిధిగా వెళ్లవచ్చు. ఆ ప్రాంతాల్లోని వారికి ఆహార భద్రత, ఆకలి చావుల నుంచి విముక్తి కల్పించడం వంటి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆకలితో బాధపడటం ఒక సామాజిక సమస్య. దీన్ని సమూలంగా రూపుమాపాలి. ఆకలిలేని సమాజాన్ని చూడాలనేదే నా అభిలాష... లక్ష్యం.

• మందిరాజు శ్రీనివాసరాజు, కర్నూలు

ఫుడ్ పాయిజన్



"ఏం కొనేటట్టు లేదు......ఏం తినేటట్టులేదు"
అనే పాట ఒకప్పుడు పెరిగిన ధరలను ఎత్తి చూపుతున్నట్లు అనిపించేది
అదే పాటను ఇప్పుడు వింటే, ఆహార పానీయాల విషతుల్యత గురించి చెబుతున్నట్లు అనిపిస్తుంది.
కాదా మరి!
గాలి కలుషితం... నీరు కలుషితం... నూనె కలుషితం... తేనె కలుషితం... పాలు కలుషితం... పండ్లు కలుషితం!
సూర్యరశ్మీ, చంద్రకాంతీ తప్ప లోకంలో కల్తీ కాకుండా ఏదీ మిగల్లేదు.
అందుకే, ఆహారంలో ఆకుకూరలకూ, కాయగూరలకూ అధిక ప్రాధాన్యతమివ్వండని చెప్పడానికి నోరు రాదు
క్యాల్షియం కోసం గుడ్లో, పాలో తీసుకొమ్మనడానికి, ప్రొటీన్ కోసం చిక్కుడు ధాన్యాలో, ఫిష్, మటన్, చికెన్‌లో తీసుకొమ్మని చెప్పడానికి ధైర్యం రాదు.
కలుషితాల గురించి ఇలా ఏకరువు పెట్టడం అంటే, పస్తులు పడుకొమ్మని చెప్పడం కాదు.
వాటిని ఆరగించే ముందు కాసిన్ని జాగ్రత్తలు తీసుకొమ్మని చెప్పడానికే ఇదంతా...!

తిన్నది విషమైపోతే...

ఏ పార్టీకో, ఫంక్షన్‌కో వెళ్లిన వాళ్లు ఆనందంగా తిరిగి రావాలి గానీ, గుంపు గుంపే ఆసుపత్రి పాలైతే ఏమనుకోవాలి?
ఫుడ్ పాయిజనింగ్ అయితే జరిగేది ఇదే కదా! ఆసుపత్రి పాలవడమే కాదు అందులో కొందరు అసువులు బాసే అవకాశం కూడా అంతే ఉంది.

ఆహారం విషతుల్యం కావడం అంటే?

వైరస్, బ్యాక్టీరియా, పారసైట్స్ వంటివి ఆహార పానీయాల్లో చేరి క్షణాల్లో లక్షల సంఖ్యలో పెరిగిపోవడం.! ఆ సమయంలో వాటిల్లోంచి కొన్ని విషపదార్థాలు వెలువడి జీర్ణవ్యవస్థను, మొత్తం అంతర వ్యవస్థను రోగగ్రస్థం చేయడం! ఈ విషపదార్థాలు ముందు పేగుల మీద తమ ప్రభావం చూపుతాయి. ఆ పరిణామంగా, పేగుల్లోని మ్యూకస్ మెంబ్రేన్ పొర దెబ్బతిని వాటిల్లోంచి నీరు కారడం మొదలవుతుంది. పేగుల్లోని జీవక్రియలకు తోడ్పడే కదలికలు కుంటుపడతాయి. వాటిల్లో హెచ్చు తగ్గులు ఏర్పడతాయి. దీనివల్ల మనం తీసుకునే ఆహార పానీయాల సారం రక్తంలోకి వెళ్లకుండా వాంతులు, విరేచనాల ద్వారా బయటికి వెళ్లిపోవడం మొదలవుతుంది. ఆ సమయంలో సరియైన వైద్య చికిత్సలు అందకపోతే కడుపులో అల్సర్లు తయారై, విరేచనాలతో పాటు రక్తస్రావం కూడా కావచ్చు. కలుషితాహారంతో వచ్చే అమీబియాసిస్ కారణంగా కూడా కొందరికి రక్తస్రావం కావచ్చు. అయితే ఈ రక్తస్రావం చాలా స్వల్పంగా అవుతున్నప్పుడు అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదు గానీ, ఎక్కువ మోతాదులో అవుతుంటే మాత్రం వెంటనే ఆసుపత్రికి తరలించడం తప్పనిసరి.

వర్షాకాలంలో.....

ఆహారం విషతుల్యం కావడం అన్నది వర్షాకాలంలో మరీ ఎక్కువ. వర్షం వల్ల అక్కడక్కడ నిలిచిపోయిన నీళ్లల్లో సూక్ష్మక్రిములు అసంఖ్యాకంగా పెరుగుతాయి. రోడ్ల మీద మూతలు లేకుండా బాహాటంగా పెట్టి అమ్మే ఆహార పానీయాల మీద ఇవి కుప్పతెప్పలుగా వాలిపోతాయి. వాటినే మనం తినడం అంటే అది విషాహారాన్ని తినడమే.! ఆహారం విషతుల్యం కావడానికి అనేకమైన సూక్ష్మ క్రిములు కారణంగా ఉంటాయి. అంగడి పదార్థాలకు దూరంగా ఉండడం ద్వారా ఈ తరహా చాలా సమస్యల నుంచి బయటపడవచ్చు.

ఉడికించినవే ఉత్తమం!

సరిగా ఉడకని ఆహార పదార్థాల్లో వైరస్, బ్యాక్టీరియాలు అమితంగా ఉంటాయి. హెపటైటిస్- ఏ, హెపటైటిస్- బి, అమీబియాసిస్ వంటి సమస్యలు ఈ కలుషిత ఆహార పానీయాల వల్ల వచ్చేవే! కాకపోతే వీటిని రాకుండా నిరోధించే టీకాలు అందుబాటులోకి వచ్చాయి. హెపటైటిస్ - బి టీకాలు మాత్రం ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉన్నాయి. అవి కూడా త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. జాండిస్, టైఫాయిడ్, కలరా వంటి వాటిని నిరోధించడానికి కూడా ఇప్పుడు అవకాశాలు ఉన్నాయి. అమీబియాసిస్‌ను నిర్లక్ష్యం చేస్తే జిగురు విరేచనాలతో పాటు రక్తస్రావం కూడా అవుతుంది. ఇంకా నిర్లక్ష్యం చేస్తే పేగుల్లో పుండ్లు ఏర్పడటంతో పాటు కాలేయం చీము పట్టే ప్రమాదం కూడా ఉంది. అయితే, ఉడికించిన ఆహార పదార్థాలతో సుఖమేమిటంటే....ఏ రకమైన సూక్ష్మ క్రిములు ఉన్నా అవి హరించుకుపోతాయి. ఆహార పదార్థాలను అతిగా ఉడికించడం వల్ల కొన్ని పోషకాలు దెబ్బతినే మాట వాస్తవమే. అలా హాఫ్ బాయిల్డ్ అంటూ ఉడికీ ఉడకనివి తినేస్తే శరీరం వైరస్, బ్యాక్టీరియాల పాలయ్యే అవకాశాలు చాలా ఎక్కువ.

- సలాడ్ అంటే పచ్చివి తీసుకోవడం మేలు. వీటిలో విటమిన్లతో పాటు పీచుపదార్థాలు బావుంటాయి. వీటిని అలా తాజాగా తినడం బెటర్. కాకపోతే వాటిని ముక్కలుగా కోసే సమయంలో చేతులతో పాటు వాటికోసం ఉపయోగించే పాత్రలను బాగా శుభ్రపరచాలి. అయితే ఆ పండ్లు చెట్టు మీద నుంచి తెంపిన స్వల్ప కాలంలో మన వద్దకు వచ్చినవై ఉండాలి. అలా కాకుండా అప్పటికే ఐదారు గంటలు గడిచిపోయి ఉంటే, వాటిల్లో వైరస్, బ్యాక్టీరియాలు చేరిపోయే అవకాశం ఉంది.
- ఉడికించిన ఆహార పదార్థాలు కూడా అప్పటికప్పుడు వండిన వేడి పదార్థాలై ఉండాలి. అయితే, అలా అన్ని సార్లూ సాధ్యం కాదు కాబట్టి హాట్ బాక్స్‌లు లేదా హాట్ ప్యాక్‌ల్లో ఉంచినవి తీసుకోవచ్చు. అలా కాకుండా ఉదయం ఎప్పుడో వండినవి సాధారణ టిఫిన్ బాక్స్‌లో తీసుకువెళితే తినేటప్పటికి ఐదారు గంటలు అయిపోయి ఉంటాయి కాబట్టి ఆహార పదార్థాలు ఇన్‌ఫెక్షన్ల పాలయ్యే అవకాశం ఉంది.
- ఫ్రిజ్‌లలో నిల్వ చేయడం వల్ల కూడా ప్రొటీన్ల నిర్మాణం మారిపోతుంది. కార్బోహైడ్రేట్లల్లో కూడా తేడా వస్తుంది. దీనివల్ల జీర్ణక్రియ సరిగ్గా జరగక, కడుపులో ఉబ్బరం, అపానవాయువులు తయారవుతాయి. అందుకే ఒకటి రెండు రోజులకు మించి ఫ్రిజ్‌లో ఆహార పదార్థాలు ఉంచకూడదు.

ఇమ్యూనిటీ లోపాలుంటే ఇక అంతే!

ఒకే ఫంక్షన్‌కు వెళ్లిన వాళ్లల్లో కొందరు మాత్రమే ఫుడ్ ఇన్‌ఫెక్షన్, లేదా ఫుడ్ పాయిజనింగ్ సమస్యకు గురవుతారు. మిగతా వాళ్లు బాగానే ఉంటారు. ఇమ్యూనిటీ తేడాలే ఇందుకు కారణం. సాధారణంగా, ఇమ్యూనిటీ లోపాలు ఉన్నవారే ఇలా ఫుడ్ పాయిజనింగ్ సమస్యకు ఎక్కువగా గురవుతుంటారు. మిగతా వాళ్లల్లో కూడా కొంత సమస్య ఉన్నా, ఆ తర్వాత దానికదే తగ్గిపోతుంది. ముఖ్యంగా పసిపిల్లలు, వృద్ధులు లేదా గర్భిణుల్లో ఇమ్యూనిటీ కాస్త తక్కువగా ఉంటుంది కాబట్టి వీళ్లు ఈ సమస్యకు ఎక్కువగా గురవుతుంటారు. అవయవ మార్పిడి వంటి కారణాలతో ఇమ్యూనిటీని తగ్గించే మందులు వాడుతున్న వారు, కడుపులోని ఆమ్లాలను తగ్గించే మందులు వాడే వారు కూడా ఈ ఇన్‌ఫెక్షన్ల బారిన పడే అవకాశాలు ఎక్కువ. జీర్ణరసాలు సరిగా ఉత్పన్నం కాక అజీర్తి సమస్యలు ఎదుర్కొంటున్న వారు కూడా ఈ ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే అవకాశాలు ఎక్కువగానే ఉంటాయి

లక్షణాలెలా ఉంటాయి?

విషతుల్యంగా మారిన ఆహార పానీయాలు తీసుకున్నప్పుడు వికారం, వాంతులు, విరేచనాలు, జ్వరం, తలనొప్పి, ఒంటినొప్పుల వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఫుడ్‌పాయిజనింగ్ కారణమైన వాంతులు విరేచనాల వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గిపోయినప్పుడు శరీరంలో ఎలక్ట్రోలైట్స్ తగ్గిపోయి శరీరం నీరసించిపోవడం, రక్తపోటు పడిపోవడం, కిడ్నీలు దుష్ప్రభావానికి గురికావడం, గుండె సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. సకాలంలో తగిన వైద్య చికిత్సలు అందకపోతే ప్రాణాపాయ స్థితి కూడా ఏర్పడవచ్చు. ప్రత్యేకించి, పసిపిల్లల్లో, వృద్ధుల్లో ఈ సమస్యలు మరీ ఎక్కువగా కనిపిస్తాయి. ఏమైనా, వాంతులు, విరేచనాల ద్వారా శరీరంలోంచి ఎక్కువ మోతాదులో నీరు వెళ్లిపోయి డీ- హైడ్రేషన్ సమస్య తలెత్తకుండా ఓ.ఆర్.ఎస్, ఎలక్ట్రోలైట్స్ వంటివి తరుచూ ఇస్తూ ఉండాలి. ఈ ప్రయత్నాలతో వాంతులు విరేచనాలు అదుపులోకి రాకపోతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం చాలా అవసరం.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

- పాలిథిన్ కవర్లలో వేడిపదార్థాలు పోసినప్పుడు డయాక్సిన్స్ అనే హానికారక అంశాలు అందులోంచి విడుదల అవుతాయి. ఈ తరహా పదార్థాలను ఎక్కువగా వినియోగించే వారు కేన్సర్ బారిన పడే ప్రమాదం కూడా ఉంది. తాగేనీటిని ప్లాస్టిక్ బాటిల్స్‌లో నింపుకోవడం వల్ల కూడా అందులోని విష పదార్థాలు విడుదలై, శరీరానికి హాని చేసే ప్రమాదం ఉంది. ఒకసారి వాడి తీసివేసిన నూనెల్ని మళ్లీ వాడటం వల్ల కూడా శరీరానికి బాగా నష్టం జరుగుతుంది. ఏ ఆహార పానీయాలనైనా రెండవ సారి వేడిచేస్తే అది అందులోని ప్రొటీన్ల, లేదా కార్బోహైడ్రేట్ల నిర్మాణం మారిపోతుంది.
- చేతులు బాగా మురికిగా ఉన్నప్పుడు వాటికి వైరస్, బ్యాక్టీరియాలు అంటుకుని ఉంటాయి. చేతులను బాగా శుభ్రం చేసుకోకుండానే తినేస్తే అది కూడా శరీరంతో విషతుల్యమై శరీరాన్ని నష్టపరిచే అవకాశం ఉంది.
- ఫుడ్ పాయిజనింగ్ అయినట్లు తెలిసిపోగానే, శరీరం డీ- హైడ్రేషన్‌కు గురికాకుండా, తక్షణ చర్యగా ఓ.ఆర్. ఎస్ గానీ ఎలక్ట్రాల్ పౌడర్ గానీ తీసుకోవాలి. కొబ్బరి నీళ్ళైనా తీసుకోవచ్చు. ఆ తర్వాత వెంటనే హాస్పిటల్‌కు తరలించడం అవసరం.

తస్మాత్ జాగ్రత్త!


- హోటల్ ఫుడ్స్‌లో రుచిగా ఉండడం కోసం అదనంగా కొన్ని రసాయనాలు కలుపుతూ ఉంటారు. సాధారణ సోడా విషయం అలా ఉంచితే, మోనో సోడియం గ్లూటమేట్ అనే ఉప్పును వాడతారు. ఇది చాలా రుచినిస్తుంది. ఈ పదార్థాలను ఒకసారి తింటే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. అయితే వీటిని తరుచూ తినడం వల్ల నరాలకు, మొత్తం నాడీవ్యవస్థకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.
- పండ్ల మీద కూడా అవి తొందరగా మగ్గడానికి/మాగడానికి ఈథర్ అనే పదార్థాన్ని వాడుతున్నారు. దీనికి తోడు పండ్లు తొందరగా చెడిపోకుండా ఎక్కువ రోజులు నిలువ ఉండడానికి వ్యాక్స్ అనే పదార్థం కూడా వేస్తున్నారు. వాటిని బాగా శుభ్రం చేయకుండా అలాగే తింటే అవి మన కడుపులోకి వెళ్లిపోతాయి. ఇవన్నీ శరీరానికి హానికారకాలే.
- కోళ్లు తొందరగా పెరగడానికి, తొందరగా లావెక్కడానికి తరుచూ హార్మోన్ ఇంజెక్షన్ల లాంటివి ఇస్తూ ఉంటారు. దీనివల్ల చికెన్‌లో కొన్ని హార్మోన్లు ఉండిపోయి, అవి మన రక్తంలోకి వెళ్లే అవకాశం ఉంది.
- పాల ఉత్పత్తి పెరగడానికి కూడా ఆవులు గేదెలకు హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తారు. ఇవి కూడా శరీరానికి హాని చేస్తాయి.

ఆకలి రుచి ఎరుగదు అంటూ ఉంటారు. నిజమే అయితే, రుచి తెలియకపోయినా ఫరవాలేదు గానీ, అవి శుచిగా ఉన్నాయో లేదో తెలుసుకోవడం చాలా అవసరం.



- డాక్టర్ డి. విశ్వనాథ్ రెడ్డి
కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్,
యశోదా హాస్పిటల్స్, సికింద్రాబాద్

క్యాన్సర్ అవగాహన



ఒబేసిటీతోనూ... క్యాన్సర్ ముప్పు!

ధూమపానం తర్వాత నివారించగలిగిన రెండవ అతి పెద్ద క్యాన్సర్ కారకం 'ఒబేసిటీ'. కానీ ఎవరికీ ఈ విషయం గురించి అవగాహన ఉండదు. మరీ ముఖ్యంగా మన దేశంలో రెండు విపరీత పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రపంచంలో అధిక బరువులో మొదటి ఐదు స్థానాల్లో మన దేశం ఒకటి. పిల్లల ఒబేసిటీ విషయంలో కూడా చైనా తర్వాత అత్యధిక శరీర బరువు కలిగిన పిల్లలు మన దేశంలోనే ఎక్కువ. ఇక అధిక బరువు కలిగిన మహిళల్లో మన దేశం మూడవ స్థానంలో, పురుషుల్లో ఐదవ స్థానంలో ఉంది. ఇలా ఏ రకంగా తీసుకున్నా మన దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య అధిక బరువని నిస్సందేహంగా చెప్పవచ్చు. అధిక బరువు క్యాన్సర్‌కు దారి తీయటానికి కారణం, కొవ్వు వల్ల శరీరంలో సహజంగా స్రవిస్తూ, తమ పని తాము చేసుకుపోయే హార్మోన్లు గతి తప్పి పోవటమే! దాంతో క్యాన్సర్ రిస్క్ ఎక్కువవుతుంది. శరీర బరువు ఎక్కువగా ఉన్నప్పుడు ఉండే క్యాన్సర్ రిస్క్ బరువుతోపాటు పెరిగిపోతూ ఉంటుంది. అధిక బరువును బిఎమ్ఐ(బాడీ మాస్ ఇండెక్స్)తో కొలిచే విషయం అందరికీ తెలిసిందే! ఈ బిఎమ్ఐ 20 నుంచి 25కు పెరిగితే వారిలో కోలోరెక్టల్ క్యాన్సర్ (పేగుల క్యాన్సర్) అవకాశాలు 9%, రొమ్ము క్యాన్సర్ అవకాశాలు 11%, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అవకాశాలు 56% పెరుగుతాయి. ఇవే కాకుండా మూత్రపిండాలు, ప్రోస్టేట్‌లతోపాటు ఇతరత్రా ఎన్నో క్యాన్సర్లు వచ్చే అవకాశాలు పెరుగుతాయి.

ఊబకాయులందరికీ క్యాన్సర్ వస్తుందా?

క్యాన్సర్‌కు అధిక బరువు ఒక కారణం! అలాగని అధిక బరువు ఉన్న వాళ్లందరికీ క్యాన్సర్ వస్తుందని చెప్పలేం! బరువు ఎక్కువగా ఉన్నా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, చక్కని జీవనశైలి గడిపే వారికి క్యాన్సర్ రాకపోవచ్చు. అలాకాకుండా అధిక బరువు కలిగి ఉండి మద్యపానం, ధూమపానం, అస్తవ్యస్తమైన జీవనశైలి, ఆహారపుటలవాట్లు, ఎక్కువ సమయాల పాటు విశ్రాంతిలో గడిపేవాళ్లకు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ.

క్యాన్సర్ ఎవరికి?

క్యాన్సర్‌కు కారణాలు ప్రధానంగా నాలుగు. అవేంటంటే....

1. జన్యుపరమైన కారణాలు (వంశపారంపర్యంగా సంక్రమించేవి)
2. కాలుష్యం, పర్యావరణం
3. జీవనశైలి
4. ఆహారపుటలవాట్లు

పూర్వంతో పోల్చుకుంటే క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరిగాయి. ఆహారం, జీవనశైలిలో కాలక్రమేణా ఎన్నో మార్పులొచ్చాయి. వాతావరణంలో కాలుష్యం పెరిగింది. పుట్టి, పెరిగే ప్రదేశాలు మారిపోతున్నాయి. ఈ అంశాలన్నీ శరీరం మీద ప్రభావం చూపిస్తాయి. వీటికి పైన చెప్పిన కారణాలు కూడా తోడైతే క్యాన్సర్ వచ్చే అవకాశాలు మరింత పెరుగుతాయి. ఎంతటి ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపుటలవాట్లతో పెరిగినా జన్యువుల్లో క్యాన్సర్ కారకం ఉంటే వంశపారంపర్యంగా క్యాన్సర్ సంక్రమించవచ్చు. అయితే ఈ రకమైన క్యాన్సర్లు 30 నుంచి 35 ఏళ్ల లోపే బయల్పడతాయి. అయితే క్యాన్సర్ కారకాల్లో వంశపారంపర్యంగా సంక్రమించే అవకాశాలను, పర్యావరణ మార్పుల వల్ల క్యాన్సర్ సంక్రమించే అవకాశాలను నియంత్రించలేకపోయినా, ఆహారపుటలవాట్లు, జీవనశైలిని ఆరోగ్యకరంగా మార్చుకునే వీలు మన చేతుల్లోనే ఉంది.

ఆహారపుటలవాట్లు, నియమాలు, శైలి

ఎప్పటికప్పుడు వేడిగా వండుకుని తినే అలవాటు కాలక్రమేణా అంతరించింది. 30, 40 ఏళ్ల క్రితం మధ్యాహ్నం వండుకున్న కూరలు మధ్యాహ్నానికే తినేసేవాళ్లం. రాత్రికి తిరిగి వేడిగా వండుకునేవాళ్లం. అలాగే మాంసాహారమైనా! కానీ ఇప్పుడు నాన్ వెజ్ తినాలనిపిస్తే ఖరీదైన రెస్టారెంట్లకు పరిగెడుతూ ఉంటాం. అక్కడ వడ్డించే పదార్థాల్లో వాడిన కోడి మాంసం ఎప్పటిదో వండేవాళ్లకే తెలియదు. ఇలా హోటళ్లలో, రెస్టారెంట్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వీటిలో వండే ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. ఒక శీతల పానీయంలో 25 ప్యాకెట్ల చక్కెర ఉంటుంది. ఇలాంటి వాటి వల్లా శరీర బరువు పెరిగి క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి ప్రాసెస్ చేసిన మాంసం, పదార్థాలు, చక్కెరలు ఎక్కువగా తినటం, తాజా కూరగాయలు, పళ్లు తక్కువగా తినటం మొదలైన కారణాలన్నీ క్యాన్సర్ కారకాలే! ఈ అలవాట్లకు తోడు శారీరక వ్యాయామం లోపించటం వల్ల శరీర బరువు పెరిగి క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతున్నాయి.



1990 నాటితో పోలిస్తే ఇప్పటికి ప్రోస్టేట్ క్యాన్సర్లు 220% పెరిగాయి. ఢిల్లీ, ముంబయి, పుణేల్లో పురుషుల ప్రాణాలను హరిస్తున్న రెండవ సాధారణ వ్యాధి ప్రోస్టేట్ క్యాన్సర్. ఈ వ్యాధి ప్రబలటానికి కారణాలు పాశ్చాత్య దేశీయుల ఆహారపుటలవాట్లు, జీవనశైలిని అనుకరించటమే! మన దేశంలో ప్రోస్టేట్ క్యాన్సర్ వల్ల మరణించే అవకాశాలు 3 శాతం! అంటే, ప్రతి వంద మందిలో ప్రతి ముగ్గురికి ప్రోస్టేట్ క్యాన్సర్ వస్తోంది. 65 ఏళ్లు దాటిన వారి మరణాలకు కారణాల్లో ఎక్కువగా ప్రోస్టేట్ క్యాన్సరే ఉంటోంది. మరీ ముఖ్యంగా ఒబేసిటీ వల్ల వచ్చే క్యాన్సర్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రధానంగా ఉంటోంది. నడుము చుట్టుకొలత వంద సెంటీమీటర్లు దాటినవాళ్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు 56 శాతం పెరుగుతాయి. కాబట్టి ఇప్పటికైనా మన అలవాట్లను మార్చుకుని, ఆరోగ్యకరమైన జీవనశైలిన అలవరుచుకోకపోతే, ప్రపంచ దేశాలతో పోలిస్తే, మన దేశం గుండె జబ్బుల్లో ప్రథమ స్థానానికి చేరుకున్నట్టే, ప్రోస్టేట్ క్యాన్సర్ విషయంలో కూడా మొదటి స్థానానికి చేరుకోవటం ఖాయం!

చికిత్స తక్షణమే!

క్యాన్సర్‌ను ఎంత త్వరగా గుర్తించి, ఎంత త్వరగా చికిత్స మొదలు పెడితే నివారణ అంత సులవవుతుంది. ప్రోస్టేట్ క్యాన్సర్ విషయంలో లక్షణాలు తొలి దశలోనే కనిపిస్తాయి. మూత్ర విసర్జన ఇబ్బందిగా ఉండటం, రాత్రివేళల్లో ఎక్కువ సార్లు మూత్ర విసర్జన చేయవలసి రావడం, మూత్రం ఆగి ఆగి రావటం...ప్రోస్టేట్ క్యాన్సర్ లక్షణాలు. ఈ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేకుండా వైద్యుల్ని సంప్రదిస్తే రక్త పరీక్షతోనే క్యాన్సర్‌ను గుర్తించి, వెంటనే చికిత్స మొదలు పెట్టవచ్చు. ఈ చికిత్సలో వాడే డావిన్సీ రోబోటిక్ సర్జరీ సహాయంతో మెరుగైన ఫలితాన్ని పొందవచ్చు. ప్రోస్టేట్ క్యాన్సర్ చికిత్సలో ఉండే దుష్ప్రభావం మూత్రం లీకేజీ! రోబోటిక్ సర్జరీ వల్ల ఈ దుష్ప్రభావాలు తక్కువ. అలాగే ఈ క్యాన్సర్ తొలి దశలో గుర్తిస్తే రేడియో థెరపీతోనే నయం చేయొచ్చు.



డాక్టర్ సంజయ్ ఎడ్ల
కన్సల్టెంట్ యూరో ఆంకాలజిస్ట్,
రోబోటిక్ సర్జన్,
అపోలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్.

నివారణ మన చేతుల్లోనే!

అధిక బరువుతో సంబంధం ఉండే క్యాన్సర్లకు గురి కాకుండా ఉండాలంటే తీసుకునే ఆహారం పట్ల అప్రమత్తంగా ఉండాలి. దురలవాట్లను వదిలేసి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలి. ఇందుకోసం...

- ఏడాదికి ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకుంటూ క్యాన్సర్‌ను ముందుగానే కనిపెడుతూ ఉండాలి.
- తాజా కూరగాయలు, పళ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెరలు తగ్గించాలి.
- శీతల పానీయాలు మానేయాలి.
- ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- వంశపారంపర్యంగా క్యాన్సర్ సంక్రమించే అవకాశాలున్నవాళ్లు మరింత అప్రమత్తంగా ఉండాలి.
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.
- ఏ అనారోగ్య లక్షణమైనా మూడు వారాలకు మించి తగ్గకపోతే క్యాన్సర్ అయి ఉండొచ్చు. కాబట్టి ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.
- ఎంత త్వరగా క్యాన్సర్‌ను గుర్తిస్తే, చికిత్స, చికిత్సకయ్యే ఖర్చు అంత త్వరగా, తక్కువగా ఉంటుంది. నివారణ అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి.

తక్షణ చికిత్సతో నివారణ వేగవంతం!

క్యాన్సర్‌ను గుర్తించి వైద్యులను కలిసేటప్పటికే రోగుల్లో వ్యాధి శరీరమంతా వ్యాపించి ఉంటోంది. ఇలా చివరి దశలో వచ్చినప్పుడు సర్జరీ, కీమోథెరపీ, రేడియో థెరపీ ఈ మూడు చికిత్సలూ అవసరమవుతాయి. ఇలా కాకుండా ఎలాంటి అనారోగ్య లక్షణమైనా మూడు వారాలకు మించి తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించటం అలవాటు చేసుకోవాలి. ఇలా పరీక్షల్లో క్యాన్సర్ అని తెలితే అప్పటికి తొలి దశలోనే ఉంటుంది కాబట్టి చికిత్స కూడా సులువవుతుంది.

ప్రకృతి వేదం

ఎసిడిటీ పోవాలంటే...

ఆవురావురుమంటూ ఆకలి। కనబడిందల్లా తినేయాలన్న కసి। కానీ, తినాలంటే భయం।

ఎందుకంటే... తినీ తినగానే కడుపు ఉబ్బరం, తేన్పులు, కడుపంతా గుడగుడలు। వాటన్నిటినీ తలుచుకుంటే ఎందుకులే తినడం అనిపిస్తుంది. అలాగని పస్తులు ఉండిపోలేరు కదా! అందుకే తినా లేక, ఆగనూ లేక నానా అవస్థలూ పడుతుంటారు ఎసిడిటీ వ్యాధిగ్రస్థులు. ఎందుకిలా అవుతుంది? యాంటాసిడ్ మాత్రలు ఎన్నాళ్లని వేసుకోవాలి? ఏం వేసుకున్నా శాశ్వతంగా పోతుందన్న భరోసా ఏవీ ఇవ్వడం లేదు ఎందుకని?



***

ఆహారం జీర్ణం కావడానికి సహజంగా మన దేహంలో తయారయ్యే యాసిడ్స్, ఎంజైమ్స్ ఈ రెండూ ముఖ్యమే. కాకపోతే, ఈ రెండూ జీర్ణప్రక్రియకు కావలసిన నిష్పత్తిలో ఉండాలి. అలా లేనప్పుడు యాసిడ్ అధికమవుతుంది. ఈ స్థితిలో జీర్ణాశయంలోని ఆమ్ల ప్రభావాన్ని తటస్థం చేయడానికి యాంటాసిడ్ ఔషధాలు వాడటం సర్వసాధారణం. యాంటాసిడ్ ఔషధాలు క్షార (ఆల్కలీన్) ద్రవ్యాలు కాబట్టి అవి జీర్ణాశయంలో మోతాదును మించిన ఆమ్లాన్ని విరిచి, సమస్యను పరిష్కరిస్తాయని చాలా మంది నమ్మకం. అందుకే యాసిడ్స్‌ను విరిచేసి ఎంజైమ్స్‌ని సమతూకంలో ఉంచగలవని, యాంటాసిడ్ ఔషధాలు వాడటానికి చాలా మంది సంసిద్ధమవుతారు. జీర్ణవ్యవస్థలో యాసిడ్ అధిక మోతాదులో ఉండటానికి గల కారణాలను నిర్ధారించకుండా, యాసిడ్‌ను విరిచే క్షార ద్రవ్యాలను ప్రతిరోజూ అలా దీర్ఘకాలికంగా వాడుతూ ఉంటారు. రసాయనికంగా ఇలా యాసిడ్‌ను విరచడం వల్ల దేహం యాసిడ్‌ను అధికంగా ఉత్పత్తి చేసి, జీర్ణవ్యవస్థలోకి విడుదల చేయవచ్చు. కాకపోతే ఈ విధానం వల్ల సమస్య మళ్లీ మొదటికి వస్తుంది.

- యాంటాసిడ్‌గా వాడే రెండవ ముఖ్యమైన పదార్థం సోడియం బైకార్బొనేట్. ఇది వంటకాల్లో వాడే సోడా ఉప్పు. దీన్ని దీర్ఘకాలికంగా వాడితే, దేహంలో యాసిడ్ ఉత్పత్తి, విడుదల ప్రక్రియలను అతలాకుతలం చేస్తుంది. మూత్ర పిండ వ్యాధులతో బాధపడే వారిలో ఇది కిడ్నీ స్టోన్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. వైద్యపరంగా ఉప్పు తక్కువ తినవలసిన అవసరం ఉన్నవారికి, అల్సర్లు, లివర్ సమస్యలు ఉన్నవారికి పరిస్థితిని ఇంకా విషమించేట్లు చేస్తుంది.
- మెగ్నీషియం సాల్ట్స్, అల్యూమినియం సాల్ట్స్ అనేవి ఎసిడిటీకి విరుగుడుగా వాడే మూడవ రకం రసాయనాలు. ఇవి కూడా మూత్రపిండాలను కుంటుపరిచేవే! వీటివల్ల ఎముకల్లోని క్యాల్షియం క్షీణించవచ్చు. మెదడు తినవచ్చు. నిజానికి యాంటాసిడ్ ఔషధాలను వ్యాధి తీవ్రతను తగ్గించడానికి తప్ప వాడకూడదు. ఎసిడిటీని ఇవి ఎప్పుడూ శాశ్వతంగా నయం చేయలేవు.

మూలికా ఔషధాలు

జీర్ణాశయంలోనికి యాసిడ్ మితిమీరి వచ్చి చేరినా, ఆ యాసిడ్‌ను సమతూకంలో ఉంచగలిగినంత మోతాదులో ఎంజైమ్స్ జీర్ణవ్యవస్థలోకి విడుదల కాకపోయినా ఎసిడిటీ మొదలవుతుందనేది స్పష్టం. ఈ రెండు సందర్భాల్లోనూ ఎంజైమ్స్ ఉత్పత్తినీ, విడుదలనూ అధికం చేయగలిగితే కొంత ప్రయోజనం ఉంటుంది. జీర్ణ ప్రక్రియకు తప్పనిసరైన ఎంజైమ్స్‌ను ఉత్పత్తి చేసి, జీర్ణవ్యవస్థకు విడుదల చేసే గ్రంధుల్లో ప్యాంక్రియాస్ ప్రధానమైనది. ఇది పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, వృక్ష సంబంధమైన పీచుపదార్థాలు, మాంసకృత్తులు, పంచదార జీర్ణం కావడానికి అవసరమైన పలురకాల హార్మోన్లను ఉత్పత్తి చేసి జీర్ణవాహికకు ...

వైద్య చికిత్సలు

ఆమ్లమూ, ఎంజైమ్స్ సరైన నిష్పత్తిలో జీర్ణవాహికకు అంద...



మానసిక ఆరోగ్యం

మనసుకు తీసుకోకూడదు!

యాదృచ్ఛికంగా జరిగే కొన్ని సంఘటనలు, కొందరి ప్రవర్తనలను మనసుకు తీసుకుంటాం. నొచ్చుకుంటాం. బాధపడి నిరాశకు లోనవుతాం. కానీ ఇది సరైనది కాదు. వాటిని వ్యక్తిగతంగా తీసుకోకూడదు. ఎందుకంటే....

తెలుసుకోండి: ఇతరుల దురుసుతనాన్ని చూసి బాధపడటం వ్యర్థం. ఎదుటి వ్యక్తి దురుసుతనం, వాళ్ల వ్యక్తిగత సమస్యలకు ప్రతిబింబం.

మిమ్మల్ని మీరు అడగండి: ఎదుటివాళ్లు చేసిన కామెంట్, వారి ప్రవర్తనలకు అర్థం ఏమై ఉంటుందో తార్కికంగా ఆలోచించండి. ఒకవేళ ఎవరైనా మీరు ఎదురుపడ్డప్పుడు పలకరింపుగా నవ్వకపోయినా, పలకరించకపోయినా అది మిమ్మల్ని అవమానించినట్టు భావించటం మానేయండి. బహుశా మిమ్మల్ని పలకరించటానికి వాళ్లకు సిగ్గు అడ్డు వచ్చిందేమో!

విమర్శలు స్వీకరించండి: విమర్శలు మంచివే! వాటిలో నిజాయతీ ఉంటే మిమ్మల్ని మీరు తరచి చూసుకోండి. వాటి నుంచి ఏం నేర్చుకోవాలో తెలుసుకోండి. ఒకవేళ అవి అనవసరమైనవైతే పట్టించుకోవటం మానేయండి.

గ్రహించండి: అందరినీ అన్ని వేళలా ఒప్పించటం సాధ్యం కాని పని అనే నిజాన్ని గ్రహించండి.



గృహ వైద్యం

కీళ్లకు 'అల్యూమినియం ఫాయిల్'

అల్యూమినియం ఫాయిల్‌ను వంటలకే కాదు, వైద్యానికీ ఉపయోగించవచ్చు. రష్యా, చైనా వైద్యులు కొన్ని వైద్య చికిత్సలకు దీన్ని వాడేవాళ్లు. ఈ ఫాయిల్‌తో జలుబు మొదలుకొని నిద్రలేమి వరకూ గృహ వైద్యం చేయొచ్చన్నది వారి అనుభవం! ఇది అర్థ్రయిటిస్, సయాటికా, గౌట్, చీలమండల నొప్పులను కూడా తగ్గిస్తుంది. ఎముకల నొప్పులు తగ్గాలంటే, నొప్పిగా ఉన్న ప్రదేశాన్ని అల్యూమినియం ఫాయిల్‌తో చుట్టి, పైన బ్యాండేజీ కట్టాలి. ఇలా ప్రతి రాత్రీ వరుసగా 10 నుంచి 12 రోజులపాటు చేయాలి. తర్వాత రెండు వారాల విరామం ఇవ్వాలి. ఇలా చేస్తే కీళ్ల నొప్పులు తగ్గుముఖం పడతాయి. ఒకవేళ అప్పటికీ తగ్గకపోతే మళ్లీ మరో 10, 12 రోజులపాటు ఫాయిల్‌తో పట్టు వేయాలి.



డైలీ సుడోకు - 98

4				1			2	
	7		4	6				
	8				5		7	1
			7	2		6		
5								3
		9		5	4			
3	2		1				8	
				3	6		9	
	1			7				2

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.


నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-97 సమాధానం

దగ్గు మందు ఇవ్వొచ్చా?






స్ఫూర్తి

మోడల్ కాదు...రోల్ మోడల్!






సెక్సువల్ హెల్త్

ఒత్తిడితో సెక్స్‌లో తృప్తి లేదా?





ఈ సినిమా నాకు అగ్ని పరీక్షే!


మంచు విష్ణు

"తెరపై రెండు గంటలు కనిపించి ప్రేక్షకుల చేత మంచి నటుడు అన్పించుకోవడం కన్నా... పది లేదా ఇరవై నిమిషాలున్నా చాలు. అతని నటనతో తెరపై ప్రభావం తీసుకొస్తే... మంచి నటుడు అంటారనే నమ్మకం నాలో ఉంది. ఆ నమ్మకంతోనే చేశా. నటుడిగా ఈ చిత్రం నాకొక అగ్నిపరీక్ష" అన్నారు మంచు విష్ణు. మోహన్‌బాబు హీరోగా, విలన్‌గా నటించిన తాజా చిత్రం 'గాయత్రి'లో విష్ణు కీలక పాత్ర చేశారు. మదన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రజ్యోతితో విష్ణు ప్రత్యేకంగా ముచ్చటించారు.

- తండ్రి, కూతురు మధ్య రిలేషన్‌షిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. కూతురు నుంచి తండ్రి ఎలా విడిపోయాడు? మళ్లీ కూతురు దగ్గరకు ఎలా చేరుకున్నాడు? ఈ మధ్యలో ఏం జరిగిందనేది చిత్రకథ. తెరపై డ్రామాను స్ట్రాంగ్‌గా తీసే దర్శకులలో మదన్ ఒకరు. తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధాలను, భావోద్వేగాలను చాలా అద్భుతంగా చూపించారు.
- అప్పటివరకూ జరిగిన కథకు, తర్వాత జరగబోయే కథకు చాలా కీలకమైన ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో నేను వస్తా. ఇరవై నిమిషాలు ఉంటుందేమో! స్టేజ్ ఆర్టిస్ట్‌గా కనిపిస్తా. డాడీ చేసిన శివాజీ పాత్ర యంగ్ వెర్షన్ నేను చేశా. డాడీ చేయవలసిన పాత్ర ఇది. కథ వినగానే నేనే చేస్తానని చెప్పా. డాడీ 'బాగుంటుందా?' అనడిగారు. 'బాగుంటుంది. కన్విక్షన్‌తో వెళ్దాం' అన్నాను. ఆయన 'సరే' అన్నారు. ప్రేక్షకులు నేను కామెడీ, ఫైట్స్ చేయడం చూశారు. ఇందులో సెటిల్డ్‌గా, అమ్మాయిని ప్రేమించే పాత్ర చేశా. నాకు జోడీగా శ్రియ నటించింది. మీరు చెప్పేవరకూ 'గేమ్'లో ఆమెతో నటించిన విషయం నాకు గుర్తు లేదు.
- డాడీ పాత్ర చేయడం రిస్కేమో? అనడుగుతున్నారు. నేను ఆ రిస్క్, ఆ ఛాలెంజ్ తీసుకున్నా. జీవితంలో ఏ రిస్కూ తీసుకోకపోవడమే అతి పెద్ద రిస్క్. ఏ రోజయితే నేనొక స్టార్‌ని, హీరోని అనే ఈగోలో పడతానో... ఆ రోజు నాలోని నటుడు చస్తాడు. మన దేశంలో సూపర్‌స్టార్లు ఐదు, పది నిమిషాల పాత్రలు చేశారు. ఈ పాత్రలో ప్రేక్షకుల హృదయాలను తాకితే నటుడిగా విజయం సాధించాననుకుంటా.
- డాడీ ఈ చిత్రానికి కష్టపడినంత... నేను నా మొదటి చిత్రానికి కూడా పడలేదు. స్క్రీన్‌ప్లే కూడా ఆయనే రాశారు. 'ఇంత గొప్ప స్థాయికి వచ్చిన తర్వాత డాడీ మీకు ఎందుకింత కష్టం! రిలాక్స్ అవ్వండి' అని చాలాసార్లు చెప్పా. సినిమాపై ప్రేమ ఉన్నవాళ్లు మనం ఏం చెప్పినా వినరు. ప్రతిరోజూ ఆయన దగ్గరనుంచి ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటూనే ఉంటా" అన్నారు.

"మా అబ్బాయి చాలా బాగున్నాడు. పాలు తాగడం, నిద్రపోవడం... రెండే పనులు చేస్తున్నాడు. (నవ్వుతూ...) మూడో పని చేయడం లేదు. 'ఓటర్' తప్ప మిగతా సినిమా చిత్రీకరణలను పూర్తి చేశా. వీలైనంత ఎక్కువ సమయం వాడితో గడుపుతున్నా. మా అమ్మాయిలకూ వాడితో ఫుల్ టైమ్‌పాస్. అరియానా, వివియానాలకు తమ్ముడు అంటే ప్రాణం. నేను నటించిన 'ఆచారి అమెరికా యాత్ర' వాళ్లిద్దరు చూశారు. 'డాడీ... యూ ఆర్ సో ఫన్నీ' అన్నారు. వాళ్లకు ఆ చిత్రం బాగా నచ్చింది. ఈ చిత్రం ఇంకా చూడలేదు".

ప్రేమికులరోజున నితిన్ సందడి


నితిన్

నితిన్ హీరోగా పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ఠ్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా ఓ సినిమా రూపొందిస్తున్నాయి. మేఘా ఆకాశ్ కథానాయిక. త్రివిక్రమ్ కథ అందించారు. కృష్ణచైతన్య దర్శకుడు. నిఖితారెడ్డి సమర్పణలో సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తికావొచ్చింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రమిది. సరదాగా సాగుతుంది. ఇటీవల హైదరాబాద్, ఊటీ, అమెరికాలో చిత్రీకరణ చేశాం" అని తెలిపారు. "ఈ నెల 12న ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను, ప్రేమికులరోజున టీజర్‌ను విడుదల చేసి, ఏప్రిల్ 5న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని నిర్మాత సుధాకర్ రెడ్డి చెప్పారు. నరేశ్, లిజీ. రోహిణి హట్టంగడి, ప్రభాస్ శ్రీను, ప్రగతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నటరాజ సుబ్రమణియన్, సంగీతం: తమన్, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్.


'నా పేరు సూర్య'లో అనూ ఇమ్మాన్యూయేల్, అల్లు అర్జున్

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ


ఓవియా, తరుణ్

తరుణ్, ఓవియా జంటగా నటించిన చిత్రం 'ఇది నా లవ్ స్టోరీ'. రమేష్ గోపి దర్శకుడు. ఎస్.వి.ప్రకాష్ నిర్మాత. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తరుణ్ మాట్లాడుతూ "మంచి ఫీల్‌గుడ్ లవ్ స్టోరీ ఇది. చాలాకాలం తర్వాత ఇలాంటి కథ కుదిరింది" అని చెప్పారు. కుటుంబ సభ్యులంతా కలిసి చూసే ప్రేమకథ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు.


పూజా హెగ్డే

జిల్ జిల్ రాణీ...
చిట్టిబాబుతో చిందేద్దామని!

రామ్‌చరణ్

పూజా హగ్డే హొయలు చూస్తే హంస, నడుము చూస్తే నెలవంక గుర్తొస్తాయని కుర్రకారు చెబితే నిజమే అనుకోవాలి! 'దువ్వాడ జగన్నాథమ్ డీజే'లోని పాటల్లో అంతలా డ్యాన్సులు చేశారామె. ఇప్పుడు ఇంకొకసారి కుర్రకారు గుండెలు జివ్వుమనేలా... కళ్లు జిల్ జిల్ మనేలా... జోరుగా, హుషారుగా చిట్టిబాబుతో చిందేయడానికి సిద్ధమయ్యారు. రామ్‌చరణ్ చిట్టిబాబుగా నటిస్తున్న చిత్రం 'రంగస్థలం'. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీస్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, మోహన్ చెరుకూరి (సీవీఎమ్) నిర్మిస్తున్న ఈ చిత్రంలో పూజ ప్రత్యేక గీతం చేస్తున్న సంగతి తెలిసిందే. 'జిల్ జిల్ రాణీ...' పల్లవితో మొదలయ్యే ఈ పాట చిత్రీకరణ సోమవారం హైదరాబాద్‌లోని ప్రముఖ స్టూడియోలో ప్రారంభమైంది. ఈ పాట కోసం ప్రత్యేకంగా పాడుబడిన బంగ్లా సెట్ వేశారు. ఐదు రోజుల పాటు చిత్రీకరించనున్న ఈ పాటకు జానీ మాస్టర్ నృత్యరీతులను సమకూరుస్తున్నారు. ఈ పాటతో సినిమా చిత్రీకరణ అంతా పూర్తవుతుంది. నిర్మాణానంతర కార్యక్రమాలు త్వరగా పూర్తి చేసి మార్చి 30న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సమంత కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ఆ ఇద్దరి స్టైల్ తేజ్‌లో ఉంది
- వి.వి.వినాయక్


సాయిధరమ్ తేజ్, వినాయక్, లావణ్య త్రిపాఠి


"పూర్తిస్థాయి రాజకీయాల్లోకి వెళ్లాక సినిమాలు మానేస్తానని ఇటీవల పవన్‌కల్యాణ్ చెప్పారు. మెగా అభిమానుల తరుపున ఆయనకు నాదొక విన్నపం. 'కల్యాణ్‌గారు.. రాజకీయంగా ఎంత ఎదిగినా, ప్రజా సమస్యలపై ఎంత పోరాడినా.. సమయం దొరికినప్పుడల్లా అభిమానుల కోసం సినిమాలు చెయ్యమని కోరుతున్నాం" అని వి.వి.వినాయక్ అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఇంటెలిజెంట్' చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం రాజమండ్రిలో జరిగింది. సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా నటించిన చిత్రమిది. సి.కళ్యాణ్ నిర్మాత. ఈ నెల 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ "తేజుతో 'చమకు చమకు' సాంగ్ షూట్ చేసినప్పుడు చిరంజీవిగారితో చేసినట్లే అనిపించింది. రెండు, మూడు సన్నివేశాల్లో తేజు పవన్ కల్యాణ్‌లా కనపడేలా తీశా.. చిరంజీవిగారు, పవన్‌కల్యాణ్ కలిస్తే ఎలా ఉంటుందో తేజు స్టైల్ కూడా అలాగే ఉంటుంది. వారిద్దరిలా తేజు స్టార్ కావాలి. మా సినిమాతోపాటు విడుదలవుతున్న 'తొలిప్రేమ', 'గాయత్రి' సినిమాలు పెద్ద హిట్ అవ్వాలి" అని అన్నారు. తేజ్ మాట్లాడుతూ "చిరంజీవిగారి కమ్‌బ్యాక్ ఫిల్మ్ డైరెక్ట్ చేసిన వినాయక్‌గారు నాతో సినిమా చెయ్యడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులకు, అభిమానులకు గుర్తుండి పోయే సినిమా అవుతుంది. మా మావయ్యలే నాకు గురువులు. చిరంజీవిగారు స్థాపించిన సామ్రాజ్యంలో జెండా రెపరెపలను నా గుండె చప్పుడుగా భావించి కష్టపడుతుంటాను. నా ఇంటి హీరోలు నాకు పంచభూతాలతో సమానం. ఒకేరోజు ఇద్దరు మెగా హీరోల సినిమాలు హిట్ కొడితే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఆ కిక్‌ను మిస్‌కాను" అని అన్నారు. "చిరంజీవిగారి 'చమక్కు చమక్కు' సాంగ్ ఎంత పెద్ద హిట్టో తెలిసిందే. 'ఇంటిలిజెంట్'లో ఆ పాటను రీమేక్ చేశాం. పాటలు చూస్తుంటే చిరంజీవిగారి సాంగ్స్ చూస్తునట్లు అనిపిస్తుంది. మా గురువు దాసరిగారి తర్వాత కారు దిగుతుంటే పులిలా కనిపించే గంభీరం మళ్లీ వినాయక్‌లోనే కనిపిస్తోంది. లోపల ఎంత టెన్షన్ ఉన్నా నవ్వుతూ పలకరిస్తుంటాడు" అని సి.కల్యాణ్ చెప్పారు. "తేజ్‌ను చూస్తుంటే చిరంజీవిగారే గుర్తుకు వస్తున్నారు. మామకు తగ్గ అల్లుడుగా సాయిధరమ్ నిరూపించుకుంటున్నాడు. మామను మించిన అల్లుడు అని కూడా అనిపించుకోవాలి" అని మురళీమోహన్ చెప్పారు.

రూ.3,210 వరకు పెరిగిన ఐఫోన్ల ధర

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ సుంకాన్ని ప్రభుత్వం పెంచిన కొన్ని రోజుల వ్యవధిలోనే యాపిల్ తన ఐఫోన్ల ధరలను పెంచింది. మోడల్‌ను బట్టి ఐఫోన్ల ధరల పెరుగుదల 3,210 రూపాయల వరకు ఉంది. యాపిల్ వాచ్ ధరలు 2,510 రూపాయల వరకు పెరిగినట్టు యాపిల్ వెబ్‌సైట్‌లోని తాజా ధరల ఆధారంగా తెలుస్తోంది. 256 జిబి వెర్షన్ ఐఫోన్ ఎక్స్ ధర 3,210 రూపాయలు పెరిగి 1,08,930 రూపాయలకు చేరింది. 32 జిబి ఐఫోన్ 6 ధర 1,120 రూపాయలు (3.6 శాతం) పెరగడంతో దీని ధర 31,900 రూపాయలకు చేరుకుంది. ఒక్క ఐఫోన్ ఎస్ఇ (ఇది దేశీయంగా తయారవుతోంది) మినహా మిగతా ఫోన్ల ధరలన్నీ పెరిగాయి. 32 జిబి వెర్షన్ ఐఫోన్ ఎస్ఇ ధర 26,000 రూపాయలు, 128 జిబి ధర 35,000 రూపాయలుగా ఉంది.

మినహాయింపులు పోతేనే
25 శాతం కార్పొరేట్ టాక్స్
ఉన్నపళంగా మినహాయింపులు తొలగించలేం: అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ : కంపెనీలపై కార్పొరేట్ టాక్స్ భారాన్ని ఇప్పటికిప్పుడు 25 శాతానికి కుదించడం కుదరని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. వివిధ రూపాల్లో కంపెనీలకు ఇస్తున్న అన్ని రకాల మినహాయింపులు పోయే వరకు ఇది కుదిరే పని కాదన్నారు. బడ్జెట్‌పై ఫిక్కి నిర్వహించిన ఒక సదస్సులో జైట్లీ ఈ విషయం స్పష్టం చేశారు. మినహాయింపులను కూడా పరిగణనలోకి తీసుకుంటే పెద్ద కంపెనీలపైనా ప్రస్తుతం 22 శాతానికి మించి కార్పొరేట్ పన్ను భారం లేదన్నారు. మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో జైట్లీ రూ.250 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న కంపెనీలపై కార్పొరేట్ టాక్స్ భారాన్ని 30 శాతం నుంచి 25 శాతానికి కుదించారు. అయినా ఇంకా 7,000 కంపెనీలు 30 శాతం టాక్స్ శ్లాబులో ఉన్నాయి. మాపైనా పన్ను పోటు తగ్గించాలని ఈ కంపెనీల నుంచి విజ్ఞప్తులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో జైట్లీ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. వచ్చే ఆర్థిక సంవత్సం ద్రవ్య లోటును జిడిపిలో 3.3 శాతం దగ్గర కట్టడి చేయడం సాధ్యమేనని జైట్లీ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2017-18) 11 నెలల జిఎస్‌టి వసూళ్ల మాత్రమే చేతికి అందే అవకాశం ఉందన్నారు. ఖర్చులు మాత్రం 12 నెలల కాలానికి ఉంటాయన్నారు. ఈ కారణం వలనే 2017-18లో ద్రవ్య లోటు జిడిపిలో నిర్ణీత 3.2 శాతాన్ని మించి 3.5 శాతానికి చేరుకుంటుందని చెప్పారు.



పెట్రోల్‌పై జిఎస్‌టికి రాష్ట్రాలే అడ్డు

పెట్రోల్, డీజిల్‌వంటి పెట్రో ఉత్పత్తులను జిఎస్‌టి పరిధిలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాలే అడ్డు అని జైట్లీ చెప్పారు. పెద్ద మొత్తంలో పన్ను ఆదాయం తెచ్చిపెట్టే వీటిపై పన్నులు విధించే అధికారాన్ని వదులుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతమైతే సుముఖంగా లేవన్నారు. అయితే జిఎస్‌టి రాబడులు పెరిగే కొద్దీ రాష్ట్రాలు దీనిపై తమ వైఖరి మార్చుకునే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిఎస్‌టిలో చేరిస్తే పన్నుల భారం తగ్గి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయని వినియోగదారులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. జైట్లీ తాజా ప్రకటనతో ఇప్పట్లో ఇది సాధ్యం కాదని భావిస్తున్నారు. మద్య, రియల్టీ వ్యాపారాలను కూడా పూర్తిగా జిఎస్‌టి పరిధిలోకి తేవాలనే డిమాండ్ వినిపిస్తోంది.

వేగంగా ప్రభుత్వ సేవలు

భారత్ సహా దక్షిణాసియా దేశాల్లో అభివృద్ధిని మరింత పరుగులు తీయించాలంటే ప్రభుత్వ సేవల్లో వేగం, ప్రభుత్వ కొనుగోళ్లలో నిష్పక్షపాతం అవసరమని అరుణ్ జైట్లీ అన్నారు. ప్రభుత్వ కొనుగోళ్లలో ఎంపిక చేసిన కొద్ది మందికే ప్రాధాన్యత ఇస్తే అవినీతి, బంధుప్రీతి, అక్రమాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ కొనుగోళ్లు నిష్పక్షపాతంగా జరిగితే పారదర్శకత కూడా ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడా లేనంత వేగంగా ఆర్థికాభివృద్ధి దక్షిణాసియాలో చోటు చేసుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో ముందు ముందు ఈ ప్రాంతంలో ప్రభుత్వ సేవలను మరింత వేగంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోళ్లకు సగటున వారం రోజుల సమయం పడుతోందని, దీన్ని మరింత తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు.

ముచ్చటగా మూడో 'సారీ'!

- ఎక్కడి రేట్లను అక్కడే ఉంచే అవకాశం
- నేడు, రేపు ఆర్‌బిఐ ద్రవ్య పరపతి సమీక్ష

న్యూఢిల్లీ: ఈ వారంలో జరగనున్న ఆరో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్‌బిఐ కీలక వడ్డీ(రెపో) రేట్లను యథాతథంగానే కొనసాగించవచ్చని బ్యాంకర్లు, విశ్లేషకులు భావిస్తున్నారు. గత రెండు సమీక్షల్లోనూ సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు సెగలు కక్కుతుండటంతో ద్రవ్యోల్బణం ఇప్పటికే ఆందోళనకర స్థాయికి పెరిగింది. ఇందుకుతోడు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పంట దిగుబడిపై చెల్లించే కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి) ఒకటిన్నర రెట్లకు పెంచడం ధరాఘాతం తీవ్రతరమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆర్‌బిఐ వడ్డీరేట్లను పెంచకుంటే చాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 6, 7 (మంగళ, బుధవారం) తేదీల్లో ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో కూడిన ద్రవ్యపరపతి విధాన కమిటీ (ఎంపిసి) భేటీ కానుంది. బుధవారం మధ్యాహ్నం ఆర్‌బిఐ సమీక్ష నిర్ణయాలను ప్రకటించనుంది.

చివరిసారి ఆగస్టులో కోత

ద్రవ్యోల్బణం మరింత పెరగవచ్చన్న ఆందోళనతో డిసెంబరులో నిర్వహించిన సమీక్షలో ఆర్‌బిఐ వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. పైగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు అంచనాను 6.7 శాతానికి కుదించింది. ఆగస్టు 2017లో నిర్వహించిన సమీక్షలో మాత్రం రెపోరేటును 0.25 శాతం తగ్గించింది. దాంతో రెపో రేటు ఆరేళ్ల కనిష్ఠస్థాయి 6 శాతానికి జారుకుంది.

2018-19 ద్వితీయార్థంలో 7 శాతానికి వృద్ధి

వచ్చే ఆర్థిక సంవత్సరం(2018-19) రెండో అర్ధభాగంలో వృద్ధిరేటు 7 శాతానికి పడిపోవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా-మెరిల్‌లించ్ (బొఫా-ఎంఎల్) తాజా నివేదిక అంచనా వేసింది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు ప్రభావాలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగం(ఏప్రిల్-సెప్టెంబర్ 2017)లో వృద్ధిరేటు కనిష్ఠ స్థాయికి పడిపోయింది. కాబట్టి, లో బేస్ ఎఫెక్ట్ ప్రభావంతో ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం (ఏప్రిల్-సెప్టెంబర్ 2018)లో వృద్ధిరేటు గరిష్ఠ స్థాయిలో(7.5 శాతం) నమోదుకావచ్చని బొఫా-ఎంఎల్ అభిప్రాయపడింది.

ఆర్‌బిఐపై తగ్గిన ఒత్తిడి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఆర్థిక వ్యవస్థ కాస్త పుంజుకుంది. కాబట్టి వృద్ధికి ఊతమిచ్చేలా వడ్డీ రేట్లలో కోతపెట్టే విషయంలోనూ ఆర్‌బిఐపై ఒత్తిడి కాస్త తగ్గిందనే చెప్పుకోవాలి. ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతున్న నేపథ్యంలో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు మరికొద్ది కాలంపాటు ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించకపోవచ్చని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ సంకేతాలిచ్చారు.

ఆందోళనకర స్థాయికి ధరల సూచీ

ఆహారోత్పత్తుల రేట్లు భగ్గుమనడంతో గత ఏడాది డిసెంబరులో రిటైల్ ధరల ద్రవ్యోల్బణం 5.21 శాతానికి ఎగబాకింది. అంతక్రితం నెలలో సూచీ 4.88 శాతంగా నమోదైంది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4శాతానికి కాస్త అటు, ఇటు(+/-2 శాతం)గా ఉండేలా చూడాలని ఆర్‌బిఐకి కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించింది.

ద్రవ్యలోటు కట్టు తప్పే ప్రమాదం
పొంచి ఉన్న చమురు సెగ : గోల్డ్‌మన్ శాచ్

న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) భారత ద్రవ్య లోటు కట్టు దాటే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ గోల్డ్‌మన్ శాచ్ హెచ్చరించింది. ఈ కాలానికి ద్రవ్య లోటు జిడిపిలో 3.3 శాతంగా ఉండే అవకాశం ఉందని ఆర్థిక మంత్రి జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే ఆర్థిక వ్యవస్థ వేగంగా గాడిలో పడితేనే ఇది సాధ్యమవుతుందని గోల్డ్‌మన్ శాచ్ సోమవారం విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది. లేకపోతే మాత్రం 2018-19 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు జిడిపిలో 3.5 శాతానికి చేరే అవకాశం ఉందని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం పన్నులు, పన్నేతర ఆదాయం తగ్గినా ప్రభుత్వ ఖర్చులు తగ్గే అవకాశమూ లేదని అంచనా వేసింది. ఎన్నికల సంవత్సరం కావడమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. ముడి చమురు ధర పెరుగుదలే భారత ఆర్థిక వ్యవస్థకు పొంచి ఉన్న ప్రధాన ముప్పు అని అంచనా వేసింది.

వచ్చే ఆర్థిక సంవత్సరం అంతా పీపా చమురు ధర 60-65 డాలర్ల మధ్య ఉండొచ్చనే అంచనాతో ఆర్థిక మంత్రి జైట్లీ బడ్జెట్‌ను రూపొందించిన విషయాన్ని గుర్తు చేసింది. పీపా చమురు ధర ఇప్పటికే 70 డాలర్లకు ఎగబాకింది. పీపా చమురు ధర 10 డాలర్లు పెరిగితే భారత ద్రవ్యలోటు జిడిపిలో 0.3 శాతం పెరిగే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాచ్ అంచనా.

ఇబ్బంది ఉండకపోవచ్చు

ద్రవ్య లోటు కొద్దిగా పెరిగినా దేశ ఆర్థిక వ్యవస్థపై పెద్దగా ప్రభావం ఉండదని అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ మూడీస్ పేర్కొంది. అభివృద్ధి, ద్రవ్య జాగ్రత్తలు పాటిస్తూ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను రూపొందించారని ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విలియం ఫోస్టర్ చెప్పారు. పరపతి రేటింగ్ పెంచుకునేందుకు జిడిపిలో అప్పుల భారాన్ని 40 శాతానికి తగ్గించాలనే మధ్యకాలిక లక్ష్యానికి అనుగుణంగానే జైట్లీ బడ్జెట్ ఉందన్నారు. మొత్తం మీద వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో జైట్లీ పేర్కొన్న ద్రవ్య లోటు సాధించగలిగే స్థాయిలోనే ఉందని తెలిపారు.

సెన్సెక్స్ పతనానికి ఎల్‌టిసిజి పన్ను కారణం కాదు..
ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ప్రతికూల పరిణామాల నేపథ్యంలోనే స్టాక్ సూచీలు భారీగా పతనమయ్యాయని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా అన్నారు. అంతేతప్ప బడ్జెట్‌లో ఈక్విటీలపై ప్రతిపాదించిన దీర్ఘకాల మూలధన లాభాల (ఎల్‌టిసిజి) పన్ను కారణం కాదని ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ఈ నెల 1న బడ్జెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటివరకు జరిగిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1208 పాయింట్లు, నిఫ్టీ 361 పాయింట్లు క్షీణించాయి.

అన్‌లిస్టెడ్ షేర్లతో పోలిస్తే సగం పన్నే..

కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడాది తర్వాత విక్రయించే షేర్లపై ఆర్జించిన లాభం రూ.లక్షకు మించితే 10 శాతం ఎల్‌టిసిజి విధించనున్నట్లు బడ్జెట్‌లో జైట్లీ ప్రకటించారు. అయితే, స్థిరాస్తులు, అన్ లిస్టెడ్ కంపనీలకు చెందిన షేర్లపై విధించే 20 శాతం దీర్ఘకాల మూలధన లాభాల పన్నుతో పోలిస్తే సగమేనని అధియా అన్నారు. "దురదృష్టమేమిటంటే, అంతర్జాతీయ మార్కెట్లు నేలచూపులు చూస్తున్న తరుణంలో ఈ నిర్ణయం ప్రకటించాల్సి వచ్చింది" అని ఆయన పేర్కొన్నారు. గత వారంలో చివరి రెండు సెషన్లలో అన్ని దేశాల ఈక్విటీ మార్కెట్ల సూచీ ఎంఎస్‌సిఐ 3.4 శాతం క్షీణించిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా ఇండియన్ స్టాక్ సూచీలు కూడా భారీ నష్టాలను చవిచూశాయన్నారు.



జిఎస్‌టి చెల్లింపుదారుల సంఖ్య పెంచేందుకే ఆదాయ త్యాగం

జిఎస్‌టి అమలుపై అధియా స్పందిస్తూ.. భవిష్యత్‌లో పన్ను చెల్లించేవారి సంఖ్య పెరుగుతుందనే నమ్మకంతో తొలినాళ్లలో కొంత ఆదాయాన్ని త్యాగం చేసినట్లు చెప్పారు. ఈ ప్రక్రియలో సంఘటిత రంగ వ్యాపారాలు గణనీయంగా ప్రయోజనం పొందాయని, కంపెనీల పద్దులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని అధియా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒకేరమైన పరోక్ష పన్నుల విధానాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్రం గత ఏడాది జూలై 1 నుంచి జిఎస్‌టిని అమల్లోకి తెచ్చింది.

పన్ను చెల్లింపుల్లో అసమానతలు

వేతన జీవులు, వ్యాపారుల పన్ను చెల్లింపుల్లో భారీ అసమానతలున్నాయని అధియా అన్నారు. ఐటీ రిటర్నులు దాఖలు చేసే 7 లక్షల కంపెనీల్లో సగం సున్నా ఆదాయం లేదా నష్టాలను ప్రకటిస్తున్నాయన్నారు. వ్యాపారుల కంటే వేతన జీవులే అధిక పన్నులు చెల్లిస్తున్నారని ఆయన తెలిపారు. ఫూల్‌ప్రూఫ్ టెక్నాలజీ సిస్టమ్ ద్వారా పలు విభాగాల పన్ను చెల్లింపుల మధ్య ఉన్న అసమానతలను తొలిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో దేశంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. భారత్‌ను పన్ను చట్టాలకు లోబడే సమాజంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోందన్నారు.

ఏప్రిల్ 1 నుంచి ఎల్‌టిసిజి

బడ్జెట్‌లో ప్రతిపాదించిన దీర్ఘకాల మూలధన లాభాల (ఎల్‌టిసిజి) పన్ను .. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి విక్రయించే ఈక్విటీలపైన మాత్రమే వర్తిస్తుందని కేంద్రం స్పష్టతనిచ్చింది. ఐటి చట్టం సెక్షన్ 10లోని క్లాజ్ (38) ప్రకారంగా గతంలో కల్పించిన ఎల్‌టిసిజి మినహాయింపు ఈ నెల 1 నుంచి మార్చి 31 వరకు విక్రయించే షేర్లకూ లభిస్తుందని తాజాగా విడుదల చేసిన సందేహాలు, సమాధానాల పత్రంలో వివరించింది. అంటే ఈ ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత నుంచి ఈక్విటీల విక్రయం ద్వారా ఆర్జించిన లాభం రూ.లక్షకు మించితేనే 10 శాతం ఎల్‌టిసిజి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాదు, కొనుగోలు చేసిన తేదీ నాటి నుంచి ఏడాది తర్వాత విక్రయించే షేర్లపైనే ఈ పన్ను వర్తిస్తుంది. ఏడాది లోపలే విక్రయిస్తే గనుక స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను కింద 15 శాతం చెల్లించాల్సి ఉంటుంది.

ఎల్‌టిసిజి పన్నుపై విడుదల చేసిన వివరణ పత్రంలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- షేర్ల విక్రయం ద్వారా ఆర్జించిన సొమ్ములో నుంచి వాటి కొనుగోలుకైన ఖర్చును మినహాయించాకే ఎల్‌టిసిజి పన్నును లెక్కగట్టడం జరుగుతుందని కేంద్రం స్పష్టం చేసింది.
- జనవరి 31 వరకు ఆర్జించిన లాభాన్ని పరిగణనలోకి తీసుకోవడం జరగదని, ఆ తర్వాత నుంచి వచ్చిన లాభంపైనే ఎల్‌టిసిజి పన్ను వర్తిస్తుందని బడ్జెట్ ప్రసంగంలోనే జైట్లీ ప్రకటించారు. ఉదాహరణకు గత ఏడాది జనవరిలో కొనుగోలు చేసిన షేర్లను ఈ ఏప్రిల్ 1న విక్రయించారనుకుందాం. మీ లావాదేవీ ఎల్‌టిసిజి పన్ను పరిధిలోకి వచ్చినప్పటికీ.. ఈ ఏడాది జనవరి చివరివరకు వచ్చిన లాభాన్ని పరిగణనలోకి తీసుకోరు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 మధ్యలో ఆర్జించిన లాభంపైనే ఎల్‌టిసిజి పన్నుని లెక్కిస్తారు.
- షేర్లను కొనుగోలు చేసిననాటి విలువతో పోలిస్తే ఈ జనవరి 31న నమోదైన ఫెయిర్ మార్కెట్ వాల్యూ ఎక్కువగా ఉన్నప్పుడు ఫెయిర్ మార్కెట్ వాల్యూనే కొనుగోలు ధరగా పరిగణించడం జరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

లాభాల్లోకి ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్

NACL Industries Limited
(formerly known as 'Nagarjuna Agrichem Limited')
ISO 9001:2015, ISO 14001:2015, OHSAS 18001:2007 Certified Company

Q3 ఫలితాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ 191.97 కోట్ల రూపాయల మొత్తం రాబడులపై 1.37 కోట్ల రూపాయల నికర లాభాన్ని సాధించింది. 2016-17 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ 181.95 కోట్ల రూపాయల మొత్తం రాబడులపై 25 లక్షల రూపాయల నికర నష్టాలను నమోదు చేసింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను 666.32 కోట్ల రూపాయల మొత్తం రాబడులపై 10.36 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించినట్లు ఎన్ఎసిఎల్ తెలిపింది. కాగా 300 కోట్ల రూపాయల మేర నిధులను సమీకరించేందుకు గాను వాటాదారుల నుంచి అనుమతి లభించిందని పేర్కొంది.

ఆశించిన స్థాయిలో రుతుపవనాలు ఉండటంతో దేశీయ, ఎగుమతి మార్కెట్లలో వృద్ధిని సాధించినట్లు తెలిపింది. సోమవారం బిఎస్ఇలో కంపెనీ షేరు 8.12 శాతం నష్టంతో 46.95 రూపాయల వద్ద స్థిరపడింది.

11 రెట్లు పెరిగిన టాటా మోటార్స్ లాభం

టాటా మోటార్స్ గ్రూప్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏకంగా పదకొండు రెట్లు పెరిగి 1,215 కోట్ల రూపాయలుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 111.60 కోట్ల రూపాయలుగా ఉంది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రాబడులు కూడా 16.1 శాతం వృద్ధి చెంది 74.156 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. కాగా స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన టాటా మోటార్స్ ఇండియా 16,102 కోట్ల రూపాయల రాబడులపై 183.65 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది.

2016-17 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ 1,052.13 కోట్ల రూపాయల నికర నష్టాలను ప్రకటించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 295.30 కోట్ల రూపాయల నికర నష్టాలను నమోదు చేసింది. బ్రిటిష్ ఆటోమొబైల్ దిగ్గజం జెఎల్ఆర్ రాబడులు 4.3 శాతం పెరిగి 630 కోట్ల పౌండ్లకు చేరుకోవటం కలిసి వచ్చిందని టాటా మోటార్స్ తెలిపింది. ఇదే సమయంలో 8.5 కోట్ల డాలర్ల ఇన్సూరెన్స్ రికవరీ రావటం కూడా కలిసి వచ్చిందని పేర్కొంది. జెఎల్ఆర్ నిర్వహణా మార్జిన్లు కూడా 160 బేసిస్ పాయింట్లు పెరిగి 10.9 శాతానికి చేరుకోవటం లాభదాయకత పెరిగేందుకు దోహదపడిందని తెలిపింది. కాగా టాటా మోటార్స్ ప్యాసింజర్, కమర్షియల్ వాహన వ్యాపారం ఏకంగా 57.8 శాతం వృద్ధి చెంది 16,101.60 కోట్ల రూపాయలకు చేరుకుందని తెలిపింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో బిఎస్ఇలో టాటా మోటార్స్ షేరు 3.12 శాతం లాభంతో 396.05 రూపాయల వద్ద స్థిరపడింది.

మరింత పెరిగిన ఐఎఫ్‌సిఐ నష్టాలు

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఐఎఫ్‌సిఐ లిమిటెడ్ 176.87 కోట్ల రూపాయల నికర నష్టాలను ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర నష్టాలు 45.17 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రాబడులు 635.55 కోట్ల రూపాయల నుంచి 655.53 కోట్ల రూపాయలకు పెరిగాయి. మొండి పద్దులతో ఫైనాన్షియల్ రంగం పూర్తిగా ఒత్తిడి లోనవుతుండటంతో నష్టాలు మరింతగా పెరిగాయని ఐఎఫ్‌సిఐ తెలిపింది. మౌలిక సదుపాయాలు, ఇనుము, ఉక్కు రంగాల్లో మొండి పద్దులు గణనీయంగా పెరిగిపోయాయని పేర్కొంది. ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటంతో సోమవారం బిఎస్ఇలో కంపెనీ షేరు 2.17 శాతం నష్టంతో 24.80 రూపాయల వద్ద క్లోజైంది.

కోల్గేట్ లాభం రూ.170 కోట్లు

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కోల్గేట్ పామోలివ్ 1,026.90 కోట్ల రూపాయల మొత్తం రాబడులపై 170.60 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాదితో పోల్చితే కంపెనీ నికర లాభం 34 శాతం వృద్ధి చెందింది. జిఎస్‌టి అమలు గాడిలో పడటంతో నిర్వహణాపరంగా మెరుగైన ఫలితాలను రాబట్టుకోగలిగినట్లు కోల్గేట్ తెలిపింది. కాగా కంపెనీ టూత్‌పేస్ట్, టూత్‌బ్రష్ కేటగిరీలో మార్కెట్ వాటాను 45.1 శాతం నుంచి 53.7 శాతానికి పెంచుకోవటమే కాకుండా అగ్రస్థానాన్ని కొనసాగిస్తోందని కంపెనీ పేర్కొంది

మైఖేల్ హాల్‌కు జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును స్విట్జర్లాండ్‌కు చెందిన మైఖేల్ ఎన్ హాల్ గెలుచుకున్నారని బయోఏషియా ప్రకటించింది. ఈ నెల 22 న తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్వహించనున్న బయోఏషియా సదస్సులో స్విట్జర్లాండ్‌లోని బయోజెన్ట్రమ్ యూనివర్సిటీ ఆఫ్ బాసెల్‌లో ప్రొఫెసర్ అయిన మైఖేల్ ఎన్ హాల్‌కు ఈ అవార్డును అందజేయనున్నారు. న్యూట్రియెంట్ యాక్టివేటెడ్ టిఒఆర్ (టార్గెట్ ఆఫ్ రామమైసిన్) పోషకాల డిస్కవరీ, కీలకమైన మెటబాలిక్ నియంత్రణలో కణాల (సెల్) వృద్ధిలో చేసిన విశేష కృషికి గుర్తింపుగా 2018 సంవత్సరానికి గాను జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును ప్రకటించినట్లు బయోఏషియా తెలిపింది.

ఆర్కిడ్ ఫార్మా రేసులో స్ట్రైడ్స్, నెక్టార్

Orchid Pharma Ltd.
(Formerly known as Orchid Chemicals & Pharmaceuticals Limited)

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆర్కిడ్ ఫార్మాను కొనుగోలు చేసేందుకు స్ట్రైడ్స్ షాసూన్, నెక్టార్ లైఫ్ సైన్సెస్ సహ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్ సన్నాహాలు చేస్తున్నాయి. తొలుత ఆర్కిడ్ ఫార్మాను చేజిక్కించుకునేందుకు అరబిందో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ప్రయత్నాలు చేసి ఆ తర్వాత రేసు నుంచి తప్పుకున్నాయి. ఆర్కిడ్ కొనుగోలుకు మొత్తం ఆరు ఫార్మా కంపెనీలు, నాలుగు ఫైనాన్షియల్ సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. చెన్నై కేంద్రంగా వైద్య కళాశాలను నిర్వహిస్తున్న రామచంద్ర గ్రూప్ సహా ముంబైకి చెందిన మెలోడి హెల్త్ కేర్, హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బయోన్ ఫార్మా, ఎడల్‌వీస్ ఆల్టర్నేటివ్ అసెట్ అడ్వైజర్స్, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలైన జెఎం ఫైనాన్షియల్ ఎఆర్‌సి, ఫినిక్స్ ఎఆర్‌సి..ఆర్కిడ్ ఫార్మా కొనుగోలుకు ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ) దాఖలు చేసిన వాటిలో ఉన్నాయి.

సుమారు 3,500 కోట్ల రూపాయల క్లెయిమ్స్‌ను చెల్లించలేకపోవటంతో ఆర్కిడ్ ఫార్మా కొంత కాలంగా సంక్షోభంలోకి కూరుకుపోయింది. దీంతో సంస్థకు రుణాలిచ్చిన లక్ష్మీవిలాస్ బ్యాంక్ (ఎల్‌విబి) గత ఏడాది ద్వితీయార్థంలో బ్యాంకర్‌ప్టసీ కోర్టును ఆశ్రయించింది. కంపెనీ కొనుగోలుకు సంబంధించి మొత్తం 25 ఆసక్తి వ్యక్తీకరణలు రాగా 10 కంపెనీలు మాత్రమే ఫీజులు చెల్లించి, సాధారణ రిజొల్యూషన్ ప్రణాళికను సమర్పించాయి.

అయితే ఆర్కిడ్ ఫార్మా వాల్యూయేషన్ అధికంగా ఉండటంతోనే పలు కంపెనీలు రేసు నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆర్కిడ్ ఫార్మా రెండు యుఎస్ ఎఫ్‌డిఎ ఆమోదం పొందిన ప్లాంట్లను నిర్వహిస్తోంది. యాంటీబయాటిక్స్‌కు సంబంధించి యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఎపిఐ)ను పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తోంది.

ఎస్సెల్ ఇన్‌ఫ్రా సోలార్ వ్యాపారంపై గ్రీన్‌కో గ్రూప్ దృష్టి

హైదరాబాద్ : సుభాష్ చంద్రాకు చెందిన ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సోలార్ వ్యాపారాన్ని సొంతం చేసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో గ్రూప్ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ కంపెనీతోపాటు హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ కూడా ఎస్సెల్ సోలార్ వ్యాపారాన్ని హస్తగతం చేసుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. గ్రీన్‌కో, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ తమ సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకునే సన్నాహాల్లో ఉన్నాయి. ఇందులో భాగంగానే ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సోలార్ వ్యాపారంపై దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. ఎస్సెల్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్‌కు 685 మెగావాట్ల సోలార్ విద్యుత్ సామర్థ్యం ఉంది. ఇందులో 165 మెగావాట్ల ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయి. 520 మెగావాట్ల ప్రాజెక్టులు ఉత్తరప్రదేశ్, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల్లో నిర్మాణ దశలో ఉన్నాయి. గ్రీన్‌కో గ్రూప్ సోలార్, పవన, జల విద్యుదుత్పత్తి రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. సోలార్, పవన విద్యుత్ టారిఫ్‌లు తగ్గినప్పటికీ తక్కువ వడ్డీ రేట్లకే రుణ సదుపాయం లభిస్తుండటం, పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నందు వల్ల ఈ రంగంలోని కంపెనీలు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టిసారిస్తున్నాయని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,270	31,000	---	31,050	30,410
క్రితం ముగింపు	31,620	31,000	31,500	31,050	30,640
22 క్యారెట్లు	28,950	28,800	---	28,800	28,960
క్రితం ముగింపు	29,280	28,800	28,980	28,800	29,180
వెండి (కిలో)	39,600	40,000	---	40,700	41,500
క్రితం ముగింపు	40,500	40,800	40,400	40,700	42,500

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	66.00	విజయవాడ	71.00
కరీంనగర్	68.00	గుంటూరు	71.00
వరంగల్	68.00	ఒంగోలు	73.00
మహబూబ్‌నగర్	66.00	చిత్తూరు	60.00
కర్నూలు	66.00	నెల్లూరు	67.00
విశాఖపట్నం	67.00	అనంతపురం	64.00
గోదావరి	70.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.40 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	360.00	చిత్తూరు	373.00
వరంగల్	362.00	చెన్నై	380.00
విజయవాడ	350.00	నమక్కల్	365.00
గోదావరి	350.00	బెంగళూరు	370.00
విశాఖపట్నం	355.00	ముంబై	405.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.37	67.68
పౌండ్	82.44	95.62
యూరో	72.73	84.34
ఆస్ట్రేలియా డాలర్	46.29	53.55
బహ్రెయిన్ దినార్	158.08	181.15
కువైట్ దినార్	176.98	220.32
ఒమని రియాల్	154.80	177.11
సౌదీ రియాల్	15.52	18.40
సింగపూర్ డాలర్	44.32	52.50
యుఎఇ దిరమ్	15.89	18.57

టీవీఎస్ నుంచి 125సిసి స్కూటర్

ధర రూ.58,750



» ఎన్‌టార్క్ పేరుతో విడుదల

చెన్నై : టీవీఎస్ మోటార్ 125 సిసి స్కూటర్ సెగ్మెంట్‌లోకి ప్రవేశించింది. ఇందులో భాగంగా ఎన్‌టార్క్ పేరుతో స్కూటర్‌ను విడుదల చేసింది. దీని ధర 58,750 రూపాయలు (ఎక్స్‌షోరూమ్, న్యూఢిల్లీ). ఇప్పటికే కంపెనీ స్కూటీ పెప్, టీవీఎస్ జుపిటర్, వీగోలను విక్రయిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో దేశీయ స్కూటర్ కేటగిరీలో 17.4 శాతం వార్షిక సగటు వృద్ధి నమోదయింది. ఈ విభాగంలో వృద్ధికి మరింతగా అవకాశాలున్నాయి. 18-24 ఏళ్ల మధ్య వయసున్న యువతను లక్ష్యంగా చేసుకుని ఎన్‌టార్క్‌ను తెచ్చినట్టు టీవీఎస్ మోటార్ ప్రెసిడెంట్, సిఇఒ, కెఎన్ రాధాకృష్ణన్ తెలిపారు. ఈ ఏడాదిలో రెండులక్షలకు పైగా ఈ స్కూటర్లను విక్రయించాలన్న లక్ష్యంతో ఉన్నట్లు ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. విదేశీ మార్కెట్లకు కూడా దీన్ని ఎగుమతి చేస్తామని చెప్పారు. దేశీయ స్కూటర్ మార్కెట్లో టీవీఎస్ వాటా 17 శాతంగా ఉందని, పరిశ్రమకన్నా మెరుగైన వృద్ధిని నమోదు చేసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.

భారతి టెలికాంలో సింగ్‌టెల్ రూ.2,649 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ : భారతి టెలికాంలో సింగపూర్‌కు చెందిన టెలికాం సంస్థ సింగ్‌టెల్ 2,649 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనుంది. దీంతో భారతి టెలికాంలో సింగ్‌టెల్ వాటా 1.7 శాతం పెరిగి 48.9 శాతానికి చేరుకోనుంది. సింగ్‌టెల్ పెట్టుబడి మేరకు ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపు మార్చినాటికి ముగిసే అవకాశం ఉంది. భారతి టెలికాంలో 85,450,000 ఈక్విటీ షేర్లను ఒక్కోటి 310 రూపాయల చొప్పున సింగ్‌టెల్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు కేటాయిస్తారు. దీంతో భారతి టెలికాంలో సింగ్‌టెల్ వాటా విలువ 2,650 కోట్ల రూపాయలకు చేరుతుంది. సింగ్‌టెల్ ద్వారా వచ్చే పెట్టుబడిని రుణాన్ని తగ్గించుకోవడానికి వినియోగించనున్నట్టు భారతి ఎయిర్‌టెల్ తెలిపింది. గత డిసెంబరు 31 వరకు కంపెనీ కన్సాలిడేటెడ్ నికర రుణం 91,714 కోట్ల రూపాయలుగా ఉంది. సునిల్ భారతి మిట్టల్ సారథ్యంలోని భారతి ఎంటర్‌ప్రైజెస్ రానున్నకాలంలో కూడా భారతి టెలికాంలో 50 శాతానికి మించిన వాటాను కలిగి ఉండనుంది.

సెన్సెక్స్ మరో 300 పాయింట్లు డౌన్

రెండు రోజుల్లో రూ.5 లక్షల కోట్లు ఆవిరి

ముంబై : ఒకవైపు బడ్జెట్‌లో ఎల్‌టిసిజి విధించడంతో ఏర్పడిన ప్రతికూలతకు అంతర్జాతీయ మార్కెట్లలో వెల్లువెత్తిన అమ్మకాలు జోడుకావడంతో మార్కెట్లో సెంటిమెంట్ తీవ్రంగా ప్రభావితం అయింది. బ్యాంకింగ్, యంత్రపరికరాలు, ఐటి కౌంటర్లలో అమ్మకాలు జోరుగా సాగడంతో వరుసగా నాలుగో రోజు ఇండెక్స్‌లు భారీ నష్టాలు నమోదు చేశాయి. దీనికి తోడు ఆసియా పాలసీ ముందు అప్రమత్తత కూడా మార్కెట్ నడకపై ప్రభావం చూపింది. పెరిగిన ద్రవ్యోల్బణ భయాలతో ఆర్‌బిఐ రేపోరేటును పెంచవచ్చునన్న ఊహాగానాలు కూడా ఇన్వెస్టర్లలో అప్రమత్తతను పెంచాయి. ప్రారంభం నుంచి నెగెటివ్ జోన్‌లోనే ట్రేడయిన సెన్సెక్స్ ఇంట్రాడేలో 500 పాయింట్లు దిగజారి చివరికి 310 పాయింట్ల నష్టంతో 34727.16 వద్ద ముగిసింది. జనవరి 12వ తేదీన నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే. నాలుగు వరుస సెషన్లలో సెన్సెక్స్ 1216.50 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 10586.80 పాయింట్లు, 10702.75 పాయింట్ల మధ్యన కదలాడి చివరికి 94 పాయింట్ల నష్టంతో 10666.55 వద్ద క్లోజయింది. స్టాక్ మార్కెట్ పతనంతో రెండు రోజుల్లోనే 5 లక్షల కోట్ల రూపాయల మేరకు ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది.



- విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మార్కెట్లో అమ్మకాలను కొనసాగిస్తున్నారు. ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న గణాంకాల ప్రకారం ఎఫ్‌పిఐలు శుక్రవారం 950 కోట్ల రూపాయల విలువ గల కొనుగోళ్లు చేయగా దేశీయ సంస్థలు 508 కోట్ల రూపాయల మేరకు అమ్మకాలు సాగించాయి.
- సెన్సెక్స్ షేర్లలో హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్, ఎల్ అండ్ టి, కొటక్ బ్యాంక్, బజాజ్ ఆటో, ఒఎన్‌జిసి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌యుఎల్, మహీంద్రా షేర్లు 4 శాతం మేరకు నష్టపోయాయి.
- ట్రెండ్‌కు ఎదురీది భారతి ఎయిర్‌టెల్ షేరు 4.20 శాతం లాభపడింది. కంపెనీలో సింగ్‌టెల్ వాటాలు పెంచుకుంటున్న వార్తలు ఈ షేరుకి ఊపు ఇచ్చాయి. అలాగే టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్, ఐటిసి, కోల్ ఇండియా, మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్, ఎన్‌టిపిసి, డాక్టర్ రెడ్డీస్, ఆర్‌ఐఎల్, ఎస్‌బిఐ లాభపడిన షేర్లలో ఉన్నాయి.

అపోలో హెల్త్‌కేర్ ఇష్యూ ధర రూ.180

ఆరోగ్య సంరక్షణ రంగంలోని అపోలో హెల్త్ కేర్ త్వరలో జారీ చేయనున్న పబ్లిక్ ఇష్యూలో షేరు ధరను కనిష్ఠంగా 180 రూపాయలు, గరిష్ఠంగా 190 రూపాయలుగా ప్రకటించింది. 980 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా మార్కెట్‌లోకి వస్తున్న ఈ ఇష్యూ ఈ నెల 12న ప్రారంభమై 15న ముగుస్తుంది. ఇష్యూ ద్వారా సేకరించే నిధులను రుణాల చెల్లింపు, వైద్యపరికరాల కొనుగోలు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనున్నట్టు కంపెనీ తెలిపింది.


10 కొత్త ఆస్పత్రుల ఏర్పాటు

కోఠి ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ఈ సంస్థ భారత్‌లోనేకాకుండా గల్ఫ్‌లో 10 కొత్త ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఇందుకోసం 13 కోట్ల డాలర్లు (రూ.835 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్టు కంపెనీ ఎండీ, ఎండి అజాద్ మూపెన్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ కంపెనీ విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లో ఆస్పత్రులు నడుపుతోంది.

ఇన్వెస్టర్లు ఏం చేయాలి?

ప్రస్తుతం మార్కెట్ బేర్ గుప్పిట్లోకి వెళ్తున్నట్టుగా కనిపిస్తోంది. ఈ దశలో ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాలి. పూర్వాపరాలు ఆలోచించి వ్యవహరించాలి. మార్కెట్‌లో ప్రస్తుతం కనిపిస్తున్న ఆటుపోట్లు తగ్గే వరకు వేచి చూడాలి. మార్కెట్ కుదుటపడిందన్న విశ్వాసం కలిగిన తర్వాతే ఇన్వెస్ట్‌మెంట్ గురించి ఆలోచించాలి.

- భయాందోళనలతో ఉన్న షేర్లన్నీ తెగనమ్మి ప్రయత్నం చేయవద్దు. పానిక్ సెల్లింగ్ ప్రమాదకరం. మీ దగ్గరున్న షేర్లలో ఏ షేరును ఏ ధరలో కొన్నారు, ప్రస్తుతం ఆ ధర ఎంత? సదరు కంపెనీ ఫండమెంటల్స్ ఎలా ఉన్నాయి, ఆ షేరును కేవలం స్పెక్యులేషన్ ఆధారంగా కొన్నారా లేక కంపెనీ పని తీరును బట్టి ఇన్వెస్ట్ చేశారా? ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకున్న తర్వాత మీ దగ్గరున్న షేర్లలో వేటిని అమ్మాలో వేటిని అట్టిపెట్టుకోవాలో నిర్ణయించుకోవాలి. నిర్ణయం తీసుకోవడంలో మాత్రం జాప్యం చేయవద్దు. కొన్ని చిన్న కంపెనీలు, పెద్దగా పేరులేని కంపెనీల షేర్లు కూడా గత కొన్ని నెలల ర్యాలీలో అసాధారణ స్థాయిలో పెరిగాయి. ఒకవేళ అలాంటి కంపెనీల షేర్లు మీ పోర్ట్‌ఫోలియోలో ఉంటే వాటిని వదిలించుకోవడం మంచిది. మార్కెట్ తిరగబడినప్పుడు శరవేగంగా పతనమయ్యేది ఈ బాపతు షేర్లే. మంచి షేర్లు ప్రస్తుతం తగ్గినా మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుంది. వీలైతే లింకుకోలేకున్నా ఇలాంటి షేర్లను వదిలించుకున్న తర్వాత మార్కెట్ స్థిరపడేవరకు వేచి చూడండి.
- ఆర్థిక రంగానికి సంబంధించి దీర్ఘకాలిక సంకేతాలన్నీ పాజిటివ్‌గానే ఉన్నాయి. అంతర్జాతీయ ఆర్థిక రంగంలోనూ పురోగమనమే ఉంది. చమురు ధరలు భయపెడుతున్నా, ముడి చమురు ఎగుమతులల్లో అమెరికా, కెనడా కూడా అడుగుపెడుతున్నాయి. అదే జరిగితే మళ్లీ చమురు ధరలు దారికి వస్తాయి. బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా ప్రభుత్వ వ్యయం మొదలైతే ఆర్థిక రంగంలో మళ్లీ ఉత్తేజం మొదలవుతుంది. అయితే ఈ అంశాలన్నీ దీర్ఘకాలిక ప్రాతిపదికన పరిశీలించాల్సినవే. స్వల్పకాలికంగా వాతావరణం అనిశ్చితంగానే ఉంది.
- మార్కెట్ పడిపోయింది, షేర్ల ధరలు పతనమయ్యాయి. ఈ సమయంలో కొనుగోలు చేస్తే భారీ లాభాలు సంపాదించవచ్చు. అన్న భావన కూడా మంచిది కాదు. ఈ టైమ్‌లో బాటమ్ ఫిషింగ్ ప్రమాదకరం. చేతులు కాల్చుకోవడం తప్ప మరో ప్రయోజనం ఉండదు.
- ఈ ఏడాది సెన్సెక్స్ 5-10 శాతం కంటే మించి లాభపడకపోవచ్చు. అందువల్ల చిన్న, మధ్యతరహా క్యాపిటలైజేషన్ ఉన్న స్టాక్స్ నుంచి బయటపడి వీలుంటే లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయండి. లేదా బేర్ మార్కెట్ కారణంగా సహేతుకమైన ధరలో వచ్చే ఐపిఒల్లో ఇన్వెస్ట్ చేయండి. వీలుంటే కనీసం ఒక ఏడాది పాటు నగదు మార్కెట్ స్థిరపడేవరకు అట్టిపెట్టుకోండి. మార్కెట్ బాటమ్ ఔట్ అయితే కారు చౌకగా అందుబాటులోకి వచ్చే మేలిమి చిన్న, మధ్యతరహా స్టాక్స్ పికప్ చేయవచ్చు.
- విదేశీ ఇన్వెస్టర్లు ఒకవేళ దేశీమార్కెట్లో ఇన్వెస్ట్‌మెంట్లను కొనసాగించాలని భావిస్తే లార్జ్ క్యాప్ షేర్లనే ఎన్నుకుంటారు. ఇప్పటికే కొన్ని లార్జ్‌క్యాప్ షేర్లు సహేతుకమైన వాల్యుయేషన్స్‌లో ట్రేడవుతున్నాయి. దేశీయ మ్యూచువల్‌ఫండ్ సంస్థలు, ఆర్థిక సంస్థలు ఓపిగ్గా వేచిచూసి సహేతుకమైన ధరల్లో చిన్న షేర్లు అందుబాటులోకి రాగానే అవకాశాన్ని ఉపయోగించుకుంటాయి.



దూసుకుపోయిన పిసి జువెలర్స్

ఈ కంపెనీ ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉన్నాయన్న మేనేజ్‌మెంట్ ప్రకటనతో పిసి జువెలర్స్ షేరు లాభాల బాటలో దూసుకుపోయింది. ఇంట్రాడేలో 29 శాతం వరకు కూడా లాభపడిన ఈ షేరు బిఎస్ఇలో 15.74 శాతం లాభంతో 423.15 రూపాయల వద్ద క్లోజయింది. గత శుక్రవారంనాడు ఈ షేరు నిట్టనిలువునా పతనమై ఇంట్రాడేలో 60 శాతం నష్టపోయిన విషయం విదితమే.

మైనర్ రికవరీ

టెక్ వ్యూ

నిఫ్టీ 150 పాయింట్లు నష్టపోయి 10600 వరకు దిగజారినా రోజంతా సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం చివరికి 95 పాయింట్ల నష్టంతో క్లోజయింది. ఇది స్వల్పకాలిక కరెక్షన్ ట్రెండ్‌లో మైనర్ రికవరీ మాత్రమే. అయితే కీలకమైన 50 డిఎంఎకన్నా పైన ఇండెక్స్ మద్దతు తీసుకున్నట్టు కనిపిస్తోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ కావాలి. ప్రస్తుతం 20 డిఎంఎకన్నా దిగువన ఉంది.

మంగళవారం స్థాయిలివే...
నిరోధం : 10700
మద్దతు :10600

- నిరోధ స్థాయిలు 10700, 10800. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ స్థాయిల కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి.
- ప్రధాన మద్దతు స్థాయి 10600. భద్రత కోసం ఇక్కడ రికవరీ సాధించి తీరాలి. అంతకన్నా దిగజారితే కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ కూడా మైనర్ మద్దతు స్థాయి 26000 వద్ద మద్దతు తీసుకుంది.

■ వి.సుందర్ రాజా

ప్రథమార్థం నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ బహుళ సప్తమి **నక్షత్రం** : చిత్త, స్వాతి
పుష్యమి, ఆశ్లేష, ఉత్తరాభాద్ర (ఉదయం), ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, వృశ్చిక, మీన రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.
నిఫ్టీ : 10666.55 (-94.05)
ట్రెండ్ మార్పు వేళలు : 10.52 గంటలు
ధోరణి: గ్రహగతులను బట్టి నిలకడ/నిస్తేజంగా ప్రారంభమై 10.45 గంటల వరకు అదే ధోరణి ప్రదర్శిస్తూ 11.10 గంటల నుంచి ఒంటి గంట వరకు, ఆ తర్వాత మూడు గంటల తదుపరి నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు. ఒంటి గంట నుంచి మూడు గంటల మధ్యలో మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్ 11.15 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషను తీసుకుని 12.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఒంటి గంట తర్వాత ఎటిపికన్నా పైకి వస్తే లాంగ్ పొజిషను తీసుకుని మూడు గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
నిరోధ స్థాయిలు : 10710, 10745
మద్దతు స్థాయిలు : 10620, 10585
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

ACI INFOCOM 6.57(6.91)1
ADITYA SPIN. 8.31(8.34)210
AGRO TECH FO 632.2(636.35)1766
AISHWARYA TE 7.9(8.31)878
ALPHAGEO (I) 876.5(865.15)4364
ALU FLUORIDE 111.65(113.4)17190
AMAR RAJA BA 778.95(768.75)25008
ANDHRA BANK 48.9(49.2)375285
ANDHRA CEMEN 11.92(12.54)15154
ANDHRA PETRO 67.05(64.05)281712
ANJANI PORTL 205.8(210.65)4736
ASTRA MICRO 107.75(108.15)88392
AUROB.PHARMA 613.65(605.1)138011
AVANTEL LTD 490.25(510.65)24219
AVANTI FEEDS 2317.75(2345.7)28060
B.N.RATHI SE 39.6(39)8136
BALAJI AMINE 627.75(618.9)11961
BAMBINO AGRO 246.85(257.45)2403
BARTRONICSIN 13.03(13.35)17067
BHAGIRA.CHEM 278.6(292.05)2804
BHAGYA INL 38.95(38.85)11697
BHARATFIN 1024.9(1034.95)26805
BNR UDYOG 33.45(33.5)10
CAMBRIDGE 80.15(81.75)3247
CCHHL 15.3(15.35)58312
CCL PRODUCTS 280.4(276.75)19370
CELESTIAL 16.45(17.05)43944
CIL SECURITS 31.3(30.45)3164
COROM INTER 554(548.05)40545
CUBEX TUBING 24.75(26)5055
CYBERMATE 3.31(3.36)107555
CYIENT 623.2(618.5)12912
DANLAW TECH. 82.1(82.8)6922
DECAN CEMENT 559.7(554.55)422
DHAN ROTO SP 38.45(40.45)1416
DIAMONPOWER 17.05(17.55)43516
DIVI'S LAB. 1033.25(1028.9)27016
DIVYA.GRANIT 112.9(113)111
DQ ENT 16.35(16.4)4362
DR.REDDY'S 2110(2122.1)60256
EMPEE SUGARS 4.36(4.53)14321
EVEREST ORG. 141.85(140.7)771
FACOR ALLOYS 3.44(3.62)77034
FIRSTOBJ 15.35(16)681
GATI LTD. 119.3(120)171306
GAYATRI PROJ 200.55(205.05)12759
GENNEX LAB 4.46(4.66)407672
GMR INFRASTR 20.2(19.25)8312175
GODAVARI DRU 35(35.4)3538
GOLDST INFRA 193.1(199.95)55751
GOLDSTONE EN 14.05(14.25)13048
GRANULES (I) 119.9(121.4)296190
GVK POWERINF 19.5(20.5)704509
HBL P SYS 55.15(56.9)226363
HERITGFOOD 722(724.95)2297
HIND.FLUROCA 14.8(14.1)1800
HINDUSTN BIO .7(.7)11
I.C.S.A. IND 4.29(4.51)51175
IKF TECHNO 1.14(1.19)1037014
INCAP LTD. 96(100.95)2116
IPAPPM 313.7(304.25)15140
IVRCL LTD 4.75(4.99)183212
KAKATIYA CEM 312.95(341.2)43172
KALLAM SPG. 22.5(22.95)18734
KARAN WOO-SN 1.81(1.81)1000

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

KAVERI SEED 480.6(493.7)29275
KCP LTD 128.95(131.3)89679
KERNEX MICRO 46.9(49.35)4142
KNR CONST 299.25(299.7)24407
KREBS BIOCHM 134(136.1)625
LANCO INFRA 1.42(1.49)744219
LOKESH MACH 64.7(66.1)8579
LOTUS CHOC 49.9(49.15)9452
MADHUCON PRJ 28.9(29.6)79491
MOLD-TEK TEC 66(69.45)2191
MOSCHIP SEMI 36.2(35.85)53989
MSR INDIA 37.7(36.75)6500
N C L IND. 247.85(255.3)32720
NACLIND 46.95(51.1)117369
NATCO PHARM 913.5(924.35)29740
NCC 112.65(115.15)473192
NEHA INTER. 7.24(7.17)27719
NETTLINX LTD 87.2(88.65)11214
NEULAND LAB. 758.1(787.95)11095
NIHAR INFO 13.21(13.85)50
NILE LTD. 824.95(866.15)10051
NTL 4.09(4.29)3248
OIL COUNTRY 44(45.65)17505
PADMALAYA TE 5.01(5.04)9912
PALRED 90(89.85)7158
PANYAM CEMEN 54.6(55.25)12114
PENNAR STEEL 57.45(57)146465
PFL INFOTECH 9.93(10.45)707
PHYTOCHEM I. 65.1(62.55)11189
PITTI LAMIN. 78.4(80.95)16039
POKARNA LTD 207.65(211.7)7334
PRAJAY ENGS. 14.65(15.4)2205
PREMIER EXPL 416.1(408.6)3832
PRISM CEMENT 127.55(126.7)174128
RAIN 337.3(331.8)939460
RAJ PACKAGIN 37.8(36.05)614
RESTILE CER. 7.38(8.01)1914
SAGAR CEM. 926.5(962.05)4995
SAMKRG PIST. 307.5(304.7)13442
SAMPRE NUTRI 64.35(64.8)1651
SANGHI IND. 115.55(117.8)63908
SATVAH.ISPAT 23.9(23.2)17591
SAVEN TECHNO 19.75(20)7093
SIBAR AUTO 21.55(21.95)16599
SMPL 1.43(1.5)46426
SMS PHARMACE 91.1(92.9)5305
SREE RAYALA 170.05(173.5)1451
STEEL EXCH 30.15(31.7)46767
SUJANA INDUS 1.07(1.12)27601
SURANATP 5.48(5.75)13418
SURYACHAKRA 1.57(1.65)24490
SURYAMBA SP 67.9(71.15)260
SURYAVA SPIN 7.78(7.43)201
SURYLAK.COTT 82.15(85.05)9079
SUVEN LIFE S 198.95(191.65)147780
TAJ GVK HOTL 168.55(166.9)17560
TANLA 31.3(31.6)124111
TRANSCORP IN 40.95(43)1110
TRANSGENE BI 2.18(2.29)11720
TRANSPORT CO 263.45(272.5)5214
USHER AGRO 7.75(7.56)7757
VICEROY HOTE 16.05(16.45)34179
VIJAY TEXTIL 53.7(56.5)3701
VIMTA LABS 195.2(199.6)26901
VIRAT CRANE 43.35(44.05)2506
VIRINCHI 120.45(126.75)23751
VISAKA IND. 669.7(694.5)17167
VISTA PHARMA 40.5(40.2)15237
VIVIMED LABS 80.15(80.1)122915
VST INDUS. 3187.15(3323.6)2068
WATERBASE 313.65(298.75)248666
XLENERGY 3.45(3.63)11855
YBRANTDIGI 5.84(5.75)183139
ZEN TECH 110.35(112.65)43238
ZENOTECH 46.25(45.05)19614

ఎన్ఎస్ఇ-500 NSE
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 591.65(589.95)11731
AARTIIND 1105.3(1090.45)35630
ABAN 191.1(193.2)1212397
ABB 1627.85(1678.55)94627
ABFRL 154.2(156.55)1060338
ABGSHIP 11.2(11.65)20467
ACC 1641.15(1679.8)486961
ADANIENT 199.45(197.2)6443758
ADANIPORTS 408.2(417.95)2936554
ADANIPOWER 32.7(32.7)15384812
ADANITRANS 194.4(193.8)795688
AEGISCHEM 255.25(268.05)370931
AHLUCONT 320.8(333.5)21493
AIAENG 1450.55(1428.9)63534
AJANTPHARM 1309.55(1390)332813
AKZOINDIA 1775.85(1809.85)8120
ALBK 60.55(61.75)2834815
ALLCARGO 189.4(189.8)343095
ALOKTEXT 3.55(3.4)4955355
AMARAJABAT 779.85(767.9)454465
AMBUJACEM 259.1(259.55)2745947
AMTEKAUTO 23.2(23.55)640598
ANANTRAJ 58.25(58.8)1653116
ANDHRABANK 48.7(49.15)2914881
APARINDS 718.65(728.05)27379
APLLTD 523.65(535.2)26037
APOLLOHOSP 1129.55(1156.95)276192
APOLLOTYRE 252(249.5)2874449
ARVIND 387.9(380.05)1827094
ASHIANA 180.6(178.3)313804
ASHOKA 218.8(222.9)163986
ASHOKLEY 129.35(122.3)22945256
ASIANPAINT 1134.1(1137.9)1263378
ASTRAL 796.8(782.4)67388
ASTRAZEN 1141.75(1086.65)12818
ATUL 2665.6(2678.5)40324
AUROPHARMA 614(605.45)1848942
AVANTIFEED 2316.95(2352.15)105692
AXISBANK 566.25(564.9)9318595
BAJAJ-AUTO 3185.55(3241.3)585934
BAJAJCORP 469.75(489.05)87133
BAJAJELEC 432.45(440.75)470020
BAJAJFINSV 4918(4935.75)295940
BAJAJHIND 13.85(13.35)5488508
BAJAJHLDNG 2742.7(2781.45)15267
BALKRISIND 1069.6(1090.8)494013
BALLARPUR 14.8(14.3)1731662
BALMLAWRIE 229.45(232)107703
BALRAMCHIN 116.2(111.3)4063944
BANKBARODA 157.5(153.2)13827865
BANKINDIA 147.2(147.55)3706252
BASF 2043.75(2005.05)25910
BATAINDIA 693.8(689.7)435547
BBTC 1305.75(1285.45)195697
BEML 1263.2(1283.05)484197
BERGEPAINT 242.35(246.85)328241
BFUTILITIE 430.55(431.4)408039
BGRENERGY 122.55(123.45)104042
BHARATFIN 1026.5(1039.65)400410
BHARATFORG 714.05(690.8)1720727
BHARTIARTL 440.2(422.35)13591277
BHEL 94.85(93.5)10260198
BHUSANSTL 44.6(46.8)15077256
BIOCON 605.2(598.2)2250781
BIRLACORPN 1041.7(1107.8)48039
BLISSGVS 194.4(195.1)173653
BLUEDART 4693.35(4620.15)7776
BLUESTARCO 719.7(718.15)45238
BOMDYEING 222.55(191.75)16083954
BOSCHLTD 19951.55(19474.4)61031
BPCL 475.95(477.15)3435092
BRFL 61(64.2)44387
BRIGADE 278.8(278.9)37555
BRITANNIA 4616.7(4726.45)177420
CADILAHC 408.15(410.85)474543
CANBK 317.65(311.3)4525833
CAPF 681.5(681.85)811453
CARERATING 1330.6(1328.05)35610
CASTEXTECH 5.15(5.3)1139557
CASTROLIND 180.75(179.7)1767506
CCL 281.25(275.9)278822
CEATLTD 1619.65(1647.45)772377
CENTRALBK 68.1(70.35)420292
CENTURYPLY 303.1(309.65)375688
CENTURYTEX 1246.95(1293.5)1448322
CERA 3224.7(3341.2)13629
CESC 1000.4(1000.2)603521
CHAMBLFERT 142.25(144.45)376295
CHENNPETRO 377.3(382.9)414702
CHOLAFIN 1273.6(1274.55)246584
CIPLA 580.1(581.15)797017
CLNINDIA 597.8(599.4)16944
COALINDIA 294.8(290.35)7795465
COLPAL 1122.65(1117.65)1051990
CONCOR 1341.3(1337.7)254172
COROMANDEL 551.8(549.6)259201
CORPBANK 35.6(36.3)513707
COX&KINGS 236.35(235.3)110139
CRISIL 1958.35(1953.3)21150
CUB 157.35(158.45)1567702
CUMMINSIND 807(829.2)821469
CYIENT 622.5(620.4)439474
DABUR 339.1(344.45)1270434
DALMIABHA 2731.45(2829.35)118574
DBCORP 329.7(326.5)15509
DBREALTY 56(58.9)582756
DCBBANK 166.2(165.65)1110954
DCMSHRIRAM 583.2(553.45)166077
DEEPAKFERT 364.35(358.75)215004
DELTACORP 342.85(330.5)3592757
DEN 100.8(99.65)404799
DENABANK 23.1(23.75)2123615
DHANUKA 694.4(699.2)22595
DHFL 509.8(519.45)7154780
DISHTV 75(72.4)6033600
DIVISLAB 1034.65(1028.25)545693
DLF 228.3(223.4)10372280
DREDGECORP 720.35(685.05)1006972
DRREDDY 2116.5(2123.55)603638
DYNAMATECH 1732.25(1772.65)4216
ECLERX 1434.55(1481.3)13872
EDELWEISS 249.1(261.4)4315726
EICHERMOT 27537.95(27811.75)48683
EIDPARRY 319.45(318.65)97328
EIHOTEL 176.55(182)192219
ELECTCAST 31.3(32.7)695620
ELGIEQUIP 314.85(314.8)39004
EMAMILTD 1092.4(1104.85)291362
ENGINERSIN 166.4(165.9)3185972
EROSMEDIA 191.65(190.85)716810
ESCORTS 878.95(860.65)1535096
ESSDEE 71.35(68.45)30231
ESSELPACK 267.7(271.75)76008
EVEREADY 381(395.15)449160
EXIDEIND 204.85(211.75)2572885
FCONSUMER 60.3(58)7878659
FDC 232.65(228)45124
FEDERALBNK 94.2(93.3)8713749
FINCABLES 675.2(700.85)66900
FINPIPE 659.5(653.2)73706
FLFL 375.05(355.6)138750
FORTIS 118.45(126.45)17584182
FSL 40.25(37.9)6496661
GAIL 462.35(466.45)3277580
GATI 119.45(119.8)1007280
GDL 220.75(224.1)88920
GEPIL 901.3(882.95)44133
GESHIP 386.95(380.25)45294
GET&D 389.35(400.8)59726
GILLETTE 6390.2(6449.75)1732
GLAXO 2479(2467.85)14091
GLENMARK 591.55(589.55)392893
GLOBOFFS 33.75(33.15)20381
GMDCLTD 143(138.5)283841
GMRINFRA 20.15(19.25)85508428
GODFRYPHLP 888.85(891)102583
GODREJCP 1039(1051.6)307126
GODREJIND 557(580.75)625239
GODREJPROP 780.8(806.6)155160
GPPL 138.25(140.85)977088
GRANULES 119.45(121.3)2032094
GREAVESCOT 132.7(134.1)823881
GREENPLY 324.95(333.5)107270
GRINDWELL 500.1(511.6)11547
GRUH 545.25(567.8)363322
GSFC 124.65(129.1)5818189
GSKCONS 6521.95(6607.95)6810
GSPL 189.45(192.95)1096164
GUJFLUORO 799.7(796.35)43489
GUJGASLTD 837.4(849.45)62676
GULFOILLUB 895.75(875.95)11920
GVKPIL 19.65(20.65)836555
HATHWAY 36.15(36.95)932007
HAVELLS 499.05(509.6)1543999
HCC 35.95(36.1)17216078
HCL-INSYS 54.7(53.85)3623010
HCLTECH 993.15(990.9)1088789
HDFC 1823.35(1903.85)6082208
HDFCBANK 1913.85(1948)1981696
HDIL 52.65(51.35)17022856
HEIDELBERG 147.85(148.95)139453
HEROMOTOCO 3636.4(3623.45)319150
HEXAWARE 370.8(370.05)550826
HFCL 26.3(26.65)6782305
HIMATSEIDE 330.85(334.75)109478
HINDALCO 246.6(249.85)8462501
HINDCOPPER 75.65(76.55)3787876
HINDPETRO 383.85(374.5)5467111
HINDUNILVR 1355.75(1372.2)1585136
HINDZINC 292.95(294.35)2515888
HMT 34.7(35.85)4800
HMVL 250.45(240.5)19464
HONAUT 16474.2(16696.5)1075
HOTELEELA 20.4(19.6)848451
HSIL 414.8(424.1)83080
HTMEDIA 94.55(94.1)528596
IBREALEST 202.7(193.4)10387324
IBULHSGFIN 1292.45(1319.6)1509725
ICICIBANK 329.7(335.1)17339547
ICRA 3880.3(3921.6)2140
IDBI 60.4(58.65)7114915
IDEA 87.55(88.3)14048237
IDFC 53.25(52.45)8944598
IFBIND 1275.9(1216.4)19468
IFCI 24.7(25.35)21476954
IGARASHI 827.5(817.85)11217
IIFL 751.25(761)289927
IL&FSTRANS 75.95(75.3)322007
INDHOTEL 135.95(129)966551
INDIACEM 153.1(153.3)7389388
INDIANB 340.1(340.3)801237
INDOCO 272(255.45)112981
INDUSINDBK 1713(1761.3)1600927
INEOSSTYRO 940.65(926.8)6544
INFRATEL 349(344.85)2690533
INFY 1138.2(1143.25)4930110
INGERRAND 743.2(758.05)15122
INOXLEISUR 284.5(282.9)197557
INOXWIND 121.9(119.85)644054
INTELLECT 192.95(171.6)2007063
IOB 21.05(21.1)2369017
IOC 409(408.65)6571394
IPAPPM 314.15(303.15)113821
IPCALAB 557.4(561.9)46508
IRB 223.65(224.05)1217306
ITC 279.25(275.35)19706340
J&KBANK 70.65(69.1)487446
JAGRAN 169.9(166.6)124004
JAICORPLTD 161.45(161.55)2737232
JBCHEPHARM 298.2(304.05)67641
JBFIND 173.3(166.85)150012
JCHAC 2334.4(2419.3)8872
JETAIRWAYS 690.8(685.6)2956211
JINDALPOLY 343.25(342.85)61058
JINDALSTEL 259.55(250.55)13957982
JISLJALEQS 121.3(116.9)19584334
JKCEMENT 1070.4(1092.9)27868
JKIL 288.55(293.65)188355
JKLAKSHMI 409.35(405.2)66440
JKTYRE 174.6(173.9)1247766
JMFINANCIL 156.05(158.75)844458
JPASSOCIAT 19.05(17.95)67254823
JPINFRATEC 14.65(14.25)4861853
JPPOWER 6.5(6.4)4222954
JSWENERGY 85.15(84.05)3499211
JSWHL 1700.95(1680.15)7567
JUBILANT 955.75(880.1)2027748
JUBLFOOD 1959.35(2006.2)996002
JUSTDIAL 449.4(449.15)5679175
JYOTHYLAB 360.55(365.3)220660
KALPATPOWR 432(434)182767
KANSAINER 492.8(499.95)218367
KEC 352.25(340.2)370275
KESORAMIND 129.4(130.55)747686
KIRLOSENG 378.05(381.2)20571
KITEX 272.1(267.25)119278
KOLTEPATIL 315.45(329.35)276966
KOTAKBANK 1062.25(1085.95)2370531
KPIT 207.1(197.35)3747554
KRBL 591.35(592.1)95965
KSCL 479.05(494.2)591163
KSK 14.25(15)125662
KTKBANK 137.9(138.85)2516188
KWALITY 94.7(92.7)1629507
L&TFH 158.4(157.7)9835428
LAKSHVILAS 129.5(128.4)532384
LAOPALA 627.75(605.9)27449
LAXMIMACH 5714.3(5799.65)24252
LICHSGFIN 516.4(511.9)1861979
LITL 1.55(1.6)283993
LT 1363.65(1415.45)3060688
LUPIN 849.1(847)1407031
M&M 760.5(770.25)2018332
M&MFIN 438.45(446.35)2113143
MAGMA 155.9(159.35)176442
MAHINDCIE 210.5(212.9)737686
MAHLIFE 475.55(491.05)18937
MANAPPURAM 105.4(106.25)5489351
MANPASAND 381.95(376.35)161489
MARICO 295.4(304.5)1283740
MARKSANS 38.2(37.95)3896395
MARUTI 9080.6(8990.6)651062
MAYURUNIQ 479(477.3)25855
MCDOWELL-N 3189.7(3182.3)416338
MCLEODRUSS 169.65(165.95)247108
MERCK 1397.65(1429.35)22784
MHRIL 316.8(323.05)60768
MINDACORP 186.7(192.55)396003
MINDTREE 705(735.15)1709873
MMTC 54.6(56.1)1745868
MOIL 230.45(235.15)500878
MONSANTO 2532.1(2522.75)5398
MOTHERSUMI 354.6(352.05)3144428
MOTILALOFS 1168.25(1236.15)120325
MPHASIS 856.3(854.65)179437
MRF 68615.1(69259.4)12193
MRPL 117.95(117.05)3315310
MTNL 20.95(21.75)2583376
MUTHOOTFIN 396.05(402.1)1068692
NATCOPHARM 909.2(922.2)354551
NATIONALUM 72.9(70)10119646
NAUKRI 1285.5(1369.3)102516
NAVKARCORP 173.65(173.9)238856
NCC 112.5(114.95)6588853
NETWORK18 51.3(50.75)990430
NHPC 28.05(27.85)8162704
NIITTECH 826.75(790)1065954
NITINFIRE 5.7(5.9)318881
NLCINDIA 100.25(102.2)851374
NMDC 132.85(132.8)5801912
NTPC 166.25(165.2)5941662
OBEROIRLTY 468.95(490.25)661475
OFSS 4233.9(4192.8)45086
OIL 336.6(345.65)261006
OMAXE 228.65(228.85)629433
ONGC 188.75(192.7)7607002
ORIENTBANK 113.55(112.4)4103172
ORIENTCEM 142(144.55)54432
ORISSAMINE 1734.15(1755.3)4070
PAGEIND 19157.4(20052.8)29972
PARSVNATH 21.7(22.65)114936
PCJEWELLER 423.7(364.25)51310563
PEL 2617(2648.65)216426
PERSISTENT 770.4(784.3)66014
PETRONET 247.65(243.3)4839007
PFC 112.35(110.95)5860031
PFIZER 2208.85(2230.35)13176
PFS 33.75(33.35)1329817
PGHH 9252.2(9226.75)3457
PHOENIXLTD 605.1(634.5)177565
PIDILITIND 875.2(862.8)524002
PIIND 855.6(886.6)154478
PNB 163.7(161.85)20688955
POLARIS 450.95(412.7)1570548
POWERGRID 196.5(192.9)12373481
PRAJIND 96.2(100.2)1745094
PRESTIGE 302.25(311.75)232467
PRISMCEM 126.85(126.9)706080
PTC 97.3(97.15)1632229
PUNJLLOYD 21.05(20.95)1760546
PURVA 143.65(142.25)449390
PVR 1297.7(1302.15)163563
RADICO 354.2(324.8)3902802
RAIN 337.55(332.4)5275615
RAJESHEXPO 817.35(820.05)285315
RALLIS 229.9(236.1)450750
RAMCOCEM 719.55(736.4)315454
RAMCOSYS 461.5(478.8)28028
RATNAMANI 965.8(994.05)7512
RAYMOND 931.9(933.3)757335
RCF 84.95(87.2)3985497
RCOM 26.25(26.1)93472759
RECLTD 147.7(145.4)3864556
REDINGTON 149.45(155.55)712531
RELAXO 588.35(611.4)26854
RELCAPITAL 456(436.75)5816240
RELIANCE 902.15(904.35)8773525
RELINFRA 446.2(449.75)3037191
RENUKA 15.25(14.5)4195928
REPCOHOME 592.1(592.85)443225
RIIL 482.75(491.85)533352
RKFORGE 764.7(772.35)34721
RNAVAL 38(38.55)8376455
ROLTA 60.65(59.3)1298036
RPOWER 42.6(41.25)14004413
RTNPOWER 6.35(6.6)9039471
RUCHISOYA 15.1(15.95)1349283
SADBHAV 389.35(390.75)106238
SADBHIN 136(132.7)178682
SAIL 84.8(83.6)11446302
SANOFI 4931.05(4989.15)4128
SBIN 298.05(297.35)18940578
SCHAEFFLER 5375.65(5415.1)2421
SCHNEIDER 114.85(117.5)105696
SCI 72(74.65)1210977
SHARDACROP 413.8(417.65)10629
SHILPAMED 518.95(526.2)22423
SHK 292.7(297.2)548778
SHOPERSTOP 524(519.1)60391
SHREECEM 16635.65(17038.4)49055
SHRIRAMCIT 1957.25(1996.05)15072
SIEMENS 1269(1292.85)199908
SIMPLEXINF 583.05(567.15)20279
SINTEX 21.9(22.15)4444404
SITINET 20.75(21.95)201050
SJVN 35.15(34.7)796961
SKFINDIA 1767.75(1749.95)3828
SMLISUZU 811.2(828.5)23377
SNOWMAN 51.15(52.2)1119146
SOBHA 536.95(547.85)172667
SOMANYCERA 699.7(714.2)33133
SONATSOFTW 273.1(275.75)151783
SOUTHBANK 27.7(28.2)17237756
SPARC 416.2(420.95)267606
SREINFRA 80.15(85.2)7703524
SRF 1775.05(1797.7)159576
SRTRANSFIN 1345.8(1321.9)668938
STAR 686.4(711.2)556402
STCINDIA 148.95(148.85)20171
SUNDARMFIN 1636.9(1659.15)8976
SUNDRMFAST 505.15(513.6)132070
SUNPHARMA 557.45(551.2)4734366
SUNTV 953.6(953.15)822601
SUPREMEIND 1265(1308.35)108554
SUVEN 199.45(191.45)789444
SUZLON 13.3(13.6)40954889
SWANENERGY 205.5(202.9)134110
SYMPHONY 1775.35(1774.75)27396
SYNDIBANK 66.15(67.15)4567088
SYNGENE 596(598.9)76459
TAKE 163.05(164.6)228746
TATACHEM 695.45(692.25)886221
TATACOFFEE 135.6(138.85)616174
TATACOMM 619.25(616.9)603866
TATAELXSI 1006.45(993.05)460391
TATAGLOBAL 273.1(274.85)6833906
TATAMOTORS 395.8(383.75)9876017
TATAMTRDVR 218.95(214.2)3875699
TATAPOWER 85(84.8)5165430
TATASPONGE 1018.95(993.85)245110
TATASTEEL 664.05(670.45)4698722
TBZ 115.9(113.25)526519
TCS 3103.2(3153.65)1378871
TECHM 629.05(619.45)3500770
TECHNO 360.75(360.05)16070
TEXRAIL 96.9(92.85)1001215
THERMAX 1195.1(1220.9)8920
THOMASCOOK 232.05(224.45)660723
TIDEWATER 6460.55(6476.75)2444
TIMKEN 877(855.05)62093
TITAN 802.3(822.2)3079541
TNPL 417.3(398.4)94909
TORNTPHARM 1342.35(1358.35)164677
TORNTPOWER 252.75(261.45)1378836
TREEHOUSE 13.5(13.35)28693
TRIDENT 71.9(73.45)754377
TRITURBINE 126.9(126.5)121427
TTKPRESTIG 6952.9(7065.4)5099
TTML 6.55(6.85)611933
TV18BRDCST 54.75(53.9)9486324
TVSMOTOR 658.35(645.25)1045696
TVSSRICHAK 3423.25(3465.8)6141
TVTODAY 450.95(449.95)121588
UBL 1180.2(1139.85)1652212
UCOBANK 29.35(29.6)649432
UFLEX 378.55(393.55)344672
ULTRACEMCO 4146.4(4179.45)178020
UNICHEMLAB 357.35(358.15)373232
UNIONBANK 126.65(127.5)9548623
UNITECH 7.4(7.5)33855525
UPL 722.5(733.05)1661523
VAIBHAVGBL 680.75(672.75)22400
VAKRANGEE 236.4(262.65)4607036
VEDL 328.85(334.3)12360798
VIDEOIND 16.85(17.3)1558857
VIJAYABANK 61.1(60.2)1533005
VINATIORGA 879.35(926.95)84008
VIPIND 339.4(341.2)489667
VOLTAS 596.1(572.55)1338482
VRLLOG 417.7(428.75)65650
VSTIND 3190.15(3349.7)1934
VTL 1344.1(1292.3)21876
WABAG 569.25(564.15)71874
WABCOINDIA 7298.05(7093.05)13407
WELCORP 161.15(155.4)687649
WELSPUNIND 62.75(63.6)1641567
WHIRLPOOL 1365.15(1445.9)264215
WIPRO 298.75(300.6)2194146
WOCKPHARMA 745.2(734.35)2453715
WONDERLA 375.35(374.15)53368
ZEEL 582.7(586.1)1228509
ZEELEARN 43.35(43)624704
ZENSARTECH 932.45(925.45)18803
ZYDUSWELL 976.85(988.25)3441



రైతులకు సహాయం అందిస్తున్న రాజా శ్రీనివాస్ రావు



ఆ ప్రవాసీయులు.. రైతు బాంధవులు

తెలుగు రాష్ట్రాల రైతుల చేయూతకు టెకీల సంకల్పం.. పంటల పెట్టుబడికి వడ్డీలేని రుణాలు



అందమైన దేశం..

ఆంక్షలమయం

బ్రూనై.. దక్షిణాసియాలో ఒక చుక్కలాంటి దేశం. ఈ దేశం పేరు వినగానే చాలా మందికి ఎడారులు.. మసీదులతో కూడిన ఒక ముస్లిం దేశం గుర్తుకొస్తుంది. కానీ ఒకసారి బ్రూనైకు వెళ్లి వచ్చిన వారు మాత్రం దీనిని అందమైన ప్రదేశంగానే గుర్తుండిపోతుందంటారు. ఇటీవల కాలంలో ఈ దేశానికి వెళ్లే పర్యాటకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ దేశానికి వెళ్లాలనుకొనే పర్యాటకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో.. తెలుసుకోవాల్సిన విషయాలేమిటో చూద్దాం..





ఏ దేశంలో ఏముంది? Foreign

మద్య నిషేధం

బ్రూనై ముస్లిం దేశం కావటంతో అనేక ఆంక్షలు ఉంటాయి. ఉదాహరణకు బ్రూనైలో మద్యం విక్రయించటం, కొనటం నిషిద్ధం. విదేశీయులకు మాత్రం కొన్ని ప్రాంతాల్లో మద్యాన్ని విక్రయిస్తారు. కానీ దానిని బహిరంగ ప్రదేశాలలో సేవించకూడదు. సిగరెట్లు అంతే! ఇదే విధంగా బ్రూనైలో ఇస్లాంపై తప్ప ఇతర మతాలపై కొన్ని ఆంక్షలు ఉన్నాయి. ఉదాహరణకు అక్కడ బహిరంగంగా క్రిస్మస్ జరుపుకోకూడదు. బ్రూనైకు వెళ్లే పర్యాటకులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి. బహిరంగ స్థలాల్లో మతాలకు సంబంధించిన చర్చలు జరపకపోతే మంచిది. అంతే కాకుండా బహిరంగ ప్రదేశాల్లో కురచ బట్టలు వేసుకొని తిరగటంపైనా నిషేధముంది. బ్రూనైకు వెళ్లే పర్యాటకులు ఈ అంశాలను గమనించాలి.

ప్రపంచంలో అతి తక్కువ జన సాంద్రత ఉన్న దేశాల్లో బ్రూనై కూడా ఒకటి. ఈ దేశ జనాభా దాదాపు ఐదు లక్షలు. వీరిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తూ ఉంటారు. ఈ గ్రామీణ ప్రాంతాలు కూడా అడవులకు ఆనుకొనే ఉంటాయి. ఎందుకంటే బ్రూనైలో మొత్తం ప్రాంతంలో 80 శాతం అడవులే ఉంటాయి. అందువల్ల అక్కడకు వెళ్లే పర్యాటకులు ఈ పరిస్థితిని గమనించి.. దానికి తగిన విధంగా దుస్తులను ఎంపిక చేసుకుంటే మంచిది.

చూడాల్సిన ప్రదేశాలు అనేకం..

బ్రూనై రాజధాని బండార్ సేరి బిగావాన్‌లో చూడాల్సిన ప్రదేశాలు అనేకం ఉన్నాయి. వీటిలో పర్యాటకులు తప్పనిసరిగా చూడాల్సింది సుల్తాన్ రాజమందిరం. సుమారు 2 వేల గదులతో అత్యంత సుందరంగా నిర్మించిన ఈ మందిరంలో కొన్ని భాగాలను చూడటానికి రంజాన్ నెలలో సందర్శకులకు అనుమతి ఇస్తారు. ఈ రాజమందిరమే కాకుండా రాజ మసీదు, ఇండిపీరియల్ హోటల్ వంటివి తప్పనిసరిగా చూడాల్సిన ప్రదేశాలు. బ్రూనైలో ఆహారపదార్థాలపై పన్నులు ఉండవు కాబట్టి అక్కడ ఆహార పదార్థాలు చవకగా దొరుకుతాయి. దీనితో మ్యూరా, బిరాకాస్ బీచ్‌ల పక్కన ఉండే బార్ బెక్యూ రెస్టారెంట్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. అయితే ఈ బీచ్‌లలో అర్ధనగ్నంగా దుస్తులు వేసుకొని వెళ్లటం నిషేధం.

– స్పెషల్ డెస్క్



దుబాయ్‌లో స్థిరపడిన ప్రవాసీయులు

- ఏటా ఓ గ్రామం దత్తత
- ఒక్కొక్క రైతుకు 10-15 వేలు రుణం
- ఇప్పటికే 15మంది రైతులకు సాయం
- పంటలు నష్టపోతే పూర్తి అప్పు మాఫీ
- దుబాయ్‌లో ప్రత్యేక సంస్థ ఏర్పాటుతో కృషి

జగిత్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారంతా 15మంది దుబాయ్‌లో ఒకేచోట ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అందరూ రైతు బిడ్డలే! భూమిపుత్రుల కష్టం విలువ తెలిసి కాబోలు.. తెలుగు రాష్ట్రాల్లోని నిరుపేద రైతులకు అండగా నిలుస్తున్నారు. భూమి ఉన్నా.. పంటల సాగుకు పెట్టుబడి పెట్టే స్థోమత లేని రైతన్నలకు నగదు సాయం అందిస్తున్నారు. ఇచ్చిన మొత్తాన్ని పంట దిగుబడి వచ్చిన తర్వాతే తీసుకుంటున్నారు. అదీ.. వడ్డీలేకుండా. పంట చేతికి అందని రైతులపై ఒత్తిడి చేయడం లేదు. పైగా అలాంటివారికి ఇచ్చిన మొత్తానంతా మాఫీ చేస్తున్నారు. ఈ కార్యక్రమం అమలు కోసం దుబాయ్‌లో 'రైతు బాంధవ' పేరుతో వారంతా కలిసి దుబాయ్‌లో ప్రత్యేక సంస్థను నెలకొల్పారు. ఈ సంస్థ ద్వారా ఇప్పటికే 15మంది రైతులకు సాయం అందింది. వరంగల్‌కు చెందిన రాజా శ్రీనివాస్ రావు ఈ సంస్థకు నాయకత్వం వహిస్తుండగా, చైతన్యసుధ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

సాయం ఇలా..

రైతు బాంధవ సంస్థ ద్వారా ఏటా ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటారు. అక్కడ ఆర్థికంగా చితికిపోయిన రైతులను గుర్తిస్తారు. వారికి పంటల సాగుకు పెట్టుబడి కింద ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు అందిస్తారు. ఇచ్చిన మొత్తాన్ని పంట చేతికొచ్చిన తర్వాత రైతుల నుంచి వడ్డీ లేకుండా తీసుకుని, ఇతర రైతులకు అందిస్తారు. 2016లో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపెల్లిని దత్తత తీసుకున్నారు. గ్రామంలోని 15 మంది రైతులను ఎంపిక చేసి, గత ఖరీఫ్‌లో తలా రూ.10వేల చొప్పున రూ.1.5 లక్షలను పెట్టుబడి సాయం కింద అందజేశారు. కాగా భూమ రాజం అనే రైతు.. దిగుబడి రాక పూర్తిగా నష్టపోయాడని తెలిసి, ఆయన రుణాన్ని మాఫీ చేశారు. మిగిలిన 14 మంది రైతుల నుంచి రూ.1.4 లక్షలను తీసుకొని, ఆ డబ్బును ఈ రబీ సీజన్‌లో మరో 15 మంది రైతులకు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు రాజా శ్రీనివాస్‌రావు కొద్ది రోజుల క్రితం కుమ్మరిపెల్లికి చేరుకున్నారు. పెట్టుబడి తీసుకున్న రైతులతో సమావేశమయ్యారు. రైతులు తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించడంతో ఆ గ్రామంలో మరో 15 మంది రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పెట్టుబడి సాయానికిగాను రైతులను ఎంపిక చేసే బాధ్యతను గ్రామస్థులకే అప్పగిస్తారు. ఇందుకుగాను కుమ్మరి పెల్లిలో నలుగురు సభ్యులతో ఓ కమిటీ వేశారు. కాగా ప్రవాసీయుల కృషిని గ్రామస్థులు అభినందిస్తున్నారు.



కూలీ గోస తప్పింది

మాకు కొంతే భూమి ఉంది. పంట పెట్టుబడికి బ్యాంకు అధికారులు రుణం ఇవ్వమని చెప్పారు. దీంతో సాగు మానేసి కూలీ పనికి సిద్ధమయ్యాం. అయితే, దుబాయ్‌లోని ప్రవాసీయుల సంస్థ మాకు అండగా నిలిచింది. రూ.10 వేల సాయం ఇవ్వడంతో పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసుకున్నాం. మాకు కూలీపని చేసే గోస తప్పింది" - మ్యాదరవేని కొమురవ్వ, మహిళా రైతు, కుమ్మరిపెల్లి

"నేను రైతు కుటుంబం నుంచి వచ్చాను. అందుకే, రైతుల కష్టాలు నాకు తెలుసు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 15 మందిమి ఒకేచోట దుబాయ్‌లో స్థిరపడ్డాం. రైతులకు ఏదైనా చేయాలనే ఆలోచనతో రైతు బాంధవ సంస్థను ఏర్పాటు చేశాం. ఏటా ఒక ట్రెండు గ్రామాలను ఎంపిక చేసుకుని, రైతులకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నాం. పంట నష్టం జరిగిన రైతులకు రుణాలు కూడా మాఫీ చేస్తున్నాం"

-రాజా శ్రీనివాస్‌రావు, రైతు బాంధవ సంస్థ నిర్వాహకుడు



పేద రైతులకు అండ

"పేద రైతులకు 'రైతు బాంధవ' సంస్థ ఎంతో అండగా ఉంటోంది. ఏ బ్యాంకుకు వెళ్లినా మాకు అప్పు పుట్టలేదు. ఈ సంస్థ నాకు రూ.10 వేలు పెట్టుబడి కింద అందించింది. పంట పండాక తిరిగి చెల్లించాను"

- లక్ష్మణ్, రైతు, కుమ్మరిపెల్లి



రైతుల కష్టాలు తొలగించేందుకే



తిరిగొస్తాం.. తీసుకెళ్లండి!

- కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు ప్రతి 8 గంటలకు ఒక కాల్
- కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు
- తెలుగురాష్ట్రాల ఎన్ఆర్ఐ వధువుల నుంచే ఎక్కువగా ఇలాంటి కాల్స్

బెంగళూరు, ఫిబ్రవరి 5: అమ్మాయి తల్లిదండ్రులకు అమెరికా సంబంధం కావాలి. అమెరికాలో అబ్బాయి ఉన్న తల్లిదండ్రులకు.. ఆస్తిపాస్తులు బాగున్న అమ్మాయి సంబంధం కావాలి. ఎన్ఆర్ఐ అల్లుడు దొరికాడని అమ్మాయి కుటుంబం సంతోషిస్తే, అమ్మాయి కన్నా ఆమె వెంట నడిచివచ్చే సిరిసంపదలపైనే అబ్బాయి కుటుంబం కన్నేస్తోంది. అందులో ఏమైనా తేడా జరిగితే కన్నెర్ర చేస్తోంది. మన తెలుగు రాష్ట్రాల నుంచి విదేశాలకు వెళ్లి కాపురాలు చేస్తున్న వివాహితల్లోనే ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు తాజా పరిశీలనలో వెల్లడైంది. 'మరింత కట్నం' వేధింపులను తట్టుకోలేమని, తమను తీసుకెళ్లాలంటూ, ప్రతి 8 గంటలకు ఒకరు చొప్పున తమ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి అభ్యర్థిస్తున్నారని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యాలయం వెల్లడించింది. కొన్నాళ్ల క్రితం ఎన్ఆర్ఐ వధువుల పరిస్థితిపై జాతీయ ప్రజా సహకారం, శిశు అభివృద్ధి సంస్థ నిర్వహించిన అధ్యయన ఫలితాలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేయడం గమనార్హం. ఎన్ఆర్ఐ సమస్యలపై పనిచేసేందుకు గతంలో ప్రవాస భారతీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉండేది. దానిని 2007లో విదేశాంగ మంత్రిత్వ శాఖలో విలీనం చేసి.. ఎమ్ఏడీఏడీ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేశారు. మంత్రిత్వ శాఖలో భాగంగా పని చేసే ఈ విభాగానికి వచ్చే ఎన్ఆర్ఐ ఫిర్యాదుల్లో వివాహ సంబంధమైనవి ఒకటో రెండో తప్పకుండా ఉంటున్నాయి. ఎన్ఆర్ఐ సంబంధాలు చేసుకొన్నవారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన వివాహితల నుంచి తమకు ఎక్కువగా కట్నం సమస్యపై ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఈ విభాగం పేర్కొంది. అబద్ధాలు చెప్పి మోసపు పెళ్లి చేసుకొన్నారంటూ, గుజరాత్, పంజాబ్‌ల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని వెల్లడించింది. అటు అదనపు కట్నం కేసులు, ఇటు వంచనకు గురయిన ఉదంతాలకు సంబంధించి తమకు.. ప్రతి 8 గంటలకు ఒక ఫోన్‌కాల్ చొప్పున రోజుకు మూడు ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొంది. జనవరి 2015 నుంచి నవంబరు 2017 మధ్య కాలంలో, అంటే 1,064 రోజుల్లో 3,328 ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపింది. ఇందులో ఎక్కువ ఫోన్ కాల్స్ అరబ్ దేశాల నుంచి వచ్చాయని, అమెరికా, కెనడా దేశాలు ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయని చెన్నైకు చెందిన ప్రముఖ న్యాయవాది సుధా రామలింగం వివరించారు. ఏపీ, తెలంగాణలకు చెందిన ఎన్ఆర్ఐ వధువుల నుంచి కట్నం సమస్యలపైనే ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని ఆరతీ రావు అనే మాజీ మహిళా దౌత్యాధికారి తెలిపారు. ఏదో చేసుకోవాలి కాబట్టి, పెళ్లికి సిద్ధమవుతున్నారేగానీ, భార్యతో కలిసి ఉండాలనే ఆసక్తి ఎన్ఆర్ఐ అబ్బాయిల్లో కనిపించడంలేదని ఆరతి అన్నారు. వీరంతా తమ భర్తల చేతుల్లో తీవ్ర చిత్రహింసలు అనుభవిస్తున్నారని తెలిపారు. బహ్రెయిన్‌లో ఓ ఎన్ఆర్ఐ భర్త.. తన భార్య డాక్యుమెంట్లను నాశనం చేసి, ఆమెకు కనీసం ఫోన్‌ను కూడా అందుబాటులో లేకుండా చేశాడని ఆరతి వివరించారు. అయితే, తమ దృష్టికి వచ్చిన ఇలాంటి కేసులకు మాత్రమే న్యాయం చేయగలుగుతున్నామని ఆరతి, రామలింగం తెలిపారు. ఎన్ఆర్ఐ సంబంధాలపై మోజును అమ్మాయి తల్లిదండ్రులు వదులుకొన్నప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ప్రముఖ సామాజికవేత్త సమతా దేశ్‌మానే తేల్చిచెప్పారు.



న్యూయార్క్ సీటు కోసం ఇద్దరు ప్రవాస భారతీయుల పోటీ

న్యూయార్క్, ఫిబ్రవరి 5: ఈ ఏడాది నవంబరులో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికలు.. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి గెలిస్తేనే ట్రంప్‌కు అనుకూల పవనాలు వీస్తాయి. ఒకవేళ డెమొక్రాట్లు గెలిస్తే ఆయన తీసుకుంటున్న పలు నిర్ణయాలకు గండి పడినట్లే! అందుకే, అభ్యర్థుల ఎంపికలో రెండు పార్టీలు తెగ కసరత్తు చేస్తున్నాయి. అయితే, న్యూయార్క్ 11వ కాంగ్రెస్ జిల్లా ప్రతినిధుల సభకు పోటీచేసేందుకు డెమొక్రటిక్ పార్టీ టికెట్ కోసం ఇద్దరు ప్రవాస భారతీయులు పోటీ పడుతుండడం విశేషం. భారత సంతతికి చెందిన ఒమర్ వైద్, మోహన్ రాధాకృష్ణన్ ఆ పార్టీ నామినేషన్ పత్రాలు అందుకునేందుకు బరిలో నిలిచారు. గుజరాతీ కుటుంబ నేపథ్యం ఉన్న వైద్ ఇల్లినాయిస్, ఫ్లోరిడాలో పెరిగారు. భిన్నత్వమే తనకు పార్టీ టికెట్ దక్కేలా చేస్తుందని ఆయన ఆశిస్తున్నారు. మోహన్ రాధాకృష్ణన్(27) స్టేటెన్ ఐలాండ్‌లో నివాసముంటున్నారు. ఆయన అక్కడి లేబర్ యూనియన్ నాయకుడు. నామినేషన్ పత్రాలు అందుకునేందుకు వీరిద్దరితో పాటు మరో ఆరుగురు పోటీ పడుతున్నారు. వీరిలో డెమొక్రటిక్ ప్రైమరీ ఎన్నికల్లో గెలిచినవారే ప్రతినిధుల సభకు పోటీ చేసేందుకు అర్హులవుతారు.

గల్ఫ్‌లో 'న్యాయ' కష్టాలు!

బాధితులకు సాయం కరువు.. తీవ్ర ఇబ్బందుల్లో ప్రవాసులు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలంటున్న బాధితులు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

విదేశాల్లో న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే ప్రవాసులకు ఆయా దేశాల్లో ఉండే భారత దౌత్య కార్యాలయాల నుంచి ఎలాంటి సాయం అందడం లేదు! అమెరికా, ఐరోపా, గల్ఫ్ దేశాల్లో ప్రవాస భారతీయులు దురదృష్టవశాత్తు ఏవైనా కేసుల్లో చిక్కుకుంటే న్యాయ సహాయం అందించే విధానం లేదు. కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రం ఢిల్లీ నుంచి విదేశీ వ్యవహారాల శాఖ పరిపాలన, ఆర్థిక అనుమతులు మంజూరు చేస్తేనే ప్రవాసులకు న్యాయ సహాయం అందుతుంది. లేదంటే వారికి దేవుడే దిక్కు! గల్ఫ్ దేశాల్లో అయితే పరిస్థితి మరీ దారుణం. ఒంటెలు, గొర్రెలు, కార్ల దొంగతనాలపై బూటకపు కేసులతో కొందరు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి మరికొందరు.. అష్టకష్టాలు పడుతూ న్యాయ సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. సౌదీ అరేబియాలోని భారత ఎంబసీల నుంచి ఎలాంటి న్యాయ సహాయం అందకపోవడంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 30మందికి పైగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వస్థలాలకు వెళ్లలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇలాంటివారిలో గుంటూరు జిల్లాకు చెందిన షేక్ అరిఫ్‌ది దారుణ పరిస్థితి. గుంటూరులోని సంగడిగుంట చక్కల బజారుకు చెందిన షేక్ అరిఫ్(30) ఓ సౌదీ జాతీయుడితో కలిసి కారులో పనికి వెళ్తుండగా అతను నిద్రమత్తులో నడపడంతో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అరిఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. 3 నెలలు కోమాలో ఉన్న అరిఫ్ మొత్తం ఏడాది పాటు ఆస్పత్రిలోనే ఉన్నాడు. డిశ్చార్జయిన తర్వాత ఉద్యోగం కోసం ప్రయత్నించగా ఆరోగ్యం సహకరించడంలేదు. ముఖ్యంగా అతని అఖమా(రెసిడెన్సీ వీసా) గడువు పూర్తవడంతో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న వ్యక్తిగా మారాడు. గత్యంతరం లేని పరిస్థితుల్లో స్వదేశానికి తిరిగి వెళ్లడానికి ప్రయత్నించగా.. పోలీసు కేసు కారణంగా దేశం విడిచి వెళ్లడం కుదరదని అక్కడి అధికారులు తేల్చారు. కాగా.. అరిఫ్‌కు చికిత్స అందించిన ఆస్పత్రి యాజమాన్యం తమకు సుమారు రూ.36 లక్షలు చెల్లించాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారు న్యాయస్థానానికి నివేదించారు. ఈ మేరకు బిల్లు చెల్లించాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసిందని పోలీసులు తెలిపారు. అయితే.. ఈ కేసులో తాను బాధితుడినంటూ అరిఫ్ కోర్టుకు విన్నవించుకోగా.. ప్రమాదం జరిగిన అల్ బాహా రాష్ట్రానికి కేసును బదిలీ చేస్తూ ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ పాత్రను తెలపాలని కోర్టు సూచించింది. అయితే, అరిఫ్ అఖమా గడువు ముగియడంతో ఇప్పుడతను అల్ బాహా కోర్టుకు వెళ్లలేని పరిస్థితి. కోర్టు తీర్పుల్లో జోక్యం చేసుకోబోమని, న్యాయసలహాలు అందించడం తమ పని కాదంటూ భారత కాన్సులేటు చేతులెత్తేసింది. దీంతో అరిఫ్ పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యిలా తయారైంది.





నేడు సౌదీకి సుష్మ

సౌదీ అరేబియా ప్రభుత్వం ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జనద్రియా ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ మంగళవారం రియాద్ చేరుకోనున్నారు. భారత ఎంబసీ నిర్వహించే ప్రవాస భారతీయుల సమావేశంలో పాల్గొంటారు. బుధవారం జనద్రియా సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభోత్సవంలో సౌదీ అరేబియా ప్రభుత్వ అధికారులతో కలిసి పాల్గొంటారు. సౌదీ సంస్కృతిని ప్రతిబింబించే జనద్రియా ఉత్సవాలకు సౌదీ అరేబియా సర్కారు ఏడాదికో దేశాన్ని అతిథిగా ఆహ్వానిస్తుంది. ఈ ఏడాది భారత్‌ను అతిథిగా ఎంపిక చేసింది. ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన భారతీయ కళలు, సాంస్కృతిక ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ముగింపులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ దినోత్సవాలను నిర్వహించనున్నారు. తెలంగాణ దినోత్సవంలో 'బతుకమ్మ' నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సౌదీ అరేబియా జాతీయ భద్రతా దళాలకు చెందిన ప్రతినిధుల మధ్య బతుకమ్మ ఆడడం, మొత్తం గల్ఫ్ దేశాల్లో ఇదే తొలిసారి కావడం విశేషం.



యూకే వీసా నిబంధనలపై నిరసనలు

భగ్గుమన్న భారతీయ వృత్తి నిపుణులు

యూకే వీసా నిబంధనలపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. భారతీయ వృత్తి నిపుణులు, వలసదారులు లండన్‌లోని నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ వీసా విధానాలు అమానుషం, అక్రమం అని ఆరోపిస్తూ..600 మంది డాక్టర్లు, ఇంజినీర్లు, ఐటీ ఉద్యోగులు, టీచర్లు కుటుంబ సభ్యులతోసహా ఆందోళన చేపట్టారు. 'మేం అత్యంత నైపుణ్యం కల్గిన వాళ్లం. యూకే హోం శాఖ విధానాలతో మాకు అన్యాయం జరుగుతోంది. అందుకే మేమంతా ఓ గ్రూప్‌గా ఏర్పడ్డాం. ప్రభుత్వంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నాం' అని భారతీయ వృత్తి నిపుణుల గ్రూప్ ఓ ప్రకటన విడుదల చేసింది. నేరస్థులు, పన్ను ఎగవేతదారులు లక్ష్యంగా.. యూకే ఇమ్మిగ్రేషన్ యాక్ట్‌లోని సెక్షన్లను ఆయుధంగా చేసుకుని..ఐఎల్ఆర్ అప్లికేషన్లలో జాప్యం లేదా తిరస్కరించడం వల్ల తమకు అన్యాయం జరుగుతోందని భారతీయ వృత్తి నిపుణులు వాపోతున్నారు. నైపుణ్యం కల్గిన వలసదారులు, ఉన్నత విద్యావంతులు, వృత్తి నిపుణులకు ఐఎల్ఆర్ అప్లికేషన్లు తిరస్కరిస్తున్నారు. గతంలో ఎప్పుడో టాక్స్ రిటర్న్స్‌లో చేసిన చిన్న చిన్న తప్పులకు మూల్యం చెల్లించాలంటున్నారు. వాస్తవానికి వాటిని ఎప్పుడో పరిష్కరించుకోవడం జరిగింది' అని నిరసన ప్రదర్శనకు నేతృత్వం వహించిన అదితి భరద్వాజ్ విమర్శించారు. భారత్‌సహా యూరోపియన్ యూనియనేతర విద్యార్థులు, లాంగ్ టెర్మ్ విజిటర్లకు హెల్త్ సర్ఛార్జ్‌ను పెంచే యోచనలో ఉన్నట్లు యూకే ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఏడాదికి ప్రస్తుతం 200 పౌండ్లు ఉన్న హెల్త్ సర్‌చార్జ్‌ని 400 పౌండ్లకు పెంచాలన్న ప్రతిపాదనలపై యూకేలోని భారతీయులు భగ్గుమంటున్నారు.

36 శాతం పెరిగిన దరఖాస్తులు

మరోవైపు యూకే యూనివర్సిటీల్లో చదవడానికి దరఖాస్తు చేసుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 36శాతం పెరిగింది. వివిధ కోర్సుల్లో చేరడానికి 4470 మంది భారతీయ విద్యార్థులు అప్లై చేసినట్లు యూసీఏఎస్ వెల్లడించింది.

గోవా రాజధాని పనాజీలో ఇటీవల రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సమావేశం జరిగింది. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల ప్రయోజనార్థం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో జరిగే సివిల్స్ పరీక్షలకు, రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే గ్రూప్-1 లేదా తత్సమాన పరీక్షలకు 60 శాతం ఉమ్మడి (కామన్) సిలబస్ ఉండాలన్న ప్రతిపాదనకు ఆ సమావేశంలో ఆమోదం లభించింది. ఇది కార్యరూపం దాల్చితే తెలుగు రాష్ట్రాల్లో పోటీ పరీక్షలపరంగా కీలకమైన మార్పులు వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా ముందస్తు సన్నాహక వ్యూహాలను సిద్ధం చేసుకుంటేనే భవిష్యత్‌లో జరిగే ఉద్యోగ నియామక పరీక్షల్లో విజయం సాధించగలం. ఈ నేపథ్యంలో ఆయా పరీక్షల్లో రానున్న మార్పులు, వాటి ప్రభావం ఏ మేరకు ఉంటుంది తదితర అంశాలపై విశ్లేషణ..



టార్గెట్ గ్రూప్స్

గ్రూప్స్, సివిల్స్ ఉమ్మడి సిలబస్..

ముందస్తు వ్యూహం

మన దేశంలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అధిక శాతం మంది ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ప్రయత్నాలు చేస్తుంటారు. ఇందుకోసం సంవత్సరాల తరబడి కష్టపడుతుంటారు. 20-21 ఏళ్లకు సన్నాహాలు ప్రారంభించి 30 ఏళ్ల వరకు కొనసాగిస్తూనే ఉంటారు. విజయం సాధిస్తే ఫర్వాలేదు. కానీ అందుకు భిన్నమైన పరిస్థితి ఏర్పడినప్పుడు విపరీతమైన ఒత్తిడికి లోనవుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ పరిస్థితిని యూపీఎస్సీ నిశితంగా అధ్యయనం చేసింది. దీన్ని అధిగమించే క్రమంలో చేపట్టాల్సిన చర్యల గురించి వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల అభిప్రాయాలను స్వీకరించింది. వాటి ఆధారంగానే పోటీ పరీక్షలను 'క్యాండిడేట్ ఫ్రెండ్లీ'గా మార్చే ఉద్దేశంతో ఉమ్మడి సిలబస్ అనే ప్రతిపాదన వెలుగులోకి వచ్చింది.

దారితీసిన పరిస్థితులు..

డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు.. సివిల్స్, గ్రూప్స్, ఎస్ఐ, ఎస్ఎస్‌సీ, బ్యాంక్స్, పీఎస్‌యూలు.. ఇలా వివిధ రంగాల్లో ఉద్యోగాలకు సిద్ధమవుతుంటారు. ఆయా పరీక్షల సిలబస్ వేర్వేరుగా ఉంటోంది. ఒకదానితో మరొక దానికి సంబంధం ఉండదు. దీంతో నాలుగు నుంచి ఐదు సంవత్సరాల విలువైన సమయాన్ని పోటీ పరీక్షల సన్నద్ధత కోసమే వెచ్చిస్తున్నారు. కొంత మంది గ్రూప్స్ లేదా ఏదో ఒక ఉద్యోగం సంపాదించి తరవాత సివిల్స్ వైపు దృష్టి సారిస్తున్నారు. దీంతో ఆ ఉద్యోగాల కోసం రెండు - మూడేళ్లు, తరవాత సివిల్స్ మరో రెండు - మూడేళ్లు కష్టపడాల్సి వస్తోంది. ఒక పరీక్ష కోసం వెచ్చించిన కాలం మరో పరీక్షకు ఉపయోగపడటం లేదు. దీంతో సమయం వృథాతోపాటు, కొంత వయోపరిమితిని దాటి పోతున్నారు.

ప్రయోజనాలు

- ఈ నేపథ్యంలో సివిల్స్, రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే గ్రూప్-1 లేదా తత్సమాన పరీక్షలకు 60 శాతం ఉమ్మడి (కామన్) సిలబస్ ఉండటం అభ్యర్థులకు లాభం చేకూరుస్తుందనే భావనలో తాజా ప్రతిపాదనను ఆమోదించారు.
- ఎటువంటి ఒత్తిడి లేకుండా ఏక కాలంలో సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధం కావచ్చు.
- సివిల్స్ రాసే అభ్యర్థుల సంఖ్య పెరగొచ్చు.
- ప్రిపరేషన్ భారం కూడా కొంత మేర తగ్గుతుంది.

మార్పులు - ప్రభావం

- ప్రిలిమినరీలో రెండు పేపర్లు: తెలుగు రాష్ట్రాల్లో గ్రూప్-1 పరీక్షలో ప్రిలిమినరీ, మెయిన్స్ అనే రెండు పేపర్లు ఉంటాయి. ప్రిలిమినరీ పరీక్షలో ఒక పేపర్ మాత్రమే ఉంటుంది. దీనికి కేటాయించే మార్కులు 150. ఇందులో అన్ని అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఈ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ప్రతిపాదిత నూతన విధానంలో ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 200 మార్కుల చొప్పున మొత్తం మార్కులు 400.
- మొదటి పేపర్‌లో ప్రధానంగా నాలుగు భాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అవి.. 1) చారిత్రక అంశాలు 2) భారతదేశ సంస్కృతి - వారసత్వం 3) భారత రాజ్యాంగం 4) జనరల్ మెంటల్ ఎబిలిటీ.
- రెండో పేపర్‌లో నాలుగు భాగాలు ఉంటాయి. అవి.. 1) జాగ్రఫీ 2) ఇండియన్ ఎకానమీ 3) సైన్స్ - టెక్నాలజీ 4) అంతర్జాతీయ, జాతీయ వర్తమాన అంశాలు.
- ఇక్కడ అభ్యర్థులు గమనించాల్సిన అంశం.. పేపర్ల వారీగా అడిగే అంశాలను పేర్కొన్నారు. కాబట్టి మార్కుల కేటాయింపు కూడా అదేవిధంగా సమంగా ఉంటుందని భావిస్తే పొరపడినట్లే. అంటే ఒక్కో పేపర్‌లో నాలుగు అంశాలు ఇచ్చారు. కాబట్టి ఒక్కో అంశం నుంచి 50 మార్కులు ఇస్తారు అనుకోవడానికి లేదు. ఏవిభాగం నుంచైనా ఎన్ని ప్రశ్నలైనా ఇవ్వొచ్చు. 2017 సివిల్స్ ప్రిలిమినరీ పేపర్‌ను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.
- గ్రూప్స్‌లో రెండు పేపర్లు గ్రామీణ అభ్యర్థులకు మేలు చేసే అంశమే. ఎందుకంటే ప్రిలిమినరీ పరీక్షలో ఇంగ్లీష్‌ను ప్రవేశపెడితే వడ పోతలో గ్రామీణ అభ్యర్థులు ఎక్కువగా నష్టపోతారు. సివిల్స్ ప్రిలిమ్స్‌లో కూడా సీశాట్ పేపర్‌ను తొలగించి ఒక ఆప్షనల్ లేదా మరో జీఎస్ పేపర్‌ను ప్రవేశ పెట్టవచ్చనే వార్తలకు ఈ మార్పులు బలం చేకూరుస్తున్నాయి.
- ఉమ్మడి సిలబస్ విధానం వల్ల సివిల్స్ అభ్యర్థుల నుంచి బలమైన పోటీ ఏర్పడుతుంది.

ప్రిలిమినరీలో నెగిటివ్

ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే అన్ని రకాల పరీక్షల్లో నెగిటివ్ మార్కుల ప్రస్తావ లేదు. అయితే యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీలో మాత్రం నెగిటివ్ మార్కులు ఉంటాయి. ప్రతి తప్పునకు 1/3 వంతు మార్కుల కోత విధిస్తున్నారు. ప్రతిపాదిత మార్పుల మేరకు ఇదే విధానాన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కూడా అమలు చేసే అవకాశం ఉంది. సాధారణంగా రాత పరీక్షలు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటాయి. చాలా మంది సమాధానాలు తెలియకపోయినా ఇచ్చిన ఐచ్ఛికాల్లో ఒక దాన్ని సమాధానంగా గుర్తిస్తున్నారు. ఇలా ఇవ్వడం ద్వారా ప్రయోజనం పొందేవారూ ఉన్నారు. దాంతో కష్టపడి చదివిన అభ్యర్థులు కొంతమేరకు నష్టపోతున్నారు. కాబట్టి నెగిటివ్ మార్కింగ్‌ను స్వాగతించవచ్చు.

నెగిటివ్ మార్కింగ్‌ను ప్రవేశపెట్టడం వల్ల కచ్చితంగా తెలిస్తేనే సమాధాన్ని గుర్తిస్తారు. అంచనా (గెస్)తో జవాబు ఇచ్చే అవకాశాలు తగ్గుతాయి. తద్వారా కష్టపడి చదివిన అభ్యర్థులు ప్రయోజనం పొందుతారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రిపరేషన్‌తోపాటు ప్రాక్టీస్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. చాలా మంది కేవలం సన్నాహాలపైనే మాత్రం దృష్టి సారించి, ప్రాక్టీస్‌ను విస్మరిస్తుంటారు. అలాకాకుండా ప్రిపరేషన్‌లో భాగంగా ప్రాక్టీస్‌కు చోటు కల్పించాలి. దాన్ని తప్పనిసరి అంశంగా భావించాలి.

భాషా సామర్థ్యాలకు పరీక్ష

ప్రతిపాదిత విధానంలో అభ్యర్థుల భాషా సామర్థ్యాలను తెలుసుకోవడం కోసం ప్రత్యేకంగా పరీక్షలను నిర్వహించాలని సూచించారు. ఆ మేరకు ఇంగ్లీష్, ప్రాంతీయ భాషల్లో ప్రత్యేక పేపర్లను ప్రవేశపెడతారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ భాష పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు ఎటువంటి పరీక్ష నిర్వహించడం లేదు. దీంతో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు అభ్యర్థులు కూడా తెలుగు రాష్ట్రాల సర్వీసులకు ఎంపికవుతున్నారు. కానీ ఆయా రాష్ట్రాల్లో మాత్రం మాతృభాషలో పరీక్షలు నిర్వహిస్తుండటం గమనించాల్సిన విషయం. ప్రతిపాదిత విధానంలో తెలుగులో పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు ఒక పేపర్‌ను, ఇంగ్లీష్ భాషకు మరొక పేపర్‌ను కేటాయిస్తారు. అర్హతగా కాకుండా వీటిల్లో వచ్చిన మార్కులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నేపథ్యంలో తెలుగు మాధ్యమం అభ్యర్థులు ఇంగ్లీష్ భాషపై, ఆంగ్ల మాధ్యమం అభ్యర్థులు తెలుగు భాషపై అవగాహన పెంచుకోవాలి.



డాక్టర్ పి.వి. లక్ష్మయ్య
(డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ స్టడీ సర్కిల్)

మెయిన్స్ వెయిటేజీ మార్పు

- ప్రతిపాదిత విధానం మేరకు గ్రూప్-1 మెయిన్స్‌లో ఆరు పేపర్లు ఉంటాయి. వీటికి ఒక్కో దానికి 150 మార్కుల చొప్పున మొత్తం మార్కులు 900. అయితే ఈ విధానంలో గతంలో ఉన్న కొన్ని సబ్జెక్ట్‌ల ప్రాముఖ్యతను తగ్గించడం లేదా పూర్తిగా తొలగించే అవకాశం ఉంది. కాబట్టి మెయిన్స్ వెయిటేజీ మారొచ్చు. అధికారికంగా వివరాలు వెల్లడైతే ఈ విషయంపై స్పష్టత వస్తుంది.
- **ఇంటర్వ్యూ మార్కుల పెంపు:** ఇంటర్వ్యూకు కేటాయిస్తున్న మార్కులను కూడా పెంచే ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం గ్రూప్-1లో ఇంటర్వ్యూ 75 మార్కులకు ఉంటుంది. దీన్ని 100 మార్కులకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అసలు సవాలు.. ప్రిలిమ్సే

- మరో కీలకమైన మార్పు ప్రిలిమినరీ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక సంఖ్యను భారీగా తగ్గించడం. ప్రస్తుతం ప్రిలిమినరీ పరీక్ష ద్వారా మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. దాంతో చాలా మంది ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తామనే భావనలో మెయిన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అర్హత పొందితే చాలనే భావనలో ప్రిలిమ్స్‌పై అంతగా దృష్టిసారించడం లేదనే వాదన బలంగా వినిపించేది. దీనికి చెక్ పెట్టేందుకు నూతన విధానంలోప్రిలిమినరీ ద్వారా మెయిన్స్‌కు ఎంపిక చేసే అభ్యర్థుల సంఖ్యను భారీగా కుదిస్తారు. 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఈ నేపథ్యంలో తక్కువ మందికి మాత్రమే మెయిన్స్ అవకాశం లభిస్తుంది. అంటే ప్రిలిమ్స్‌లో గట్టెక్కడమే సవాలుగా మారుతుంది.
- కాబట్టి ప్రిలిమ్స్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.
- గతంలో మాదిరిగా కేవలం అర్హత సాధిస్తే చాలనే భావన పనికిరాదు. అన్ని సబ్జెక్ట్‌లను సమగ్రంగా చదివితేనే మెయిన్స్‌కు అర్హత సాధిస్తారు.
- ఈ క్రమంలో అభ్యర్థులు ప్రిపరేషన్‌తోపాటు సాధ్యమైనన్ని నమూనా పరీక్షలు రాయడం అలవాటు చేసుకోవాలి.
- 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. కాబట్టి రిజర్వేషన్లు కలిగిన అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధిస్తే ఉద్యోగాలు సాధించే అవకాశాలు మరింత మెరుగవుతాయి.

రుతువుల వర్గీకరణ

భారత వాతావరణ సంస్థ శీతోష్ణ పరిస్థితుల ఆధారంగా ఏడాదిని నాలుగు రుతువులుగా వర్గీకరించింది. అవి.. మార్చి-మే నెల వరకు వేసవి కాలం, జూన్-సెప్టెంబరు వరకు నైరుతి రుతుపవన కాలం, సెప్టెంబరు రెండో వారం-నవంబరు వరకు ఈశాన్య రుతుపవన కాలం, డిసెంబరు- ఫిబ్రవరి వరకు శీతాకాలం. భారతదేశాన్ని రుతుపవన దేశంగా పరిగణిస్తారు. దీనికి కారణాలు..

- భారతదేశానికి ఉత్తరంగా విశాల భూభాగం, దక్షిణాన జలభాగం విస్తరించి ఉండటం.
- ఉత్తరాన హిమాలయాలు పెట్టని కోటలా ఉండటం.
- అంతర అమన అభిసరణ రేఖ ఉత్తరానికి జరగడం.
- పశ్చిమ జెట్ ప్రవాహాలు
- పశ్చిమ కల్లోలాలు

భారతదేశంలో సాధారణంగా ఉష్ణమండల రుతుపవన శీతోష్ణస్థితి కనిపిస్తుంది. ఇక్కడి వాతావరణాన్ని అధ్యయనం చేయడానికి కోల్‌కతాలో 'భారత వాతావరణ సంస్థ'ను (1875)లో ఏర్పాటు చేశారు. దీన్ని 1905లో సిమ్లాకి, ఆ తరవాత 1928లో పుణెకి మార్చారు. ప్రస్తుతం ఈ సంస్థ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. దీనికి సంబంధించిన ప్రాంతీయ కేంద్రాలు ముంబై, చెన్నై, నాగపూర్, కోల్‌కతా, గౌహతిలో ఉన్నాయి.

సూర్యకిరణాలు

నిలువుగా పడితే..

వేసవి కాలం

భారతదేశంలో సూర్యుడు మార్చి 21న భూమధ్య రేఖ నుంచి ప్రారంభమై ఉత్తరం వైపు ప్రయాణిస్తాడు. మూడు నెలల తరవాత జూన్ 21 నాటికి కర్కట రేఖపైకి చేరతాడు. ఈ క్రమంలోనే భారత ఉపఖండంపై సూర్య కిరణాలు నిట్టనిలువుగా పడటంతో ఉష్ణోగ్రత తీవ్రత పెరుగుతుంది. దాంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేసవిలో థార్ ఎడారి నుంచి ఉత్తర మైదానాలవైపు వీచే గాలులను 'లూ' పవనాలు అంటారు. వీటిని అత్యంత దుర్భరమైన గాలులుగా పరిగణిస్తారు. వేసవి కాలంలో సంవహన ప్రక్రియ కారణంగా చిరుజల్లులు కురుస్తుంటాయి. వీటిని వివిధ పేర్లతో పిలుస్తారు. అవి..

రాష్ట్రం	చిరుజల్లు పేరు
ఉత్తరప్రదేశ్	అంధిలు
పశ్చిమ బెంగాల్, జార్ఖండ్	కాలా బైశాఖి
అసోం	నార్వెస్టర్లు
కర్ణాటక	చెర్రీ బ్లొజమ్స్
దక్షిణ భారతదేశం	మాంగో షోవర్స్

భారతదేశంలో అత్యధిక / సాధారణ ఉష్ణోగ్రతలు మేలో నమోదవుతుంటాయి. జైసల్మేర్ ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రత రికార్డవుతుంది.

రుతుపవనాల ప్రవేశం

వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రత కారణంగా భారత ఉపఖండంలో అల్ప పీడన పరిస్థితులు ఏర్పడతాయి. దీంతో రుతుపవనాలు భారత్‌వైపు మళ్లుతాయి. ఈ క్రమంలోనే ఉత్తరార్ధ గోళంలోని సైబీరియా అధిక పీడన ప్రాంతం నుంచి చల్లని పొడి గాలులు భారత ఉప ఖండంపైకి వీస్తాయి. ఇవి భారత్‌లోకి ప్రవేశించకుండా హిమాలయాలు అడ్డుపడతాయి. దక్షిణార్ధ గోళంలోని హిందూ మహా సముద్రంపై ఉన్న అధిక పీడన గాలులు నీటి ఆవిరితో నిండి భూ మధ్య రేఖను దాటి కుడివైపునకు ఒంగి నైరుతి దిశ నుంచి భారత్‌లోకి ప్రవేశిస్తాయి. వీటినే నైరుతి రుతుపవనాలు అంటారు. వీటినే దక్షిణార్ధ గోళంలో ఆగ్నేయ వ్యాపార పవనాలని పిలుస్తారు.

నైరుతి రుతుపవనాలు

అండమాన్ దీవుల నుంచి మొదటగా నైరుతి రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. నైరుతి రుతుపవనాలు మే చివరి వారంలో అండమాన్ దీవులను చేరి జూన్ 1 నాటికి కేరళ తీరాన్ని తాకుతాయి. జూన్ 10 నాటికి ముంబై తీరానికి, జూన్ 15 నాటికి గుజరాత్ తీరానికి, జూలై 15 నాటికి దేశమంతటా విస్తరిస్తాయి. భారతదేశానికి 75 శాతం వరకు వర్షపాతం నైరుతి రుతుపవనాల ద్వారానే సంభవిస్తుంది. ఇవి భారత్‌లో ప్రవేశించే ముందు అరేబియా శాఖ, బంగాళాఖాతపు శాఖలుగా విడిపోతాయి.

అరేబియా శాఖ

ఇది తీరంలో అధిక వర్షపాతాన్ని కలిగిస్తుంది. పశ్చిమ కనుమలను దాటి మధ్య భారతదేశం, తూర్పు కనుమల్లో వర్షించి పొడి పవనాలుగా మారి బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్కడి బంగాళాఖాత శాఖతో కలుస్తాయి. అరేబియా శాఖలోని మరో శాఖ వాయవ్య భారతదేశంలోకి ప్రవేశిస్తుంది. ఆరావళి పర్వతాలు అడ్డుపడకపోవడంతో స్వల్పంగా వర్షించడమే కాకుండా థార్ ఎడారి ఏర్పడటంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అక్కడి నుంచి ఉత్తరానికి ప్రయాణించే క్రమంలో వాటికి హిమాలయాలు అడ్డురావడంతో తూర్పు వైపుగా మరలుతాయి. ఈ అరేబియా శాఖ పశ్చిమ ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో తూర్పు వైపు నుంచి వచ్చే అరేబియా శాఖతో కలుస్తాయి.

బంగాళాఖాతపు శాఖ

బంగాళాఖాతపు నైరుతి రుతుపవన శాఖ అండమాన్ దీవుల్లో అధిక వర్షపాతాన్నిస్తుంది. ఇది ఈశాన్య దిశగా ప్రయాణించే క్రమంలో పూర్వాంచల్ పర్వతాలు అడ్డగించడంతో స్వల్ప వర్షపాతాన్నిచ్చి మయన్మార్ వైపు ప్రయాణిస్తాయి. వీటిలో కొన్ని పవనాలు ఉత్తర దిశగా వీస్తాయి. వీటికి కూడా హిమాలయాలు అడ్డురావడంతో తూర్పు వైపునకు మరలుతాయి. ఇదే ప్రాంతంలో నీటి ఆవిరితో నిండిన అరేబియా శాఖ పవనాలకు మేఘాలయలోని గారో, ఖాసీ కొండలు అడ్డురావడంతో ఇక్కడ అత్యధికంగా వర్షం పడుతుంది. అందుకే ఈ ప్రాంతాల్లోని మాసిన్‌రామ్, చిరపుంజి ప్రాంతాలు ప్రపంచంలోకెల్లా అత్యధిక వర్షపాతాన్ని పొందుతున్నాయి. చిరపుంజిని 'సోహ్రా' అని కూడా పిలుస్తారు.


వర్షాభావ ప్రాంతాలు

నైరుతి రుతుపవనాలతో దేశంలో అత్యధిక వర్షపాతం నమోదవుతున్నప్పటికీ.. తమిళనాడు తీరం, పశ్చిమ కనుమల తూర్పు ప్రాంతం, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతాలకు అసలు వర్షపాతం లభించదు. ఉత్తర మైదానాల్లో తూర్పు నుంచి పశ్చిమానికి వచ్చే సరికి వర్షపాతం క్రమంగా తగ్గుతుంటుంది.

ఈశాన్య రుతుపవనాలు

ఇవి సెప్టెంబరు మధ్య కాలం నుంచి భారత్‌వైపు వీస్తుంటాయి. ఈ కాలంలో సూర్యుని గమనం భూమధ్య రేఖ నుంచి మకర రేఖవైపునకు ఉంటుంది. ఇదే సమయంలో నైరుతి రుతుపవనాలతో దేశంలోని అధిక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుంది. దీంతో వాతావరణం క్రమంగా చల్లబడి అధిక పీడన ప్రాంతాలు ఏర్పడతాయి. ఇదే క్రమంలో భూమధ్య రేఖపై సూర్యుని ప్రభావంతో అల్ప పీడన ప్రాంతాలు ఉంటాయి. వీటిని విస్తరించడం కోసం భారత భూభాగం, మయన్మార్ దేశం మీదుగా గాలులు భారత ఈశాన్య ప్రాంతం నుంచి తూర్పు తీరానికి తాకుతూ వీస్తుంటాయి. వీటినే ఈశాన్య రుతుపవనాలు లేదా తిరోగమన నైరుతి రుతుపవనాలు అని కూడా పిలుస్తారు. వీటి ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు తీరంతోపాటు రాయలసీమ జిల్లాల్లో కూడా అత్యధికంగా వర్షాలు పడతాయి. ఈశాన్య రుతుపవనాలు సాధారణంగా తుపానులతో కూడిన వర్షాలనిస్తాయి. అందుకే బంగాళాఖాతంలో అక్టోబరు, నవంబరు మాసాల్లో అధికంగా తుపానులు ఏర్పడతాయి. డిసెంబరు నుంచి దేశం మొత్తమ్మీద ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. కొద్ది కాలం తరవాత ఉత్తరం నుంచి దక్షిణానికి వెళ్లే కొద్దీ క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి.

పోటీ పరీక్షల ప్రత్యేకం
జాగ్రఫీ



ఎల్‌నినో

అయిదు నుంచి ఏడేళ్లకోసారి దక్షిణ అమెరికా ఖండానికి చెందిన పెరూ తీర ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్ర జలాలు సాధారణ స్థాయి కంటే అధికంగా వేడెక్కి అల్పపీడన పరిస్థితులను కలిగిస్తాయి. దీంతో భారత దేశంలోకి ప్రవేశించే రుతుపవనాలు ఆకర్షితమౌతాయి. ఈవిధంగా భారత్‌లోకి రావాల్సిన రుతుపవనాలు పెరూ తీరం వైపు కదలడంతో దేశంలో వర్షపాతం తగ్గి కరవు పరిస్థితులు ఏర్పతాయి. ఈ స్థితినే 'ఎల్‌నినో' అంటారు. ఇది స్పానిష్ భాషా పదం. ఈ పరిస్థితి సాధారణంగా డిసెంబరులో ఏర్పడుతుంది. అందుకే దీన్ని 'బాల ఏసు' అని కూడా అంటారు.

శీతాకాలం

జనవరి నెలలో దేశవ్యాప్తంగా అత్యల్ప ఉష్ణోగ్రత ఉంటుంది. శీతాకాలంలో ఉత్తర భారతదేశంలో పశ్చిమ కల్లోలాలతో కొద్దిపాటి వర్షం కురుస్తుంది. ఇది గోధుమ పంటకు అనుకూలం. మధ్యధరా ప్రాంతంలోని అలజడుల కారణంగా పశ్చిమ కల్లోలాలు ఏర్పడతాయి. ఇవి క్రమంగా ట్రోపో ఆవరణంపై భాగానికి ప్రయాణించి పశ్చిమ జెట్ ప్రవాహాల ద్వారా తూర్పువైపునకు మళ్లి, ఉత్తర ప్రాంతాలకు కూడా విస్తరించి వర్షాన్నిస్తాయి.



ఎస్.వి. నారాయణ
సీనియర్ ఫ్యాకల్టీ

జాబ్ కార్నర్

రైట్స్ లిమిటెడ్

రైట్స్ లిమిటెడ్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- మొత్తం ఖాళీలు: **32**
- పోస్టులు: అడిషనల్ జనరల్ మేనేజర్ (ఎలక్ట్రికల్) 3, టెక్నికల్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్ 9, సివిల్ 10), అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) 10
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 21
- వెబ్‌సైట్: www.rites.com

బామర్ లారీ

బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్ - ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ (కస్టమర్ క్లియరెన్స్) అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- మొత్తం ఖాళీలు: **42**
- అర్హత: 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 21 ఏళ్లు మించరాదు
- ఎంపిక: రాత పరీక్ష / ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 15
- వెబ్‌సైట్: www.balmerlawrie.com

ఏపీ సీఆర్‌డీఏ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్‌డీఏ) - తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ఖాళీలు: **7**
- పోస్టులు: సీనియర్ స్ట్రక్చరల్ ఇంజనీర్ 1, సీనియర్ పవర్ ఇంజనీర్ 1, సీనియర్ వాటర్ అండ్ సీవరేజ్ ఇంజనీర్ 1
- అర్హత: సంబంధిత విభాగంలో ఎంటెక్ ఉత్తీర్ణతతోపాటు కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 17
- పోస్టులు: రీసెర్చ్ అసోసియేట్ - అర్బన్ డిజైన్ 1, రీసెర్చ్ అసిస్టెంట్ - అర్బన్ డిజైన్ 1, రీసెర్చ్ అసోసియేట్ లివబిలిటీ 1, రీసెర్చ్ అసిస్టెంట్ - లివబిలిటీ 1
- అర్హత: అసోసియేట్ పోస్టులకు సంబంధిత విభాగంలో ఎంటెక్, అసిస్టెంట్ పోస్టులకు బిఆర్క్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 16
- వెబ్‌సైట్: www.crda.ap.gov.in

కాంట్రాక్ట్ టీచర్లు

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఐఐటి, నీట్ మెడికల్ అకాడమీల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- బోధనా విభాగాలు: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఇంగ్లీషు, తెలుగు
- ఖాళీలు ఉన్న అకాడమీలు: ఈడ్పుగల్లు, విజయవాడ (బాలికలు), గుంటూరు (బాలురు), చిన్న టేకూరు, కర్నూలు (బాలురు)
- అర్హత: ఐఐటి/ నిట్‌ల్లో డిగ్రీ/ పీజీ పూర్తిచేసి ఉండాలి. ఐఐటి జెఇఇ/ నీట్ శిక్షణలో కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి.
- వేతనం: సైన్స్ విభాగాలకు ఏడాదికి 9 నుంచి 12 లక్షల వరకు, భాషా విభాగాలకు రూ.3,60,000 నుంచి 6,00,000 వరకు వార్షిక వేతనం ఉంటుంది.
- ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డెమో ద్వారా
- రాత పరీక్ష: ఫిబ్రవరి 18న
- ఇంటర్వ్యూలు: ఫిబ్రవరి 23, 24న
- డెమో: ఫిబ్రవరి 26న
- ఫలితాల విడుదల: ఫిబ్రవరి 28న
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 10
- వెబ్‌సైట్: apswreis.info

సీనియర్ రీసెర్చ్ ఫెలోస్

హైదరాబాద్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్ (క్రీడా)- తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
- ఖాళీలు: **5** (సీనియర్ రీసెర్చ్ ఫెలో 4, ఫీల్డ్ అసిస్టెంట్ 1)
- కాంట్రాక్టు వ్యవధి: రెండేళ్లు
- అర్హత: పీజీ (ఆగ్రోనమీ/ సాయిల్ సైన్స్/ సాయిల్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్)తోపాటు నెట్ అర్హత ఉండాలి. లేదా పిహెచ్‌డి పూర్తిచేసి ఉండాలి. ఫీల్డ్ అసిస్టెంట్‌కు బిఎస్సీ పూర్తిచేసి కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.
- వయసు: పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించరాదు.
- ఇంటర్వ్యూ: ఫిబ్రవరి 12న
- వెబ్‌సైట్: www.crida.in

శ్రీశాంత్ కేసులో బీసీసీఐకి కోర్టు నోటీసులు



న్యూఢిల్లీ: తనపై విధించిన జీవితకాల నిషేధాన్ని సవాలు చేస్తూ క్రికెటర్ శ్రీశాంత్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని బీసీసీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. శ్రీశాంత్ పిటిషన్‌ను సోమవారం విచారణకు స్వీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఖన్విల్కర్, చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం..నాలుగు వారాల్లోపు తమ స్పందనను దాఖలు చేయాలని బోర్డు, క్రికెట్ పాలకమండలిని ఆదేశించింది. 2013లో ఐపీఎల్ ఫిక్సింగ్ కుంభకోణంలో శ్రీశాంత్‌పై బీసీసీఐ జీవితకాల నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అయితే కేరళ హైకోర్టుకు చెందిన ఏకసభ్య ధర్మాసనం ఆ నిషేధాన్ని కొట్టివేసింది. కానీ అదేకోర్టు డివిజన్ బెంచ్ మాత్రం ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. దాంతో అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.



వరల్డ్‌కప్ హీరోలకు ఘన స్వాగతం

ముంబై: అండర్-19 వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టుకు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం తెల్లవారుజామున భారత జట్టు ఛత్రపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) సీనియర్ అధికారులు పృథ్వీ షా సేనకు స్వాగతం పలికారు. విశ్వవిజేతలకు వెల్‌కమ్ చెప్పడానికి అభిమానులు భారీ సంఖ్యలో ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.

ఫైనల్‌స్థాయి ఆట కాదది

రాహుల్ ద్రావిడ్

ముంబై: అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో భారత కుర్రాళ్లు ఎనిమిది వికెట్ల తేడాతో ఆసీస్‌పై ఘన విజయంతో ట్రోఫీ దక్కించుకున్నారు. కానీ కోచ్ ద్రావిడ్ మాత్రం తుదిపోరులో యువ ఆటగాళ్లు 'నెంబర్ వన్' గేమ్ ఆడలేదని అంటున్నాడు. టైటిల్ విజయానికి భారత్ పూర్తిగా అర్హమైనదేనని చెప్పిన అతడు..'క్వార్టర్స్‌లో బంగ్లాపై, సెమీస్‌లో పాకిస్థాన్‌పై మాదిరి మేం ఫైనల్లో ఆడలేదు. అయితే తుదిపోరు కుర్రాళ్లకు ఓ మంచి అనుభవం' అని పేర్కొన్నాడు.

క్లిష్టమైన పయనం : షా

ముంబై సమీప విరార్ నుంచి అండర్-19 ప్రపంచకప్ వేదిక మౌంట్‌మాంగను వరకూ తన పయనం ఎంతో క్లిష్టమైనదిగా కెప్టెన్ పృథ్వీషా అభివర్ణించాడు. జట్టు వరల్డ్‌కప్ ను గెలుచుకున్న క్షణాలను మాటల్లో చెప్పలేనని ఉద్వేగంగా అన్నాడు. 'వరల్డ్ కప్ సాధించిన జట్టు కెప్టెన్‌గా నా అనుభూతిని మాటలలో వర్ణించలేను. ఇందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు' అని తాను ఈ స్థాయికి చేరుకోవడం వెనుక ఘనత తండ్రిదే అని అన్నాడు. ప్రపంచకప్‌లో.. వ్యూహాలను పక్కాగా అమలు పరిచామని, అందుకు ప్రతి ఆటగాడు ఎంతో గర్విస్తున్నాడని పృథ్వీ షా చెప్పాడు.

స్వదేశంలో ఏ జట్టునైనా మెడలు వంచి వెనక్కి పంపగల సామర్థ్యం దక్షిణాఫ్రికా జట్టుది. ఎంతటి పటిష్ఠ జట్టు అయినా సరే తమ డెన్‌లోకి వస్తే సఫారీలు చెడుగుడు ఆడేస్తారు. బౌన్స్, పేస్ పిచ్‌లే వారి బలం. కానీ ఆ బౌన్స్‌నే తమ బలంగా మార్చుకుని ఈసారి వారి కోరలు పీకే పనిని మన స్పిన్నర్లు తీసుకున్నారు. దక్షిణాఫ్రికా పిచ్‌లపై పేసర్లు లాభపడతారని అంతా అనుకునేదే. కానీ లెగ్గీ ద్వయం యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌ల మణికట్టు మాయాజాలంలో పడి ఎలా తేరుకోవాలో వారికి అర్థం కావడం లేదు. ఇప్పటిదాకా జరిగిన రెండు వన్డేల్లో ప్రధాన భూమిక వారిదే. ఇక సఫారీ నేలపై భారత్‌కు తొలి వన్డే సిరీస్‌ను అందించడం కూడా వీరి భుజస్కంధాలపైనే ఉంది. స్వదేశంలోనే కాదు.. విదేశీ గడ్డపై కూడా సత్తా చూపగలమని ఈ స్పిన్ స్టార్స్ నిరూపిస్తుండడం నిజంగా జట్టుకు శుభసూచకం..

కోరలు పీకేస్తున్నారు

- సఫారీల పనిపడుతున్న చాహల్, కుల్దీప్
- జట్టుకు భరోసాగా మారిన జోడీ



యజ్వేంద్ర చాహల్
కుల్దీప్ యాదవ్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భారత స్పిన్ విభాగం మొత్తం యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌ల చుట్టే తిరుగుతుందనడంలో అతిశయోక్తి లేదు. ఏ ముహూర్తాన ఈ ఇద్దరూ జట్టులో ప్రవేశించారో కానీ తామాడిన ప్రతి మ్యాచ్‌లోనూ దాదాపు అదరగొడుతున్నారు. తమకు మాత్రమే సాధ్యమయ్యే వైవిధ్యమైన బంతులతో చెలరేగిపోతూ ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తున్నారు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న 6వన్డేల సిరీస్‌లో ఇప్పటిదాకా 2మ్యాచ్‌లు జరిగాయి. ఈ రెండింటి గురించి ఓసారి ఆలోచిస్తే అందరి మదిలో నిలిచేది వీరిద్దరే. వీరిధాటికి ప్రత్యర్థి భారీస్కోర్లు చేయలేకపోతుండడంతో భారత బ్యాట్స్‌మెన్‌కు ఎక్కువగా ఆడే అవకాశమే రావడం లేదు. సిరీస్‌లో 2-0 ఆధిక్యంతో కొనసాగుతున్నామంటే దీనికి చాహల్, కుల్దీప్ స్పిన్ మాయే కారణం. వాస్తవానికి కొంతకాలం వరకు కూడా స్పిన్నర్లు అశ్విన్, జడేజా లేని భారత జట్టును ఊహించలేదు. అన్నిఫార్మాట్లలోనూ వీరికి ప్రత్యామ్నాయమనేది లేకుండా చోటు దక్కేది. కానీ గతేడాది నుంచి వారి ప్రభ తగ్గిపోయి టెస్టులకు మాత్రమే పరిమితం కావాల్సి వచ్చింది. అశ్విన్ చివరివన్డే గతజూన్‌లో ఆడగా జడేజా జూలైలో ఆడాడు. అప్పటినుంచి భారత వన్డే, టీ20ల స్పిన్ భారం చాహల్, కుల్దీప్‌లదే. శ్రీలంక, ఆసీస్, కివీస్‌లతో జరిగిన సిరీస్‌లకు ఆ సీనియర్లను పక్కనపెట్టి ఈ యువ స్పిన్నర్లపై టీమ్ మేనేజ్‌మెంట్ గట్టి నమ్మకాన్నే ఉంచింది. దీన్ని వీరిద్దరు రెండు చేతులతో ఒడిసిపట్టుకున్నారు.

ఆరంభం నుంచే అదుర్స్..: అంతర్జాతీయ క్రికెట్‌లో చాహల్, కుల్దీప్ సులువుగా ఒదిగిపోయారనే చెప్పవచ్చు. ఎందుకంటే జట్టులోకి వచ్చింది మొదలు తమ కెప్టెన్, కోచ్‌ల ప్రణాళికలకు అనుగుణంగా రాణిస్తూ కొండంత భరోసా కల్పిస్తున్నారు. అయితే గతేడాది భారత్‌లో పర్యటించిన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక జట్లపై ఈ లెగ్గీస్ అద్భుతంగా రాణించినా విదేశీటూర్లలో ఏమేరకు ఆకట్టుకుంటారనే అనుమానం వ్యక్తమైంది. కానీ పేసర్లకు స్వర్గధామంలా నిలిచే దక్షిణాఫ్రికా పిచ్‌లపై అద్భుతంగా రాణిస్తున్నారు. అకుంఠిత దీక్షతో వీరు చెలరేగుతున్న తీరు చూస్తుంటే ఆ సంశయాలన్నీ పటాపంచలైనట్టే. భారత్ 'ఎ' తరఫున చాహల్‌కు ఇక్కడ పర్యటించిన అనుభవముంది. ఇక ఈ రెండు వన్డేల్లోనూ చాహల్, కుల్దీప్ ఏకంగా 13వికెట్లు నేలకూల్చారు. తొలివన్డేలో చాహల్ తన పది ఓవర్లలో 45 రన్స్‌కు 2వికెట్లు తీశాడు. కుల్దీప్ పది ఓవర్లలో 34 రన్స్‌కు 3వికెట్లు తీయగలిగాడు. ఇక సెంచూరియన్‌లో చాహల్ సఫారీల పతనానికి నేతృత్వం వహించాడు. కెరీర్‌లో తొలిసారిగా 5వికెట్లతో చెలరేగగా కుల్దీప్ 3 వికెట్లు తీశాడు. ఓ దశలో 51/1తో పటిష్ఠంగా కనిపించిన ఆజట్టు వీరి రాకతో కకావికలమైంది. స్లో టర్న్‌తో సహకరిస్తున్న పిచ్‌పై వీరు విజృంభించి వారికి సొంతగడ్డపై అత్యల్పస్కోరును రుచి చూపించారు.

'పేస్'తోనే కొడుతున్నారు: దక్షిణాఫ్రికాలో ఎలా విజయవంతం కావాలనే రహస్యాన్ని చాహల్, కుల్దీప్ తెలుసుకున్నట్టే అనిపిస్తోంది. డర్బన్‌లో జరిగిన తొలి వన్డేలో గోధుమ వర్ణం కలిగిన పిచ్‌పై ప్రొటీస్ బ్యాట్స్‌మెన్ ఆరంభం నుంచే స్పిన్‌పై ఎదురుదాడికి దిగాలని ప్రయత్నించారు. కానీ అదేదీ వీరిద్దరి బౌలింగ్‌పై ప్రభావం పడలేదు. లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి ఫలితం సాధించారు. ఇక సెంచూరియన్ పిచ్ కాస్త టర్నవడంతో చెలరేగారు. దక్షిణాఫ్రికాలో వికెట్ వేగంగా స్పందిస్తుందనే విషయం వారికి తెలుసు. ఇది స్పిన్నర్లకు కాస్త సహాయకరంగా ఉంటుంది. భారత్‌లో ఆడినప్పుడు బంతి వికెట్ మీదకు నెమ్మదిగా వస్తుంటుంది. దీంతో బ్యాట్స్‌మెన్ ఆడేందుకు సమయం దొరుకుతుంది. దీంతో ఇక్కడి బౌన్స్‌ను బౌలింగ్‌కు అనుకూలంగా మార్చుకుని వికెట్లు తీయగలుగుతున్నారు. ఎందుకంటే బ్యాట్స్‌మెన్‌కు బ్యాక్‌ఫుట్ వెళ్లి ఆడేందుకు ఎక్కువ సమయం చిక్కదు. నిజానికి భారత్‌లో కన్నా ఇక్కడ బౌలింగ్ చేయడమే ఎక్కువగా ఆస్వాదిస్తున్నట్టు చెబుతున్న చాహల్, కుల్దీప్ సఫారీ టూర్‌ను ఎంతలా ఎంజాయ్ చేస్తున్నారో అర్థమవుతోంది.

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు ముందు చాహల్, కుల్దీప్ కలిసి 25.41 సగటుతో 22వికెట్లు తీశారు. ఇక ఎకానమీరేట్ ఓవర్‌కు 5పరుగులకన్నా ఎక్కువే. అయితే ప్రస్తుతం రెండు వన్డేల్లో 11.61 సగటుతో 13వికెట్లు పడగొట్టగా ఎకానమీరేట్ ఓవర్‌కు 3.74 మాత్రమే ఉండడం వీరి బౌలింగ్ ఎదుర్కొనేందుకు ప్రొటీస్ బ్యాట్స్‌మెన్ పడుతున్న ఇబ్బందిని సూచిస్తోంది. విచిత్రమేమంటే.. దక్షిణాఫ్రికా జట్టులో ఉన్న స్పిన్నర్లు తాహిర్, షంసీ మాత్రం ఇప్పటిదాకా వికెట్ తీయలేకపోయారు.

ఈసారి డికాక్ వంతు

- భారత్‌తో సిరీస్‌కు దూరం



కేప్‌టౌన్: భారత్‌తో ఆరు వన్డేల సిరీస్ ప్రారంభానికి ముందు నుంచే దక్షిణాఫ్రికాకు దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉంది. డివిల్లీర్స్, కెప్టెన్ డుప్లెసిస్ లేకపోవడంతో పాటు ఇప్పటికే రెండు మ్యాచ్‌లు కోల్పోయిన సఫారీలు.. ఇప్పుడు వికెట్ కీపర్ డికాక్‌ను కూడా కోల్పోవాల్సి వచ్చింది. ఎడమచేయి మణికట్టు గాయం కారణంగా అతను మిగిలిన నాలుగు వన్డేలకు దూరం కానున్నాడు. అతనికి రెండు నుంచి నాలుగు వారాల పాటు విశ్రాంతి అవసరముంది. రెండు వన్డేల్లో 34, 20 పరుగులు చేసిన డికాక్ స్థానంలో హెన్రిక్ క్లాసెన్ మూడో వన్డేలో అరంగేట్రం చేసే అవకాశం ఉంది. మూడో వన్డే బుధవారం జరగనుంది.

అమ్మాయిలూ అదుర్స్

- తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై భారత్ విజయం
- పేసర్ జులన్ గోస్వామికి 4 వికెట్లు
- రాణించిన స్మృతి మంధాన



జులన్


కింబర్లే: సుదీర్ఘ విరామం తర్వాత మైదానంలోకి అడుగు పెట్టిన భారత మహిళల జట్టు సమష్టి ఆటతీరుతో అదరగొట్టింది. ఓపెనర్ స్మృతి మంధాన (84) మెరుపులకు తోడు పేసర్లు జులన్ గోస్వామి (4/24), శిఖా పాండే (3/23) చెలరేగడంతో దక్షిణాఫ్రికా కుప్పకూలింది. దీంతో సోమవారం జరిగిన తొలి వన్డేలో 88 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం సాధించడంతో పాటు మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 213 పరుగులు చేసింది. స్మృతి, కెప్టెన్ మిథాలీ రాజ్ (45) ఆతిథ్య జట్టు బౌలర్లపై ఆధిపత్యం చూపుతూ 21 ఓవర్లపాటు క్రీజులో నిలిచారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను భారత బౌలర్లు కట్టడి చేయడంతో 43.2 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. ఆరంభంలో శిఖా పాండే టాప్ ఆర్డర్‌ను దెబ్బతీయగా టెయిలెండర్లను గోస్వామి వణికించింది. దీంతో 13 పరుగులకు ప్రారంభమైన వికెట్ల పతనం ఏ దశలోనూ ఆగలేదు. కెప్టెన్ వాన్ నీకెర్క్ (41) టాప్ స్కోరర్‌గా నిలిచింది. రెండో వన్డే 7న జరుగుతుంది.

లోథా సిఫార్సులు పూర్తిగా అమలు చేయాల్సిందే

హెచ్‌సీఏ పనితీరుపై ఉమ్మడి హైకోర్టు వ్యాఖ్య

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి): జస్టిస్ లోథా కమిటీ సిఫార్సులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అమలు కావడం లేదని ఉమ్మడి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సిఫార్సులు పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అవసరముందని పేర్కొంది. హెచ్‌సీఏ పనితీరుపై గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అనిల్ రమేశ్ దవే, హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ సీతాపతితో కూడిన అడ్మినిస్ట్రేట్ కమిటీ సోమవారం నివేదిక సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన ధర్మాసనం..లో థా సిఫార్సులు పూర్తిగా అమలవడం లేదని వ్యాఖ్యానించిం ది. కమిటీ నివేదికపై పిటిషనర్‌తోపాటు ప్రతివాదులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆదేశిస్తూ విచారణను మూడు వారాలపాటు వాయిదా వేసింది.

గాయంతోనే శతకం బాదాడు



ఉన్ముక్త్

న్యూఢిల్లీ: ఆటగాడు గాయపడితే మ్యాచ్‌కు దూరంగా ఉండడం సహజమే.. కానీ యువ క్రికెటర్ ఉన్ముక్త్ చంద్ మాత్రం అందరిలా కాకుండా గాయం వేధిస్తున్నప్పటికీ బరిలోకి దిగి వీరోచిత శతకం (125 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్సర్లతో 116)తో జట్టును గెలిపించిన తీరు ఔరా! అనిపించక మానదు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా సోమవారం ఉత్తరప్రదేశ్‌తో ఢిల్లీ మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే దీనికి కొద్ది ముందు నెట్ ప్రాక్టీస్‌లో ఉన్ముక్త్ దవడకు బంతి బలంగా తాకింది. అయినా ఏమాత్రం బెదరకుండా కట్టు కట్టుకుని మరీ బ్యాటింగ్‌కు దిగి పరుగుల వర్షం కురిపించాడు. ఇతడి సాహసోపేత ఆటతీరుతో ఢిల్లీ 50 ఓవర్లలో 307/6 పరుగులు చేసింది. ఆ తర్వాత యూపీ 252 పరుగులకే ఆలౌట్ అయ్యింది. 2002లో వెస్టిండీస్‌పై అనిల్ కుంబ్లే కూడా సరిగ్గా ఇలాంటి పరిస్థితిలోనే బరిలోకి దిగి రాణించాడు.

'అనంతపురం ఫుట్‌బాల్'కు 'లా లిగా' చేయూత

మాడ్రిడ్: స్పెయిన్‌కు చెందిన ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్లబ్ లా లిగాకు చెందిన లా లిగా ఫౌండేషన్, లా లిగా ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్.. విసెంట్ ఫెర్రర్ ఫౌండేషన్‌తో చేయి కలిపింది. ఫెర్రర్ ఫౌండేషన్... రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) పేరిట అనంతపురం జిల్లాలో పేదరికాన్ని రూపుమాపేందుకు కృషి చేస్తోంది. అంతేకాదు బాలల్లో విద్య, క్రీడాభివృద్ధికి శ్రమిస్తోంది. ఫెర్రర్ ఫౌండేషన్ అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ సహకారంతో 2014-15 సీజన్ నుంచి అనంతపురం ఫుట్‌బాల్ లీగ్ (ఏఎఫ్ఎల్) నిర్వహిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఫుట్‌బాల్ క్రీడాకారులను వెలికితీయడమే ధ్యేయంగా ఈ లీగ్ ఆవిర్భవించింది. ప్రారంభంనాటి నుంచి నేటివరకూ ఈ లీగ్ అంచలంచెలుగా ఎదిగింది. ప్రస్తుతం పలు డివిజన్లు, యువ జట్లు లీగ్‌లో పాల్గొంటున్నాయి. ఈ ఫుట్‌బాల్ లీగ్ ప్రత్యేకతను తెలుసుకున్న లా లిగా ఫౌండేషన్ దానికి చేయూత నిచ్చేందుకు ఫెర్రర్ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం దరిమిలా 11-19 ఏళ్ల మధ్య బాలబాలికలు తమ ఫుట్‌బాల్ నైపుణ్యాలకు మరింత మెరుగులుదిద్దుకొనే అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టులోని మూడు పథకాల కింద..లా లిగా లిబెర్డోలా కోచ్‌లు, ఫుట్‌బాలర్లు తమ అనుభవాలను అనంతపురం ఫుట్‌బాల్ లీగ్ శిక్షకులు, ఆటగాళ్లతో వీడియోల ద్వారా పంచుకుంటారు. అంతేకాదు లా లిగా శిక్షణ పద్ధతులను అనంతపురం జిల్లా ఆటగాళ్లకు నేర్పుతారు.

భారత్‌కు సవాల్



ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ నేటినుంచే

అలోర్ సెటార్ (మలేసియా): హెచ్ఎస్ ప్రణయ్‌కు గాయం, సైనా నెహ్వాల్ గైర్హాజరీ.. ఇలా కీలక పరిణామాల నేపథ్యంలో భారత జట్టు ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సవాల్‌కు సిద్ధమైంది. మంగళవారం మొదలవనున్న ఈ మెగా ఆసియా ఈవెంట్‌లో భారత మహిళల బృందానికి క్లిష్టమైన డ్రా ఎదురైంది. గ్రూప్-డబ్ల్యూలో పటిష్ఠ జపాన్, హాంకాంగ్‌లతో సింధు సారథ్యంలోని భారత జట్టు పోటీపడనుంది. సీనియర్ సైనా ఆడకపోవడం, జూనియర్లు శ్రీకృష్ణప్రియ, రుత్వికలకు అనుభవం అంతగా లేకపోవడంతో ఇప్పుడు సింగిల్స్‌లో జట్టు భారమంతా సింధుపైనే పడనుంది. సిక్కిరెడ్డి, ప్రజక్తా సావంత్, సంయోగితలు డబుల్స్ భారాన్ని మోయనున్నారు. ప్రపంచ చాంపియన్ ఒకుహర, ప్రపంచ రెండోర్యాంకర్ యమగుచి, సయాకా సాటోలాంటి స్టార్లున్న జపాన్ నుంచి సింధు బృందానికి గట్టి పోటీ ఎదురు కానుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో ఫిలిప్పీన్స్, మాల్దీవులు, ఇండోనేసియాతో కలిపి గ్రూప్-డిలో భారత జట్టు తలపడనుంది. భారత్‌కు కిడాంబి శ్రీకాంత్ సారథ్యం వహించనున్నాడు. సాయి ప్రణీత్, సమీర్ వర్మ జట్టులోని మిగతా సభ్యులు. తొలిపోరులో ఫిలిప్పీన్స్‌తో శ్రీకాంత్ సేన ఆడనుంది. భారత మహిళల జట్టు మంగళవారం హాంకాంగ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టోర్నీలో సెమీస్‌కు చేరిన జట్లు మే 20 నుంచి 27 వరకు జరిగే థామస్, ఉబెర్ కప్‌కు అర్హత సాధిస్తాయి.

బెంగళూరుకు తరలనున్న బీసీసీఐ హెడ్డాఫీసు!



న్యూఢిల్లీ: బీసీసీఐ తన ప్రధాన కార్యాలయాన్ని బెంగళూరులోని కొత్త జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి తరలించే అవకాశముంది. ప్రస్తుతం బోర్డు హెడ్డాఫీసు వాంఖడే స్టేడియంలోని అద్దె భవనంలో కొనసాగుతోంది. బెంగళూరుకు సమీపంలో 40 ఎకరాల్లో అత్యంత అధునాతనంగా ఎన్‌సీఏను నిర్మిస్తున్నారు. ఒకటిరెండేళ్లలో ఈ అకాడమీ పూర్తికానుంది. అనంతరం బీసీసీఐ తన ప్రధాన కార్యాలయాన్ని అక్కడికి తరలించే అవకాశాలున్నాయి.

మాపై చేతబడి జరిగిందేమో!

అండర్-19 ప్రపంచకప్‌లో భారత్‌తో ఓటమిపై పాక్

కరాచీ: 'ఆడలేక మద్దెల ఓడు..' అన్నట్టుంది పాకిస్థాన్ జట్టు పరిస్థితి. అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్లో భారత్ చేతిలో పాక్ జట్టు ఏకంగా 203 పరుగుల భారీ తేడాతో ఓడిన సంగతి గుర్తుందిగా! అయితే, పాక్ దారుణ వైఫల్యంలో తాంత్రిక శక్తుల పాత్ర ఉండొచ్చంటూ ఆ జట్టు మేనేజర్ నదీమ్ ఖాన్ వింత వాదన తెరపైకి తీసుకొచ్చాడు. తమపై చేతబడి జరిగి ఉండొచ్చని, అందుకే తమ ఆటగాళ్లు మూకుమ్మడిగా విఫలమయ్యారని నదీమ్ వ్యాఖ్యానించడంపై ఆ దేశ అభిమానులే నవ్వుకుంటున్నారు. 'ఆరోజు మ్యాచ్ హోరాహోరీగా సాగుతుందని మేం ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. కానీ, మరీ ఘోరంగా 69 పరుగులకే కుప్పకూలాం. ఆ దశలో మావాళ్లపై ఏదైనా చేతబడి జరిగిందేమో అన్న అనుమానం కలిగింది' అని నదీమ్ అన్నాడు.

వరల్డ్ టీటీలో మానవ్‌కు రజతం



మానవ్

న్యూఢిల్లీ: భారత ఆటగాడు మానవ్ టక్కర్ అంతర్జాతీయ వేదికపై పతకంతో మెరిశాడు. లక్సెంబర్గ్‌లో జరిగిన ఐటీటీఎఫ్ వరల్డ్ జూనియర్ సర్క్యూట్ ఫైనల్స్‌లో మానవ్ రజత పతకం సాధించాడు. జూనియర్ బాలుర ఫైనల్లో మూడోసీడ్ మానవ్ 3-4తో అమెరికాకు చెందిన కనాక్ జా చేతిలో పోరాడి ఓడి రన్నరప్‌తో సంతృప్తిపడ్డాడు.

ఫోర్బ్స్ జాబితాలో బుమ్రా, హర్మన్‌ప్రీత్, హీనా



హర్మన్‌ప్రీత్
హీనా సిద్ధు

ముంబై: స్టార్ క్రికెటర్లు జస్ప్రీత్ బుమ్రా, హర్మన్‌ప్రీత్ కౌర్, హాకీ గోల్‌కీపర్ సవిత పునియా, షూటర్ హీనా సిద్ధు ఫోర్బ్స్ జాబితాలో చోటు సంపాదించారు. 30 ఏళ్లలోపు వయస్సువారు తమతమ రంగాల్లో ప్రతిభతో సమాజంపై చూపుతున్న ప్రభావం ఆధారంగా మొత్తం 30 మందిని ప్రతి ఏటా ఫోర్బ్స్ ఎంపిక చేస్తుంది. 2018 జాబితాలో ఈ నలుగురు క్రీడాకారులు చోటు దక్కించుకోవడం విశేషం. ఇందులో హీనా సిద్ధు మూడోస్థానంలో, సవిత 13, హర్మన్ 14, బుమ్రా 16వ స్థానంలో నిలిచారు.

మాజీ పేసర్ బొలింజర్ రిటైర్



సిడ్నీ: ఆస్ట్రేలియా మాజీ పేస్ బౌలర్ డగ్ బొలింజర్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. బొలింజర్ 12 టెస్టుల్లో 50, 39 వన్డేల్లో 62 వికెట్లు పడగొట్టాడు. 2010లో యాషెస్ సిరీస్‌తో చివరి టెస్టు ఆడిన బొలింజర్‌కు ఆ తర్వాత జట్టులో చోటు దక్కలేదు.

ఎవరూ దింపని చోట దించుతున్నాం

చంద్రయాన్-2 ల్యాండింగ్ సైట్ ఖరారు.. ఏప్రిల్‌లో ప్రయోగం: ఇస్రో చైర్మన్

న్యూఢిల్లీ/హైదరాబాద్ ఫిబ్రవరి 5: అంతరిక్ష పరిశోధనలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో చారిత్రక ప్రయోగానికి సిద్ధమవుతోంది. ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-2 మిషన్ ద్వారా



చంద్రునిపై తొలిసారిగా రోవర్‌ను దించబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఇస్రో చైర్మన్ డాక్టర్ కే శివన్ వెల్లడించారు. చంద్రునిపై రోవర్‌ని దించడానికి రెండు ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటివరకూ ఎవరూ రోవర్‌ను దించని ప్రదేశంలో చంద్రయాన్-2ను దింపబోతున్నామని ప్రకటించారు. ఏప్రిల్‌లో చంద్రయాన్-2ను శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తామని ఇది కక్ష్యలోకి చేరడానికి 2-3 నెలల సమయం పడుతుందన్నారు. చంద్రుని ఉపరితలంపై 14 రోజులు ఉండేలా రోవర్‌ను తీర్చిదిద్దినట్లు శివన్ తెలిపారు. ఇది 150-200 కిలోమీటర్ల వరకు నడిచి రసాయన విశ్లేషణ చేస్తుందన్నారు.



ఎలా పనిచేస్తుందంటే

ఈ ప్రాజెక్టు కోసం ఇస్రో మూడు మానవరహిత వెహికిల్స్‌ను అభివృద్ధి చేస్తోంది. ఇందులో ఒకటి ఆర్బిటర్ క్రాఫ్ట్. ఇది చంద్రుని ఉపరితలంపై కొంత ఎత్తులో తిరుగుతూ ఉంటుంది. వీటితో పాటు ఒక రోవర్.. దీన్ని సురక్షితంగా దించే ల్యాండర్. సెమీ అటానమస్ మోడ్‌లో ఉన్న ఆరు టైర్ల రోవర్ భూమి నుంచి వచ్చే కమాండ్స్ ఆధారంగా చంద్రునిపై తిరుగుతూ ఉంటుంది. రోవర్‌లో ఉండే పరికరాలు చంద్రుని ఉపరితలానికి సంబంధించిన వివరాలను సేకరిస్తాయి. చంద్రయాన్-2 ఆర్బిటార్ ద్వారా ఈ వివరాలు భూమికి చేరతాయి. దీని ద్వారా చంద్రునిపై ఉన్న మట్టిని రసాయన విశ్లేషణ చేసేందుకు వీలవుతుంది. చంద్రయాన్-2 బరువు 3,290 కిలోలు. ఇందులో ఆర్బిటార్, రోవర్, ల్యాండర్ ఉంటాయి. చంద్రుని కక్ష్యకు 100 కిలోమీటర్ల దూరంలో ల్యాండర్ వేరుపడి.. చంద్రునిపై ఉనిర్దేశించిన ప్రాంతంలో రోవర్‌ను సురక్షితంగా దించుతుంది. కాగా, ఐదు నెలల్లో 5 అంతరిక్ష ప్రయోగాలు చేయనున్నట్లు శివన్ వెల్లడించారు.



చుడీదార్‌లో అమ్మవారు

అలంకరణపై భక్తుల ఆగ్రహం

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జిల్లా మైలాడుదురైలోని ప్రాచీన ఆలయంలో అమ్మవారిని చుడీదార్‌తో అలంకరించడంపై భక్తులు ఆగ్రహిస్తున్నారు. మైలాడుదురైలో అభయాంబికై సమేత శ్రీమయూర నాథర్ ఆలయం ఉంది. ఆ ఆలయంలో మయూరనాథుడు లింగరూపంలో ఉన్నాడు. అభయాంబికై అమ్మవారు నిల్చొని ఉన్నారు. తై మాసపు శుక్రవారం సందర్భంగా గత శుక్రవారం అమ్మవారికి చుడీదార్ అలంకరణ చేశారు. భక్తులు ఈ దృశ్యాన్ని చూసి అమ్మవారికి అపచారం జరిగిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మవారిని చుడీదార్‌తో అలంకరించడం హిందూ ధర్మాలకు వ్యతిరేకమని రాష్ట్ర ఆలయాలు, మఠాల సంరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి అళగిరి అన్నారు.



రాజ్యసభలో తొలిసారిగా ప్రసంగిస్తున్న అమిత్‌షా

ఇవాళ మేం.. రేపు మీరు!

- ఎవరైనా అధికారంలోకి రావచ్చు
- పార్టీలకు అతీతంగా వ్యవహరించాలి: అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): "ఈరోజు మేం అధికారంలో ఉన్నాం. రేపు మీరు అధికారంలోకి రావచ్చు! ఔను... మేమే శాశ్వతంగా అధికారంలో ఉంటామని చెప్పడంలేదు. ఇది ప్రజాస్వామ్యం! కొన్ని అంశాలపై రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి"... అంటూ సుతిమెత్తగా చురకలు! "జీఎస్టీని గబ్బర్‌సింగ్ ట్యాక్స్ అంటారా? చట్టబద్ధంగా వసూలు చేసే పన్నును దోపిడీ సొమ్ముతో పోల్చుతారా? మీరేం చేయాలనుకుంటున్నారు? పన్నులు కట్టొద్దని ప్రజలను రెచ్చగొడతున్నారా?".. అంటూ ఘాటుగా హెచ్చరికలు! బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ అమిత్‌షా రాజ్యసభలో తన తొలి ప్రసంగంలోనే చెలరేగిపోయారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పడంపై సోమవారం ఆయన గంటన్నర పాటు మాట్లాడారు. వివిధ అంశాలపై కాంగ్రెస్ వైఖరిని దునుమాడారు. 'పకోడీలు తయారు చేసి విక్రయించడం కూడా ఉపాధి మార్గమే' అని ప్రధాని చేసిన వ్యాఖ్యలను చిదంబరం ఖండిస్తూ... 'బిచ్చమెత్తుకోవడం కూడా ఉద్యోగమే అంటారేమో!' అని విమర్శించడంపై అమిత్‌షా మండిపడ్డారు. "పకోడీలను అమ్మడం సిగ్గుచేటు కాదు. కానీ... వారిని బిచ్చగాళ్లతో పోల్చడమే సిగ్గుచేటు" అన్నారు. ఇది ఒక చాయ్‌వాలాను ప్రధానిగా చేసిన దేశమని గుర్తుంచుకోవాలన్నారు. జీఎస్టీని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ 'గబ్బర్ సింగ్ ట్యాక్స్' అనడంపై షా మండిపడ్డారు. "ఏంటి... ఇక్కడ దోపిడీ జరుగుతోందా? ఈ పన్ను ఎక్కడికి పోతోంది? సైనికులకు వన్‌ర్యాంక్ వన్ పెన్షన్ అమలుకు ఇదే సొమ్ము ఉపయోగపడుతుంది. అమరులైన సైనికుల భార్యల ఖాతాల్లోకి పెన్షన్ రూపంలో వెళ్తుంది. గ్రామీణ మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు ఉపయోగపడుతుంది" అని వివరించారు. పన్నులకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టడం మంచి రాజకీయాలకు సం కేతం కాదన్నారు. తాము అధికారంలోకి రాకముందు అంతా అనిశ్చితే అని అ మిత్‌షా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 12 లక్షల కోట్ల విలువైన కుంభకోణాలు జరిగాయన్నారు. అమిత్ వేసే ఒక్కో 'పంచ్'ను అధికార పక్ష సభ్యులు చప్పట్లు కొడుతూ స్వాగతించారు. అమిత్‌షా ప్రసంగాన్ని అడ్డుకునేందుకు విపక్షాలు ఎంత ప్రయత్నించినా... సభాధ్యక్షుడు వెంకయ్య వారిని అనుమతించలేదు.

'బినామీ'లకు చుక్కలే!

(మొదటి పేజీ తరువాయి)

కొన్నారుగానీ.. తర్వాత ఎలాంటి సాగు ఆదాయాన్నీ డెజావు ఫార్మ్స్ చూపలేదు. పైగా అక్కడ చట్ట విరుద్ధంగా ఖరీదైన విల్లా నిర్మించారు. అంటే.. అత్తమామలు డైరెక్టర్లుగా ఉన్న కంపెనీకి అల్లుడు అప్పు ఇచ్చాడు. ఆ తర్వాత ఆ కంపెనీ ఎలాంటి కార్యకలాపాలూ చేపట్టలేదు. దీంతో ఇది షారుక్ బినామీ ఆస్తేనని ఐటీ శాఖ నిర్ధారణకు వచ్చింది.

ఎలా బయటపడింది?

తాళ్ గ్రామంలో సముద్ర తీరప్రాంత నిబంధనలను ఉల్లంఘించిన 87 ఫాంహౌస్‌లపై చట్టపరంగా చర్యలు తీసుకునే అంశంపై.. మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా కలెక్టర్ విజయ్ సూర్యవంశీ గత ఏడాది ఆదాయపన్ను శాఖ అధికారులను సంప్రదించారు. ఐటీ అధికారులు వాటి మూలాల గురించి ఆరా తీయడంతో షారుక్ పేరు బయటికొచ్చింది. వ్యవసాయ భూమిని జిల్లా కలెక్టరు లేదా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా వ్యవసాయేతర కార్యకలాపాలకు వినియోగిస్తున్నాడంటూ షారుక్‌పై ముంబై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అలా ఈ విషయం ప్రపంచం దృష్టికి వచ్చింది. ఐటీ నోటీసులకు 90 రోజుల్లోగా షారుక్ సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలి. లేదంటే ఆ భూమి ప్రభుత్వపరమైపోతుంది. అది కచ్చితంగా బినామీ అని తేలితే షారుక్‌పై క్రిమినల్ కేసు కూడా తప్పదు.

నల్లబాబులకు దడదడ..

షారుఖ్ ఖాన్ బినామీ వ్యవహారం ఇపుడు దేశంలో సంపన్న కుటుంబాలన్నింటికీ ఓ షాక్‌లా తగిలింది. రిటర్న్స్ ఫైల్ చేసేటపుడు ఏ మాత్రం అనుమానాస్పదమైన లావాదేవీ లేదా క్రయవిక్రయం ఉన్నా ఇక అది గోవిందా అని వారికి అర్థమైంది. దీంతో.. తమకున్న బినామీ ఆస్తులను కాపాడుకోవడమెలా అన్నదానిపై ఇపుడు వారు ట్యాక్స్ నిపుణులను, లాయర్లను సంప్రదిస్తున్నారు.

వారికి ఇబ్బందే..!

మోదీ సర్కారు తెచ్చిన చట్టంలో ఉన్న ఓ ఇబ్బంది ఏంటంటే.. తల్లిదండ్రుల కోసం లేక అన్నదమ్ముల కోసం ఓ ప్రాపర్టీ లేదా ఇల్లు కొని-తాను అందులో నివాసం ఉండని మధ్యతరగతి జీవులెందరో ఉంటారు. వారు కూడా ఈ బినామీ పరిధిలోకి వచ్చేయడం. అలాంటపుడు జాయింట్ హోల్డింగ్ పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బినామీ ఆస్తులపై దాడులకు, జప్తునకు లేదా చర్యలకు నిర్దిష్ట కాలావధి లేకపోవడం ఓ మైనస్ పాయింట్ అని వారు చెబుతున్నారు. 20 ఏళ్ళ కిందటి ఆస్తి, క్రయవిక్రయాలకు కూడా ఇపుడు చర్య తీసుకోవడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు.



షారుక్ కాబట్టే చర్చ!

నోట్ల రద్దు తర్వాత మోదీ సరారు నల్లధన ఆసాములపై ప్రయోగించిన రెండో బుల్లెట్.. బినామీ ఆస్తుల చట్టం అని చాలా మంది అనుకుంటారు . కానీ, నిజానికి నోట్ల రద్దు నిర్ణయానికి సరిగ్గా వారం ముందు.. అంటే 2016 నవంబరు 1న ఆ చట్టం అమల్లోకి వచ్చింది. అదే ఏడాది నవంబరు 15న.. ప్రధాని మోదీ గోవాలో మాట్లాడుతూ 'బినామీ ఆస్తుల గుట్టుమట్లు విప్పుతాం. బినామీల పేరిట ఆస్తులు కూడబెట్టేవారి పట్ల చట్టం కఠినంగా వ్యవహరిస్తుంది. అని ఆరోపించారు. అప్పట్నుంచీ బినామీల వేట మొదలైంది. ఈ ఏడాది జనవరి 11 నాటికి.. రూ.3500 కోట్ల విలువైన బినామీ ఆస్తులను జప్తు చేసినట్లు ఆదాయపన్ను శాఖ ప్రకటించింది. అయితే వారెవరూ షారుక్ ఖాన్‌లా సెలబ్రిటీలు కాకపోవడంతో ఇన్నాళ్లూ దీనిపై చర్చ జరగలేదంతే!

నేరము.. శిక్ష

పన్ను కట్టని సంపాదన, అవినీతి డబ్బుతో ఇతరుల పేరిట ఆస్తులను కొనడం. వాటిపై వారికి ఎలాంటి హక్కులూ లేకుండా తాను అనుభవించడం. స్థిర, చరాస్తులు, మేధో హక్కులు, కాపీరైట్ హక్కులు, బంగారు బాండ్లు, ఫైనాన్షియల్ సెక్యూరిటీలు.. తదితరమైనవి ఇతరుల పేరిట కొంటే బినామీ లావాదేవీ కిందకు వస్తాయి.

- బినామీ ఆస్తులు ఉన్నట్లు రుజువైతే ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష పడుతుంది. బినామీ ఆస్తి మార్కెట్ విలువలో 25% జరిమానాగా చెల్లించాలి.
- పైగా, ఆ ఆస్తి మొత్తాన్నీ ఎలాంటి పరిహారం లేకుండానే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. బినామీ ఆస్తిని ఎలాంటి పరిహారం చెల్లించకుండానే సర్కారు స్వాధీనం చేసుకుంటుంది.

మోదీ మత్తులో ఉంటే..

- మోదీ 'టాప్' వ్యాఖ్యపై కాంగ్రెస్ నేత రమ్య ట్వీట్
- సోషల్ మీడియాలో ఆగ్రహించిన బీజేపీ శ్రేణులు
- ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులే తనకు 'టాప్' (టీ-టొమోటా, వో-ఆనియన్, పీ-పొటాటో) ప్రాధాన్యం అని.. బెంగళూరు ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యకు ప్రతిస్పందనగా కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్, మాజీ ఎంపీ రమ్య చేసిన కౌంటర్ ట్వీట్ తీవ్ర దుమారం రేపుతోంది. 'మీరు పాట్ (పీవోటీ మత్తు)లో ఉన్నపుడు ఇలా జరుగుతుందన్న మాట' అని రమ్య ట్వీట్ చేశారు. కానీ, ఆ ట్వీట్‌పై ఆగ్రహం వ్యక్తం కావడంతో.. పాట్ అంటే 'పొటాటోస్, ఆనియన్స్, టొమాటోస్' అని ఎందుకు అనుకోకూడదని మరో ట్వీట్‌లో సమర్థించుకున్నారు. బీజేపీ నేతలు మాత్రం.. 'మాదక ద్రవ్యాల మత్తు' అనే అర్థంలోనే రమ్య 'పాట్' అనే పదాన్ని వాడిందని ఆమెపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు. దేశ ప్రధానిపై ఇలా అవహేళనగా ట్వీట్ చేసిన రమ్యపై కాంగ్రెస్ చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియాలో పలువురు డిమాండ్ చేశారు. రమ్య తన ట్వీట్‌లో మాట్లాడిన దాని గురించి దేశంలో చాలా మంది ప్రజలకు, ఆ మాటాకొస్తే.. ప్రధానితో సహ తన పార్టీ సభ్యులకు ఎవరికీ తెలియదని.. ఆమె నాయకుడికి (రాహుల్‌కు) మాత్రం ఆమె చెప్పిందేంటో వెంటనే అర్థమైపోతుందని బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్.నరసింహారావు ట్విటర్‌లో విమర్శించారు.

వ్యక్తిగత విమర్శలొద్దు: సిద్దరామయ్య

సినీనటి రమ్య ట్వీట్‌పై దుమారం రేగుతున్న నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పందించారు. ఈ విషయంలో వ్యక్తిగత విమర్శలు వద్దని ఆయన అన్నారు. రమ్య చేసిన ట్వీట్‌పై ఆయన్ను ప్రశ్నించగా.. 'రమ్య అలా అన్నదో లేదో నాకు తెలీదు. కాబట్టి నన్ను కాదు దీని గురించి ఆమెనే ఆమెనే అడగాలి. ఈ విషయంలో వ్యక్తిగత విమర్శలు తగద'ని ఆయన బదులిచ్చారు.

అబుదాబీలో భారతీయుడికి 17 కోట్ల లాటరీ



దుబాయి, ఫిబ్రవరి 5: అబుదాబీలో ఓ భారతీయుడిని అదృష్టం వరించింది. అతనికి రూ.17కోట్ల విలువైన లాటరీ తగిలింది. కేరళకు చెందిన సునీల్ కుట్టి నాయర్ కొంతకాలంగా అబుదాబీలో నివసిస్తున్నాడు. ఇటీవల అతను 500 ధిరమ్‌లు చెల్లించి ఓ లాటరీ టికెట్ కొనుగోలు చేశాడు. లాటరీ టికెట్ డ్రాలో సునీల్ నాయర్ మొదటి బహుమతి కింద రూ.17.68కోట్లు గెలుచుకున్నాడు. కాగా, టికెట్ కొనేందుకు డబ్బిచ్చిన ముగ్గురు స్నేహితులతో ఆ లాటరీ మొత్తాన్ని పంచుకోనున్నట్లు సునీల్ నాయర్ తెలిపాడు.

ఎన్డీయే లుకలుక

(మొదటి పేజీ తరువాయి)

తలోదారి అవుతుందేమోనని కూటమిలో ఆందోళన వ్యక్తమవుతోంది. 'వాజపేయి హయాంలో ఎన్డీఏ నిర్మాణం జరిగింది. మోదీ అధికారంలోకి వచ్చాక ముక్కలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలు సమీపించే నాటికి ఎన్డీఏ అన్నదే ఉండే అవకాశం లేదు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఏకాకిగా పోటీ చేయాల్సి వస్తుందేమో' అని అకాలీదళ్ ఎంపీ ఒకరు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న వైఖరి వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని, బీజేపీకి ఢిల్లీలోనూ, రాష్ట్రాల్లోనూ ఏ పార్టీ కూడా అండగా నిలిచే అవకాశాలు లేవని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చలేదని తెలుగుదేశం అసంతృప్తి వ్యక్తం చేయగా, మిగతా పార్టీలూ అంతకంటే ఎక్కువ అసంతృప్తితో ఉన్నాయి. మిత్రులంతా ఏకతాటిపైకి వస్తే బీజేపీ ఇబ్బందుల్లో పడుతుందని అంటున్నాయి. తెలుగుదేశం ముందడుగు వేస్తే ఎన్డీఏలోని బీజేపీయేతర పార్టీలన్నీ కూటమి నుంచి వైదొలగే అవకాశాలున్నాయి. మోదీ వైఖరి అంటే ఇష్టపడని ఎంపీలు, మంత్రులు బీజేపీలో ఉన్నప్పటికీ వారు ప్రభుత్వాన్ని పడగొట్టుకోవాలని అనుకోవడం లేదు. నిజానికి కేంద్ర బడ్జెట్‌పై కానీ, మోదీ విధానాలపై కానీ బీజేపీ సభ్యులు అం త సంతృప్తికరంగా లేదన్న విషయం వ్యక్తమవుతూనే ఉంది. అయితే, వచ్చే ఎన్నికల్లో చేతులు కలిపేందుకు ఎందరు వస్తారన్న ప్రశ్న ఇప్పుడు అందరిలోనూ రేగుతున్నది.

అహంకారంతో సంకీర్ణ రాజకీయాలు సాగవు

'ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్న తెలుగుదేశం అసంతృప్తి సహేతుకమైనదే. ఏపీ ఏర్పడినపుడు ప్రత్యేక హోదా కల్పిస్తామని పార్లమెంటు వేదికపైనే వాగ్దానం చేశారు. దాన్ని అమలు చేయకపోవడం సరైనది కాదు. బీజేపీ సంకీర్ణధర్మాన్ని పాటించాలి. వాజపేయి నుంచి బీజేపీ సంకీర్ణ ధర్మాన్ని నేర్చుకోవాలి. మిత్రపక్షాలతో వారు సరిగా వ్యవహరించడం లేదు. వ్యక్తి గురించి కాక మొత్తం బీజేపీ గురించి మాట్లాడుతున్నా..

- ఆంధ్రజ్యోతితో అకాలీదళ్ నేత నరేశ్ గుజ్రాల్

ఏ పార్టీ ఏమంటోంది?

శివసేన : టీడీపీ కంటే ముందు నుంచే ఎన్డీఏలో ఉంది. బీజేపీ వైఖరిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. కేంద్రంలో బీజేపీ అధికారానికి వచ్చినప్పటి నుంచీ రెండు పార్టీల మధ్య చిచ్చు రగులుతున్నది. మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీలు వేరువేరుగా పోటీ చేశాయి. గుజరాత్‌లో కూడా బీజేపీకి వ్యతిరేకంగా అభ్యర్థులను నిలబెట్టింది. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేయబోమని శివసేన ఇటీవల ప్రకటించింది. లోక్‌సభలో శివసేనకు 18 మంది సభ్యులున్నారు.

రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ(3): బీహార్‌లో కేంద్రమంత్రి ఉపేంద్ర కుషావహ నేతృత్వంలో రాష్ట్రీయ లోక సమతా పార్టీ బీజేపీకి ప్రత్యర్థి అయిన రాష్ట్రీయ జనతాదళ్‌తో కలిసి ప్రజా సమస్యలపై ర్యాలీ నిర్వహించింది.

జేడీయూ(2): ఇదొక్కటే కాస్త నమ్మదగ్గ మిత్రపక్షం.

పీడీపీ(3): కాశ్మీర్‌కు చెందిన పీడీపీకి లోక్‌సభలో ముగ్గురు ఎంపీలు ఉన్నారు. ఈ రాష్ట్రంలో పిడీపీ-బీజేపీ కూటమి రెండు పార్టీల మధ్య విభేదాల వల్ల ఏ క్షణంలోనైనా పడిపోయే అవకాశాలున్నాయి.

నాగా పీపుల్స్ ఫ్రంట్(1): నాగాలాండ్‌లోని నాగా పీపుల్స్ ఫ్రంట్ విభేదాల కారణంగా బీజేపీకి మద్దతు ఉపసంహరించుకున్నది.

అకాలీదళ్(4): బీజేపీకి మిత్రపక్షం. తెగతెంపులు చేసుకుని, వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని భావిస్తోంది.

ఒక అమరుడి పుష్పవిలాసం

ఎన్నేళ్లు బతికామన్నది కాదన్నయ్యా..! ఎంత గొప్పగా బతికామన్నదే ముఖ్యం

ప్రతీకారం తీర్చుకోండి: సైన్యంతో రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పాకిస్థాన్ సైనికులు ఆదివారం రాత్రి జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ కెప్టెన్ కపిల్ కుందు తన ఫేస్‌బుక్‌లో చివరిగా పెట్టిన ఓ మినీ కవిత ఇపుడు దేశవ్యాప్తంగా వైరల్ అయ్యింది. దేశభక్తిని ఎగదోస్తోంది. పాకిస్థాన్‌పై జనాగ్రహం పెల్లుబికేట్లు చేస్తోంది. 'ఎన్నేళ్ళు బతికామన్నది కాదు.. ఎంత గొప్పగా బతికామన్నదే ముఖ్యం..' అని తన ఫేస్‌బుక్ బయోలో రాసుకున్నాడు కపిల్ కుందూ. ఆనంద్ అనే హిందీ సినిమాలో రాజేష్ ఖన్నా- అమితాబ్ బచ్చన్‌తో అన్న మాటలవి.. ఆ డైలాగే కునాల్‌కు స్ఫూర్తి. దీనిపై వేల మంది స్పందించారు. సామాజిక మాధ్యమాల ద్వారా కపిల్‌కు నివాళులర్పిస్తూ- పాకిస్థాన్‌ను దునుమాడుతూ -దేశభక్తిని చాటుతూ పోస్టులు పెట్టారు. పాక్‌పై మరోసారి సర్జికల్ దాడులు జరపాలని కేంద్రాన్ని కోరారు. ఆదివారం రాత్రి కూడా కపిల్ విధుల్లోనే ఉన్నాడు. రాత్రి ఒంటి గంటకు కూడా తన కుమారుడు తనతో మాట్లాడినట్లు కునాల్ తల్లి సునీత చెబుతున్నారు. కానీ తెల్లారేసరికి విగతజీవుడయ్యాడు. రాజౌరీ జిల్లాలోని అనేక సెక్టార్లలో పాక్ - ఆదివారం ఉదయం 11 గంటల నుంచీ నిరంతరంగా మోర్టార్లతో దాడులు చేస్తూనే ఉంది. మెంధార్, మంజకోటే, బాల్కొటే సెక్టార్లలో కూడా మోర్టార్లు వచ్చిపడుతూనే ఉన్నాయి. అనేక పౌర ఆవాసలను అవి ధ్వంసం చేశాయి. పొద్దస్తమానం కవ్వింపుకు పాల్పడడంతో సైన్యం అప్రమత్తంగా కాపలాకాస్తోంది. కునాల్, మరో ముగ్గురు సైనికులు- రామావతార్, శుభమ్ సింగ్, రోషన్- ఆ బంకర్ ద్వారా ఎదురు కాల్పులు జరుపుతూనే వచ్చారు. చివరకు రాత్రి దాటాక- ఒక మోర్టార్ వచ్చి నేరుగా ఆ బంకర్‌ను తాకింది. దాంతో ఆ నలుగురూ అసువులు బాసారు.

కెప్టెన్ కునాల్ వయసు కేవలం 23 ఏళ్లు.. మరో ఐదు రోజుల్లో - అంటే ఫిబ్రవరి 10న ఆయన 23వ పుట్టినరోజు. ఆ రోజుకు ఇంటికి వస్తానని, అమ్మ దగ్గరే సెలబ్రేట్ చేసుకుంటానని కూడా కునాల్ -ఫోన్లో తన సోదరికి చెప్పాడు. అంతలోనే ఈ ఘోరం జరిగిపోయింది. "కపిల్ ఆలోచనలు ఎప్పుడూ దేశం కోసమే.. అందుకే సైన్యంలో చేరాడు. అతడు ధీశాలి. నాకు మరో కొడుకు పుట్టి ఉన్నా- అతణ్నీ సైన్యంలోకే పంపేదాన్ని" అని ఆయన తల్లి సునీత పేర్కొన్నారు. మరో ఇరవయ్యేళ్ళు బతికినా కపిల్, దేశానికి ఇంత గొప్పగానే సేవ చేసి ఉండేవాడు.. అతని త్యాగం వృథాపోదు.. అని ఆమె కన్నీళ్ళను అదిమి పెట్టుకుంటూ అన్నారు.

పాకిస్థాన్ దుశ్చర్యలను హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఖండించారు. "మొదటిసారి సైన్యం సర్జికల్ దాడులు జరిపినపుడు మీడియాకు తెలీదు. పూర్తయ్యాక తెలిసింది. ఇప్పటికీ పాక్ వైఖరి మారలేదు. సైన్యం ఈ మరణాలకు ప్రతీకారం తీర్చుకోవాలి. మరో సర్జికల్ దాడి జరపాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఏం చేయాలో సైన్యం నిర్ణయించుకోవాలి" అని పేర్కొన్నారు. ఏం చేసినా నిశీధిలోనే చేయాలన్నారు.



పాక్ కాల్పుల్లో మృతి చెందిన జవాన్లు (ఎడమ నుంచి) రోషన్‌లాల్, రామావతార్, శుభం సింగ్

కపిల్ కవితా ఝరి



స్వతహాగా భావుకుడైన కపిల్ తన భావాల్ని స్వేచ్ఛా శైలిలో తన ఫేస్‌బుక్‌లో పెట్టుకునేవాడు. ఆయన బయోతో పాటు , ఒక అమరుడి కథ అన్న పేరుతో రాసుకున్న కవిత ఇపుడు అందర్నీ ఆకర్షిస్తోంది..

ఫేస్‌బుక్ బయోలో రాసుకున్నది..

పరిగెత్తు.. జీవితమే ఒక పరుగు
పరిగెత్తలేకపోతే నడువ్..
నడవలేకపోతే.. నేలపై పాకు
కానీ విశ్రమించకు..
లక్ష్యం చేరే దాకా విశ్రమించకు
ఎన్నాళ్ళు బతికామన్నది కాదు..
ఎంత గొప్పగా బతికామన్నది ముఖ్యం.
బతుకు, మరణం అన్నీ జీవన క్రమంలో భాగం
మరణమే చివరి చరణం కాదు..

ఒక అమరుడి కథ

అంతా ముగిసిపోయిందని ఆమె అనుకుంది..
అతను శాశ్వతంగా వెళ్లిపోయాడని
అంతా అనుకున్నారు..
కానీ అతను తెచ్చిన పువ్వుల్లో బతికే ఉన్నాడు!!
ఆ పువ్వులు ఎన్నో సంగతులు చెబుతాయి..
అతని భావాలకు మార్గం చూపుతాయి
ఎపుడూ అనుకొనేవాడు
అమె లేనిదే ఏమీ లేదని..తన బతుకే వేరని!
అతనికి జీవించడం ఓ చాన్స్ ..
అందుకే పూలమ్మేవాడికి ముందే డబ్బిచ్చేశాడు!
పువ్వులు అలా వస్తూనే ఉన్నాయి..
పుట్టిన రోజు..పెళ్లి రోజూ ఇలా
ప్రతి సందర్భంలో శుభాకాంక్షలు ఆమెకు
చెబుతూనే ఉన్నాయి!
ఆమె పువ్వుల్ని తన హృదయానికి హత్తుకుంది..
ప్రతి పువ్వులో అతణ్ణి చూసుకుంది!
అతని నిష్క్రమణ గురించి ఆలోచిస్తోంది
పువ్వులొస్తూనే ఉన్నాయి..
జీవితం కొనసాగాలని
ఆమెకు చెబుతూనే ఉన్నాయి.
పువ్వుల్ని పట్టుకుని ఆమె ఏడ్చింది.. నవ్వింది!
జీవితం, మరణం....
ఇవేమీ అతనికి పెద్ద విషయాలు కావని అంటోంది!!



కెప్టెన్ కపిల్ కుందు భౌతిక కాయం వద్ద విలపిస్తున్న ఆయన సోదరి

ఇక చేతలే మాట్లాడుతాయ్: భారత ఆర్మీ వైస్ చీఫ్

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్, ఫిబ్రవరి 5: సరి'హద్దు'మీరుతున్న పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం తప్పదని భారత ఆర్మీ వైస్ చీఫ్ శరత్ చంద్ర ఘాటుగా హెచ్చరించారు. ఆదివారం జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాల్లో పాక్ జరిపిన కాల్పులకు ఓ సైనికాధికారితో పాటు మరో ముగ్గురు జవాన్లు చనిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్మీ వైస్ చీఫ్ సోమవారం మీడియాతో మాట్లాడారు. 'పాక్ ఆర్మీ అమాయకులను పొట్టనబెట్టుకుంటోంది. ఇక మా చేతలే మాట్లాడతాయి అని స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి ఒక్కరికీ భారత ఆర్మీ శౌర్యప్రతాపాలపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. కాగా.. తమ సైన్యం జరుపుతున్న దాడులకు ఏ క్షణమైనా భారత్ ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉందని భావిస్తున్న అక్కడి ప్రభుత్వం ఆగమేఘాల మీద చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సీపీఈసీ) పరిసరాల్లో గస్తీని ముమ్మరం చేసింది.



నేటి సత్యభామ.!

భర్త ప్రాణాల కోసం గన్‌తో బెదిరింపు

లఖ్‌నవ్, ఫిబ్రవరి 5: నాడు నరకాసురుడి నుంచి కృష్ణుడిని రక్షించేందుకు సత్యభామ విల్లు పట్టింది. అయితే నేటి సత్యభామ కొందరు దుండగుల నుంచి భర్తను కాపాడుకునేందుకు తుపాకీ చేతపట్టింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కకోరి జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తన ఇంటి ముందు ఉన్న అబిద్ అలీ అనే జర్నలిస్టుపై సోమవారం ఉదయం ఇద్దరు దుండగులు దాడికి దిగారు. ఇంతలోనే మరో నలుగురు వచ్చి అలీని కొట్టడం ప్రారంభించారు. తన ముందే తన భర్తను కొట్టడం తట్టుకోలేకపోయిన అతని భార్య ఇంట్లో నుంచి తుపాకీ తీసుకొచ్చి దుండగులపై గురిపెట్టింది. తన భర్తను విడిచిపెట్టి వెళ్లాలని బెదిరించింది. వారిని భయపెట్టించేందుకు గాలిలో కాల్పులు కూడా జరిపింది. దీంతో బెదిరిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటన అంతా అక్కడి సీసీటీవీల్లో రికార్డు అయింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.